అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శనివారం 24-08-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 236
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar
16 పేజీలు వెల : 6.50

జూరాలలో 16 గేట్లు ఎత్తివేత



ఐదు యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి 6లో..



నదిలో పడిపోయిన బస్సు

నేపాల్‌లో ఘోరం!

నదిలోకి దూసుకెళ్ళిన యూపీ బస్సు

14మంది భారతీయులు మృతి

బయటపడిన 29మంది

ఖాట్మండు : నేపాల్‌లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. భారత పర్యాటకులు ప్రయాణిస్తున్న బస్సు నదిలోకి దూసుకెళ్ళడంతో 14మంది చనిపోయారు. సెంట్రల్ నేపాల్‌లో శుక్రవారం మర్స్యాంగ్డి నదిలో బస్సు పడిపోయింది. ఆ సమయంలో బస్సులో డ్రైవర్, అసిస్టెంట్‌తో సహా 41మంది ప్రయాణికులు వున్నారు. గోరఖ్‌పూర్‌కి చెందిన ఈ బస్సు రిసార్ట్ టౌన్ అయిన పోఖ్రా నుంచి బయలుదేరి రాజధాని ఖాట్మండుకు వెళుతోంది. తన్హున్ జిల్లాలో అయినా పహరాలో హైవై పై నుంచి బస్సు నదిలోకి దూసుకువెళ్ళింది. వెంటనే నదిలో పడిన బస్సు నుంచి 29 మందిని కాపాడగలిగారు. "ఈ బస్సు యూపీలో రిజిస్ట్రరైంది. పోఖ్రా నుండి ఖాట్మండు మీదుగా గోరఖ్‌పూర్ వెళుతోంది. 29 మందిని బస్సులో నుంచి వెలికి తీసి ఆస్పత్రికి పంపాం" అని మాత్రమే జిల్లా పోలీసు కార్యాలయ అధికారులు తెలిపారు. వారి పరిస్థితి ఎలా వుందో వెంటనే తెలియరాలేదు. నేపాల్ విపత్తు నిర్వహణా శిక్షణా స్కూలుకు చెందిన సీనియర్ ఎస్పీ మహదేవ్ పౌడల్ నేతృత్వంలో 45మంది సాయుధ పోలీసు బృందం ఈ సహాయక, వెలికితీత చర్యల్లో పాల్గొంది. శుక్రవారం ఉదయం 11.30గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు.

గత నెలలో నేపాల్‌లో పొంగి పొర్లుతున్న త్రిశూలి నదిలో రెండు బస్సులు కొట్టుకు పోయిన ఘటనలో 65 మంది ప్రయాణికులు మరణించారు. దాదాపు వంద కిలోమీటర్ల దూరంలో మృతదేహాలు కనిపించాయి. ఈ ప్రమాదంలో ఐదుగురు భారతీయుల మృత దేహాలు లభ్యం కాగా, ఇద్దరి ఆచూకీ తెలియరాలేదు. ఎన్‌డీఆర్‌ఎఫ్‌కి చెందిన 12మంది సభ్యుల బృందం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టినా కొట్టుకుపోయిన ఆ బస్సుల ఆచూకీ దొరకలేదు.

ఘటనా స్థలానికి యూపీ ప్రభుత్వాధికారులు

తన్హున్ జిల్లాలోని అంబుకరేని ప్రాంతంలో హైవై పై నుంచి 150 మీటర్ల లోతులో నదిలోకి బస్సు పడిపోవడంతో 14 మంది చనిపోయారని, 29 మందిని కాపాడారని నేపాల్ అధికారులు ధృవీకరించారని యూపీ ప్రభుత్వ సహాయ కమిషనర్ నవీన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సమాచారం అందుకోగానే సీనియర్ డివిజనల్ మేనేజర్ సంఘటనా స్థలానికి వెళ్ళారని, సహాయక చర్యల సమన్వయం కోసం ఏడీఎంని నియమించామని చెప్పారు. స్థానిక అధికారులతో మాట్లాడి సమాచారం తెలుసుకుంటున్నామని చెప్పారు. పర్వత ప్రాంతాలు కావడం వల్ల ...15లో

రూ.300కే

ఇంటర్నెట్ కేబుల్ టీవీ ఇ-ఎడ్యుకేషన్

టీ-ఫైబర్‌కు వడ్డీ రహిత రుణం రూ.1,779 కోట్లు అందించాలి

భారత్ నెట్ 3 ఆర్కిటెక్చర్

డీపీఆర్‌ను ఆమోదించండి

స్పోర్ట్స్ యూనివర్శిటీకి ఆర్థిక సహాయమివ్వండి :కేంద్ర మంత్రులకు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి



కేంద్ర మంత్రి సింధియాకు జ్ఞాపికను అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిజీబిజీగా గడుపుతున్నారు. రాష్ట్రంలోని వివిధ పథకాలకు ఆర్థిక సాయాన్ని అందించాలని కేంద్రాన్ని కోరారు. రాష్ట్రానికి సంబంధించిన అభివృద్ధి అంశాలపై కేంద్ర మంత్రులు జ్యోతిరాదిత్య సింధియా, మన్ సుఖ్ మాండవీయలతో వరస భేటీల్లో పాల్గొన్నారు. శుక్రవారం సాయంత్రం కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాను సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కలిశారు. టి-ఫైబర్ ద్వారా రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీలు, మండలాలు, జిల్లాలకు ఇంటర్నెట్ కనెక్టివిటీని కల్పించడం తమ ఉద్దేశమని వివరించారు. 65,500 ప్రభుత్వ సంస్థలకు జీ2జీ (గవర్నమెంట్ టూ గవర్నమెంట్), జీ2సీ (గవర్నమెంట్ టూ సిటీజన్) కనెక్టివిటీ కల్పించడంతో పాటు రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో 63 లక్షల గృహాలు, పట్టణ ప్రాంతాల్లో 30 లక్షల గృహాలకు నెలకు కేవలం రూ. 300కే ఇంటర్నెట్, కేబుల్ టీవీ, ఈ-ఎడ్యుకేషన్ సేవలు అందించాలని తమ ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో 300 రైతు వేదికలకు టీ-ఫైబర్ ద్వారా రైతు నేస్తం కార్యక్రమాన్ని ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తోందని, సాంఘిక సంక్షేమ పాఠశాలలకూ టీ-ఫైబర్ ద్వారా ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పిస్తున్నామని కేంద్ర మంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. రూ. 1,779 కోట్ల పెట్టుబడులతో ...15లో

నేడో, రేపో కొత్త పీసీసీ ప్రకటన!

మంత్రివర్గ విస్తరణకు అవకాశం

ఏఐసీసీలో కీలక భేటీ 3లో..

పాల్గొన్న పార్టీ చీఫ్ ఖర్గే, రాహుల్

హాజరైన దీపాదాస్ మున్షీ, రేవంత్, భట్టి, ఉత్తమ్

వ్యక్తిగతంగానూ అభిప్రాయాలు

తీసుకున్న కేంద్ర నాయకత్వం

జాతీయ, అంతర్జాతీయ క్రీడల నిర్వహణకు తెలంగాణకు అవకాశం ఇవ్వండి

తెలంగాణ యువతలోని క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు స్పోర్ట్స్ యూనివర్శిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రి మాండవీయకు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. స్పోర్ట్స్ యూనివర్శిటీల్లో అన్ని రకాల క్రీడలకు సంబంధించిన శిక్షణ, పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులన్నీ తెలంగాణలో ఉన్నాయని మంత్రి మన్‌సుఖ్ ఎల్ మాండవీయకు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. అందువల్ల భవిష్యత్తులో నిర్వహించనున్న ఒలింపిక్స్‌తో పాటు ఇతర అంతర్జాతీయ, జాతీయ క్రీడలు నిర్వహించే అవకాశాన్ని తెలంగాణకు ఇవ్వాలని కోరారు. డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి సీఎం కేంద్ర మంత్రి మన్ సుఖ్ మాండవీయతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా క్రీడా శాఖపై తమకున్న లక్ష్యాలను, ఆకాంక్షలు, తెలంగాణకు ఉన్న ఘనతను కేంద్ర మంత్రికి వివరించారు. ఒలింపిక్స్‌తో పాటు పలు అంతర్జాతీయ క్రీడల్లో తెలంగాణ క్రీడాకారులు పతకాలు సాధించిన విషయాన్ని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అంతర్జాతీయ వేదికలపై క్రీడాకారులు రాణించడానికి అవసరమైన అన్ని వసతుల కల్పనకు తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని కేంద్ర మంత్రికి తెలియజేశారు.

బఫర్ జోన్‌లో ఉంటే కూల్చేయండి

నా ఇల్లు, ఫామ్ హౌస్ మీరే వెళ్లి కొలవండి

కేటీఆర్, హరీశ్‌రావుకు మంత్రి పొంగులేటి సవాల్

చర్యలు తీసుకోవాలని హైడ్రా కమిషనర్‌కు ఆదేశం..



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

'నా ఇల్లు, నా ఫామ్ హౌస్' ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉంటే కూల్చేయాలని మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావును రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సవాల్ విసిరారు. హిమయత్‌సాగర్ ప్రాంతంలోని నా ఫామ్‌హౌజ్ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందంటూ బీఆర్‌ఎస్, మీడియా తనపై బురద జల్లుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడికి మీరే వెళ్లి వాటిని కొలవాలనీ, అవి అక్రమమని తేలితే వెంటనే కూల్చేయాలని కోరారు. ఇదే సందర్భంగా హైడ్రా కమిషనర్‌ను కూడా మంత్రి ఆదేశించారు. ఉన్నత లక్ష్యం కోసమే హైడ్రా తీసుకొచ్చామనీ, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలోని నిర్మాణాలకు అనుమతించేది లేదని స్పష్టం చేశారు. అలాంటి కట్టడాలను కూల్చి వేస్తామన్నారు. అక్రమ కట్టడం గత ప్రభుత్వ ...15లో

డిజైన్ ప్రకారం నిర్మాణం

జరగలేదు

కాళేశ్వరం వైఫల్యంపై సీడీవో ఎస్‌ఈ ఫజల్

మంత్రివర్గమే

అదనపు వెంట్లు వేయాలంది

కమిషన్‌కు కీలక 15లో

సమాచారమిచ్చిన అధికారి

రెండో రోజూ నరేందర్‌రెడ్డి హాజరు



అనిల్ అంబానీపై ఐదేండ్లు నిషేధం

రూ.25 కోట్ల జరిమానా.. మరో 24 సంస్థలపైనా సెబీ వేటు

రిలయన్స్ హోమ్ ఫైనాన్స్‌లో అవినీతి, నిధుల మళ్లింపుపై కఠిన చర్యలు



ముంబయి : ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ అవినీతిపై సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజీ బోర్డు ఆఫ్ ఇండియా (సెబీ) ఎట్టకేలకు చర్యలు తీసుకుంది. స్టాక్ మార్కెట్ల నుంచి ఆయన్ను ఐదేండ్ల పాటు నిషేధిస్తూ నిర్ణయం తీసుకుంది. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌హెచ్‌ఎఫ్ఎల్)లో నిధుల మళ్లింపుపై శుక్రవారం అనిల్ అంబానీతో పాటు రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ మాజీ అధికారులపై కూడా సెబీ చర్యలు చేపట్టింది. వీరితో పాటు మరో 24 సంస్థలపై ఐదేండ్ల నిషేధాన్ని విధించింది. పైగా అనిల్ అంబానీకి రూ.25 కోట్ల జరిమానా విధిస్తూ సెబీ నిర్ణయం తీసుకుంది. ఏ లిస్టెడ్ కంపెనీలోనైనా డైరెక్టర్ లేదా కీ మేనేజిరియల్ పర్సనల్ (కెఎంపీ) లేదా మార్కెట్ రెగ్యులేటర్ వద్ద నమోదైన మధ్యవర్తి పొజీషన్ సహా సెక్యూరిటీస్ మార్కెట్‌లతో సంబంధం ఉండే ఎలాంటి కార్యకలాపాల్లోనూ పాల్గొనకుండా ఐదేండ్లపాటు అంబానీపై నిషేధం ప్రకటించింది. లిస్టెడ్ కంపెనీలో డైరెక్టర్ పోస్టు నుంచి కూడా ఆయన్ను తప్పించింది. రిలయన్స్ హోం ఫైనాన్స్‌ను సైతం సెక్యూరిటీ మార్కెట్ల నుంచి ఆరు నెలలపాటు నిషేధించడంతో పాటు రూ.6 లక్షల జరిమానా విధించింది. ఈ వ్యవహారంతో సంబంధం కలిగిన మరికొన్ని సంస్థలపై రూ.25 కోట్ల జరిమానాకు ఆదేశించింది. అక్రమంగా రుణాలు పొందడం లేదా రుణాలు ...15లో

వ్యవస్థల్ని సక్రమంగా నడిపేది

ప్రజాఉద్యమాలే

న్యాయవ్యవస్థా దానిలో భాగమే...

ప్రజాస్వామ్య, పౌరహక్కుల సంరక్షణ

కోసం పోరాటాలే శరణ్యం 3లో..

దానికోసం చివరివరకు నిలబడతాం

మీట్ ది ప్రెస్‌లో మానవ హక్కుల

కార్యకర్త ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా

కమలానికి కాశ్మీరం పరీక్షే

గత ఐదేండ్ల స్థితిగతుల ఆధారంగా ఎన్నికలు

అక్కడి అభివృద్ధి అంతా మేడిపండు చందమే

ఇతర ప్రాంతాలను విస్మరించిన అధికార యంత్రాంగాలు

పలు సమస్యలతో కాశ్మీరీలు సతమతం 3లో..

లోక్‌సభ ఎన్నికల్లో జమ్మూలో కమలానికి పరాభవం

చర్చలతోనే పరిష్కారం

మరోసారి స్పష్టం చేసిన భారత్



ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో మోడీ భేటీ

నాలుగు ఒప్పందాలపై సంతకాలు

కీవ్ : యుద్ధాలు, దాడులతో ఏ సమస్యను శాశ్వతంగా పరిష్కరించుకోలేమని, చర్చలు, సంప్రదింపులు, దౌత్య మార్గాలతోనే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని భారత్ మరోసారి స్పష్టం చేసింది. ఉక్రెయిన్‌లో తొలిసారి ...15లో



డీజీపీకి ఫిర్యాదును అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ముందు కాంగ్రెసోళ్ల

ఇండ్లు కూల్చండి

ఆ తర్వాతే సామాన్యుల భవనాలవైపు వెళ్లండి

పొంగులేటి, వివేక్, కేవీపీ,

మధుయాష్కీలవి అక్రమ

నిర్మాణాలే : కేటీఆర్

బీఆర్‌ఎస్ శ్రేణులు, జర్నలిస్టుల మీద

దాడులపై డీజీపీకి ఫిర్యాదు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పొంగులేటి, వివేక్, కేవీపీ, మధుయాష్కీ, తదితర నేతల ఇండ్లను ముందు కూల్చాలనీ, ఆ తర్వాత సామాన్యుల భవనాల వైపు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు, ఎమ్మెల్యే కె.తారకరామారావు డిమాండ్ చేశారు. జర్నలిస్టులపైనా, బీఆర్‌ఎస్ కార్యకర్తలపైనా కాంగ్రెస్ పార్టీ శ్రేణుల దాడులు, పోలీసుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ హైదరాబాద్‌లో డీజీపీ డాక్టర్ జితేందర్‌కు ఫిర్యాదు చేశారు. కొందరు పోలీసుల తీరు సరిగా లేదని ఆయన వద్ద ప్రస్తావించారు. ఆ తర్వాత కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. విద్యార్థి నాయకుడు, తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్ ఆధ్వర్యంలో తిరుమలగిరిలో ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా రైతు నిరసన దీక్ష చేస్తే 50 కాంగ్రెస్ గుండాలు రాళ్ళు, గుడ్లు, సుతిలి బాంబులతో దాడులు చేశారని ఆరోపించారు. పోలీసులే తమ నిరసన దీక్ష టెంట్‌ను కూల్చేయటం దారుణమన్నారు. రుణమాఫీపై చర్చకు ఏఊరైనా వెళ్దామని సవాల్ చేస్తే సీఎం ...15లో

ఇక స్పీడ్..

రాష్ట్రాభివృద్ధికి ప్రత్యేక కమిషన్



మొత్తం 19 ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి

పనులు వేగంగా ప్రారంభించాలి : సీఎం ఆదేశాలు

వివరాల కోసం ప్రణాళికా శాఖ ప్రత్యేక పోర్టల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టులు, కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికను రూపొందిస్తోంది. ఇందుకు సంబంధించిన కసరత్తును ముఖ్యమంత్రి రేవంత్ దగ్గరుండి మరీ పర్యవేక్షిస్తున్నారు. తద్వారా స్పీడ్ (స్మార్ట్ ప్రోయాక్టివ్ ఎఫిషియంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ) పేరిట సరికొత్త కార్యాచరణను చేపట్టాలంటూ ఆయన ఉన్నతాధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఒక ప్రత్యేక కమిషన్‌గా దీన్ని ఏర్పాటు చేయనున్నారు. స్పీడ్ పరిధిలో మొత్తం 19 ప్రాజెక్టులు, కార్యక్రమాలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనుంది. సంబంధిత విభాగాల అధికారులు నెలకోసారి సమావేశమై వాటిని సమీక్షిస్తారు. నిర్దిష్ట కాలవ్యవధిలో ఆయా ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు వీలుగా క్షేత్రస్థాయిలోని ఆఫీసర్లు, సిబ్బందితో ఎప్పటికప్పుడు సమాలోచనలు చేసి, ప్రణాళికలు రూపొందిస్తారని ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి. రాష్ట్రాభివృద్ధికి ప్రామాణికమైన మౌలిక సదుపాయాల కల్పనలో వివిధ విభాగాల మధ్యనున్న అడ్డంకులు, అవరోధాలన్నింటినీ అధిగమించేందుకు 'స్పీడ్' ప్రత్యేక చొరవను ప్రదర్శిస్తుందని ఉన్నతాధికారులు తెలిపారు. ఒకవేళ పనుల్లో జాప్యం జరిగినా, వాటి పురోగతికి ఆటంకాలేర్పడినా నేరుగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, ఆయన జోక్యంతో అవసరమైన నిర్ణయాలను అది తీసుకుంటుందని వారు వివరించారు. కేవలం నగరాలు, పట్టణాలకే పరిమితం కాకుండా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు, మారుమూల గ్రామాల్లోని అభివృద్ధి పనులను కూడా ఇది పర్యవేక్షిస్తుంది. వివిధ కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు, నగర పంచాయతీలు, గ్రామ పంచాయతీల్లోని పనులు, వాటిని చేపట్టటానికి కావాల్సిన నిధులు, అంచనాలపై కూడా ఇది స్పష్టమైన ప్రణాళికలు రూపొందించి, ఉన్నతాధికారులకు పంపుతుంది. స్పీడ్ చేపట్టబోయే ప్రాజెక్టుల పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక విధానాన్ని రూపొందించాలంటూ ముఖ్యమంత్రి కార్యాలయం ఇప్పటికే సంబంధిత అధికారులను, ఆయా విభాగాలను ఆదేశించింది. పనితీరుపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించేందుకు, వాటి పర్యవేక్షణకు ప్రత్యేక ఏర్పాటు చేయాలంటూ సూచించింది. ఈ మొత్తం ప్రక్రియనంతటినీ ...15లో

'స్పీడ్' పరిధిలోని 19 ప్రాజెక్టులివే...

1) మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్
2) శాటిలైట్ టౌన్ల అభివృద్ధి
3) మెట్రో రైల్ విస్తరణ
4) జీహెచ్ఎంసీ పునర్ వ్యవస్థీకరణ
5) రీజనల్ రింగ్ రోడ్
6) హైదరాబాద్ నగరంలో ఎలివేటెడ్ కారిడార్లు
7) రాష్ట్రంలో కొత్త విమానాశ్రయాలు
8) ఢిల్లీలో తెలంగాణ భవన్ నిర్మాణం
9) మహిళా శక్తి పథకం అమలు
10) జిల్లా సమాఖ్య భవనాల నిర్మాణం
11) రెసిడెన్షియల్ స్కూళ్లు, వాటి కాంప్లెక్సుల నిర్మాణం
12) అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల సంస్థాగత అభివృద్ధి
13) ఐటీఐల్లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు
14) ఉస్మానియా దవాఖానాకు నూతన భవనం
15) నూతన నర్సింగ్, నూతన పారామెడికల్ కాలేజీల ఏర్పాటు
16) హెల్త్ టూరిజం ప్రమోషన్
17) ఎకో టూరిజం ప్రాజక్టుల ప్రమోషన్
18) టెంపుల్ సర్క్యూట్స్ టూరిజం
19) యాంటీ డ్రగ్స్ స్ట్రాటజీ అమలు

బాధితురాలి ఆక్రందనలు

ఎవరికీ వినబడలేదా?

- సీబీఐ అధికారుల విస్మయం
- సెమినార్ హాల్‌కు విరిగిన డోర్ బోల్ట్‌పై పరిశీలన
- ఆ నలుగురికీ పాలిగ్రాఫ్ ?

కోల్‌కతా : అమానుష ఘటన జరిగిన ఆర్‌జికార్ ఆస్పత్రిలోని సెమినార్ హాల్‌లో ఎలాంటి అంతరాయం, అడ్డంకులు లేకుండా నేరం ఎలా జరిగిందనే విషయమై సిబిఐ ప్రధానంగా దృష్టి కేంద్రీకరించింది. సెమినార్ హాల్ తలుపునకు బోల్ట్ విరిగి వుండడాన్ని గమనించింది. దీనిపై విద్యార్థులను ప్రశ్నించగా, కొంతకాలంగా బోల్ట్ పనిచేయడం లేదని, దానిపై ఇంతకుముందు కూడా అధికారులకు ఫిర్యాదులు చేసినట్లు వారు తెలిపారు. తలుపునకు బోల్ట్ లేనపుడు లోపల బాధితురాలు చేసిన ఆక్రందనలు ఎవరికీ వినిపించలేదా అని అధికారులు ఆశ్చర్యపోతున్నారు. పైగా ఎవరూ లోపలకు రాకుండా బయట ఎవరినైనా కాపలాగా పెట్టి వుంటారా అనే కోణంలో కూడా పరిశీలిస్తున్నారు. దీన్ని నిర్ధారించుకునేందుకు వారు సిసి టివి ఫుటేజీని సమీక్షిస్తున్నారు. 9వ తేదీ రాత్రి 2 నుండి 3గంటల మధ్యలో బాధితురాలు సెమినార్ హాల్లోకి ప్రవేశించిందని ప్రాథమిక పరిశీలనలో వెల్లడైంది. సెమినార్ హాల్లో ఆమె పడుకుని వుండగా చూసినట్లు డ్యూటీలో డాక్టరు కూడా తెలిపారు. ఆ రాత్రి హాల్లో పడుకున్నా ఆమె తలుపు వేసుకోకపోవడానికి కారణం బోల్ట్ విరిగి వుండడమేనని, ఇది అందరికీ తెలిసిన విషయమేనని అక్కడి డాక్టర్లు, ఇంటర్న్‌లు, జూనియర్ డాక్టర్లు తెలిపారని సిబిఐ అధికారులు చెప్పారు. బాధితురాలితో కలిసి ముందు రోజు రాత్రి డిన్నర్ చేసిన ముగ్గురు జూనియర్ డాక్టర్లు, ఒక ఇంటర్న్‌కు కూడా పాలిగ్రాఫ్ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ నేరంలో వారి పాత్ర వుందా? లేదా? అనేది నిర్ధారించుకోవడానికి ఈ చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

28 జీవో ఉద్యోగుల భవితకు ఉరి

- ప్రజాపాలనలో పాతపెన్షన్ అమలు చేయాలి : టీఎస్‌సీపీఎస్‌ఈయూ అధ్యక్షులు స్థితప్రజ్ఞ డిమాండ్
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డికి వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను అమల్లోకి తెచ్చిన 28 జీవో ఉద్యోగుల భవితకు ఉరివంటిదని టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షులు గంగాపురం స్థితప్రజ్ఞ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజా పాలన ప్రభుత్వంలో ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కార కమిటీ చైర్మెన్, తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జి చిన్నారెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లో స్థితప్రజ్ఞ కలిసి వినతిపత్రం సమర్పించారు. సీపీఎస్ అమల్లోకి రావడానికి గల కారణాలను వివరించారు. పాత పెన్షన్ పునరుద్ధరణ ఆవశ్యకతపై సంపూర్ణ నివేదికను అందజేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరణ చేయాలని కోరుతూ శుక్రవారం అన్ని జిల్లాల్లో బ్లాక్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. 28 జీవోను దహనం చేసి నిరసన తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో స్థితప్రజ్ఞ మాట్లాడుతూ ఉద్యోగ సంఘాలతో చర్చించకుండానే 2014లో ఏర్పడిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని కొనసాగిస్తామని ప్రకటించిందన్నారు. 2014, ఆగస్టు 23న 28 జీవోను విడుదల చేసిందని గుర్తు చేశారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చిన విధంగా సీపీఎస్‌ను రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పాత పెన్షన్ పునరుద్ధరణ అంశం పరిష్కారమయ్యేలా కృషి చేస్తామని చిన్నారెడ్డి హామీ ఇచ్చారని చెప్పారు.

రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి

- మంద కృష్ణమాదిగ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుననుసరించి రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగ, మాదిగ సామాజిక వర్గానికి చెందిన శాసన సభ్యులు, సామాజిక వేత్తలు మంత్రులను కోరారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆధ్వర్యంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావును కలిశారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేసేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. మంత్రులను కలిసిన వారిలో శాసన సభ్యులు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, వేముల వీరేశం, కాలే యాదయ్య, మందుల శామ్యూల్, ప్రొఫెసర్ మల్లేశం, ప్రొఫెసర్ ఖాసీం, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొండేటి మల్లయ్య, విజయ్ కుమార్ ముంజగళ్ళ, బాపిరాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు మేడి పాపయ్య మాదిగ, గోవింద్ నరేష్‌లు ఉన్నారు.

రోజుకు 62 రోడ్డు ప్రమాదాలు

- 'సుప్రీం' ఆదేశాలు అమలు చేయాలి
- రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి : అధికారులకు రవాణామంత్రి పొన్నం దిశానిర్దేశం


(ఫైల్)

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతున్నదనీ, వాటి నియంత్రణ కోసం సుప్రీంకోర్టు కమిటీ ఇచ్చిన రోడ్డు భద్రతా మార్గదర్శకాలను తప్పనిసరిగా అమలు చేయాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారుల్ని ఆదేశించారు. 2023లో 22,903 రోడ్డు ప్రమాదాలు జరిగాయనీ, అంటే రోజుకు 62 ప్రమాదాలు జరుగుతున్నాయనీ, దీనికి బాధ్యులు ఎవరని ప్రశ్నించారు. రోడ్డు భద్రతపై శుక్రవారంనాడిక్కడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రవాణా, ట్రాఫిక్, ఆరోగ్య, కుటుంబసంక్షేమం, రోడ్లు, భవనాల శాఖ, నేషనల్ హైవేస్ అథారిటీ, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్స్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ), హెచ్‌ఎండీఏ సహా పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గతేడాది జరిగిన రోడ్డు ప్రమాదాలను విశ్లేషించారు. మొత్తం 22,903 ప్రమాదాల్లో 7,186 ప్రాణాంతకమైనవి కాగా, 2,476 తీవ్రమైన గాయాలతో కూడిన ప్రమాదాలు జరిగాయని తెలిపారు. 10,404 ప్రమాదాల్లో చిన్న గాయాలు, 2,747 సాధారణ గాయాల ప్రమాదాలు జరిగాయని విశ్లేషించారు. రోడ్డు భద్రతా ప్రాధాన్యతను ఇవి గుర్తుచేస్తున్నాయనీ, వీటి నియంత్రణకు సుప్రీంకోర్టు కమిటీ ప్రతిపాదించిన రోడ్డు భద్రతా నిబంధనల్ని తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. రోడ్లపై ఎక్కడ ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయో వాటిని బ్లాక్‌స్పాట్స్‌గా గుర్తించి అన్ని శాఖల సమన్వయంతో నివారణకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించేలా 108 అంబులెన్సులు, క్రిటికల్ కేర్ సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలకు కారణమైన వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకోవాలనీ, వారి డ్రైవింగ్ లైసెన్సులు రద్దు చేయాలని చెప్పారు. డ్రంక్ అండ్ డ్రైవ్, రాంగ్‌సైడ్ డ్రైవింగ్‌ను నిషేధించాలనీ, పట్టుబడితే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, సురక్షిత డ్రైవింగ్ వంటి వాటిపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిల సంఖ్య పెంచాలనీ, జిల్లా రోడ్డు భద్రతా సమావేశాల్ని రెగ్యులర్‌గా నిర్వహిస్తూ, సమన్వయం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా విభాగాల ఉన్నతాధికారులతో పాటు రవాణాశాఖ జాయింట్ కమిషనర్లు సీ రమేష్, మమత ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వ్యవస్థల్ని సక్రమంగా నడిపేది ప్రజా ఉద్యమాలే

న్యాయ వ్యవస్థ దానిలో భాగమే...

- ప్రజాస్వామ్య, పౌరహక్కుల సంరక్షణ కోసం పోరాటాలే శరణ్యం
- దానికోసం చివరివరకు నిలబడతాం
- మీట్ ది ప్రెస్‌లో మానవ హక్కుల కార్యకర్త ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రజా ఉద్యమాలే వ్యవస్థల్ని సక్రమంగా నడుపగలుగుతాయనీ, దీనిలో న్యాయ వ్యవస్థకు ఎలాంటి మినహాయింపు లేదని మానవ హక్కుల కార్యకర్త, ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య, పౌరహక్కుల సంరక్షణ కోసం పోరాటాలే శరణ్యమనీ, దానికోసం చివరి వరకు నిలబడతామని తేల్చిచెప్పారు. తెలంగాణ స్టేట్ యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో శుక్రవారంనాడిక్కడి బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ప్రొఫెసర్ సాయిబాబాతో మీట్ ది ప్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు సాయిబాబా సమాధానాలు చెప్పారు. తొమ్మిదేండ్ల నాగపూర్ జైలు జీవిత కష్టాలనూ పంచుకున్నారు. తన తల్లి చనిపోతే అంత్యక్రియలకు కూడా తనకు పెరోల్ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక కోర్టుకు మరో కోర్టుకు మధ్య విచారణల్లో చాలా వ్యత్యాసాలున్నాయనీ, వ్యక్తుల్ని బట్టి విచారణలు జరుగుతున్నాయేమో అనే సందేహాలు తనకు అనేకసార్లు వచ్చాయని చెప్పారు. ఇదే విషయాన్ని జైలులోని నిరక్షర ఖైదీలు తనవద్ద ప్రస్తావిస్తే ఆశ్చర్యపోయానన్నారు. ఫలానా బెంచ్ అయితే బెయిల్ రాదనీ, వాదనలు కూడా అనవసరమని తనకు సలహాలు సూచనలు చేశారని చెప్పారు. తాను జైలులో ఉన్న సమయంలో ఘోరమైన నేరాలు చేసిన నేరస్తులకు స్వల్ప వ్యవధిలోనే బెయిళ్లు రావడం తాను కళ్లారా చూసాననీ, మానవ హక్కుల కోసం గళం ఎత్తితే తొమ్మిదేండ్లకు పైగా జైలులో పెట్టి నిర్బంధం విధించారని అన్నారు. వ్యవస్థలన్నీ సక్రమంగా నడవాలంటే ప్రజా ఉద్యమాలే శరణ్యమనీ, దానిలో న్యాయవ్యవస్థకు మినహాయింపు ఏమీ లేదన్నారు. తన తరపున వాదించిన న్యాయవాది హనీబాబుపై కూడా అనేక నిర్బంధ సెక్షన్ల కింద కేసులు పెట్టారని గుర్తుచేశారు. తనలాంటి చదువుకున్న, ఉపాధ్యాయ వృత్తిలో ఉండి సమాజంలో హక్కుల కోసం గళమెత్తే వ్యక్తిని నిర్బంధంలో ఉంచితే, సామాన్యులు భయంతో బిక్కచచ్చి, మౌనంగా ఉండిపోతారని రాజ్యం భావించిందనీ, కానీ అందుకు భిన్నంగా కొత్త గొంతులు పుట్టుకొచ్చాయని వివరించారు. సమాజంలో మార్పునకు సాహిత్యం దోహదపడుతుందని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. హక్కులు ఎప్పుడూ స్థిరంగా ఉండవనీ, కొత్త హక్కులు పుట్టుకొస్తూనే ఉంటాయని విశ్లేషించారు. ప్రజాస్వామ్య, ఆదివాసీ హక్కుల సాధన కోసం పోరాడాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని చెప్పారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన పాక్షిక విజయమేననీ, ప్రజాస్వామ్య తెలంగాణ సాధనే అంతిమ విజయం అని స్పష్టం చేశారు. దేశంలో వివిధ ప్రాజెక్టులు నిర్మించేటప్పుడు దాదాపు రెండు కోట్ల మంది ఆదివాసీ, గిరిజనులు అదృశ్యం అయ్యారనీ, వారికి సంబంధించిన ఎలాంటి సమాచారం ప్రభుత్వం వద్ద లేదని తెలిపారు. కార్పొరేట్లు, బహుళజాతి సంస్థలు చెప్తున్న అభివృద్ధి ప్రకృతి విధ్వంసంతో కూడుకున్నదనీ, అడవులు, కొండల్ని తవ్వేసి, అక్కడ సంపదను కొల్లగొట్టడమే వారు అభివృద్ధి అని చెప్తున్నారని వివరించారు. కానీ, ఆదివాసీలకు అభివృద్ధిపై స్పష్టమైన అవగాహన ఉందనీ, అది పాలకులకు అర్థం కావట్లేదని చెప్పారు. దేశంలో ఖనిజ సంపద దోపిడీకి వ్యతిరేకంగా ఆదివాసీలు స్వచ్ఛందంగా పోరాటాలు చేస్తున్నారనీ, వాటిని విద్యావేత్తలు, పౌరసమాజం నుంచి ఆశించిన మద్దతు లభించట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో కులవ్యవస్థను నిర్మూలించాలనుకొనేవారి సంఖ్య ఎక్కువగానే ఉందనీ, వారందరినీ ఏకతాటిపైకి తెచ్చే ప్రయత్నాల్లోనే లోపాలు ఉన్నాయని విశ్లేషించారు. కేవలం ప్రభుత్వాలను మార్చడం వల్ల సమాజంలో మార్పు రాదనీ, ప్రజాఉద్యమాలు వస్తేనే సంపద పంపిణీకి సమాన అవకాశాలు లభిస్తాయని చెప్పారు. తెలంగాణ ప్రజల నుంచి తాను సామాజిక విజ్ఞానం నేర్చుకున్నాననీ, ప్రజాసామ్య పరిరక్షణ కోసం మానవ హక్కుల కార్యకర్తగానే కొనసాగుతానని అన్నారు. అయితే దీన్ని రాజ్యం, వ్యవస్థలు భిన్న కోణాల్లో విశ్లేషించి, వక్రీకరించుకుంటే తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. కార్యక్రమానికి టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ సమన్వయకర్తగా వ్యవహరించారు. ప్రొఫెసర్ హరగోపాల్ అధ్యక్షత వహించారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి వీ యాదగిరి వందన సమర్పణ చేశారు.

పీఈసెట్‌లో 753 మందికి సీట్ల కేటాయింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పీఈసెట్) మొదటి విడత కౌన్సెలింగ్‌లో 753 మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించారు. ఈ మేరకు పీఈసెట్ ప్రవేశాల కన్వీనర్ పి రమేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మొదటి విడత కౌన్సెలింగ్‌లో 967 మంది వెబ్‌ఆప్షన్లు నమోదు చేశారని తెలిపారు. బీపీఈడీలో 1,437 సీట్లు, డీపీఈడీలో 300 సీట్లు కలిపి మొత్తం 1,737 సీట్లు కన్వీనర్ కోటాలో అందుబాటులో ఉన్నాయని వివరించారు. మొదటి విడతలో బీపీడీలో 600 మందికి, డీపీఈడీలో 153 మందికి కలిపి 753 మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. ఈనెల 28 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించాలని కోరారు. ఈనెల 27 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు.

బీజేపీకి కష్టమే

హర్యానాలో అధికార పార్టీకి అనేక సవాళ్లు

- ఇప్పటికే నిరుద్యోగం, అగ్నిపథ్, రైతు సమస్యలతో రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత
- కాషాయపార్టీకి దూరమైన జేజేపీ
- ఎన్నికల్లో మళ్లీ కమలం వికసించటం కష్టమే
- లోక్‌సభ ఎన్నికల తర్వాత పుంజుకున్న కాంగ్రెస్
- రాజకీయ విశ్లేషకుల అంచనాలు



చండీగఢ్ : హర్యానాలో అధికార బీజేపీకి రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో చేదు ఫలితాలు ఎదురుకానున్నాయా? కాషాయపార్టీ మళ్లీ అధికారాన్ని నిలబెట్టుకోవటం అసాధ్యమేనా? లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో సత్తా చాటిన హస్తం పార్టీ నుంచి బీజేపీకి గట్టి పోటీ తప్పదా? అంటే.. రాజకీయ పరిశీలకులు అవుననే అంటున్నారు. రాష్ట్రంలో అధికార బీజేపీపై అన్ని వర్గాల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఉన్నదనీ, ఇది రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిబింబించనున్నదని వారు అంచనా వేస్తున్నారు.

కాంగ్రెస్‌కు గణనీయంగా పెరిగిన ఓటింగ్

ఈ ఏడాది ముగిసిన లోక్‌సభ ఎన్నికల ఫలితాలే రాష్ట్రంలో బీజేపీ పతనానికి, అధికార పార్టీపై ప్రజల ఆగ్రహానికి ప్రత్యక్ష ఉదాహరణగా రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. 2019 లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో హర్యానాలో కాంగ్రెస్ గణనీయమైన ఓటు శాతాన్ని పెంచుకున్నదని అంటున్నారు. అయితే, బీజేపీ మాత్రం స్వల్ప పెరుగుదలనే నమోదు చేయటం గమనార్హం. అయితే, ఈ ఎన్నికల్లో ఓటింగ్ సరళిని చూస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మొత్తం 90 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 44 స్థానాల్లో బీజేపీ, 42 సీట్లలో కాంగ్రెస్ ముందంజలో ఉన్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్.. ఆప్‌తో కలిసి పోటీ చేసిన విషయం విదితమే.

బీజేపీ సర్కారుపై నిరుద్యోగుల ఆగ్రహం

భారత్‌లో ప్రభుత్వ ఉద్యోగానికి ఉన్న క్రేజ్ అంతా, ఇంతా కాదు. ఇందుకు హర్యానా యువత కూడా మినహాయింపేమి కాదు. దీంతో ప్రభుత్వ ఉద్యోగం కోసం వారు తీవ్రంగా ప్రయత్నిస్తుంటారు. అయితే, ఎన్నికల్లో హామీలిచ్చే బీజేపీ.. అధికారంలోకి వచ్చిన తర్వాత యువతకు ఉద్యోగాలను కల్పించటంలో విఫలమైందని ఇక్కడి నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ముగిసిన లోక్‌సభ పోరులోనూ నిరుద్యోగం, రైతుల సమస్యలే ఎన్నికల అంశాలుగా మారాయి. దీంతో ఆ ఎన్నికల్లో బీజేపీకి పెద్ద ఎదురుదెబ్బే తగిలింది. మొత్తం పది ఎంపీ స్థానాలున్న హర్యానాలో బీజేపీ ఐదు స్థానాల్లో ఓటమి చెందింది. కాంగ్రెస్ సున్నా నుంచి ఐదుకు పుంజుకున్నది. దీంతో హస్తం, కమలం పార్టీలు ఐదు స్థానాల చొప్పున కైవసం చేసుకున్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో పదికి పది స్థానాలను బీజేపీ విజయం సాధించుకున్న విషయం విదితమే.

నిరుద్యోగంలో ముందు

బీజేపీ పాలనలో హర్యానాలో నిరుద్యోగం తీవ్రమైంది. సాక్షాత్తు ప్రభుత్వ గణాంకాలే ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయి. ప్రభుత్వ పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వేతో పోల్చి చూస్తే భారత్‌లో హర్యానా రాష్ట్రంలో ఎక్కువ నిరుద్యోగ రేటు ఉన్నదని సెంటర్ ఆఫ్ మానిటరింగ్ ది ఇండియన్ ఎకానమి (సీఎంఐఈ) వివరించింది. ఇది నిరుద్యోగంలో హర్యానాను నాలుగో స్థానంలో పెట్టిందని పేర్కొన్నది. పొరుగు రాష్ట్రాలైన పంజాబ్, యూపీ, హిమాచల్‌ప్రదేశ్, రాజస్థాన్‌ల కంటే దారుణ ప్రదర్శనను హర్యానా కనబర్చిందని వివరించింది. రాష్ట్రవ్యాప్తంగా కార్మికుల స్థితిగతులు కూడా దయనీయంగా ఉన్నాయని ట్రేడ్ యూనియన్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రంలోని వివిధ ఇండస్ట్రియల్ సెక్టార్లలో దాదాపు 50 నుంచి 60 లక్షల మంది కార్మికులు పని చేస్తున్నారనీ, వీరిలో 50 శాతం మంది మాత్రమే (దాదాపు 28 లక్షల మంది) ఈఎస్ఐ కింద నమోదయ్యారని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి జై భగవాన్ అన్నారు.

అగ్నివీర్ పథకం వద్దంటున్న హర్యానా ప్రజలు

రక్షణ, భద్రత ఏజెన్సీలకు ఎక్కువ మంది యువతను అందించే రాష్ట్రాల్లో హర్యానా ఒకటి. అయితే, కేంద్రంలోని మోడీ సర్కారు తీసుకొచ్చిన అగ్నివీర్ పథకం ఇక్కడి యువతకు శాపంగా మారిందని హర్యానా ఓటర్లు భావిస్తున్నారు. సైన్యంలో చేరి, శాశ్వత ఉద్యోగంతో దేశానికి సేవ అందించాలనుకుంటున్న హర్యానా యువతకు.. అగ్నివీర్ వంటి తాత్కాలిక ఉద్యోగ పథకం నిరాశను కలిగిస్తున్నదని కొందరు విశ్లేషకులు చెప్తున్నారు. దీంతో ఇక్కడి ప్రజలు అగ్నివీర్ పథకాన్ని వెనక్కి తీసుకోవాలనే డిమాండ్‌ను వినిపిస్తున్నారని అంటున్నారు.

బీజేపీతో జేజేపీ తెగదెంపులు

బీజేపీకి దుష్యంత్ చౌతలా రూపంలోనూ ఎదురుదెబ్బ తగలనున్నదని రాజకీయ పరిశీలకులు చెప్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన పార్టీ జననాయక జనతా పార్టీ (జేజేపీ) పది మంది ఎమ్మెల్యేలను గెలుచుకొని రాష్ట్రంలో బీజేపీ నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడటానికి కీలకంగా వ్యవహరించింది. అయితే, డిమాండ్ల సాధనకు మోడీ సర్కారుపై రైతుల పోరాటం నేపథ్యంలో ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికలకు ముందు జేజేపీ.. కాషాయపార్టీతో తెగదెంపులు చేసుకున్నది. దీంతో ఈ రాజకీయ పరిణామం రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి శాపంగా.. కాంగ్రెస్‌కు ప్రయోజనంగా మారనున్నదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

కమలానికి 'జాట్'ల దెబ్బ

ఇక హర్యానాలో జాట్ సామాజిక వర్గం ప్రభావానికి కౌంటర్‌గా బీజేపీ ఓబీసీ సీఎం అస్త్రంతో ముందు కొచ్చింది. లోక్‌సభ ఎన్నికలకు ముందే ఈ నిర్ణయాన్ని తీసుకున్నది. అయితే, ఈ నిర్ణయం లోక్‌సభ ఎన్నికల్లో ఏ మాత్రమూ పని చేయకపోవటంతో బీజేపీ డీలా పడిపోయిందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. జాట్ ఓటర్లు బీజేపీయేతర అభ్యర్థులకు ఓటు వేయటంతో కాషాయపార్టీ తీవ్రంగా నష్టపోయిందని చెప్తున్నారు. భారత ఎన్నికల సంఘం ప్రకటించిన విధంగానే హర్యానాలో అక్టోబర్ 1న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇక ఎన్నికలకు దాదాపు 40 రోజులే మిగిలి ఉన్నది. ఈ నేపథ్యంలో ఇక్కడి అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్‌లు ఓటర్లను తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలను తీవ్రం చేశాయి. 'నాన్‌స్టాప్ హర్యానా' పేరుతో బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా ప్రచారాన్ని నడిపిస్తున్నది. భూపిందర్‌సింగ్ హుడా నేతృత్వంలోని రాష్ట్ర కాంగ్రెస్ 'హర్యానా మాంగే హిసాబ్' నినాదంతో ముందుకెళ్తున్నది.

నేడో, రేపో కొత్త పీసీసీ ప్రకటన..!

మంత్రివర్గ విస్తరణకు అవకాశం

- ఏఐసీసీలో కీలక భేటీ
- పాల్గొన్న పార్టీ చీఫ్ ఖర్గే, రాహుల్
- హాజరైన దీపాదాస్ మున్షీ, రేవంత్, భట్టి, ఉత్తమ్
- వ్యక్తిగతంగానూ అభిప్రాయాలు తీసుకున్న కేంద్ర నాయకత్వం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రెండూ మూడ్రోజుల్లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ)కి కొత్త అధ్యక్షుడిని నియమించనున్నట్టు తెలిసింది. అలాగే రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణ, మార్పులు, చేర్పులకు కేంద్ర నాయకత్వం ఆమోదం తెలిపినట్టు సమాచారం. శుక్రవారం అక్బర్ రోడ్‌లోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో కీలక భేటీ జరిగింది. ఈ సమావేశంలో పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, పీసీసీ అధ్యక్షులు, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. దాదాపు రెండు గంటల పాటు సాగిన ఈ భేటీలో నూతన పీసీసీ ఎంపిక, మంత్రి వర్గ విస్తరణపై చర్చ జరిగినట్టు విశ్వసనీయంగా తెలిసింది. అలాగే మిగిలిన నామినేటెడ్ పోస్టుల భర్తీపై చర్చించినట్టు సమాచారం. తొలుత ప్రస్తుతం రాష్ట్రంలో రాజకీయ పరిణామాలపై అధిష్టానం ఆరా తీసినట్టు తెలిసింది. క్షేత్రస్థాయిలో పార్టీ మరింత బలోపేతం, ఎన్నికల టైంలో ఇచ్చిన హామీల అమలు, ఇతర అంశాలను రాష్ట్రనేతలు అధిష్టానానికి వివరించారు. ఈ సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం... రేవంత్ రెడ్డి సర్కార్ విజయ వంతంగా రూ. 2 లక్షల వరకు రుణమాఫీ అమలు చేయడంపై రాహుల్ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం కొత్త పీసీసీ ఎంపికపై ప్రధానంగా చర్చించారు. సామాజిక వర్గాల వారీగా రేసులో ఉన్న నేతల బలాబలాలు, ప్రజల్లో, పార్టీలో వారి చరిష్మా, పార్టీని నడిపే సామర్థ్యం, ఇతర విషయాలపై రాష్ట్ర నేతల అభిప్రాయాలను అధిష్టానం అడిగి తెలుసుకుంది. గతంలోనూ కొత్త అధ్యక్షుడి ఎంపిక, మంత్రి వర్గ విస్తరణపై పలుమార్లు చర్చలు జరిపినా... నేతల మధ్య ఏకాభిప్రాయం రాకపోవడంతో వాయిదా పడుతూ వచ్చింది. అయితే ఈ భేటీలోనూ భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనట్టు విశ్వసనీయంగా తెలిసింది. దీంతో విడివిడిగా సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి ఉత్తమ్‌ల అభిప్రాయాలు తీసుకున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ దిశలో అధిష్టానమే నూతన పీసీసీ పేరును ఖరారు చేసినట్టు తెలిసింది. ఈ పేరును ఒకటి, రెండ్రోజుల్లో అధికారికంగా విడుదల చేసే అవకాశం ఉంది.

పీసీసీ రేసులో

పీసీసీ పదవి కోసం పార్టీలో కీలక నేతలు వారి వారి స్థాయిలో లాబీయింగ్ చేస్తున్నారు. ఈ రేసులో మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నేతలు ఉన్నారు. ఆరుగురు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. సామాజిక వర్గాల వారీగా బీసీల నుంచి మహేశ్ కుమార్ గౌడ్, మధుయాష్కీ గౌడ్, అంజన్ కుమార్ యాదవ్ పేర్లు అధిష్టానం తుది పరిశీలనలో ఉన్నాయి. ఎస్సీ సామాజిక వర్గం నుంచి సంపత్ కుమార్, అడ్లూరి లక్ష్మణ్ పోటీ పడుతున్నారు. ఇక ఎస్టీ నుంచి కేంద్ర మాజీ మంత్రి, ఎంపీ బలరాం నాయక్‌లు పీసీసీ పదవి ఆశిస్తున్నారు. సీఎం, డిప్యూటీ సీఎం, ఇతర పదవుల్లో అగ్ర వర్ణాలకు, ఎస్సీ, ఎస్టీలకు అవకాశం కల్పించినందున... పీసీసీ పదవిని బీసీలకు ఇవ్వాలని హైకమాండ్ యోచిస్తున్నట్టు తెలిసింది. తద్వారా సామాజిక న్యాయంతో పాటు... అన్ని వర్గాలకూ అవకాశం కల్పించినట్టు అవుతుందని యోచిస్తోంది. ఇదే జరిగితే పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి మహేశ్ కుమార్ గౌడ్‌కు ఎక్కువ ఛాన్స్ ఉన్నట్టు ఏఐసీసీ వర్గాలు చెబుతున్నాయి.

కేబినెట్ లో మార్పులు, చేర్పులు

కేబినెట్ విస్తరణపై కేంద్ర నాయకత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది. ప్రస్తుతం ఆరు మంత్రి పదవులు ఖాళీగా ఉండగా, కొత్తగా కేబినెట్‌లో నలుగురికి చోటు కల్పించడంతో పాటూ, పలువురి మంత్రి పదవులు మార్చే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఇప్పటి వరకు మంత్రి వర్గంలో చోటు దక్కని నిజామాబాద్, ఆదిలాబాద్, మరో జిల్లాలకు ఛాన్స్ ఉండనుంది. ఈ రేసులో గడ్డం వివేక్ వెంకట స్వామి, సుదర్శన్ రెడ్డి, పరిగి రామ్మోహన్ రెడ్డి, శ్రీహరి ముదిరాజ్, బాలు నాయక్, కోమటి రెడ్డి రాజగోపాల రెడ్డి, ప్రేమ్ సాగర్, మల్ రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. అలాగే తాజాగా గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ప్రమాణం చేసిన కోదండ రాం రెడ్డి పేరు కూడా పరిశీలనలో ఉన్నట్టు సమాచారం.

కేసీ వేణుగోపాల్‌తో నేతల భేటీ

కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలు భేటీ అయ్యారు. సాయంత్రం కేసీ వేణుగోపాల్ నివాసంలో జరిగిన ఈ భేటీలో పీసీసీ నూతన అధ్యక్షుడిపై కీలకంగా చర్చించారు. ఉదయం జరిగిన భేటీ తరువాత అధిష్టానం తీసుకున్న నిర్ణయాన్ని వేణుగోపాల్ ఈ సమావేశంలో నేతలకు వివరించినట్లు విశ్వసనీయ సమాచారం. అలాగే కొత్త కేబినెట్ విస్తరణలో సామాజిక వర్గాల వారీగా అవకాశాలు, ఇతర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్కమార్క పార్టీ చీఫ్ ఖర్గేతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కాగా, సీఎం రేవంత్ రెడ్డి శనివారం ఢిల్లీ పర్యటన ముగించుకొని హైదరాబాద్ తిరిగి రానున్నట్టు సీఎంఓ వర్గాలు తెలిపాయి.

థాయిలాండ్‌లో మంకీపాక్స్ కేసు నమోదు

ఆసియాలోనే మొదటిది

బ్యాంకాక్ : ఆసియాలోనే మొట్టమొదటగా మంకీపాక్స్ కేసు ఇక్కడ నమోదైనట్టు థాయిలాండ్ ధృవీకరించింది. ఆఫ్రికా నుంచి ఇక్కడకు వచ్చిన రోగిలో ఈ వైరస్ బయటపడింది. ఈ నెల 14న బ్యాంకాక్‌లో ఆ రోగి దిగాడని, వెంటనే మంకీపాక్స్ లక్షణాలు వుండడంతో ఆస్పత్రికి పంపామని సంబంధిత వర్గాలు తెలిపాయి. 66ఏండ్ల ఆ యురోపియన్‌పై నిర్వహించిన పరీక్షల్లో ఎంపాక్స్ క్లేడ్ 1బి సోకినట్టు నిర్ధారించబడిందని వ్యాధి నియంత్రణా విభాగం అధికారులు తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థకు కూడా ఈ విషయాన్ని తెలియచేసినట్టు చెప్పారు. ఆ రోగికి దగ్గరగా ఉన్న మరో 43మందిని కూడా పర్యవేక్షణలో పెట్టామని, ఇప్పటివరకు వారికెలాంటి లక్షణాలు లేవని చెప్పారు. అయినా 21 రోజుల పాటు పర్యవేక్షణలో ఉంచనున్నట్టు తెలిపారు. 42 ముప్పు దేశాల నుంచి థాయిలాండ్‌కు వచ్చినవారెవరైనా వెంటనే పరీక్షలు చేయించుకోవాలని అధికారులు కోరారు. ఆఫ్రికాలో ముఖ్యంగా కాంగో, బురుండి, కెన్యా, ర్వాండా, ఉగాండాల్లో మంకీపాక్స్ కేసులు, మరణాలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో డబ్ల్యుహెచ్‌ఓ దీన్ని అత్యవసర ఆరోగ్య పరిస్థితిగా ప్రకటించింది.

కమలానికి కాశ్మీరం పరీక్షే

గత ఐదేండ్ల స్థితిగతులే ఆధారంగా ఎన్నికలు

- ఇక్కడి అభివృద్ధి అంతా మేడిపండు చందమే అంటున్న మేధావులు
- ఇతర ప్రాంతాలను విస్మరించిన అధికార యంత్రాంగాలు
- పలు సమస్యలతో కాశ్మీరీలు సతమతం
- లోక్‌సభ ఎన్నికల్లో జమ్మూలోనూ కమలానికి ఎదురుగాలి
- అసెంబ్లీ పోరులో ఓడితే ఆ పార్టీకి పెద్ద దెబ్బే
- రాజకీయ విశ్లేషకులు, పరిశీలకుల అంచనా



శ్రీనగర్ : దాదాపు పదేండ్ల తర్వాత జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలను చూడబోతున్నది. 2014లో ఒక రాష్ట్రంగా ఎన్నికలను జరుపుకున్న జమ్మూకాశ్మీర్.. ప్రస్తుతం కేంద్రపాలిత ప్రాంతం(యూటీ) హోదాలో ఎన్నికలకు వెళ్తున్నది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) ఇక్కడ ఎన్నికల తేదీలను ప్రకటించిన విషయం తెలిసిందే. సెప్టెంబర్ 18, 25, అక్టోబర్ 1 తేదీలలో మొత్తం మూడు దశల్లో 90 అసెంబ్లీ స్థానాలకు ఇక్కడ ఎన్నికలు జరగనున్నాయి.

జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370, ఆర్టికల్ 35(ఎ)లను కేంద్రంలోని మోడీ సర్కారు 2019, ఆగస్టులో రద్దు చేసింది. అంతటితో ఆగకుండా రాష్ట్రాన్ని రెండు యూటీలుగా ముక్కలు చేసింది. ఇందులో ఒకటి జమ్మూకాశ్మీర్ కాగా.. ఇంకొకటి లడఖ్. అయితే, తాము తీసుకున్న ఈ చర్యతో జమ్మూకాశ్మీర్‌లో శాంతి నెలకొంటుందనీ, ఉగ్రవాదం అంతమవుతుందనీ, అభివృద్ధి, పర్యాటకరంగం మెరుగుదలను చూస్తుందని బీజేపీ అంచనా వేసింది. గత ఐదేండ్లుగా ఇవే మాటలను వినిపించింది. అక్కడ కల్పించినట్టుగా చెప్తున్న కొన్ని మౌలిక సదుపాయాలకు సామాజిక మాధ్యమాల్లో, ప్రధాన స్రవంతి మీడియాల్లో ప్రచారం కల్పించుకున్నది. దీంతో జమ్మూకాశ్మీర్‌లో నిజంగానే అభివృద్ధి జరుగుతున్నదనీ, ఆర్టికల్ 370 రద్దుతోనే ఇది సాధ్యమైందనే భ్రమను బీజేపీ ప్రజల్లో కలిగించిందని కొందరు రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ఇక్కడి ప్రజల్లో మాత్రం ఆ భావన కనిపించటం లేదు. జమ్మూకాశ్మీర్‌లో కనిపించేదంతా పైపై మెరుగులేనని జమ్మూకాశ్మీర్ ప్రజలు భావిస్తున్నట్టు విశ్లేషకులు అంటున్నారు.

ముఖ్యంగా, శ్రీనగర్‌లో కొంత వరకు పునర్నిర్మాణ పనులు చేపట్టటం, లాల్‌చౌక్ వద్ద క్లాక్ టవర్‌ను మెరుగుపర్చటం వంటివి కొన్ని ఇక్కడ జరిగాయి. దీంతో వీటికి ప్రచారం కల్పించి, భారతీయ పర్యాటకులు ఇక్కడకు వచ్చేలా కేంద్రం ప్రచారం కల్పించిందని తెలుపుతున్నారు. అయితే, ఇతర పట్టణాల అభివృద్ధిని ఇక్కడి అధికార యంత్రాంగాలు విస్మరించాయనీ, ఇందుకు ఈ ప్రాంతంపై పట్టు ఉండే కేంద్రమే బాధ్యత వహించాలని ఇక్కడి స్థానికులు చెప్తున్నారు. జమ్మూకాశ్మీర్‌లో రోడ్ల పరిస్థితి దారుణంగా ఉన్నదనీ, ఎక్కడపడితే అక్కడ గుంతలు పడి ఉన్నాయని వాపోతున్నారు.

కాశ్మీర్ నుంచి జమ్మూకూ పాకిన ఉగ్ర ముప్పు

గతంలో కాశ్మీర్‌కే పరిమితమైన ఉగ్రవాద ముప్పు.. ఇప్పుడు జమ్మూలోని కథువా, ఉధంపూర్, దోడా వంటి ప్రదేశాలకూ వ్యాపించిందని విశ్లేషకులు చెప్తున్నారు. వాస్తవానికి ఇవి చాలా కీలకమైన ప్రాంతాలు. ఈ మూడు ప్రాంతాలు జమ్మూ మీదుగా పఠాన్‌కోట్ నుంచి శ్రీనగర్‌కు కలిపే జాతీయ రహదారి-44ను ఆనుకొని ఉంటాయి.

నిరుద్యోగం.. ధరలు, అవినీతి పెరుగుదలతో జమ్మూ ప్రజలు సతమతం

విద్యుత్ సరఫరా విషయానికి వస్తే ఐదేండ్ల క్రితం ఇది చాలా దారుణ పరిస్థితుల్లో ఉండేది. ప్రస్తుతం ఇక్కడ కరెంటు బిల్లుల మోత మోగుతున్నదని స్థానికులు చెప్తున్నారు. విద్యుత్ కోతలూ ఉంటున్నాయని అంటున్నారు. ఆర్టికల్ 370 రద్దు అనంతరం జమ్మూ ప్రాంతంలో ఎక్కువ ఉద్యోగాలు వస్తాయనీ, పిల్లలకు చక్కటి విద్య అందుతుందనీ, స్థానికులకు వ్యాపారం ఎక్కువవుతుందనీ, జీవన నాణ్యతా ప్రమాణాలు పెరుగుతాయని కొన్ని అంచనాలు ఏర్పడ్డాయి. బీజేపీ కూడా వీటికి తీవ్ర ప్రచారం కల్పించింది. అయితే, నిరుద్యోగం, ధరల పెరుగుదల, అవినీతి పెరుగుదలతో తాము బాధపడుతున్నామని జమ్మూ ప్రాంతంలోని ప్రజలు వాపోతున్నారు.

'ఐదేండ్లుగా అణచివేతలు, అవమానాలు'

కేంద్రంలోని మోడీ పాలనలో జమ్మూకాశ్మీర్ తీవ్ర నష్టాన్ని, ఇబ్బందులనే ఎదుర్కొన్నదని ఇక్కడి మేధావులు అంటున్నారు. కేంద్ర చెప్పే అభివృద్ధి మేడిపండు చందమేనని చెప్తున్నారు. గత ఐదేండ్లుగా కాశ్మీరీలు అనేక అణచివేతలు, అవమానాలను ఎదుర్కొన్నారని చెప్తున్నారు. ఇక్కడ భావప్రకటన, పత్రికా స్వేచ్ఛకు స్థానమే లేకుండా పోయిందంటున్నారు. అయితే, ఎట్టకేలకు ఇప్పుడు ప్రజాస్వామ్యయుత పద్ధతిలో ఎన్నికలు జరగనుండటంతో ఇక్కడి ప్రజలు కొంత ఆశతో ఉంటున్నారు. తాము గత ఐదేండ్లుగా ఎదుర్కొంటున్న కొన్ని సమస్యలకు పరిష్కారం దక్కుతుందని విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఈ ఐదేండ్లలోని పరిస్థితులే రాబోయే ఎన్నికల్లో ఓట్ల రూపంలో ప్రతిబింబించనున్నాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

ఎన్నికల్లో చేదు ఫలితాలు

ఆర్టికల్ 370 రద్దుతో అంతా మంచే జరుగుతుందని వాదించిన బీజేపీ పట్ల జమ్మూకాశ్మీర్ ప్రజలు ఆగ్రహంతోనే ఉన్నారు. కాషాయపాపర్టీపై వారు తమ కోపాన్ని ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో చూపించారు. హిందువులు ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో సైతం బీజేపీకి గట్టి షాకే ఎదురైంది. బీజేపీకి గట్టి పట్టున్న ప్రాంతాలైన భదెర్వాహ్, దోడా ప్రాంతాల్లోనూ ఆ పార్టీ అభ్యర్థులకు ఎదురుగాలే వీచింది. ఇక కాశ్మీర్‌లో పోటీ చేసే సాహసాన్ని బీజేపీ చేయలేకపోయింది. ఇతర పార్టీల వారికి ప్రచారం రూపంలో సహకరించినా.. ఆ అభ్యర్థులు కూడా ఓడిపోవటం గమనార్హం.

అది తేలే దాకా అక్టోబర్ 1(పోలింగ్ రోజు) వరకు ఆగాలనీ, అక్టోబర్ 4న అభ్యర్థుల భవితవ్యం తేలనున్నదని చెప్తున్నారు.

బీజేపీకి పెద్ద సవాలే

జమ్మూకాశ్మీర్‌లో పరిస్థితులు ప్రస్తుతం బీజేపీకి అనుకూలంగా లేవు. ఆర్టికల్ 370 రద్దును ఇప్పటికీ సమర్థించుకుంటున్న ఈ పార్టీ.. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం కాశ్మీర్‌లో మాత్రం తమ ఎంపీ అభ్యర్థులను నిలబెట్టే సాహసం చేయలేకపోయింది. అయితే, ఇప్పుడు రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆ పార్టీ ప్రదర్శన ఎలా ఉండబోతున్నదన్నదే రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ నడుస్తున్నది. ఆ పార్టీకి గట్టి పట్టుండే జమ్మూ ప్రాంతంలోనూ ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో చేదు ఫలితాలే ఎదురయ్యాయి. అయితే, అవే ఫలితాలు రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లోనూ ప్రతిబింబిస్తే బీజేపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలే అవకాశమున్నదనీ, ఆర్టికల్ 370 రద్దు సరికాదనే వాదన ప్రజాతీర్పుతో వెల్లడవుతుందని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ప్రస్తుతం జమ్మూకాశ్మీర్ ఎన్నికల్లో పోటీ చేయబోయే ప్రధాన పార్టీలన్నింటిలో ఒక్క బీజేపీ తప్పితే అన్ని కూడా జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్ర హోదాను, ఆర్టికల్ 370 పునరుద్ధరణకు డిమాండ్ చేస్తున్నాయి.

మనిషి నమ్మాల్సింది తన శక్తి సామర్థ్యాలను, ఆత్మవిశ్వాసాన్నే కాని విధిని, ప్రారబ్ధాన్ని కాదు - డా. బి.ఆర్. అంబేద్కర్

సంపాదకీయం

సరైన ప్రతిఘటన



రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను తుంగలో తొక్కి, ప్రజల కష్టార్జితాన్ని కార్పొరేట్లకు దోచిపెడుతూ..అణగారిన వర్గాలకు అన్యాయం చేసే..ఆరెస్సెస్-బీజేపీ పరివార్ అంబులపొదిలోని మరో దుర్మార్గమే లేటరల్ ఎంట్రీ విధానం. ఖాళీగా ఉన్న సివిల్ సర్వీస్ పోస్టులను భర్తీ చేయడానికి తగిన ప్రణాళికలను రూపొందించడం మాని లేటరల్ ఎంట్రీ పేరుతో ఆరెస్సెస్ పరివారంతో, కార్పొరేట్ అత్యాశాపరులతో నింపే ఎత్తుగడ ప్రమాదకరం. లేటరల్ ఎంట్రీ పేరుతో రిజర్వేషన్లకు అన్యాయం జరుగుతుండటంతో 'ఇండియా' వేదికలోని ప్రతిపక్ష పార్టీలతోపాటు అందులో లేని పార్టీలు..చివరికి అధికార ఎన్డీయే కూటమిలోని లోక్ జనశక్తి (ఎల్‌జెపి) తదితర పార్టీలు ఈ విధానం ఆమోదయోగ్యం కాదని అన్ని వైపుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో దిక్కుతోచక తోకముడిచింది. నియామకాల్లో రిజర్వేషన్లకు సంబంధించిన నిబంధనలు లేవని, వాటిని సమీక్షించి, సంస్కరించాల్సిన అవసరమున్నందు వల్లే ప్రస్తుత ప్రకటనను రద్దు చేస్తున్నామని చెప్పడం ఆత్మవంచన తప్ప మరొకటి కాదు. దీనిపై మోడీ-2 ప్రభుత్వ హయాంలోనే విమర్శలు వచ్చినా లెక్కచేయలేదు. లోక్‌సభలో సొంత మెజార్టీ వుండడంతో విమర్శలను, అభ్యంతరాలను బేఖాతరు చేసింది. ఇప్పుడా పరిస్థితి లేదు. అదీగాక, త్వరలో జమ్ముకాశ్మీర్, హర్యానా, ఆ తరువాత మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నందున కాషాయదళం వెనకడుగు వేయక తప్పలేదు. పరిపాలనా వ్యవస్థలో వినాశకరమైన ఈ లేటరల్ ఎంట్రీ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలి. అంతవరకు ప్రతిపక్షాలు, ప్రజలు ఉద్యమాన్ని కొనసాగించాలి.


> ఆది నుంచీ రిజర్వేషన్లపై మండిపాటే ఆరెస్సెస్, బీజేపీ విధానం కదా? నాడు మండల్ కమిషన్ సిఫార్సులను వ్యతిరేకిస్తూ.. 'మండల్.. కమండల్' అంటూ దేశవ్యాప్తంగా వీరంగం వేసిన చరిత్రా వారిదే! రిజర్వేషన్లిచ్చే ప్రభుత్వరంగాన్నే చాపచుట్టి కార్పొరేట్లకు కట్టబెడుతున్న, దేశవ్యాప్త కులగణనకు మోకాలొడ్డుతున్న వర్తమానమూ వారిదే! ఇప్పటికే గవర్నర్లు సహా రాజ్యాంగంలోని పలు కీలక సంస్థల్లోకి కరడుగట్టిన ఆరెస్సెస్ వాదులను చొప్పించిన మోడీ ప్రభుత్వం..సొంతంగా మెజారిటీ లేకపోయినా అవే పద్ధతులను కొనసాగించడం, మనుస్మృతి సామాజిక ఆదేశాన్ని అమలు చేయడమే.

యుపిఎస్‌సి పరీక్ష ద్వారా ఐఏఎస్‌లను నియమిస్తారు. అలాకాకుండా సంబంధిత విభాగాల్లో నైపుణ్యం, అనుభవం ఆధారంగా బయటి వ్యక్తులతో ఆ పోస్టులను భర్తీ చేయడాన్ని లేటరల్ ఎంట్రీ అనేది సర్కారు నిర్వచనం. 24 కేంద్ర మంత్రిత్వ శాఖలలోని జాయింట్ సెక్రటరీ, డైరెక్టర్, డిప్యూటీ సెక్రటరీ వంటి 45 పోస్టులను లేటరల్ ఎంట్రీ ద్వారా భర్తీ చేసే ప్రక్రియ మూడు రోజుల క్రితం ప్రారంభించింది. కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ ప్రభుత్వ హయాంలో రెండో పరిపాలనా సంస్కరణల సంఘం (ఎఆర్‌సి), ఆరోవేతన సంఘం (2013) చేసిన సిఫార్సులకు అనుగుణంగా లేటరల్ ఎంట్రీ విధానం ప్రకారం పోస్టులు భర్తీ చేయాలని నిర్ణయించినట్లు మోడీ హయాంలోని ఎన్డీయే ప్రభుత్వం చెప్పడం సమస్యను పక్కదారిపట్టించే యత్నమే.

సామాన్యులను రాబందుల్లా పీక్కుతినే నయా ఉదారవాద విధానాలను నాడు కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ సర్కారు భుజాన మోసినా...నేడు ఎన్డీయే నెత్తిన పెట్టుకున్నా అది దారుణమే! మోడీ నేతృత్వంలోని సర్కారు..లేటరల్ నియామకాల విషయంలో ఆత్రం ఎందుకు ప్రదర్శించింది? స్వామి కార్యం, స్వకార్యం పూర్తవుతుందన్నట్టుగా..తనను అందలమెక్కించేందుకు వేల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టే అదానీ, అంబానీలాంటి కార్పొరేట్ల మనుషులను, సమాజాన్ని మత, కుల ప్రాతిపదికన నిలువునా చీల్చే కరడుగట్టిన సంఘపరివార్ వాదులను కేంద్ర ప్రభుత్వ కీలక విభాగాల్లోని ఉన్నతస్థాయి పోస్టుల్లో నియమించేందుకే ఈ తొందర.

ఆది నుంచీ రిజర్వేషన్లపై మండిపాటే ఆరెస్సెస్, బీజేపీ విధానం కదా? నాడు మండల్ కమిషన్ సిఫార్సులను వ్యతిరేకిస్తూ.. 'మండల్.. కమండల్' అంటూ దేశవ్యాప్తంగా వీరంగం వేసిన చరిత్రా వారిదే! రిజర్వేషన్లిచ్చే ప్రభుత్వరంగాన్నే చాపచుట్టి కార్పొరేట్లకు కట్టబెడుతున్న, దేశవ్యాప్త కులగణనకు మోకాలొడ్డుతున్న వర్తమానమూ వారిదే! ఇప్పటికే గవర్నర్లు సహా రాజ్యాంగంలోని పలు కీలక సంస్థల్లోకి కరడుగట్టిన ఆరెస్సెస్ వాదులను చొప్పించిన మోడీ ప్రభుత్వం.. సొంతంగా మెజారిటీ లేకపోయినా అవే పద్ధతులను కొనసాగించడం, మనుస్మృతి సామాజిక ఆదేశాన్ని అమలు చేయడమే. అన్ని రాజ్యాంగ వ్యవస్థల్లోకి పరివార్ మనుషులను చొప్పించేందుకు 2014లో అధికారానికి వచ్చినప్పటి నుండీ మోడీ సర్కారు తెగబడుతోంది. లేటరల్ ఎంట్రీ విషయంలో వచ్చిన ఐక్య ప్రతిఘటన ప్రభుత్వ మెడలు వంచింది. ఇదే స్ఫూర్తితో ప్రభుత్వ తిరోగమన విధానాలన్నింటినీ తిప్పికొట్టాలి.

రుణ'మాఫీ'కి ఆటంకాలేమిటి?


సారంపల్లి మల్లారెడ్డి
9490098666



తెలంగాణ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో ప్రకటించినట్లు రైతులకు రూ.2లక్షల పంట రుణమాఫీని ఆగస్టు 15లోపు అమలు చేస్తానని ప్రకటించి మూడు విడతలుగా రూ.18వేల కోట్లు 22 లక్షల మందికి బ్యాంకుల్లో జమచేసింది. వాస్తవానికి రాష్ట్రంలో 42 లక్షల మంది రైతులు బ్యాంకుల నుండి రుణం పొందారు. వీరిలో అర్హులైన వారికి రూ.31వేల కోట్లు మాఫీచేయాల్సి వస్తుందని ప్రభుత్వం మొదట అంచనా వేసింది. మూడు విడతలుగా మాఫీ ప్రకటించినా రూ.18వేల కోట్ల కు మించలేదు. అర్హత ఉండి అమలు కాని రైతులు ఆందోళనకు గురౌతున్నారు. ప్రభుత్వానికి దరఖాస్తులు పెట్టుకోవడంతో పాటు ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నారు. ఆర్థిక మంత్రి, సాంకేతిక శాఖ మంత్రి, భవన నిర్మాణ శాఖామాత్యులు మాత్రం అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదని ప్రకటనలు చేస్తున్నారు. రుణమాఫీ అమలు కాకపోవడంతో సహజంగానే ఆందోళన పెద్ద ఎత్తున ఉంటుంది. రుణమాఫీకి వస్తున్న ఆటంకాలేమిటి?

రుణమాఫీ కోసం ప్రభుత్వం జీవో 567 తేదీ15జులై2024న తెచ్చింది. ఆ జీవోలో రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు అంశాలతో సంబంధం వున్నప్పటికీ, అవసరం లేదని ప్రభుత్వం ప్రకటించింది. స్వయానా ముఖ్యమంత్రి నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి ఆంక్షలు ఉండవని ప్రకటించారు.అయినప్పటికీ అనేక జిల్లాల్లో ఆధార్, రేషన్ కార్డును గమనంలోకి తీసుకొని రుణమాఫీని వర్తింపజేయనున్నట్లు ప్రకటనలు వస్తున్నాయి. 12డిసెంబర్2018 నుండి 09డిసెంబర్2023 వరకు బాకీ పడి ఉన్న వారికి రుణమాఫీ వర్తిస్తుందని, రూ.2 లక్షలకు పైన బాకీ ఉన్నవారు పై మొత్తం చెల్లిస్తే వారికి కూడా వర్తింపజేస్తామని ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించింది.

బ్యాంకుల నిర్లక్ష్య పాత్ర

రాష్ట్రస్థాయిలో లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో బ్యాంకులన్నీ ప్రతీ ఏటా "రుణప్రణాళిక" ప్రకటించడం, అమలు జరపడం ఏడాదిలో నాలుగుసార్లు సమీక్షలు జరుపడం ఆనవాయితీగా వస్తున్నాయి. ఈ విధానాన్ని అమలు చేయడానికి జిల్లా స్థాయిలో కలెక్టర్ నాయకత్వాన జిల్లా లీడ్ బ్యాంకు నేతృత్వంలో సమావేశాలు నిర్వహించి రుణ సమస్యలను పరిష్కరించాలి. ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీని కూడా రాష్ట్ర, జిల్లాల లీడ్ బ్యాంకులు తగిన సమాచారాన్ని ప్రభుత్వానికి ఇచ్చి మాఫీ పరిహారాన్ని తెప్పించుకుని రైతుల ఖాతాల్లో జమచేయాలి. 2001 నుండి రాష్ట్రంలో లీడ్ బ్యాంకు పాత్ర పూర్తిగా తగ్గింది. శాస్త్రీయత లేని రుణ ప్రణాళికలు ప్రకటించడం, అవి అమలు జరుపకపోవడం పరిపాటిగా వస్తున్నవి. 2014 నుండి 2023 వరకు రెండు విడతలుగా రైతులు రుణమాఫీ ప్రకటించిన బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు బ్యాంకులకు చెల్లించడానికి పదేండ్ల కాలాన్ని తీసుకుంది. రెండు విడతలుగా ప్రకటించిన మాఫీకి మొదటి విడత రూ.16,140 కోట్లు, రెండోవిడత రూ.19,300కోట్లు చెల్లించారు. ఈ చెల్లింపుల్లో జరిగిన కాలయాపన వల్ల మొదటి విడత రూ.9,400 కోట్లు, రెండవ విడత రూ.10,200 కోట్లు రైతులు వడ్డీలు చెల్లించాల్సి వచ్చింది. ప్రభుత్వం ఇచ్చిన మాఫీలో 50శాతం వడ్డీలకే సరిపోయింది. ప్రభుత్వం మాఫీ ప్రకటించడంతో 2014 నుండి బ్యాంకులు రైతులకు నేరుగా రుణాలివ్వకుండా "బుక్ అడ్జస్ట్‌మెంట్" రెన్యూవల్, రీ-షెడ్యూల్ చేసి వడ్డీలకు వడ్డీలు పెంచి రైతులపై భారాన్ని మోపాయి. కొత్త అప్పులివ్వకపోవడం వల్ల రైతులు వ్యవసాయ రుణాల కోసం ప్రయివేటు రుణాలపై ఆధారపడి అధిక వడ్డీలు చెల్లించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. బ్యాంకులు తమ వ్యాపార ధనంలో 18శాతం పంటరుణాలకు 22శాతం వ్యవసాయ దీర్ఘకాలిక రుణాలకు ఇవ్వాలని రిజర్వు బ్యాంకు నిర్దేశించినప్పటికీ దాన్ని ఖాతరు చేయడం లేదు. వ్యవసాయ రుణాల్లో 15శాతం దళిత, గిరిజనులకు ఇవ్వాలని, మొత్తం రుణంలో 8.3శాతం సన్న, చిన్న కారు రైతులకు ఇవ్వాలని కూడా ఆదేశించింది. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రైతులందరికీ పంట రుణాలివ్వాలి. కానీ ప్రస్తుతం ఉన్న రైతుల్లో సగం మందికి మాత్రమే బ్యాంకుల్లో అరకొర రుణాలిస్తున్నారు. ఆ రుణాలు పెట్టుబడికి సరిపోకపోవడం వల్ల వారంతా ప్రయివేటు రుణాల ఊబిలోకి నెట్టబడుతున్నారు.

> 2001 నుండి రాష్ట్రంలో లీడ్ బ్యాంకు పాత్ర పూర్తిగా తగ్గింది. శాస్త్రీయత లేని రుణ ప్రణాళికలు ప్రకటించడం, అవి అమలు జరుపకపోవడం పరిపాటిగా వస్తున్నవి. 2014 నుండి 2023 వరకు రెండు విడతలుగా రైతులు రుణమాఫీ ప్రకటించిన బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు బ్యాంకులకు చెల్లించడానికి పదేండ్ల కాలాన్ని తీసుకుంది. రెండు విడతలుగా ప్రకటించిన మాఫీకి మొదటి విడత రూ.16,140 కోట్లు, రెండోవిడత రూ.19,300కోట్లు చెల్లించారు. ఈ చెల్లింపుల్లో జరిగిన కాలయాపన వల్ల మొదటి విడత రూ.9,400 కోట్లు, రెండవ విడత రూ.10,200 కోట్లు రైతులు వడ్డీలు చెల్లించాల్సి వచ్చింది. ప్రభుత్వం ఇచ్చిన మాఫీలో 50శాతం వడ్డీలకే సరిపోయింది.

కార్పొరేట్ల ప్రయోజనాల కోసమేనా?

2020 జూన్ 5న కేంద్ర ప్రభుత్వం తెచ్చిన రైతు వ్యతిరేక నల్ల చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన పదోండు నెలల పాటు జరిగిన మహాపోరాటంలో రోజూ లక్షలాది మంది రైతులు పాల్గొన్నారు. చివరికి 2021 నవంబర్‌న కేంద్రం దిగొచ్చింది. నల్ల చట్టాలను ఉపసంహరించుకుంటూ ప్రధాని మోడీ ప్రకటించారు. ఆ పోరాట సందర్భంగా కిసాన్ సంయుక్త మోర్చా తరపున పార్లమెంటులో 1. రుణవిమోచన చట్టం 2. కనీస మద్దతు ధరల చట్టం ప్రతిపక్ష సభ్యుల ద్వారా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. దీన్ని ఆమోదిస్తానని నాడు ప్రధాని హామీనిచ్చారు. 2022 నుండి నేటికీ ఆ చట్టాలను పార్లమెంట్‌లో చర్చకు తీసుకురాలేదు. ప్రతీ రాష్ట్రంలో నేటికీ రైతులు రుణభారం భరించలేక ఉద్యమాలు సాగిస్తూనే ఉన్నారు. వ్యవసాయ ఉత్పత్తి ధర అనునిత్యం పెరగటం, అదే సందర్భంలో వ్యవసాయోత్పత్తుల ధరలు తగ్గటం వల్ల రైతులు రుణగ్రస్తులు అవుతున్నారు. ఈ రెండు సమస్యల పరిష్కారం జరిగినప్పుడే రైతుల ఆత్మహత్యలు నివారించబడతాయి. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ రెండు అంశాలను మినహా ఇతర అనేక అంశాలపై పథకాలను రూపొందిస్తున్నాయి. ఈ రెండు పథకాలు అమలు జరిపినచో కార్పొరేట్ సంస్థల ఆదాయానికి నష్టం వాటిల్లుతుందని గుర్తించి వాటిని అమలు జరపడం లేదు. ఈ విధానాలను కార్పొరేట్ సంస్థలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. కేంద్ర స్థాయిలో బ్యాంకులు తమ వ్యాపార ధనంలో 10-11శాతం మాత్రమే వ్యవసాయ రుణాలిస్తున్నాయి. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దేశవ్యాపితంగా రూ.18లక్షల కోట్లు పంటరుణాలిస్తామని ప్రకటించినప్పటికీ ఆచరణలో రూ.11.5లక్షల కోట్లకు మించలేదు. కేంద్ర ప్రభుత్వంతో పాటు తెలంగాణలోని రాష్ట్ర ప్రభుత్వం పంట రుణాలలోని శాస్త్రీయతను దెబ్బకొట్టింది. గతంలో కేంద్రం రూ.72 వేల కోట్లు మాఫీ ప్రకటించినప్పుడు ఒకే విడతగా రైతులకు చెల్లించి రైతులను రుణవిముక్తులను చేశారు. ప్రస్తుత రుణ మాఫీ పథకాన్ని కూడా ఒకే విడతగా అమలు చేయాలని 2014 నుండి 2023 వరకు ఆందోళనలు కొనసాగాయి. దాని ఫలితం రాలేదు. ఇందుకు బ్యాంకులు కూడా సహకరించలేదు.

బాధ్యత విస్మరించిన లీడ్ బ్యాంకు


రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించగానే రాష్ట్రంలోని లీడ్ బ్యాంకు అన్ని బ్యాంకుల నుండి రైతుల రుణ జాబితాలను సేకరించి ప్రభుత్వానికి ఇవ్వాలి. ప్రభుత్వం నుండి మాఫీ తెప్పించి రైతుల ఖాతాలలో జమచేయాలి. కానీ ఆ పనిచేయకుండా ప్రభుత్వం పథకం ప్రకటించిన తర్వాత కూడా రుణ వసూళ్లు, రెన్యూవల్స్, బుక్ అడ్జస్ట్‌మెంట్లు పెద్ద ఎత్తున చేశారు. కొన్ని సహకార సంఘాలు కూడా ప్రభుత్వానికి రుణగ్రస్తుల జాబితాలు పంపడంలో నిర్లక్ష్యం చేశాయి. ఫలితంగా అర్హత కలిగిన వారికి రుణమాఫీ వర్తించలేదు. 9డిసెంబర్2023 తర్వాత రుణం పొందిన వారికి రుణ మాఫీ వర్తించదని తెలిసినప్పటికీ అంతకుముందున్న రుణాన్ని 2024 సంవత్సరానికి రెన్యూవల్ చేశారు. ఫలితంగా ఆ రైతులు రుణమాఫీ నుండి మినహాయించబడ్డారు. 2018 తర్వాత బాకీ ఉన్నవారిని "వాయిదా మీరిన బాకీదారులుగా" (ఎన్‌పిఎ) నమోదు చేశారు. వారు రుణమాఫీకి అనర్హులయ్యారు. కనీసం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రాయితీని రైతులకందించాల్సిన ప్రధాన బాధ్యత లీడ్ బ్యాంకుది.కానీ ఆ లీడ్‌బ్యాంకే నివేదికలు తయారు చేయడంలో నిర్లక్ష్యం వహించింది. కనీసం రిజర్వుబ్యాంకు ఆదేశాలను కూడా బ్యాంకులు పాటించడం లేదు.

> 2024 వానాకాలం పంటలకు నేటికీ రుణాలివ్వలేదు. పంట రుణాలు రూ.42వేల కోట్లుగా ప్రకటించి రూ.7200కోట్లు మాత్రమే ఇచ్చినట్లు రాష్ట్ర ఆర్థిక మంత్రి ప్రకటించారు. దాదాపు పంటకాలం రెండొంతులు దాటింది. ప్రస్తుతం రైతులు పెట్టుబడికి ఇబ్బందులు పడుతున్న వాస్తవం బ్యాంకులకు తెలియదా? ఒక వైపున రుణమాఫీ జరుగుతున్నప్పటికీ మరోవైపున వసూలు చేయడం, రెన్యూవల్ చేయడం సమంజసమేనా? ఈ పరిస్థితుల్లో ఇంకోవైపున అర్హత కలిగిన వారు రుణమాఫీ కాకపోవడంతో ఆందోళన చెందటం సహజమేకదా!

పంటకాలం దాటుతున్నా అందని రుణాలు

2024 వానాకాలం పంటలకు నేటికీ రుణాలివ్వలేదు. పంట రుణాలు రూ.42వేల కోట్లుగా ప్రకటించి రూ.7200కోట్లు మాత్రమే ఇచ్చినట్లు రాష్ట్ర ఆర్థిక మంత్రి ప్రకటించారు. దాదాపు పంటకాలం రెండొంతులు దాటింది. ప్రస్తుతం రైతులు పెట్టుబడికి ఇబ్బందులు పడుతున్న వాస్తవం బ్యాంకులకు తెలియదా? ఒక వైపున రుణమాఫీ జరుగుతున్నప్పటికీ మరోవైపున వసూలు చేయడం, రెన్యూవల్ చేయడం సమంజసమేనా? ఈ పరిస్థితుల్లో ఇంకోవైపున అర్హత కలిగిన వారు రుణమాఫీ కాకపోవడంతో ఆందోళన చెందటం సహజమేకదా! ప్రభుత్వం ప్రకటించిన నిబంధన ప్రకారం 12డిసెంబర్2018 నుండి 9డిసెంబర్2023 వరకు పంట రుణాలు రూ.2లక్షల లోపు ఉన్న జాబితాలను బ్యాంకులు తయారు చేయడం శ్రమతో కూడిన పనికాదు. అయినప్పటికీ అవి చేసిన అవకతవకల వల్ల రైతులు రుణమాఫీ అర్హతను కోల్పోతున్నారు. మాఫీకి ఇచ్చిన నిధులు రైతుల ఖాతాకే చెల్లించాలని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ మాఫీ డబ్బులలో 70-80శాతం జమచేసి మిగిలిన డబ్బులను రైతుల ఇతర ఖాతాలకు మళ్లిస్తున్నారు. లేదా వేరేవిధంగా వినియోగిస్తున్నారు. మాఫీ కింద వచ్చిన డబ్బులను పూర్తిగా తమ ఖాతాలో జమ చేయలేదని అనేకమంది రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత పరిస్థితిని గమనించి ప్రభుత్వం రుణమాఫీ అమలు తీరుపై విజిలెన్స్ శాఖను ఏర్పాటు చేయాలి. బ్యాంకుల్లో రైతుల ఖాతాలను పరిశీలించి అర్హత గలవారికి కలిగించిన నష్టానికి బ్యాంకులను బాధ్యులుగా చేసివారి నుండి పరిహారాన్ని రైతులకు చెల్లించాలి. సహకార సంఘాలు, వాణిజ్య బ్యాంకులు, లీడ్ బ్యాంకు నాయకత్వాన రైతులకు న్యాయం జరిగే విధంగా ప్రభుత్వ రుణమాఫీ అమలయ్యే విధంగా వెంటనే చర్యలు తీసుకోవాలి. రైతులను రుణవిముక్తులను చేయాలి. తిరిగి కొత్త పంట రుణాలివ్వాలి.

వీరులు నడిచిన దారుల్లో..
వీర తెలంగాణ సాయుధ పోరాట బాట
వీధి వీధిలో మెరిసే నెత్తుటి పూదోట...


కట్టా నర్సింహ
9490098337

అవును...మట్టిమనుషుల శౌర్యం, సమరయోధుల త్యాగం, ప్రపంచపటంలోనే తెలంగాణ నేలను "వీర తెలంగాణ"గా సుస్థిరం చేశాయి. ఇక్కడి పల్లెల్ని ప్రజాయుద్ధ క్షేత్రాలుగా, ప్రజల్ని తుపాకి తూటాలుగా తీర్చిదిద్ది, మన ఘనతలు చరిత్రపుటల్లో సువర్ణాక్షరాలై చిరకాలం వెలిగేలా చేశాయి.

భారతదేశమంతటా సాగుతున్న స్వాతంత్ర్య ఉద్యమ ప్రేరణతో మొదలైన

వీరుల దారుల్లో...



తెలంగాణ పోరాటం... భూమి, భుక్తి, విముక్తి నినాదంతో ఆరంభమై కూలీరేట్ల పెంపు, సామాజిక న్యాయసాధన, అక్షరాస్యత, అందరికీ అభివృద్ధి, దోపిడీ అంతం, సమసమాజ స్థాపన అనే దిశగా సాగింది. సంఘం పిలుపుతో వరదలా కదిలిన జనసైన్యం ఊరూరా ఉద్యమ పతాకం అందుకుంది. తొలుత ఆంధ్రమహాసభ అండతో సాంస్కృతిక సమరంగా మొదలై 1946 జూలై 4న కడివెండిలో దొడ్డి కొమురయ్య అమరత్వంతో సాయుధ పోరాట ఫిరంగులై పేలింది. ఈ మహోజ్వల పోరాటంలో దొరలు, జాగీదార్ల దౌర్జన్య క్రీడలు, నిజాం సేనల నిరంకుశ దాడులు, రజాకార్ల దోపిడీ అకృత్యాలు, నెహ్రూ సైన్యాల అరాచకాలెన్నో.... వాటిని ఎదురించి మట్టికరిపించిన వీరగాథలు మరెన్నో... వీటన్నిటికీ సాక్షిగా నిలచి ఎదురు తిరిగిన పల్లెలు ఈ నేలపై అనేకం.

ఐలమ్మ తిరుగుబాటు కేంద్రం పాలకుర్తి, తొలి గుతుపల సంఘం నీర్మాల నుంచి మొదలుపెడితే ఓ వీర బైరాన్‌పల్లి, గుండ్రాపల్లి, ధర్మాపురం, పురిగిల్ల, బాలెంల, సిరిసిల్ల, సూర్యాపేట, మానుకోట, కామారెడ్డి గూడెం, రాచకొండ, దేవరకొండ, నల్లగొండ, పిండిప్రోలు, కోయగూడెం, వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్, హైదరాబాద్ ఇలా అన్నీ ఉద్యమ కేంద్రాలే. కొమురం భీం, షేక్ బందగీ వంటి వీరులు తిరుగుబాటు ప్రారంభిస్తే... సాయుధ పోరాట నావకు రావి నారాయణరెడ్డి, భీంరెడ్డి నర్సింహరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వర్‌రావు, కాచం కృష్ణమూర్తి, మల్లు వెంకట నర్సింహారెడ్డి, ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం వంటి ఎందరో సారథ్యం వహించారు. పుచ్చలపల్లి సుందరయ్య, చండ్ర రాజేశ్వర్‌రావు వంటి మహా నేతలు మార్గనిర్దేశం చేశారు.

నాలుగువేల మంది అమరుల రక్తతర్పణ, మూడువేల గ్రామాల్లో ప్రజారాజ్యం, పదిలక్షల ఎకరాల భూ పంపిణీ, వెట్టి చాకిరీ రద్దు ఇలా అనేక అంశాలకు పునాదిగా నిలిచింది వీరతెలంగాణ పోరాటం. నిజాం రజాకార్లను నెహ్రూ సైన్యాలను మట్టికరిపించి ఈ నేలను వీరభూమిగా రూపుదిద్దింది. ఈ మహత్తర పోరాటానికి ఇంధనం ప్రజాకళలే. దాశరథి, వట్టికోట, మగ్దూం మొహిద్దీన్, షోయబుల్లాఖాన్ వంటి సాహితీమూర్తులు తమ రచనలతో ప్రజల్లో స్ఫూర్తి రగిలిస్తే, సుద్దాల హనుమంతు, యాదగిరిలాంటి కళాకారులు ఊర్లకుఊర్లు ఉర్రూతలూగించి కదనానికి కదిలించారు.

ఆ పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తున్న ప్రజానాట్యమండలి..ఈ వార్షికోత్సవ వేళ.. వీరతెలంగాణ అమరు లను స్మరించుకు నేందుకు, ఉద్యమ పల్లెల్ని, యోధుల స్థూపాలను గుండెలకద్దుకుని, ఆటాపాటల్లో వారి ఆశయాలను నెమరేసుకుని, రేపటిదిశగా నడిచేందుకు, నడిపించేందుకు "శౌర్యయాత్ర"కు సిద్ధమైంది. ఈ "శౌర్య యాత్ర" సెప్టెంబర్ 1న గుండ్రాం పల్లిలో ప్రారంభమై, వీరులు నడిచిన దారుల్లో నాటి పోరాట క్షేత్రాలను దర్శించుకొని, తొలి ఆంధ్రమహాసభకు పురుడుబోసిన జోగిపేటలో సెప్టెంబర్ 20న ముగియనుంది. రాష్ట్రమంతటా ఈ శౌర్యయాత్రతో గొంతుకలుపుదాం. వీరులకు జేజేలు పలుకుదాం.

అక్షర వాచస్పతి...దాశరథి


అంకం నరేష్
6301650324



'నేను కత్తి, డాలూ పట్టుకోలేను. సాయుధుడనై ఎదిరించలేను. కానీ, నా పెన్నే నా గన్ను" అని చాటిన ఘనాపాటి దాశరథి. తెలుగు సాహితీ లోకంలో ఆయనొక అక్షర వాచస్పతి. ఓవైపు మార్క్సును అనుసరిస్తూనే మరోవైపు రాముని్న ఆరాధించిన మహాపండితుడు. భారతీయ తాత్విక మూలాలను తెలుగు ప్రజలకు పరిచయం చేసిన బహుభాషా కోవిదుడు. నిజాం నిరంకుశ పాలనపై పోరాడిన ధీరుడు. భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం నాటి అభ్యుదయ సమాజాన్ని తన రచనల ద్వారా సంఘటిత పరిచిన ఉద్యమ సూరీడు.. ఆయనే దాశరథి రంగా చార్యులు. "నా తెలంగాణ కోటి రతనాల వీణ" అంటూ నినదించిన దాశరథి కృష్ణమా చార్యులు, రంగా చార్యులకు స్వయాన అన్న. తెలంగాణ వేదనను, వీరత్వాన్ని దాశరథి సోదరులు స్వయంగా అనుభవించి సాహిత్య వినీలకాశంలో విహరించారు. రంగాచార్యులు తన రచనల ద్వారా ప్రజల్ని మేల్కొల్పడానికి, అన్యాయాన్ని ఎదిరించేలా పురిగొల్పడానికి ఇష్టపడేవారు. తెలంగాణ సాయుధ పోరాటానికి ఆయన రచనలు ఎంతగానో దోహదపడ్డాయి. లక్ష్యశుద్ధితో రచనలు కొనసాగాయి. దాశరథి సాహితీ సేవ విలక్షణమైనది, విస్తృతమైనది, విభిన్నమైనది. రంగాచార్య రచనలు భావోద్రేకాలు రగిలించేకన్నా, భావోద్వేగాలు కలిగిస్తాయి.

సంప్రదాయ పునాదుల మీద ఆకాశమంత ఎత్తుగా ఎదిగిన అభ్యుదయ సారస్వత గోపురం దాశరథి సాహిత్యం.తన నలభై ఏండ్ల జీవితంలో అక్షర ప్రస్థానం ప్రారంభించి ఎన్నో నవలలు గ్రంథాలు, కవితలు, వ్యాస సంకలనాలు రాసిన దాశరథి మహబూబాబాద్ జిల్లాలోని చిన్నగూడూరు గ్రామంలో సాంప్రదాయ బ్రాహ్మణ వైదిక కులంలో 24 ఆగస్టు1928లో జన్మించారు. పన్నెండేండ్ల వయసులోనే పోరుబాట పట్టారు. భారత స్వాతంత్ర్య ఉద్యమం, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడారు. దేశ్‌ముఖ్‌లు, మక్తాదారులు, పటేళ్లు, పట్వారీలు, మాల్ పటేళ్లు తెలంగాణ పల్లెల్లో ప్రజలపై జరిపిన అరాచకాలను కండ్లకు కట్టినట్లు చెప్పేందుకే ఆయన రచనలు చేశారు. ఆంధ్ర మహాసభ స్ఫూర్తితో అన్న కృష్ణమాచార్య నేరుగా సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. నిజాం నిరంకుశత్వం ఆయన్ను జైల్లో నిర్బంధించగా ఆ ఉద్యమ ప్రభావం కుటుంబం మొత్తమ్మీద పడింది. దీంతో రంగాచార్య లైబ్రేరియన్‌గా పనిచేస్తూ కుటుంబ భారాన్ని మోయాల్సి వచ్చింది. ఉద్యమ చివరి రోజుల్లో రజాకార్ల దాడులు పెరగడంతో రంగాచార్య కూడా అజ్ఞాతంలోకి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మహా రచయిత వట్టికోట అల్వార్ స్వామి సాహిత్యం దాశరథి మీద తీవ్రమైన ప్రభావం చూపింది. రంగాచార్యుల రచనలది విశిష్ట పంథా. కవిత్వం కన్నా కథలు ప్రజల హృదయాలను నేరుగా తాకుతాయని ఆయన అభిప్రాయపడేవారు. అన్యాయాలను, అకృత్యాలను ఎదిరించడమే ఆయన రచనల ముఖ్య ఉద్దేశం. నిజాం పరిపాలనలోని అఘాయిత్యాల గురించి రంగాచార్య రాసిన సాహిత్యం ఒక దృఢమైన ఆశయంతో ముందుకు సాగింది. గ్రామీణ ప్రజల మట్టి బతుకులు ఆయన మనసును కదిలించేవి. గడుల్లోని దొరలు, మాల్ పటేళ్లు తనకు రాబంధు-లుగా కనిపించేవారు. తెలంగాణ సాయుధ పోరాటానికి ముందున్న స్థితిగతులు, నిజాంకాలం నాటి ప్రజల దుర్భర పరిస్థితులను దారుణమైన బానిస బతుకుల గురించి తను రాసిన 'చిల్లర దేవుళ్ళు' నవలలో అక్షరీకరించారు. 'వేదం, జీవననాదం' అంటూ మెప్పించారు. అమృతంగమయ మాధుర్యం చూపించారు. మాయజలతారుతో మైమరిపించారు. రానున్నది ఏది నిజం అంటూ ప్రశ్నించారు. అప్పటి సమాజంలో ప్రజల బానిస బతుకుల స్థితిగతులను మోదుగుపూలు నవలలో కండ్లకు కట్టినట్లు చిత్రించారు.

> నిజాం పరిపాలనలోని అఘాయిత్యాల గురించి రంగాచార్య రాసిన సాహిత్యం ఒక దృఢమైన ఆశయంతో ముందుకు సాగింది. గ్రామీణ ప్రజల మట్టి బతుకులు ఆయన మనసును కదిలించేవి. గడుల్లోని దొరలు, మాల్ పటేళ్లు తనకు రాబంధులుగా కనిపించేవారు. తెలంగాణ సాయుధ పోరాటానికి ముందున్న స్థితిగతులు, నిజాంకాలం నాటి ప్రజల దుర్భర పరిస్థితులను దారుణమైన బానిస బతుకుల గురించి తను రాసిన 'చిల్లర దేవుళ్ళు' నవలలో అక్షరీకరించారు. 'వేదం, జీవననాదం' అంటూ మెప్పించారు. అమృతంగమయ మాధుర్యం చూపించారు. మాయజలతారుతో మైమరిపించారు. రానున్నది ఏది నిజం అంటూ ప్రశ్నించారు. అప్పటి సమాజంలో ప్రజల బానిస బతుకుల స్థితిగతులను మోదుగుపూలు నవలలో కండ్లకు కట్టినట్లు చిత్రించారు.

తెలంగాణ జనజీవనం, నిజాంపాలన నాటి నిరంకుశత్వం తదానంతర రైతాంగ పోరాటం నాటి సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక అంశాల నేపథ్యంలో దాశరథి రచనలు ఒక ప్రేరణగా నిలిచాయి. తెలంగాణ సమాజం తమ అస్తిత్వం కోసం, సాంస్కృతిక స్వేచ్ఛ కోసం, నీళ్లు, నిధులు, నియామకాల కోసం చేసిన తెలంగాణ మలి దశ పోరాటాన్ని ఆయన రచనలు ప్రభావితం చేశాయి. జనం భాషలో గుండెలను పలకరిస్తూ మెదళ్లను పదును పెడుతూ వీరు చేసిన రచనలు నేటితరానికి మార్గదర్శకాలుగా నిలుస్తాయనడంలో సందేహం లేదు. బుద్ధుని జీవిత చరిత్రను 'బుద్ధ భానుడు' పేరుతో అపురూపమైన రచనను 2010 సంవత్సరంలో వెలువరించారు. రంగాచార్య నవలలు ఎక్కువగా రాసినా తెలుగు సాహిత్య ప్రక్రియల్లో కథా సాహిత్యం అంటే ఆయనకెంతో అభిమానం. ఆయన చేతి నుండి జాలువారిన కథా సంపుటి 'నల్లవాగు'. సమర సాహిత్యానికి చెందిన 'రణరంగం', 'రణభేరి', 'జనరంగం' వీరి రచనలే.

తొలుత కమ్యూనిస్టు భావజాలంతో ప్రభావితుడైన రంగాచార్య తదనంతర కాలంలో ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకున్నారు. అనంతర కాలంలో తెలుగు సాహిత్య చరిత్రలో తొలిసారిగా నాలుగు వేదాలను తెలుగులోకి అనువదించి 'అభినవ వ్యాసుని'గా ఖ్యాతిగాంచారు. వేదాలను అనువాదం చేయడానికి ముందు ఆయన తన కట్టుబొట్టును కూడా మార్చుకున్నారు. పంచె కట్టుకోవడం, చొక్కా వేసుకోకుండా శాలువా కప్పుకోవడం, నుదుట మూడునామాలు పెట్టుకోవడం చాలామందిని ఆశ్చర్యపరిచాయి. ఆయన జీవితంలో వైవిధ్యమైన వేషధారణ అది. దీనికి ఆయన 'మతం వ్యక్తిగతమైంది. మార్క్సిజానికి, నా వేషధారణకు, వేదాల అనువాదానికి మధ్య వైరుధ్యమేమీ లేదు" అంటూ నిక్కచ్చిగానే సమాధానమిచ్చారు. ఇరవయ్యవ శతాబ్దము సాహిత్యవనంలో మోదుగు పువ్వుగా నిలిచిన దాశరథి 2015 జూన్ 8న అస్తమించారు. మానవత్వమే లక్ష్యంగా, అక్షరమే ఆయుధంగా జనం కోసం పనిచేసిన ఆయన తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడేందుకు తన రచనల ద్వారా ఎంతగానో కృషి చేశారు. సాహితీలోకంలో ఒక ధ్రువతారగా వెలుగొందారు.

(నేడు దాశరథి రంగాచార్య 96వ జయంతి)

ఓఆర్ఆర్ లీజు రద్దు చేయండి-కేటీఆర్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) లీజు విషయంలో కాంగ్రెస్ మంత్రులు ఇంకా ప్రతిపక్షంలో ఉన్నట్టే ఆరోపణలు చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు విమర్శించారు. గత ప్రభుత్వం తప్పుచేసినట్టు భావిస్తే, ఓఆర్ఆర్ లీజును రద్దుచేసి, మళ్లీ టెండర్లు పిలవాలని సవాల్ చేశారు. తమ చేతిలో ఉన్న పని చేయకుండా బీఆర్ఎస్‌పై ఆరోపణలు చేస్తే ప్రజలు నమ్మబోరని చెప్పారు. ఓఆర్ఆర్ లీజు విషయంలో మేము నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా నిబంధనలను అనుసరించామని వివరించారు.

వక్ఫ్ బిల్లును ఎన్డీఏ మిత్రపక్షాలు వ్యతిరేకిస్తాయి

- చంద్రబాబు, నితీష్ కుమార్‌లను కలిశాం :ముస్లీం పర్సనల్ లా బోర్డు అధ్యక్షుడు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

వక్ఫ్ బిల్లును ఎన్డీఏ మిత్రపక్షాలైన జేడీయూ, టీడీపీ వ్యతిరేకిస్తాయని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్‌బి) అధ్యక్షుడు ఖలీద్ సైఫుల్లా రహ్మానీ అన్నారు. చంద్రబాబు నాయుడు, నితీష్ కుమార్‌లను కలిశామని, వక్ఫ్ బిల్లుపై ఇరువురు నేతలు తమ వ్యతిరేకతను వ్యక్తం చేశారని తెలిపారు. ఏఐఎంపీఎల్‌బి, జమియత్ ఉలేమా-ఎ-హింద్, ఇతర ప్రధాన ముస్లిం సంఘాలు సమిష్టిగా లోక్‌సభలో సమర్పించిన వక్ఫ్ (సవరణ) బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశాయి. ఒకవేళ ఆమోదం పొందితే బిల్లును రద్దు చేసే వరకు దేశవ్యాప్తంగా నిరసన తెలుపుతామని హెచ్చరించాయి. శుక్రవారం నాడిక్కడ స్థానిక కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన ఏఐఎంపీఎల్‌బి, జమియత్ ఉలేమా-ఇ-హింద్ సంయుక్త విలేకరుల సమావేశంలో ఏఐఎంపీఎల్‌బి ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఫజ్లూర్ రహీం ముజద్దేది, జమియత్ ఉలేమా-ఇ-హింద్ అధ్యక్షుడు సయ్యద్ అర్షద్ మదానీలతో కలిసి ఖలీద్ సైఫుల్లా రహ్మానీ మాట్లాడారు."మేము టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడిని కలిశాం. ఈ బిల్లును తాను వ్యతిరేకిస్తానని హామీ ఇచ్చారు. మేము ఆగస్టు 21న జేడీయూ చీఫ్ నితీష్ కుమార్‌తో సమావేశమయ్యాం. బిల్లును వ్యతిరేకిస్తానని ఆయన కూడా మాకు హామీ ఇచ్చారు" అని రహ్మానీ అన్నారు.

ఆర్‌జేడీకి చెందిన తేజస్వి యాదవ్ కూడా తమ పార్టీ వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తుందని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. "మేము దీనికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తాము. నిరసనను చివరి వరకు తీసుకువెళతాము" అని రహ్మానీ చెప్పారు. ముస్లిం సంస్థలు రక్షణ, పారదర్శకత ముసుగులో వక్ఫ్ ఆస్తులను ధ్వంసం చేయడానికి, ఆక్రమించడానికి "నీచమైన కుట్ర"గా ఈ బిల్లును తీసుకొస్తున్నారని, ప్రభుత్వం ఇలాంటి చర్యలు మానుకోవాలని, బిల్లును ఉపసంహరించుకోవాలని కోరారు. జేపీసీ సమావేశానికి తమకు ఆహ్వానం అందలేదని, ఆహ్వానిస్తే హాజరవు తామని పేర్కొన్నారు. బిల్లును పూర్తిగా ఉపసంహరించుకోవాలని తాము కోరుకుంటున్నామని రహ్మానీ తెలిపారు.

'బిల్లు రాజ్యాంగ విరుద్ధం'

లౌకికవాదం, రాజ్యాంగానికి ఈ బిల్లు విరుద్ధమని అన్నారు. అనేక వక్ఫ్ ఆస్తులను ప్రభుత్వ శాఖలు ఆక్రమించాయని, ఆ అద్దెను వక్ఫ్‌కు అప్పగించాలని కోరారు. "వారు చేస్తున్న మార్పుల వల్ల ప్రయోజనం ఉండదు. ఇది ముస్లింల ఆస్తులన్నీ లాక్కోవడానికి దారి తీస్తుంది" అని రహ్మానీ తెలిపారు. ఈ బిల్లు సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్‌లో ముస్లిమేతర ప్రాతినిధ్యాన్ని 13కి, వక్ఫ్ బోర్డులలో తప్పనిసరి స్థానాలతో 7కి పెంచుతుందని రహ్మానీ పేర్కొన్నారు. ఇది రాజ్యాంగంలోని 26వ అధికరణానికి విరుద్ధమని, మైనారిటీలు తమ మత, సాంస్కృతిక సంస్థలను నిర్వహించుకునే హక్కును కల్పిస్తున్నారన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలిసారిగా దేశంలో ఇస్లాం మతంపై నిరంతర దాడులతో అసాధారణ పరిస్థితులు తలెత్తుతున్నాయని జమియత్ ఉలేమా-ఏ-హింద్ అధ్యక్షుడు అర్షద్ మదానీ ఆరోపించారు.

సార్వత్రిక ఎన్నికల సమయంలో హిందువులు, ముస్లింలను విభజించేందుకు బీజేపీ ప్రయత్నించి విఫలమైందని విమర్శించారు. రాజ్యాంగం సెక్యులర్‌గా ఉంటుందని, మైనార్టీలను ఆదుకుంటామని దేశ విభజన సమయంలో ముస్లిం సంఘాలకు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. "ఇది కేవలం వక్ఫ్ సమస్య కాదు. ముస్లింలకు లౌకికవాదం, మైనారిటీలకు రక్షణ కల్పిస్తామని రాజ్యాంగం వాగ్దానం చేసింది. ఈరోజు ఈ హామీపై బహిరంగంగానే దాడి జరుగుతోంది" అని మదానీ అన్నారు. మోడీ ప్రభుత్వంతో చర్చలు ప్రారంభించడంపై వచ్చిన ప్రశ్నలకు బదులిస్తూ తమ సంస్థ అనేకసార్లు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని రహ్మానీ చెప్పారు.

బిల్లు రూపొందించే ముందు ప్రభుత్వం తమను సంప్రదించలేదని అన్నారు. "తలుపు తెరిచే వారితో చర్చలు జరుగుతాయి. కానీ ఇది ముస్లింలకు తలుపులు మూసిన ప్రభుత్వం" అని రహ్మానీ ఆవేదన వ్యక్తం చేశారు.

వక్ఫ్ బిల్లుపై జేపీసీ భేటీలో

- ప్రతిపక్షాల ప్రశ్నల వర్షం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

వక్ఫ్ (సవరణ) బిల్లు-2024పై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) భేటీ అయ్యింది. ఈ సమావేశంలో ప్రతిపక్ష సభ్యులు ప్రశ్నల వర్షం కురిపించారు. ప్యానెల్‌లోని పలువురు ప్రతిపక్ష సభ్యులు బిల్లులోని నిబంధనలు భావప్రకటన స్వేచ్ఛ, మత స్వేచ్ఛ, సమానత్వ చట్టాలను ఉల్లంఘిస్తున్నాయని పేర్కొన్నారు. బిల్లులో పేర్కొన్న వివిధ క్లాజులపై ప్రశ్నలు గుప్పించారు. ప్రత్యేకించి వివాదాస్పద ఆస్తి యాజమాన్యంపై నిర్ణయం తీసుకునేందుకు జిల్లా కలెక్టర్లకు అధికారం కల్పించే ప్రతిపాదన, అలాగే ముస్లిమేతరులను కూడా వక్ఫ్ బోర్డులో సభ్యులుగా చేర్చడంపై ప్రతిపక్ష సభ్యులు నిలదీశారు. ఈ బిల్లుకు కాంగ్రెస్, టీఎంసీ, డీఎంకే, ఆప్, వైసీపీ, ఎంఐఎం తదితర పార్టీలు వ్యతిరేకించగా, బీజేపీ మద్దతిచ్చింది. బీజేపీ మిత్రపక్షాలు జేడీయూ, ఎల్‌జేపీ (రామ్‌విలాస్), టీడీపీ "తటస్థ" వైఖరి తీసుకున్నాయి. జేడీయూ, ఎల్‌జేపీ (రామ్‌విలాస్) ముస్లిం సంఘాలు వ్యక్తం చేసిన ఆందోళనలను పరిష్కరించాలని కోరుతున్నాయి. అయితే ఆరు గంటల పాటు జరిగిన సమావేశం అనంతరం జేపీసీ చైర్‌పర్సన్, బీజేపీకి చెందిన జగదాంబిక పాల్ చర్చలు "ఫలవంతమైనవి" అని అన్నారు.

ఇటీవల ఆగస్టు 8న ముగిసిన పార్లమెంట్ సమావేశాల సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ (సవరణ) బిల్లుపై చర్చించేందుకు జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) తొలిసారి సమావేశమైంది. బీజేపీ సీనియర్ ఎంపీ జగదాంబికా పాల్ నేతృత్వంలోని జేపీసీలో పార్లమెంట్ ఉభయ సభల నుంచి 31 మంది ఎంపీలు ఉన్నారు. అందులో 21 మంది లోక్‌సభ, 10 మంది రాజ్యసభ సభ్యులు ఉన్నారు.

సమావేశంలో బిల్లుపై, ముఖ్యంగా అందులో పేర్కొన్న 44 సవరణలపై వివరంగా చర్చించారు. ప్రతిపక్ష సభ్యులు బిల్లుకు సంబంధించి అనేక ప్రశ్నలు లేవనెత్తారు. ఇది రాజ్యాంగం అందించిన మత స్వేచ్ఛను ఉల్లంఘి స్తుందని పేర్కొన్నారు. ఆగస్టు 30న జరిగే జేపీసీ తదుపరి సమావేశంలో నివేదికకు తుది రూపం ఇస్తారు. ఈ నివేదికను పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో సమర్పించనుంది.

ఈ బిల్లు ఆమోదయోగ్యం కాదు: వి.విజయసాయి రెడ్డి

జేపీసీ సమావేశం అనంతరం వైసీపీ ఎంపీ వి. విజయసాయిరెడ్డి మాట్లాడుతూ "మా పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ నిర్ణయం, పార్టీ అధికారిక వైఖరికి అనుగుణంగా వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకించాను. ఈ బిల్లుపై భాగస్వామ్య పక్షాల్లో అనేక ఆందోళనలు ఉన్నాయి. ఇది ప్రస్తుత రూపంలో ఆమోదయోగ్యం కాదు. జేపీసీ సభ్యుడిగా అన్ని భాగస్వామ్యపక్షాల నుండి వాయిస్ వినాలనుకుంటున్నాను. మీకు ఏవైనా ఆందోళనలు, అభ్యంతరాలు ఉంటే, venumbaka.vr@sansad.nic.in ద్వారా ఇ మెయిల్ చేయవచ్చు. అందరి అభిప్రాయాలు విన్న తరువాత నేను కమిటీ ముందు ఆందోళనలతో కూడిన అసమ్మతి నోటు ఉంచుతా" అని తెలిపారు. ఈ సమావేశంలో నసీర్ హుస్సేన్, గౌరవ్ గొగోయ్ (కాంగ్రెస్), కళ్యాణ్ బెనర్జీ (టీఎంసీ), వి. విజయసాయి రెడ్డి (వైసీపీ), అసదుద్దీన్ ఒవైసి (ఎంఐఎం), ఎ.రాజా (డీఎంకె), అరుణ్ భారతి (ఎల్‌జెపి), సంజయ్ సింగ్ (ఆప్), లావు శ్రీకృష్ణ దేవరాయలు (టీడీపీ) తదితరులు పాల్గొన్నారు.

విక్రమసింఘె దోషి

- శ్రీలంక సుప్రీం కోర్టు రూలింగ్

కొలంబో : స్థానిక ఎన్నికలను ఏడాదికి పైగా నిర్వహించకుండా జాప్యం చేస్తూ వచ్చి చట్టవిరుద్ధంగా వ్యవహరించినందుకు శ్రీలంక అధ్యక్షుడు రనీల్ విక్రమసింఘె దోషి అని శ్రీలంక సుప్రీం కోర్టు నిర్ణయించింది. అయితే ఆయన అధ్యక్షుడిగా అధికారంలో వున్నందున ఆయనకు గల రక్షణ దృష్ట్యా ఈ తీర్పు వల్ల తక్షణమే ఎలాంటి చట్టపరమైన పర్యవసానాలు వుండవు. 2023 మార్చిలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కావాల్సిన నిధులు విడుదల చేయడంలో విక్రమసింఘె విఫలమయ్యారని ఐదుగురు సభ్యుల సుప్రీం కోర్టు ధర్మాసనం గురువారం ఏకగ్రీవంగా తీర్పు చెప్పింది. కాగా వచ్చే నెల్లో జరగనున్న అధ్యక్ష ఎన్నికల్లో దేశ ఆర్థిక పరిస్థితులు, ఓటర్లకు కీలకాంశంగా మారుతుందని భావిస్తున్నారు. స్థానిక ఎన్నికలు వాయిదా పడినందున, సెప్టెంబరు 21న జరిగే ఎన్నిక ఈ ప్రభుత్వ మొదటి ఎన్నికలు కానున్నాయి. విక్రమసింఘె ఈఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. ప్రత్యర్థుల నుండి గట్టి సవాలు ఎదుర్కొంటున్నారు.

బిమ్స్‌టెక్ సదస్సు వాయిదా



బ్యాంకాక్ : వచ్చే నెల్లో తాను ఆతిథ్యం ఇవ్వాల్సిన బిమ్స్‌టెక్ సదస్సును థాయిలాండ్ వాయిదా వేసింది. కొత్త ప్రభుత్వం ఏర్పడేవరకు దీనిపై నిర్ణయం తీసుకోలేమని విదేశాంగ మంత్రిత్వ శాఖ శుక్రవారం తెలిపింది. థాయిలాండ్‌లో ప్రస్తుతం తాత్కాలిక ప్రభుత్వం వుంది. గత వారం ప్రధాని శ్రెట్టా తవిసిన్ ప్రభుత్వాన్ని కోర్టు రద్దు చేసింది. ఆ స్థానంలో వచ్చిన పెటాంగ్‌టన్ షినవ్రత ఇంకా తన కొత్త కేబినెట్‌ను ప్రకటించాల్సి వుంది. సెప్టెంబరు 3,4 తేదీల్లో బ్యాంకాక్‌లో ఈ సదస్సు జరగాల్సి వుంది. బిమ్స్‌టెక్‌లో థాయిలాండ్, భారత్, మయన్మార్, బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక, భూటాన్‌లు వున్నాయి. రెండేళ్లకోసారి ఈ దేశాల నేతలు సమావేశమవుతారు.

ఎయిరిండియాకు భారీ జరిమానా

న్యూఢిల్లీ : ఎయిరిండియాకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) శుక్రవారం రూ.90 లక్షల జరిమానా విధించింది. జులై 9న ముంబయి నుంచి రియాద్‌కు అర్హతలేని సిబ్బందితో విమానాన్ని నడిపినందుకు గాను ఈ జరిమానా విధించింది. ఎయిరిండియా ఆపరేషన్స్ డైరెక్టర్‌కు రూ. 6 లక్షలు, ట్రైనింగ్ డైరెక్టర్‌కు రూ. 3 లక్షలు జరిమానా విధించింది.జులై 9 ఘటనలో ట్రైనీ



పైలెట్ శిక్షణ పొందిన కెప్టెన్‌తో ముంబయి - రియాద్ విమానాన్ని నడపాల్సి వుంది. అయితే శిక్షణ పొందిన కెప్టెన్ అనారోగ్యం పాలవడంతో అతని స్థానంలో ట్రైనీ కెప్టెన్‌ను నియమించినట్టు తెలిపింది. ఫ్లైయింగ్ డ్యూటీల కోసం ట్రైనీ పైలెట్‌ను, ట్రైనీ కెప్టెన్‌ను అత్యవసరంగా కేటాయించాల్సి వచ్చినట్టు ఎయిరిండియా వాలంటరీగా సమర్పించిన నివేదికలో పేర్కొంది. ఈ ఘటన ఎయిరిండియా రోస్టరింగ్ విధానంలో లోపాన్ని చూపుతోందని డిజిసిఏ ఓ ప్రకటనలో తెలిపింది. తీవ్రమైన భద్రతా ఉల్లంఘనగా పరిగణిస్తున్నట్టు పేర్కొంది.

'ఉక్కు'పై కేంద్ర ప్రభుత్వ వైఖరి మారాలి

విశాఖపట్నం :పోరాటాలతో ఏర్పాటైన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేసే ఆలోచనను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి ఆదినారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1289వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరంలో ఏఐటియుసి కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నాశనం చేసేందుకు కేంద్ర బిజెపి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని, దానిలో భాగంగానే సొంత గనులు కేటాయించడంలేదని తెలిపారు. రా మెటీరియల్‌ను తగినంతగా సరఫరా చేయకపోవడం వల్ల ఉక్కు ఉత్పత్తికి తీవ్ర నష్టం కలుగుతోందన్నారు. ఇప్పటికైనా తన తీరును మార్చుకుని కర్మాగారాన్ని పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని, ఆర్థిక వనరులు సమకూర్చాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో పోరాట కమిటీ నాయకులు మసేన్‌రావు, జె రామకృష్ణ, కె రాజబాబు, తాండ్ర కనకరాజు, బిఎంఎల్ నాయుడు, వరప్రసాద్, చీకటి శ్రీనివాసరావు, వి కృష్ణంనాయుడు పాల్గొన్నారు.

అసత్యాలకు కేరాఫ్ అడ్రస్ జగన్

- వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు



అమరావతి :అబద్ధాలు, అసత్యాలకు కేరాఫ్ అడ్రస్‌గా మాజీ సిఎం వైఎస్ జగన్ మారారని వ్యవసాయశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు విమర్శించారు. అచ్యుతాపురం సెజ్ ప్రమాద ఘటనపై ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధితులకు అన్ని విధాలా అండగా నిలబడిందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జగన్ మాత్రం నిస్సిగ్గుగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులకు అందుతున్న పరిహారంపై కూడా దిగజారి రాజకీయాలు చేస్తున్న జగన్‌ను ప్రజలు క్షమించరని అన్నారు. ప్రమాదంలో నష్టపోయిన ప్రతి ఒక్కరికీ పరిహారం అందించి అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంటే ధర్నా చేస్తానని జగన్ ప్రకటించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. విశాఖ ఎల్జీ పాలిమర్స్ ప్రమాదంలో జగన్ ప్రకటించిన పరిహారం పూర్తిస్థాయిలో అందలేదని విమర్శించారు.



విద్యార్థినిపై సామూహిక లైంగిక దాడి

- ట్యూషన్ నుంచి ఇంటికి వెళ్తుండగా దారుణం

గౌహతి : అస్సాం నాగోస్ జిల్లాలో పదో తరగతి బాలికపై సామూహిక లైంగిక దాడి జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. 14 ఏండ్ల బాలిక ట్యూషన్ ముగిసిన తర్వాత ఇంటికి తిరిగి వెళ్తుండగా, గురువారం సాయంత్రం ముగ్గురు దుండగులు అడ్డుకుని, సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో పడి ఉన్న బాధిత బాలికను గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాధిత బాలికకు స్థానిక ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక చికిత్స నిర్వహించి, అనంతరం జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

ఈ ఘటనను నిరసిస్తూ శుక్రవారం డింగీ పట్టణంలో స్థానికులు, విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. నిందితులను కఠినంగా శిక్షిస్తామని అస్సాం సిఎం హేమంత బిశ్వశర్మ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

జూరాలలో 16 గేట్లు ఎత్తివేత

- ఐదు యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి

నవతెలంగాణ-ధరూరు

కర్నాటక ప్రాంతంలో ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌ల నుంచి స్వల్పంగా వరద ప్రవాహం పెరగడంతో జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులో శుక్ర వారం 16 గేట్లను ఎత్తారు. ఎగువ నుంచి 94వేల క్యూసెక్కుల నీరు వస్తోంది. జూరాల నుంచి శ్రీశైలం జలాశయంలోకి 66 వేలా 336 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు అధికారులు తెలిపారు. జల విద్యుత్ కేంద్రం ద్వారా ఐదు యూనిట్లలో 35 వేల 882 క్యూసెక్కుల నీటిని వాడుతున్నట్టు పీజేపీ అధికారులు తెలిపారు. నెట్టెంపాడుకు 1500 క్యూసెక్కులు, కోయిల సాగర్‌కు 630, ఎడమ కాల్వకు 500 క్యూసెక్కుల నీరు, కెనాల్ కాల్వకు 550 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్-2 కాల్వకు 750 క్యూసెక్కుల నీరును వదులుతున్నారు.

షరతులు లేకుండా అర్హతున్న ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలి

- తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ర్యాలీలు, వినతులు



నవతెలంగాణ-విలేకరులు

ఎలాంటి షరతులు లేకుండా అర్హతున్న ప్రతి రైతుకూ రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పలు జిల్లాల్లో ఆందోళనలు నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నాలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గొల్లపల్లి జయరాజ్ పాల్గొని మాట్లాడారు. జిల్లాలో సుమారు 2.50 లక్షల మంది రైతులు ఉంటే ఇప్పటి వరకు మూడు విడుతల్లో 97,873 మంది రైతులకు రూ.846.31 కోట్లు మాత్రమే రుణమాఫీ అయిందని తెలిపారు. ఇంకా సగానికి పైగా రైతులకు మాఫీ కాలేదన్నారు. వారిందరికీ వెంటనే రుణమాఫీ చేయాలని, లేనిపోతే రైతులతో కలిసి తమ సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రాజయ్య, ఉపాధ్యక్షులు మల్లారెడ్డి, జైపాల్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఖమ్మం జిల్లా వైరా తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు చేపట్టిన ఆందోళనలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు పాల్గొని మాట్లాడారు. అర్హులందరికీ రుణాలు మాఫీ చేయాలన్నారు. ముదిగొండ, నేలకొండపల్లి మండల కేంద్రాల్లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అధికారికి వినతిపత్రం ఇచ్చారు. కల్లూరులో రైతు సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సూర్యాపేట జిల్లా మునగాలలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి శ్రీరాములు ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. హుజూర్‌నగర్‌లో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు నాగారపు పాండు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పల్లె వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కోదాడ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో ధర్నా నిర్వహించగా, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు.

నానో టెక్నాలజీతో అనేక ప్రయోజనాలు

- ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొ.లింబాద్రి
- ఓయూలో జాతీయ సదస్సు



నవతెలంగాణ-ఓయూ

నానో టెక్నాలజీతో అనేక ప్రయోజనాలున్నాయని, ఆ టెక్నాలజీని సరైన విధంగా ఒడిసి పట్టుకుంటే మరిన్ని ప్రయోజనాలు పొందొచ్చని ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి అన్నారు. శుక్రవారం ఓయూ ఇంజినీరింగ్ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెకానికల్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో 'అడ్వాన్సెస్ ఇన్ మెకానికల్ ఇంజినీరింగ్ అండ్ నానో టెక్నాలజీ' అనే అంశంపై రెండ్రోజుల జాతీయ సదస్సును ప్రారంభించారు. సెమినార్ నిర్వాహకులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. నానో టెక్నాలజీ పారిశ్రామిక రంగం, వైద్యారోగ్య రంగంతో పాటుగా బయలాజికల్‌లో రక్షణగా ఉంటుందని, పరిశ్రమల్లో టర్బైట్స్ కూలింగ్ కావడానికి ఉపయోగపడుతుందని తెలిపారు.

అలాగే స్పేస్ రీసెర్చ్‌లో క్రయోజెనిక్ కూలింగ్, ఎలక్ట్రికల్ బ్యాటరీలు కూల్ చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. ఉన్నత విద్యామండలి సెక్రటరీ, ఇంజినీరింగ్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్, విభాగం మాజీ హెడ్ సెమినార్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కృష్ణయ్య మాట్లాడారు. విభాగం పీహెచ్‌డీ విద్యార్థులకు ఈ సెమినార్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. పరిశ్రమల నుంచి మొదలు మానవుల నిత్యజీవితంలో నానో టెక్నాలజీ వివిధ రూపాల్లో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ రిజిస్ట్రార్ పప్పు లక్ష్మీనారాయణ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పైడిమర్రి చంద్రశేఖర్, విభాగం హెడ్ ప్రొఫెసర్ చంద్రశేఖర్‌రెడ్డి, కన్వీనర్ ప్రొఫెసర్ జి.నరేందర్, కో కన్వీనర్స్ డాక్టర్ టి.నాగవేణి, డాక్టర్ యు.అశోక్ కుమార్, విద్యార్థులు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 67 సిద్ధాంతపరమైన వ్యాసాలు సమర్పించారని నిర్వాహకులు పేర్కొన్నారు.

కోల్‌కతా ఘటనకు వ్యతిరేకంగా మహిళా ఉద్యోగుల నిరసన

- పీఆర్, భగీరథ ఉద్యోగుల ఆందోళన
- నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కోల్‌కతా ఆర్.జీ కార్ మెడికల్ కాలేజీ ఘటనకు నిరసనగా మహిళా ఉద్యోగులు మధ్యాహ్న భోజన నిరసన చేపట్టారు. పంచాయతీరాజ్, మిషన్ భగీరథ శాఖల మహిళా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లో ఉన్న రాష్ట్ర కార్యాలయంలో ఈ ఆందోళన నిర్వహించారు. దాదాపు గంటపాటు నిరసన ప్రదర్శన చేశారు. భారీసంఖ్యలో మహిళా ఉద్యోగులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో నినాదాలు చేశారు .ఘటనకు బాధ్యులైన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మహిళా రక్షణ చట్టాలను కచ్చితంగా పకడ్బందీగా అమలుచేయాలని విజ్ఞప్తి చేశారు. పనిచేసే ప్రదేశాల్లో రక్షణ చర్యలు అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు డాక్టర్ రజిత, సునంద, మంజుల, కవిత తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ రూరల్ కనుమరుగు!

- మున్సిపాల్టీలుగా డబీర్‌పురా, అలియాబాద్, మూడుచింతలపల్లి
- నాగారం మున్సిపాల్టీలోకి కీసర మండలం
- ఔటర్ లోపల ప్రాంతాలన్నీ జీహెచ్ఎంసీలో విలీనం
- పెరగనున్న పన్నులు
- అర్బన్ జిల్లాగా మేడ్చల్-మల్కాజిగిరి



హైదరాబాద్ చుట్టూ విస్తరించి ఉన్న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పూర్తి స్వరూపం మారనుంది. గ్రామీణ ప్రాంతం మొత్తం కనుమరుగై.. అర్బన్ జిల్లాగా అవతరించనుంది. త్వరలో ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న ప్రాంతాలన్నీ జీహెచ్ఎంసీలో విలీనం కానున్నాయి. బయట ఉన్న గ్రామాలు కొన్ని ఆయా మున్సిపాల్టీల్లో కలువగా.. మరికొన్ని గ్రామాలు కలిసి కొత్తగా మరో మూడు మున్సిపాల్టీలు ఏర్పడనున్నాయి. అధికారిక వర్గాల సమాచారం ప్రకారం.. గురువారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధ్యతన జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది.

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో అంతర్భాగమైన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా 15 మండలాలతో ఏర్పడింది. జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు, 40 జీహెచ్ఎంసీ డివిజన్లు, నాలుగు కార్పొరేషన్లు, తొమ్మిది మున్సిపాలిటీలు, 61 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ 61 గ్రామ పంచాయతీలు 5 మండలాల్లో విస్తరించి ఉండగా, ఐదుగురు జెడ్పీటీసీలతో జిల్లా పరిషత్ పాలకవర్గం ఉంది. ఐదు మండలాల్లో ఐదుగురు ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు ఉన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో ఈ గ్రామ పంచాయతీలు జీహెచ్ఎంసీ, మున్సిపాల్టీల్లో విలీనం అయితే రూరల్ ప్రాంతం కలగా మిగలనుంది.

మున్సిపాల్టీల్లోకి..

ఔటర్ రింగ్ రోడ్డు లోపలి గ్రామ పంచాయతీలూ దగ్గరలోని మున్సిపాల్టీల్లో విలీనం కానున్నాయి. కీసర మండలంలోని గోధుమకుంట, ఖరీంగూడ, నర్సంపల్లి, తిమ్మాయిపల్లి, చీర్యాల గ్రామాలు నాగారం లేదా దమ్మాయిగూడ మున్సిపాల్టీలో కలవనున్నాయి. ఇక ఘట్‌కేసర్ మండలంలోని చౌదరిగూడ, వెంకటాపూర్, కాచవని సింగారం, ప్రతాప సింగారం, కొర్రెముల ఘట్‌కేసర్ మున్సిపాల్టీలో కలవనున్నాయి. ఆ తర్వాత మిగిలిన గ్రామ పంచాయతీలతో కలిపి డబీర్‌పురా, మూడుచింతలపల్లి, అలియాబాద్‌లను మున్సిపాల్టీలుగా ఏర్పాటు చేయనున్నారు.

పంచాయతీ వ్యవస్థ కనుమరుగు

గ్రామీణ ప్రాంతాలను జీహెచ్ఎంసీ, మున్సిపాల్టీల్లో విలీనం చేస్తుండటంతో జిల్లాలో పంచాయతీరాజ్ వ్యవస్థ కనుమరుగు కానుంది. దీంతో సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీడీఓల అవసరం ఉండదని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం.

మున్సిపాలిటీలుగా తీర్చిదిద్దితే గ్రామాలు శరవేగంగా అభివృద్ధి చెందడంతో పాటు జిల్లాను మున్సిపల్ పాలనలోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళిక రెడీ చేస్తున్నట్టు తెలుస్తోంది. దీంతో జిల్లా పంచాయతీ, జిల్లా రూరల్ డెవలప్‌మెంట్, జిల్లా పంచాయతీ ఇంజినీరింగ్ శాఖలు కనుమరుగు కానున్నాయి. దీనికితోడు గ్రామ పంచాయతీలను మున్సిపాల్టీలు, జీహెచ్ఎంసీలో విలీనం చేయడంతో ప్రజలపై పన్నుల భారం పెరగనుంది. ఇంటి పన్నులతోపాటు, నీటి పన్ను, రిజిస్ట్రేషన్లు తదితర పన్నులు మూడింతలు పెరిగే అవకాశాలున్నాయి.

జీహెచ్ఎంసీలోకి ఔటర్ ప్రాంతాలు

ఔటర్ రింగు రోడ్డు లోపల ఉన్న ప్రాంతాలను జీహెచ్ఎంసీలో విలీనం చేసేందుకు ప్రభుత్వం సూచన ప్రాయంగా నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. రింగ్ రోడ్డు లోపల ఉన్న కీసర, ఘట్‌కేసర్ మండలాల్లోని గ్రామాలను దగ్గరలో ఉన్న ఆయా మున్సిపాల్టీల్లో విలీనం చేయనున్నారు. అలాగే, ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న నిజాంపేట, జవహర్‌నగర్, బోడుప్పల్, పీర్జాదిగూడ, కార్పొరేషన్లతోపాటు దుండిగల్, కొంపల్లి, తూంకుంట, నాగారం, దమ్మాయిగూడ, పోచారం, గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీలు జీహెచ్ఎంసీలో విలీనం కానున్నాయి.

వీల్ చైర్‌లోనే మహిళ ప్రసవం

నల్లగొండ ప్రభుత్వాస్పత్రిలో ఘటన

- పురిటి నొప్పులతో వచ్చిన గర్భిణి పట్ల సిబ్బంది నిర్లక్ష్యం!
- ఆస్పత్రిలో అదనపు కలెక్టర్ విచారణ
- నిర్లక్ష్యం వహించిన డాక్టర్లు, నర్సులపై చర్యలు

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

నల్లగొండ జిల్లా ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం దారుణ ఘటన జరిగింది. పురిటి నొప్పులతో వచ్చిన మహిళకు తీవ్ర రక్త స్రావమై వీల్ చైర్‌లోనే ప్రసవించింది. సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని, పట్టించుకోకపోవడంతోనే ఇలా జరిగిందని కుటుంబీకులు ఆరోపించారు. కాగా, ఈ ఘటనపై కలెక్టర్ విచారణకు ఆదేశించగా.. అదనపు కలెక్టర్ ఆస్పత్రిని సందర్శించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన డాక్టర్లు, స్టాఫ్ నర్సులపై చర్యలు తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ముకు చెందిన ఆంజనేయులు, అశ్విని దంపతులకు ఇప్పటికే ఇద్దరు సంతానం కాగా మూడో కాన్పు కోసం గురువారం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ అశ్వినిని పరీక్షించిన వైద్యులు కాన్పు కష్టంగా ఉందని చెప్పి మెరుగైన చికిత్స కోసం నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి పంపించారు. దీంతో ఆంజనేయులు అశ్వినిని అంబులెన్స్‌లో గురువారం రాత్రి 2:30 నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అప్పటికే తీవ్ర పురిటి నొప్పులతో బాధపడుతున్న అశ్విని పట్ల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారు. కాన్పు కోసం ఇక్కడి దాకా ఎందుకొచ్చారు.. దేవరకొండలో కాన్పు చేయలేరా అంటూ ఆంజనేయులుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వీల్ చైర్‌లోనే కూర్చోబెట్టారు. అప్పుడే తీవ్ర రక్తస్రావమై ఆడపిల్లకు జన్మనిచ్చింది. దీంతో ఆస్పత్రి సిబ్బంది వెంటనే అశ్వినిని లోపలికి తీసుకెళ్లి తల్లీబిడ్డకు వైద్య సేవలు అందించారు. సిబ్బంది తీరును నిరసిస్తూ అశ్విని కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు.





ఘటనపై విచారణకు కలెక్టర్ ఆదేశం

నల్లగొండ ప్రభుత్వాస్పత్రిలో సిబ్బంది నిర్లక్ష్యం వల్ల వీల్ చైర్‌లోనే మహిళ ప్రసవించిన విషయం తెలుసుకున్న కలెక్టర్ నారాయణరెడ్డి విచారణకు ఆదేశించారు. ఘటనపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని అదనపు కలెక్టర్ పూర్ణచంద్రకు సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర ప్రభుత్వాస్పత్రికి వచ్చి అశ్వినిని, ఆమె భర్త ఆంజనేయులును వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి సిబ్బందితోనూ మాట్లాడారు. అంతేకాక ఆస్పత్రి పర్యవేక్షకులు, ఆర్ఎంఓ, డ్యూటీ డాక్టర్ల నుంచి సంఘటన పూర్తి వివరాలు తెలుసుకున్నారు. అశ్విని ఆస్పత్రికి వచ్చిన సమయంలో విధుల్లో నర్సులు, డాక్టర్ ఎవరున్నారో విచారించారు.

డాక్టర్, నర్సులపై చర్యలు

నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని, విధుల పట్ల అలసత్వం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర మీడియా ప్రతినిధులతో చెప్పారు. గురువారం రాత్రి 10 గంటల సమయంలో దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్తే.. అక్కడ డాక్టర్ లేనందున డ్యూటీలో ఉన్న నర్సులు అంబులెన్స్ ఏర్పాటు చేసి నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి పంపించినట్టు తెలిసిందని అన్నారు. అయితే, ఇలాంటి సందర్భాల్లో అనుభవం ఉన్న వారి సహాయం లేకుండా నిండు గర్భిణిని నడవమని సలహా ఇచ్చిన నర్సు లేదా ఇతరుల వల్లే ఈ ఘటన జరిగిందని గుర్తించామన్నారు. దీనికి బాధ్యులైన డ్యూటీ డాక్టర్ నిఖిత, స్టాఫ్ నర్సులు ప్రమీల, ఉమ, పద్మ, సుజాతకు సోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు తెలిపారు. అంతేకాక గురువారం రాత్రి డ్యూటీలో ఉండకపోవడంపై దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ శాంతి స్వరూప, విధుల్లో ఉన్న స్టాఫ్ నర్సులు విజయలక్ష్మి, సైదమ్మ, మౌనిక, సరితను సస్పెండ్ చేయాలని డీసీహెచ్ఎస్‌ను ఆదేశించినట్టు తెలిపారు. జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఆదేశాల మేరకు ప్రాథమిక నివేదికను సమర్పించామన్నారు.

నిర్లక్ష్యం జరగలేదు

అశ్విని అర్ధరాత్రి 2:30 గంటలకు డెలివరీ కోసం వచ్చారు. పురిటి నొప్పులు వచ్చి పోతుండటంతో ఫ్రీ డెలివరీ కోసం వాకింగ్ చేయాలని డ్యూటీలో ఉన్న సిబ్బంది చెప్పారు. వాకింగ్ చేసి అలసిపోయి కుర్చీలో కూర్చోగానే డెలివరీ అయింది. వెంటనే సిబ్బంది తల్లీబిడ్డకు వైద్య సేవలు అందించారు. ఇద్దరూ క్షేమంగా ఉన్నారు. ఆస్పత్రిలో ఎలాంటి నిర్లక్ష్యం జరగలేదు. వచ్చిన వెంటనే పరిశీలించి బెడ్‌ని కూడా కేటాయించాం. తెల్లవారుజామున 3:56 గంటలకు డెలివరీ అయింది.

-డాక్టర్ రమణ మూర్తి : ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్

ఈస్ట్ హైదరాబాద్ అభివృద్ధే లక్ష్యం

- నాణ్యమైన నిర్మాణాలు చేపడితేనే సంస్థల మనుగడ
- ఈస్ట్ ఐటీ పార్కు, కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు కృషి
- మెట్రోను ఔటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరిస్తాం
- ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- ఉప్పల్ భగాయత్‌లో క్రెడాయ్ ప్రాపర్టీ షో



నవతెలంగాణ-ఉప్పల్

ఈస్ట్ హైదరాబాద్ అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తోందని, దీంతోపాటు నార్త్, సౌత్ హైదరాబాద్ అభివృద్ధికి తోడ్పాటునందిస్తుందని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శుక్రవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ భగాయత్‌లో నిర్వహించిన క్రెడాయ్ ప్రాపర్టీ షోను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ప్రజల ప్రతి ఒక్కరికీ ఇల్లు కొనుక్కోవాలి, బంగారం కొనుక్కోవాలనే కల ఉంటుందన్నారు. అయితే, నాణ్యమైన నిర్మాణాలు చేపట్టి నాణ్యమైన ధరలకే ప్రజలకు అందించినప్పుడే సంస్థలు ముందుకు సాగుతాయన్నారు. కొంతమంది వ్యక్తులు రియల్ ఎస్టేట్ రంగం ముందుకు వెళ్లడం లేదనడం విడ్డూరంగా ఉందన్నారు. క్రెడాయ్ ప్రాపర్టీ షోల ద్వారా 270 అమ్మకాలు జరిగాయని ఆ సంస్థలే చెబుతున్నాయని చెప్పారు. ఈస్ట్, నార్త్, సౌత్ అభివృద్ధి లక్ష్యంగా ఈస్ట్ సాఫ్ట్‌వేర్ ఐటీ పార్క్ ఏర్పాటు చేస్తామన్నారు.

నగర జనాభా అవసరాలకు అనుగుణంగా మెట్రో రైలును ఔటర్ రింగ్ రోడ్డు వరకు పొడిగిస్తామని తెలిపారు. ఈస్ట్ హైదరాబాద్ అభివృద్ధిలో భాగంగా పొల్యూషన్ లేని పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రూ.2,800 కోట్లతో కిమ్స్ పరిశ్రమ ఏర్పాటు చేసి 2000 మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఈస్ట్ కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు, ఫైవ్ స్టార్ హోటల్ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామన్నారు. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. అమెరికా, సౌత్ కొరియా దేశాల నుంచి పలు సంస్థలు రూ.31 వేల కోట్ల పెట్టుబడులతో 30,750 మందికి ఉపాధి కల్పించే లక్ష్యంగా హైదరాబాద్‌కు రానున్నాయని తెలిపారు. తక్కువ మాట్లాడి ఎక్కువ పని చేయడమే తమ ప్రభుత్వ విధానమన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, క్రెడాయ్ ప్రాపర్టీ షో అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, కోశాధికారి మనోజ్ అగర్వాల్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సర్వజన ఆస్పత్రిలో మౌలిక వసతులు కల్పించాలి

- వైద్యం కోసం వస్తే కొత్త జబ్బులు : సీపీఐ(ఎం) భద్రాద్రి జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య
- ఆస్పత్రి ఎదుట ఆందోళన



నవతెలంగాణ-కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సర్వజన ఆస్పత్రిలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆస్పత్రి ఎదుట పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ.. పాత జబ్బు నయం చేసుకోవడానికి రోగులు ఆస్పత్రికి వస్తే అక్కడ ఉన్న డ్రయినేజీ సమస్యతో కొత్త రోగాలతో ఇంటికి వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత నెలలో ఆస్పత్రిలో ఉన్న సమస్యలపై అధ్యయనం చేయగా, అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయని అన్నారు. వాటిని పరిష్కరించాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటికీ ఒక్కటి కూడా పరిష్కారం కాలేదని చెప్పారు. ఆస్పత్రికి వచ్చిన రోగులకు ఆస్పత్రి డ్రయినేజీ లీక్ అవడం వల్ల దుర్గంధం వెదజల్లుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రన్నారు. ఎమర్జెన్సీ వార్డులో కనీసం వెంటిలేటర్లు, మానిటర్లు పనిచేయడం లేదని, డెంగ్యూ వ్యాధి నివారణకు అవసరమైన ప్లేట్‌లెట్స్ మిషన్ కూడా సక్రమంగా లేదని తెలిపారు. దాంతో రోగులు మెరుగైన వైద్యం కోసం ప్రయివేట్ ఆస్పత్రులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

డాక్టర్, నర్సింగ్ పోస్టులు, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని రోజుకి 500 మంది రోగులు వస్తున్న హాస్పిటల్‌లో కేవలం మూడు స్ట్రేచర్లు మాత్రమే ఉన్నాయన్నారు. జిల్లా కేంద్ర ఆస్పత్రిలో పరిస్థితులే ఈ రకంగా ఉంటే మారుమూల గ్రామాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. సీజనల్ వ్యాధుల నుంచి ఏజెన్సీ ప్రజలను కాపాడాలంటే మెరుగైన వైద్య సౌకర్యం అందించాలని డిమాండ్ చేశారు. ఇందుకు ప్రభుత్వ ఆస్పత్రిని అభివృద్ధి చేయాలని, దానికి తగినన్ని నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆస్పత్రి సమస్యలు పరిష్కారమయ్యేవరకూ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్, టౌన్ కమిటీ సభ్యులు డి.వీరన్న, సందకూరి లక్ష్మి, నందిపాటి రమేష్, నాయకులు బుర్ర వీరభద్రం, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

సోనియా నివాసానికి ఎంపీ రఘునందన్ రావు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని కలవడానికి శుక్రవారం ఢిల్లీలోని సోనియా గాంధీ నివాసానికి బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావు వెళ్లారు. రాహుల్ గాంధీ బ్రిటన్ పౌరుడని బ్లిడ్జ్ పత్రికలో వచ్చిన వ్యాసానికి సంబంధించిన ప్రతులను తీసుకెళ్లారు. రాహుల్ గాంధీని కలిసి వాటిని అందజేసే ప్రయత్నం చేయగా ఆయన సమావేశంలో ఉన్నారని సిబ్బంది చెప్పారు. దీనితో ఆ ప్రతులను అక్కడి సిబ్బందికే ఇచ్చి వెనుదిరిగారు. ఈ సందర్భంగా రఘునందన్ రావు మాట్లాడుతూ రాహుల్ గాంధీ బ్రిటన్ పౌరుడని బ్లిడ్జ్ పత్రికలో వచ్చిన కథనానికి సోనియా, రాహుల్ స్పందించాలని, ఆ కథనాలపై ఏం చర్యలు తీసుకుంటారో చెప్పాలని డిమాండ్ చేశారు. రఘునందన్ రావు వెంట సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ ఉన్నారు.

కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

- ఉద్దేశపూర్వకంగానే ఆలస్యం : సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం పాలసీకి సంబంధించి సీబీఐ కేసులో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు మరోసారి వాయిదా వేసింది. లిక్కర్ పాలసీ సీబీఐ కేసులో ఢిల్లీ హైకోర్టు బెయిల్ తిరస్కరించడంతో కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ బెయిల్ పిటిషన్‌ను శుక్రవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఈ కేసులో సిబిఐ కౌంటర్ దాఖలు చేయలేదు. విచారణ సందర్భంగా సీబీఐ ఉద్దేశపూర్వకంగానే ఆలస్యం చేస్తోందని కేజ్రీవాల్ తరపున న్యాయవాది అభిషేక్ సింఘ్వీ తెలిపారు. ఈ క్రమంలో సీబీఐ కౌంటర్ దాఖలుకు గడువు ఇస్తూ విచారణను వచ్చే నెల 5కు కోర్టు వాయిదా వేసింది. ఈడీ కేసులో కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చిన విషయం తెలిసిందే. సీబీఐ కేసులో బెయిల్ రాకపోవడంతో ఆయన తీహార్ జైలులోనే ఉన్నారు.

కవితతో హరీశ్‌రావు ములాఖాత్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టై తీహార్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో శుక్రవారం ఉదయం మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ములాఖాత్ అయ్యారు. సుమారు 20 నిమిషాల పాటు ఆమెతో మాట్లాడారు. కవిత కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. దీర్ఘకాలికంగా గైనిక్ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే జులై 16న ఆమెను ఢిల్లీలోని దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఆ తర్వాత న్యాయమూర్తి అనుమతితో కవిత భర్త అనిల్ నేతృత్వంలో ఢిల్లీ ఎయిమ్స్‌లో వైద్య పరీక్షలు నిర్వహించారు. అప్పటి నుంచి కవితకు జైలులోనే వైద్య సేవలు అందిస్తున్నారు. అయినప్పటికీ ఆమె ఆరోగ్యం పూర్తిగా మెరుగు పడకపోగా మరింత క్షీణించడంతో జైలు వైద్యుల సూచనల మేరకు గురువారం మరోసారి ఢిల్లీ ఎయిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఆమె భర్త అనిల్ సమక్షంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కవితను జైలులో హరీశ్‌రావు కలిశారు. ఆరోగ్య పరిస్థితి, వైద్య పరీక్షలు, జైలులో వసతులు, మందులు తదితర అంశాలపై చర్చించినట్టు తెలిసింది. ఈ నెల 27న కవితకు బెయిల్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది. ఈ సారి తప్పనిసరిగా బెయిల్ వస్తుందని, దీనికి సంబంధించి ఇప్పటికే న్యాయ నిపుణులతో చర్చించామని హరీశ్‌రావు ఆమెకు ధైర్యం చెప్పినట్టు సమాచారం.

పన్ను కట్టని వాహనాల రిజిస్ట్రేషన్ రద్దు..!

- వాహన యజమానులకు నోటీసులు పంపనున్న ఆర్టీఏ
- గ్రేటర్ పరిధిలో లక్షకుపైగా పన్ను చెల్లించని వాహనాల గుర్తింపు
- త్రైమాసిక పన్ను వసూళ్లపై ప్రత్యేక డ్రైవ్‌కు శ్రీకారం

నవతెలంగాణ-సిటీబ్యూరో

వాహన పన్ను ఎగవేతదారులకు గట్టి షాక్ ఇచ్చేందుకు రవాణాశాఖ సిద్ధమైంది. త్రైమాసిక పన్ను చెల్లించకుండా తిరుగుతున్న వాహనాల రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని నిర్ణయించింది. ఆ మేరకు రవాణా వాహన యజమానులకు నోటీసులు పంపించే పనుల్లో నిమగ్నమైంది. గ్రేటర్‌లో పరిధిలో ప్రధానంగా గూడ్స్ క్యారేజ్ వాహనాలతో పాటు మ్యాక్సీ, మోటార్ క్యాబ్స్, టూరిస్ట్ బస్సులు, పలు రవాణా వాహనాలు పన్నులు కట్టకుండా తిరుగుతున్నట్టు ఇప్పటికే రవాణాశాఖ గుర్తించింది. మూడు జిల్లాల్లోని ప్రాంతాల వారీగా ఎగవేతదారులను గుర్తించిన ఉన్నతాధికారులు జాబితాలను సేకరించి ఎంవీఐలకు అప్పగించి తనిఖీలు మొదలు పెట్టనున్నారు.

గ్రేటర్‌లోని మూడు జిల్లాల పరిధిలో సుమారు 5 లక్షల వరకు రవాణా వాహనాలు ఉన్నాయి. వీటి పరిధిలో దాదాపు లక్షకుపైగా వాహనాలు త్రైమాసిక పన్ను ఎగ్గొట్టి దర్జాగా రోడ్లపై పరుగులు పెడుతున్నాయి. ఇందులో హైదరాబాద్‌లోని 5 ఆర్టీఏ కార్యాలయాల పరిధిలో 41వేల రవాణా వాహనాలు ట్యాక్స్ కట్టకుండా రోడ్లపై యథేచ్ఛగా తిరుగుతున్నాయి. వాస్తవానికి ప్రతి మూడు నెలలకోసారి రవాణా వాహనాలకు ట్యాక్స్ చెల్లించాలి. అయితే, ఇందులో సగానికిపైగా వాహనాల ట్యాక్స్ కోవిడ్ పీరియడ్ నుంచి పెండింగ్‌లో ఉండగా.. మిగతావి నాలుగైదు క్వార్టర్స్ నుంచి త్రైమాసిక పన్ను చెల్లించకుండా తిరుగుతున్నాయి. ఇందులో గూడ్స్ క్యారేజ్ (ఎల్‌జీవీ, ఎంజీవీ, హెచ్‌జీవీ) వంటి వాటితోపాటు మోటార్ క్యాబ్స్, మాక్సీ క్యాబ్‌లు, మినీ బస్సులు, కమర్షియల్ ట్రాక్టర్స్, లగ్జరీ టూరిస్ట్ క్యాబ్స్ తదితర వాహనాలే ఎక్కువగా ఉన్నాయి. వీటికి సంబంధించి ఒక్కో త్రైమాసికానికి చెల్లించాల్సిన ట్యాక్స్ సుమారు రూ.వెయ్యి నుంచి రూ.2వేల లోపు ఉంటుంది. ఈ లెక్కన లక్షకుపైగా వాహనాలకు లెక్క కడితే.. కోట్లల్లోనే ఆర్టీఏకు రుసుం రావాలి. ఇంత భారీ మొత్తంలో ట్యాక్స్ పెండింగ్ ఉన్న నేపథ్యంలో రవాణాశాఖ వాటిని రాబట్టేందుకుగాను ప్రత్యేక దృష్టిపెట్టింది. కనీసం ఐదు త్రైమాసికాలకుపైగా పన్ను కట్టని వాహనాల రిజిస్ట్రేషన్(ఆర్సీ) రద్దు చేస్తూ.. వాహన యజమానులకు నోటీసులు పంపించాలని నిర్ణయించింది. సదరు నోటీసులకు స్పందించి స్వచ్ఛందంగా ముందుకొచ్చి పన్ను కట్టేవారికి అపరాధ రుసుము 50 శాతం విధించనుంది. ప్రత్యేక బృందాల తనిఖీల్లో మాత్రం పట్టుబడితే 200శాతం పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ఎగవేతదారులు అప్రమత్తమై పన్ను బకాయిలు చెల్లించాలని సూచిస్తున్నారు. ఈ తరహా వాహనాలకు ప్రమాదం జరిగితే పైసా కూడా పరిహారం రాదన్న విషయం యజమానులు గుర్తించాలని అధికారులు చెబుతున్నారు.


(ఫైల్)

వాహనం వినియోగించకుంటే సమాచారమివ్వాలి..

గ్రేటర్ పరిధిలోని 11 కార్యాలయాల పరిధిలో మొత్తం 5లక్షలకు పైగా వాహనాలు తిరుగుతుంటే త్రైమాసిక పన్ను చెల్లించేవి లక్షలోనే ఉన్నాయి. గ్రేటర్‌లోని శివారు ప్రాంతాల్లో అధికంగా సరకు రవాణా చేసే వాహనదారులే తప్పించుకుంటున్నారు. అలాగే, ఇతర రవాణా వాహన యజమానులూ ఉన్నారు. ఈ నేపథ్యంలో అధికారులు పన్ను ఎగవేత వాహనాలపై నిఘా పెంచారు. తనిఖీల్లో పట్టుబడితే మాత్రం భారీ పెనాల్టీ తప్పదని హెచ్చరిస్తున్నారు. దీంతోపాటు ఎవరైనా మూడు నెలలపాటు వాహనం వినియోగించకపోతే రవాణాశాఖ కార్యాలయంలో సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు. చాలా మంది ఫైనాన్షియర్లు వాయిదాలు చెల్లించని వారి వాహనాలను స్వాధీనం చేసుకుని బయట దాచిపెడతారు. కొన్ని వాహనాలను తిప్పరు. ఆ వివరాల్ని చెబితే బకాయిలు కట్టించుకొని అధికారికంగా ఆ వాహనాన్ని దస్త్రాల నుంచి తొలగించనున్నారు.

12కోట్లకు పైనే జీహెచ్ఎంసీ వాహనాల పన్ను బకాయిలు..!

గ్రేటర్‌తో పాటు రాష్ట్రంలో ఇంటింటా చెత్త సేకరణకు అప్పటి ప్రభుత్వం స్వచ్ఛ ఆటోలను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ ఆటోలు గ్రేటర్ పరిధిలో సుమారు 450 వరకు ఉండగా.. మరో 450 భారీ వాహనాలుంటాయి. ఈ వాహనాలు ప్రతి మూడు నెలలకోసారి త్రైమాసిక పన్ను చెల్లించాలి. కానీ ట్యాక్స్ చెల్లించకుండా తిరుగుతుండగా.. వాటి ఫిట్‌నెస్ గురించి పట్టించుకునే వారే లేరు. తనిఖీల సందర్భంగా సదరు ఆటోలు, వాహనాలు ఆపితే.. చెత్త సేకరణకు ఆటంకాలు ఎదురవుతాయని చూసీచూడనట్టు వదిలేస్తున్నామని అధికారులు వివరిస్తున్నారు. కాగా, ఈ స్కీం ప్రారంభం నుంచి 450 స్వచ్ఛ ఆటోలతో పాటు మరో 450 పైగా మున్సిపల్ వాహనాలకు సంబంధించి జీహెచ్ఎంసీ పన్ను చెల్లించడం లేదు. ఈ వాహనాల నుంచే రవాణాశాఖకు రూ.12కోట్ల 60 లక్షల రుసుం రావాల్సి ఉండగా.. రాష్ట్రవ్యాప్తంగా మరో రూ.10 కోట్ల వరకు వస్తుందని అధికారుల అంచనా. మరోవైపు వాహన ట్యాక్స్ చెల్లించాలని జీహెచ్ఎంసీ అధికారులకు నోటీసులు పంపిస్తున్నా స్పందించడం లేదని.. ప్రభుత్వమే చొరవ తీసుకుంటే బావుంటుందని ఆర్టీఏ అధికారులు కోరుతున్నారు. ఫిట్‌నెస్ లేని వాహనాలతో రోడ్లపై తిరిగితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.



ఇండ్లు, బదిలీలు, ఉద్యోగాలు ఇప్పిస్తామని టోకరా

- 107 మందిని మోసం చేసిన ముఠా
- రూ. కోటి 29 లక్షలు వసూలు
- సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి పేరుతో మోసాలకు పాల్పడిన నిందితులు
- వివరాలు వెల్లడించిన రాచకొండ సీపీ సుధీర్‌బాబు

నవతెలంగాణ-హయత్ నగర్

ప్రభుత్వ ఉద్యోగాల్లో బదిలీలు చేయిస్తానని, ఉద్యోగాలు ఇప్పిస్తానని, డబుల్ బెడ్ రూమ్స్ ఇప్పిస్తానంటూ దాదాపు 107 మందిని మోసం చేసిన ముఠాని పోలీసులు పట్టుకున్నారు. రూ.కోటి 29లక్షలు వసూలు చేసినట్టు గుర్తించారు. 'నేను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సలహాదారు వేం నరేందర్ రెడ్డిని మాట్లాడుతున్నాను' అని చెప్పి కొందరు ప్రభుత్వ అధికారులకు ఫోన్‌లు చేసి నకిలీ బదిలీ ఆర్డర్ కాపీలు ఇవ్వడం, 'నేను మల్కాజిగిరి ఆర్‌డీఓను మాట్లాడుతున్నా' అని కొందరికి నకిలీ డబుల్ బెడ్ రూమ్ పట్టాలు అందజేయడం, అదేవిధంగా ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగాలు ఇప్పిస్తామని.. ఇలా దాదాపు 107 మందిని మోసం చేసిన ఆరుగురిని రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు. కీసర పోలీసులు, మల్కాజిగిరి ఎస్‌ఓటీ పోలీసులు సంయుక్తంగా చేసిన ఆపరేషన్ వివరాలను శుక్రవారం ఎల్‌బీనగర్‌లో ఉన్న సీపీ క్యాంప్ కార్యాలయంలో రాచకొండ సీపీ సుధీర్‌బాబు మీడియాకు వివరాలు వెల్లడించారు. కుషాయిగూడలోని వాసవి శివనగర్ కాలనీలో నివాసముంటున్న అనుగు సురేందర్‌రెడ్డి స్వస్థలం యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం హుస్నాబాద్ గ్రామం. ఇతను చెడు అలవాట్లకు బానిసై సులభంగా డబ్బులు సంపాదించాలని ఆలోచించాడు. ఓ మధ్యాహ్నం భోజన పథకం ఏజెన్సీలో అప్పుడప్పుడూ పని చేసేందుకు వెళుండేవాడు. ఇదే క్రమంలో అతను తన ఇంటి పక్కనే ఉంటున్న మేరీనా రోజ్, మరో నలుగురితో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. మిగతా నలుగురు నల్లగొండ జిల్లాకు చెందిన బోలుగుల అంజయ్య, కుషాయిగూడకు చెందిన బండ వెంకటేష్, కట్రావత్ గోపాల్ నాయక్, కీసరకు చెందిన అనుగు హర్షినిరెడ్డి కష్టమర్ల కోసం వెతికేవారు. ఈ క్రమంలో వారు తమకు సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి తెలుసని అమాయకులతో పరిచయం చేసుకున్నారు. అనంతరం సురేందర్‌రెడ్డి పలువురు బాధితులతో తాను వేం నరేందర్ రెడ్డిని మాట్లాడుతున్నానని ఫోన్‌లో మాట్లాడేవాడు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కావాలంటే, ఉద్యోగ బదిలీలు, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగాలు సులభంగా నమ్మబలికి బాధితుల నుంచి డబ్బును రోజ్ బ్యాంక్ ఖాతాలోకి ట్రాన్స్‌ఫర్ చేయించుకునేవాడు. ఇలా ఉద్యోగ బదిలీల కోసం నకిలీ ఆర్డర్ కాపీలు ఇచ్చి ఏడుగురు బాధితుల నుంచి రూ.7 లక్షలు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు సంబంధించి 98మందికి నకిలీ పట్టాలు ఇచ్చి రూ.కోటి 4లక్షలు, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నకిలీ ఆర్డర్ కాపీలు ఇచ్చి ఇద్దరి నుంచి రూ.18లక్షల 5వేలు వసూలు చేశారు. చివరకు మోసపోయామని గ్రహించిన బాధితురాలు కల్యాణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు విశ్వసనీయ సమాచారం మేరకు నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి 8ఫోన్లు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నకిలీ పట్టాలు 98, రెండు నకిలీ ఆర్‌డీఓ స్టాంప్స్, రూ. కోటి 97లక్షలు స్వాధీనం చేసుకున్నారు. సురేందర్ రెడ్డి గతంలో బెట్టింగ్ కేసులో జైలుకు వెళ్లి వచ్చాడు. మీడియా సమావేశంలో మల్కాజిగిరి ఎస్‌ఓటీ డీసీపీ రమణా రెడ్డి, అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి, ఏసీపీ శ్రీకాంత్ గౌడ్, కీసర ఇన్‌స్పెక్టర్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో 9 నెలలుగా పశువుల ఆస్పత్రుల్లో మందుల కొరత

- వెంటనే సరఫరా చేయించండి
- సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మూగజీవుల వేదన రాష్ట్ర ప్రభుత్వానికి పట్టదా? 9 నెలలుగా పశు వైద్యశాలల్లో మందుల కొరత ఉన్నా ఎందుకు పట్టించుకోవడం లేదు? అని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు ప్రశ్నించారు. పశువైద్య సంచార వాహన సేవల్లో అంతరాయం కలుగుతోందని తెలిపారు. పశువుల ఆస్పత్రుల్లో మందుల కొరత తీర్చాలనీ, చేప పిల్లల పంపిణీ చేపట్టాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన శుక్రవారం లేఖ రాశారు. పశుసంవర్ధక శాఖ సీఎం దగ్గరే ఉన్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. పొదుగు వాపు, గాలి కుంటు వ్యాధులు సోకితే ఒక్కో మూగ జీవిపై పాడి రైతులు రెండు వేల దాకా ఖర్చు చేయాల్సి వస్తున్నదనీ, ఇది రైతులకు భారమేనని తెలిపారు. నట్టల నివారణ మందులను కూడా సరఫరా చేయడం లేదని ప్రస్తావించారు. సంచార పశువైద్యశాలల నిర్వహణను స్ఫూర్తిగా తీసుకోవాలని పలు రాష్ట్రాలకు కేంద్రం సూచించిన విషయాన్ని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ వాహనాలను తిప్పడం లేదని విమర్శించారు. ఆగస్టు నెల పూర్తికావస్తున్నా ఇంకా ఎందుకు చేప పిల్లల పంపిణీ చేపట్టలేదని ప్రశ్నించారు. ఇప్పటికి వరకు ఆ ప్రక్రియ టెండర్‌దశలోనే ఉండటం కార్యక్రమం అమలు పట్ల అనుమానాలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. చేపపిల్లల పంపిణీ కార్యక్రమాన్ని త్వరగా చేపట్టాలని కోరారు.

ప్రజావాణికి 1150 దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్‌లోని మహాత్మాజ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 1150 దరఖాస్తులు అందాయి. ఎస్సీ వెల్ఫేర్ శాఖకు సంబంధించి 610, విద్యుత్ శాఖకు, సింగరేణికి సంబంధించి 115, పౌరసరఫరాల శాఖకు సంబంధించి 113, మైనారిటీ వెల్ఫేర్‌కు సంబంధించి 85, రెవెన్యూ సమస్యలకు సంబంధించి 69, ఇతర శాఖలకు సంబంధించి 158 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్ కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ఏఎంవీఐ పోస్టుకు స్పోర్ట్స్ కోటాలో ఒక అభ్యర్థి ఎంపిక

- 28న ధ్రువపత్రాల పరిశీలన, 29న ఉస్మానియా ఆస్పత్రిలో పరీక్ష : టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ (ఏఎంవీఐ) పోస్టుకు స్పోర్ట్స్ కోటాలో ఒక అభ్యర్థి (హాల్‌టికెట్ నెంబర్ 2311802433)ని ఎంపిక చేసినట్టు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ప్రకటించింది. ఈ మేరకు టీజీపీఎస్సీ కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏఎంవీఐ పోస్టులకు స్పోర్ట్స్ కోటాలో 27 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. వారి ధ్రువపత్రాలను పరిశీలించిన అనంతరం సెక్రటేరియట్ కమిటీ ఒక అభ్యర్థిని ఎంపిక చేసిందని తెలిపారు. ఆ అభ్యర్థికి సంబంధించి ఇతర ధ్రువపత్రాల పరిశీలన ఈనెల 28న ఉదయం పది గంటలకు హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఉన్న టీజీపీఎస్సీ కార్యాలయంలో ఉంటుందని పేర్కొన్నారు. అదేనెల 29న ఉదయం తొమ్మిది గంటలకు మెడికల్ బోర్డు ఆధ్వర్యంలో ఉస్మానియా ఆస్పత్రిలోని రూమ్‌నెంబర్ 507లో మెడికల్ పరీక్షలుంటాయని వివరించారు. దానికోసం రూ.600 చెల్లించాలని సూచించారు. ఇతర వివరాల కోసం www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

'సబ్ కే సాత్-సబ్ వికాస్' విధానాన్ని మార్చుకున్న బీజేపీ

- వైద్యురాలి ఘటనలో సీఎం మమతాబెనర్జీదే నైతికబాధ్యత : సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ

నవతెలంగాణ-వరంగల్



మహిళలకు న్యాయం చేస్తామని, 'సబ్ కే సాత్-సబ్ వికాస్' అని ప్రకటించిన ప్రధాని నరేంద్ర మోడీ ఇప్పుడు వారి నినాదాన్ని మార్చుకుని కొత్త విధానాన్ని అమలు చేస్తున్నదని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ అన్నారు. హన్మకొండ జిల్లా కేంద్రంలో జరుగుతున్న సీపీఐ తెలంగాణ రాష్ట్ర సమితి నిర్మాణ సమావేశాల సందర్భంగా శుక్రవారం హరిత హెూటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్ పాషా, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిసి డాక్టర్ నారాయణ మాట్లాడారు. కలకత్తాలో వైద్యురాలిపై లైంగికదాడి, హత్య సంఘటనను సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. వైద్యురాలి హత్యకు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ దోషిగా నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సంఘటన జరిగిన వెంటనే వైద్య కళాశాల ప్రిన్సిపల్ అక్కడి నుంచి పారిపోయారని, మూడు రోజుల్లోనే అతన్ని మరో చోట ప్రభుత్వం నియమించిందని, సంఘటన వెనుక ప్రభుత్వం పాత్ర లేకుంటే ఇదంతా ఎలా సాధ్యమని ప్రశ్నించారు. బీజేపీ అనుకూల ప్రభుత్వాలు ఉన్న బీహార్, మహారాష్ట్రలో ఏమి జరిగినా పట్టించుకోకపోవడం, మహిళలు, పిల్లలపై లైంగికదాడులు జరిగినా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. మోడీ ఊపిరి అదానీ చేతిలో ఉందని, అదానీకి ఏమైనా అయితే మోడీ పదవి ఊడిపోతుందని అన్నారు. ఆ కారణంగానే అదానీని మోడీ ఉక్కు కవచాలతో కాపాడుతున్నారని అన్నారు. ప్రధాని మోడీ రాజ్యాంగబద్ధమైన వ్యవస్థలను ధ్వంసం చేస్తున్నారని, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్టు చెప్పారు. వర్గీకరణ, క్రిమిలేయర్‌కు సంబంధం లేదని, ఈ విషయాన్ని కోర్టులో విచారణ సందర్భంగా తెలియజేస్తామన్నారు. చంద్రబాబు, నితీష్ కుమార్‌పై ఆధారపడిన మోడీ ప్రభుత్వం చంద్రబాబు కోరిన విధంగా అమరావతికి నిధులు, పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హెూదా ఇస్తామంటున్నా ఆ రెండు రాష్ట్రాలకు ప్రత్యేక హెూదా ఇవ్వలేదని అన్నారు. తెలంగాణలో ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే బీజేపీలో బీఆర్ఎస్ విలీనమౌతుందని రేవంత్ చెబుతుండగా, రేవంత్ బీజేపీలో చేరుతారని బీఆర్ఎస్ నేతలు అంటున్నారని, రెండు పార్టీలు కలిసి రాజకీయ క్రీడ ఆడుతున్నాయని మండిపడ్డారు.

'వైద్యం'కు 1.35 శాతం నిధులేనా..? : సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా

ఇంత పెద్ద దేశంలో బడ్జెట్‌లో వైద్య రంగానికి కేవలం 1.35 శాతం ఖర్చు చేయడం సిగ్గుచేటని, ఇది వైద్య రంగంపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందని సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్ పాషా విమర్శించారు. ప్రభుత్వ వైద్యరంగంలో తగిన సదుపాయాలు లేకపోవడంతో కోట్లాది మంది ప్రజలు తీవ్రమైన ఆర్థిక భారాన్ని మోయాల్సి వస్తుందని అన్నారు. ఎలాంటి చర్చలు, సంప్రదింపులు లేకుండా, న్యాయ నిపుణులు వ్యతిరేకించినా కేంద్ర ప్రభుత్వం మూడు కొత్త న్యాయ చట్టాలు తీసుకొచ్చిందని, ఇవి అత్యంత క్రూరమైనవని తెలిపారు. కనీసం ఎఫ్ఐఆర్ కూడా లేకుండా పోలీసులు ఎవరినైనా అరెస్ట్ చేసేందుకు అధికారాలు ఇవ్వడం దారుణమన్నారు. ఈ సమావేశంలో కార్యదర్శి వర్గ సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, తక్కెళ్లపల్లి శ్రీనివాస్, పశ్యపద్మ, కలవేణ శంకర్, ఎం బాలనర్సింహ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. విజయ సారథి, హన్మకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ వర్గీకరణను అమలుచేయాలి

- మంత్రి కోమటిరెడ్డికి మందకృష్ణ విజ్ఞప్తి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

సుప్రీంకోర్టుకు అనుగుణంగా ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలుచేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిశారు. ఈసందర్భంగా ఎస్సీ వర్గీకరణ ఉద్యమం, సుప్రీంకోర్టు తీర్పు తదితర అంశాలపై చర్చించారు. వర్గీకరణపై అమలు విషయంలో చొరవ తీసుకోవాలని కోరారు. సుప్రీం తీర్పు వచ్చిన తర్వాత సంబంధిత తరగతికి అన్యాయం జరగొద్దని అభిప్రాయపడ్డారు. అందరి సహకారం అవసరమని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతోపాటు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యేలు కాలే యాదయ్య, వేముల వీరేశం, కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, మాజీ ఎంపీ పసునూరి దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

కీచక ఉపాధ్యాయుడు..?

- విద్యార్థినీల పట్ల వెకిలి చేష్టలు
- సింగరేణి స్కూల్ ఎదుట తల్లిదండ్రుల ఆందోళన

నవతెలంగాణ-కొత్తగూడెం

విద్యా బుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయుడే పిల్లల పట్ల వికృత చేష్టలకు పాల్పడిన ఘటన కొత్తగూడెం పట్టణం, పోస్ట్ ఆఫీస్ సెంటర్ సింగరేణి స్కూల్‌లో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఓ బాలిక పాఠశాలకు వెళ్లనని ఇంటి వద్దనే ఉండటంతో తల్లిదండ్రులు గట్టిగా మందలించారు. దాంతో ఆ బాలిక అసలు విషయం తెలిపింది. "తెలుగు టీచర్ తమపై ఇష్టం వచ్చినట్టు చేతులు వేసి ఇబ్బంది పెడుతున్నాడంటూ.." ఓ బాలిక తల్లిదండ్రులతో వాపోయింది. ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తనపై ఆగ్రహించిన విద్యార్థిని తల్లిదండ్రులతో పాటు మిగతా పిల్లల తల్లిదండ్రులు కూడా పాఠశాలకు చేరుకొని పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఉన్న సెక్యూరిటీ గార్డ్స్ రంగంలోకి దిగి, ఎవరిని లోనికి ప్రవేశించకుండా గేట్లు వేసేశారు. దాంతో ఉపాధ్యాయుడుని బయటకు పంపించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. పాఠశాల యాజమాన్యం ఎంత సర్దిచెప్పే ప్రయత్నం చేసినా వారు వినలేదు. కాగా, ఇటీవల మణుగూరు నుంచి బదిలీపై కొత్తగూడెంలోని సింగరేణి పాఠశాలకు వచ్చిన వేణు అనే ఉపాధ్యాయుడు తెలుగు పండిట్‌గా పనిచేస్తున్నాడు. వారం రోజుల క్రితమే వచ్చిన ఆయన.. స్కూలుకు వచ్చే 7వ తరగతి విద్యార్థునుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని బాలికలు, వారి తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ విషయమై కొత్తగూడెం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు వెంటనే పాఠశాలకు చేరుకున్నారు. వేణును అదుపులోకి తీసుకున్నారు.

ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట మెట్రో భూసేకరణ పనులు వేగిరం

- ఈ మార్గంలో మొత్తం 1200 ఆస్తుల ప్రభావం
- 400 ఆస్తులకు సంబంధించి నోటిఫికేషన్లు జారీ
- 8 నెలల్లో భూసేకరణ పనులు పూర్తి : హెచ్ఎంఆర్ఎల్, హెచ్ఎఎంఎల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్- చాంద్రాయణగుట్ట మధ్య పాతనగరం మెట్రో రైల్ భూసేకరణ వేగవంతం చేయనున్నామని హెచ్ఎంఆర్ఎల్, హెచ్ఎఎంఎల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంజీబీఎస్- చాంద్రాయణగుట్ట మధ్య 7.5 కిలోమీటర్ల నిడివిలో రోడ్డు విస్తరణ, స్టేషన్ల నిర్మాణానికి దాదాపు 1200 ఆస్తులపై ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు. ఇందుకుగాను ఇప్పటికే భూసేకరణ చట్టం-2013 కింద 400 ఆస్తులకు సంబంధించి నోటిఫికేషన్లు జారీ చేశామని వెల్లడించారు. తెలుగు, ఆంగ్లం, ఉర్దూ వార్తా పత్రికల్లోనూ ఈ నోటిఫికేషన్లను ప్రచురించామన్నారు.

జీహెచ్ఎంసీ మాస్టర్ ప్లాన్ ప్రకారం 100 అడుగుల వెడల్పుతో రహదారి విస్తరణ జరుగుతుందని, స్టేషన్ల వద్ద మాత్రం 120 అడుగుల వెడల్పులో విస్తరణ ఉంటుందని పేర్కొన్నారు. దారుల్‌షిఫా జంక్షన్ నుంచి శాలిబండ జంక్షన్ వరకు ప్రస్తుతం రహదారి వెడల్పు 50 అడుగుల నుంచి 60 అడుగుల వరకు, శాలిబండ జంక్షన్ నుంచి చాంద్రాయణగుట్ట జంక్షన్ వరకు 80 అడుగుల వెడల్పు ఉందన్నారు. అందువల్ల దారుల్‌షిఫా-శాలిబండ మధ్య చాలా ఆస్తుల విషయంలో ఒక్కొక్కటి 20 నుంచి 25 అడుగుల చొప్పున విస్తరణ చేయాల్సి ఉంటుందన్నారు. శాలిబండ నుంచి చాంద్రాయణగుట్ట మధ్య ఒక్కో ఆస్తి 10 అడుగుల వరకు విస్తరణ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. స్టేషన్లు, వంపు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఆస్తుల విషయంలో మాత్రం రహదారి విస్తరణ కాస్త ఎక్కువగా ఉంటుందన్నారు.

సంప్రదాయంగా వస్తున్న సర్వే పద్ధతులతోపాటు 3డీలో వీక్షించే విధంగా లైడార్ డ్రోన్ సర్వే చేసినట్టు వెల్లడించారు. ప్రభావిత నిర్మాణాల విలువను అంచనా వేసేందుకు హెచ్ఎఎంఎల్ ఇంజినీర్లు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.

ఈ మెట్రో మార్గం వెంబడి ఉండే 103 మతపరమైన, సున్నితమైన కట్టడాల పరిరక్షణ విషయంలో అదనపు జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు.

ఈ నిర్మాణాలను విలక్షణ ఇంజినీరింగ్ పద్ధతుల ద్వారా సంరక్షించేలా, పిల్లర్లు, స్టేషన్ల వద్ద జాగ్రత్తగా సర్దుబాటు చేస్తూ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తామని ఎండీ పేర్కొన్నారు. ప్రభావిత ఆస్తులకు సంబంధించిన యజమానులు హెచ్ఎఎంఎల్ భూసేకరణ అధికారి కార్యాలయం వద్ద నిర్దిష్ట గడువులోగా తమ అభ్యంతరాలు దాఖలు చేయొచ్చని, వివరాలు పొందవచ్చని చెప్పారు. ఈ భూసేకరణ కార్యక్రమం 8 నెలల్లో పూర్తి కావచ్చని పేర్కొన్నారు.

ప్రజాపాలనలో పడకేసిన ప్రజారోగ్యం

- సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రజాపాలన అని గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ సర్కారు హయాంలో ప్రజారోగ్యం పూర్తిగా పడకేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రభుత్వం ప్రజారోగ్య వ్యవస్థను గాలికొదిలే యడంతో జనం విషజ్వరాలతో మంచం పట్టే దుస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. గత ఎనిమిది నెల్లుగా పారిశుద్ధ్య నిర్వహణ పూర్తిగా దిగజారిపోయిందనీ, ఫలితంగా తీవ్రమైన దోమల బెడద కారణంగా డెంగీ, మలేరియాతోపాటు చికెన్ గున్యా లాంటి జ్వరాలతో ప్రజలు అవస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పల్లె, పట్టణం అనే తేడా లేకుండా అన్ని చోట్లా రోగుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోందని తెలిపారు. వర్షాకాలానికి ముందే ప్రజారోగ్యంపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం ఈ అంశాన్ని పూర్తిగా విస్మరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీజన్‌కు ముందే విష జ్వరాలు ప్రబలకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్న కనీస అవగాహన కూడా ఈ ప్రభుత్వానికి లేదని విమర్శించారు. ఫలితంగానే ప్రజలంతా విష జ్వరాల బారిన పడే దుస్థితి నెలకున్నదని మండిపడ్డారు. అధికారిక లెక్కల ప్రకారమే ఈ ఏడాదిలో దాదాపుగా 5,700 డెంగీ కేసులు నమోదయ్యాయనీ, కానీ అనధికారికంగా దీనికి పది రెట్లు ఎక్కువగానే ఉంటుందని తెలిపారు. డెంగీకి సరైన సమయంలో చికిత్స అందకపోవడం వల్ల ఇటీవల 50 మంది చనిపోయారనీ, ఇందులో చిన్నపిల్లలు కూడా ఉండటం అత్యంత బాధాకరమని తెలిపారు. ఒక్క రోజులోనే డెంగీతో ఐదుగురు చనిపోయిన సంఘటన ప్రతి ఒక్కరినీ కలిచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత మూడు నెల్లుగా విష జ్వరాల బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాస్పత్రుల్లో సరైన వైద్య సౌకర్యాలు లేకపోవటం, సరిపడా మందులు కూడా లేని కారణంగా జనం ప్రయివేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సిన దుస్థితి నెలకున్నదని పేర్కొన్నారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని ప్రయివేటు ఆస్పత్రులు పేద, మధ్యతరగతి ప్రజల జేబులు గుల్ల చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జనం అవస్థలు పడుతుంటే.. పట్టించుకోవాల్సిన ముఖ్యమంత్రి, మంత్రులు ఢిల్లీకి రాజకీయ యాత్రలు చేయడం దారుణమని విమర్శించారు. విజృంభిస్తున్న విషజ్వరాలతో చిన్నపిల్లలు తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. అనేక చోట్ల బెడ్లు దొరకక అవస్థలు పడుతున్నారనీ, పిల్లల ఆరోగ్య సంరక్షణలో ఇంత దుర్మార్గంగా వ్యవహరించడం సరికాదని హితవు పలికారు.

యాంత్రిక జీవనానికి పరిష్కారం కల్చరల్ సెంటర్లు

ప్రారంభోత్సవంలో మంత్రి కోమటిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



సమాజంలో పెరిగిపోతున్న మానసిక ఒత్తిళ్లు, యాంత్రిక జీవనానికి పరిష్కారం చూపించేవి కల్చరల్ సెంటర్స్ అని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రోడ్ నెంబర్ -10, జూబ్లీహిల్స్ లో ఎంపీ, ఎమ్మెల్యే కాలనీ కల్చర్ సెంటర్ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమిచ్చిన మూడెకరాల్లోనే అద్భుతమైన కల్చరల్ సెంటర్ భవనాన్ని నిర్మించుకోవటం చాలా సంతోషం కలిగిస్తుందని చెప్పారు. సమాజంలో చిన్న కుటుంబాలు పెరిగాక ఆత్మహత్యల శాతం పెరుగుతుందని.. తెలుగు సినిమా పరిశ్రమలో మంచి నటుడిగా పేరు సంపాదించుకున్న రంగనాథ్ ఆత్మహత్య ఇందుకు ప్రధాన ఉదాహరణగా నిలుస్తుందన్నారు. ఆయనకు జీవితాంతం బ్రతకటానికి సరిపడేంత డబ్బు, ఆస్తులు, పిల్లలు విదేశాల్లో ఉన్నా ఆయన బాగోగులు చూసుకునేవారు ఒక్కరు దగ్గర లేక ఒంటరితనంతో ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. ఇది అత్యంత బాధకలిగించిందని చెప్పారు. ఒంటరితనం వల్ల ఇబ్బందులుపడుతున్న పెద్ద వయసువారికి కల్చరల్ సెంటర్లు ఒక మార్గం చూపించాలని ఆయన ఆకాంక్షించారు. కల్చరల్ సెంటర్‌లో ఉన్న వాతావరణం, వసతులు బాగున్నాయన్నారు. కల్చరల్ సెంటర్‌కు మౌలిక సదుపాయల కల్పన కోసం జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి అవసరమున్న మేరకు వసతులు కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఆత్మీయ కథానాయకుడు, పద్మవిభూషణ్ చిరంజీవికి హార్దిక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అటవీశాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ, పద్మవిభూషణ్ చిరంజీవి, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే దానం నాగేందర్ మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి, మాజీమంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బిజినెస్

హ్యుందాయ్ నుంచి అల్కజార్ ఫేస్‌లిఫ్ట్ వెర్షన్

న్యూఢిల్లీ : హ్యుందాయ్ మోటార్ ఇండియా అల్కజార్‌లో సరికొత్త ఫేస్‌లిఫ్ట్ వెర్షన్‌ను సెప్టెంబర్ 9న విడుదల చేయనున్నట్టు తెలిపింది. 1.5 టర్బో జీడీఐ పెట్రోల్, 1.5 యూ2 సీఆర్‌డీఐ డీజిల్ ఇంజిన్ వేరియంట్లలో అల్కజార్ ఫేస్‌లిఫ్ట్ లభించనుందని తెలిపింది. ఈ ఇంజిన్ గరిష్టంగా 158 బిహెచ్పీ విద్యుత్, 253 ఎన్‌ఎం టార్క్ వెలువరిస్తుందని పేర్కొంది. ఈ వాహనానికి ముందస్తు బుకింగ్‌లను స్వీకరిస్తున్నట్లు ఆ కంపెనీ వెల్లడించింది. రూ.25,000 చెల్లించి కొనుగోలుదార్లు కొత్త అల్కజార్‌ను బుక్ చేసుకోవచ్చని పేర్కొంది.

తప్పు పట్టకుండా ఉక్కుకు లోహపు పూత

మార్కెట్‌లోకి ఏఎం, పీఎస్ ఆప్టిగల్



హైదరాబాద్ : ప్రముఖ ఉక్కు తయారీదారులైన ఆర్సెలార్ మిట్టల్ (ఎఎం), నిప్పన్ స్టీల్ (ఎఎస్) సంస్థలు సంయుక్తగా కలర్ కోటెడ్ స్టీల్ బ్రాండ్ 'ఆప్టిగల్'ను ఆవిష్కరించాయి. జింక్, అల్యూమినియం, మెగ్నీషియం లోహ పూతతో దీన్ని అందుబాటులోకి తెచ్చినట్టు పేర్కొన్నాయి. ఈ హై-ఎండ్ వాల్యూ యాడెడ్ స్టీల్ 'ఆప్టిగల్' - ఆర్సెలర్ మిట్టల్ యూరోప్ పేటెంట్ బ్రాండ్ అని తెలిపాయి. దేశంలో తొలిసారి ఎఎం, ఎన్ఎస్ ఇండియా ద్వారా పంపిణీ చేయబోతున్నట్లు ఆ సంస్థ సీఈఓ దిలీప్ ఊమెన్ తెలిపారు. మేక్ ఇన్ ఇండియా నినాదానికి అనుగుణంగా దీనిని తీర్చిదిద్దామన్నారు.

హైదరాబాద్ కనెక్ట్ నిర్వహించిన పేఓనీర్

హైదరాబాద్ : ఫైనాన్షియల్ టెక్నాలజీ కంపెనీ పేఓనీర్ తన ఐదో పేఓనీర్ వీఐపీ కనెక్ట్‌ను హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో నిర్వహించింది. ప్రపంచంలోని చిన్న, మధ్యతరహా వ్యాపార సంస్థలు (ఎస్‌ఎంబిలు) లావాదేవీలు నడపడానికి, వ్యాపారం చేయడానికి, అంతర్జాతీయంగా ఎదిగేందుకు తాము మద్దతునిస్తున్నట్లు పేఓనీర్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ గౌరవ్ సిసోడియా తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న 60 మంది తమ నెట్‌వర్క్ పెంచుకుని, ఇన్‌సైట్లు పొంది, తమ వ్యాపారాలను అంతర్జాతీయంగా విస్తరించేందుకు వ్యూహాలు నేర్చుకున్నారన్నారు. గ్లోబల్ స్టార్టప్‌ల్లో హైదరాబాద్ 19వ స్థానంలో నిలిచిందన్నారు.

జిఆర్ఎం ఓవర్సీస్‌కు సల్మాన్ ప్రచారం



న్యూఢిల్లీ : ఎఫ్ఎంసీజీ కంపెనీ జీఆర్ఎం ఓవర్సీస్ లిమిటెడ్ తన బ్రాండ్ అంబాసిడర్‌గా బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్‌ను నియమించుకున్నట్టు ఆ సంస్థ ప్రకటించింది. తమ సంస్థ 10ఎక్స్ బాస్మతి రైస్, 10ఎక్స్ వీట్ ఫ్లోర్ (అట్టా)కు సల్మాన్ ప్రచారం కల్పించనున్నారని జీఆర్ఎం ఓవర్సీస్ ఎండీ అతుల్ గార్గ్ తెలిపారు. సల్మాన్‌తో ప్రచారం దేశంలోని అన్ని ప్రాంతాల వరకు, మధ్యప్రాచ్యం వంటి కీలక ఎగుమతి మార్కెట్‌లను మరింత అందిపుచ్చుకోవడానికి వీలుందన్నారు.

గ్రేసియాతో పటిష్టంగా మిరప మొలకలు

గోద్రెజ్ ఆగ్రోవెట్ వెల్లడి

హైదరాబాద్ : గ్రేసియాతో శుద్ధి చేసిన మిరప మొలకలు పటిష్టంగా, ఆరోగ్యంగా ఉంటాయని గోద్రెజ్ ఆగ్రోవెట్ క్రాప్ ప్రొటెక్షన్ బిజినెస్ సీఈఓ రాజవేలు ఎస్‌కె తెలిపారు. సరైన సమయంలో, సరైన పరిమాణంలో గ్రేసియాను వినియోగించటం ద్వారా, నర్సరీ యజమానులు పొలాల్లో మెరుగైన నాట్ల కోసం తెగులు లేని నారును పొందవచ్చన్నారు. దేశం మొత్తం సుగంధ ద్రవ్యాల ఎగుమతుల్లో 42శాతంగా ఉన్న మిరప పంటలు రైతుల అభ్యున్నతిలో కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. గ్రేసియా తెగుళ్ళ, పర్యావరణ ఒత్తిళ్లకు మరింత నిరోధకతను కలిగి ఉన్న ఆరోగ్యకరమైన నారును అందిస్తుందన్నారు.

జడ్చర్లలో పిడిలైట్ రాఫ్ కొత్త తయారీ కేంద్రం

హైదరాబాద్ : పిడిలైట్ ఇండస్ట్రీస్ నుండి ప్రముఖ టైల్స్ ఎడ్హెసివ్ బ్రాండ్ అయిన రాఫ్ హైదరాబాద్ సమీపంలోని జడ్చర్లలో తమ కొత్త తయారీ కేంద్రాన్ని ప్రారంభించినట్టు తెలిపింది. దీంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఈశాన్య కర్నాటక మార్కెట్లలో అధిక నాణ్యత గల టైల్ ఎడ్హెసివ్ ఉత్పత్తుల కోసం పెరుగుతున్న డిమాండ్లను తీర్చడానికి ఈ సదుపాయం తోడ్పడనుందని పిడిలైట్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ భరత్ పూరి తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రీమియం ఉత్పత్తులకు ఉన్న డిమాండ్‌ను అందిపుచ్చుకోనున్నామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

సామ్‌సంగ్ నుంచి పది ఏఐ శ్రేణి వాషింగ్ మెషీన్‌లు

గూర్‌గావ్ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్ ప్రస్తుత పండుగ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని కొత్తగా ఏఐ ఆధారిత 10 రకాల వాషింగ్ మెషీన్‌లను విడుదల చేసినట్లు ప్రకటించింది. ఈ నెలాఖరులో విడుదల చేయబోతున్న దాని రాబోయే ఫ్రంట్-లోడ్ ఎఐ పవర్డ్ వాషింగ్ మెషీన్ కోసం ఇటీవల టీజర్‌ను విడుదల చేసినట్లు పేర్కొంది. అద్భుతమైన మేడ్ ఇన్ ఇండియా శ్రేణి దేశీయ లాండ్రీ మార్కెట్‌లో గేమ్ ఛేంజర్‌గా ఉంటుందని భావిస్తున్నామని ఆ సంస్థ పేర్కొంది.

ఆపరేషన్ హైడ్రా

- దూకుడుగా అక్రమ నిర్మాణాల కూల్చివేతలు
- వణికిపోతున్న రియల్టర్లు, అక్రమార్కులు
- చిన్న, మధ్యతరగతిపైనా కొరడా !
- సత్ఫలితాలిచ్చేనా ?

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

హైడ్రా...హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్..రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సంస్థ. ప్రభుత్వ చెరువులు, నాళాలు, రోడ్లు, ప్రభుత్వ ఆస్తుల సంరక్షణే లక్ష్యంగా రేవంత్ ప్రభుత్వం రంగంలోకి తీసుకొచ్చిన వ్యవస్థ. దీనికి సీనియర్ ఐపీఎస్ అధికారి ఏవీ రంగనాథ్‌ను కమిషనర్‌గా సర్కారు నియమించింది. అసెంబ్లీలో సుదీర్ఘంగా చర్చించిన అనంతరం చట్టం రూపంలో బయటకొచ్చిన ఈ హైడ్రా ఇప్పుడు హైదరాబాద్ రాజధానితోపాటు హెచ్‌ఎండీఏ పరిధిలోనూ సంచలనాలను సృష్టిస్తున్నది. ఏండ్లుగా అక్రమార్కులు, కబ్జాదారుల చెరలో చిక్కుకున్న చెరువులు, నాళాలు, ప్రభుత్వ ఆస్తులకు రక్షణ కవచంగా హైడ్రా అడుగులేస్తున్నది. వీరు, వారు కాదు ఎవరైనా ఈ చట్టాన్ని ఉల్లంఘిస్తే కొరడా తప్పదని ఆ సంస్థ చర్యలే స్పష్టం చేస్తున్నాయి. వచ్చిరాగానే దూకుడును ప్రదర్శిస్తున్నది. చిన్న , పెద్దా అని లేకుండా వేగంగా చర్యలు తీసుకుంటున్నది. చెరువులు, నాళాలను ఆక్రమించినా, బఫర్ జోన్‌ను అతిక్రమించి భవనాలు కట్టినా హైడ్రా నుంచి తప్పించుకోలేరని కమిషనర్ రంగనాథ్ అంటున్నారు. ఆయన గ్రేటర్ హైదరాబాద్, హెచ్‌ఎండీఏ పరిధిలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఇప్పటికే ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, రియల్టర్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న హైడ్రా, రానురాను తన విశ్వరూపాన్ని ప్రదర్శించే అవకాశం లేకపోలేదని సమాచారం. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, రెవెన్యూ పోలీసు అధికారుల సమన్వయంతో హైడ్రా పనిచేస్తున్నది. ఇప్పటికే గండిపేట, మణికొండ, అమీన్‌పూర్, ఉప్పల్, రాజేంద్రనగర్, శివరాంపల్లి, శాస్త్రిపురం, గురు బ్రహ్మనగర్, మదీనగూడ, గాజులరామారం తదితర ప్రాంతాల్లో హైడ్రా కొరడా ఝులిపించింది. అక్రమంగా నిర్మించిన భవనాలను ప్రత్యేకమైన భారీ యంత్రాలతో నేలమట్టం చేస్తున్నది. ఎఫ్‌టీఎల్ పరిధి దాటి చెరువుల్లో చేసిన నిర్మాణాలను కుప్పకూలుస్తున్నది. ఉన్నతస్థాయి ప్రజాప్రతినిధులను సైతం లెక్కచేయకుండా చట్టమే పరమావధిగా ముందుకు నడుస్తున్నది. అడ్డుతగిలిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, మహ్మద్ మెహబీన్‌పై కేసులు పెట్టింది. తద్వారా



అక్రమార్కులను వదిలేది లేదని స్పష్టం చేసింది.

శివారుల్లో..

రాజధాని శివారు ప్రాంతాల్లో గత 10 నుంచి 15 సంవత్సరాలుగా ఫాంహౌజ్ సంస్కృతి భారీగా పెరిగింది. వీటి నిర్మాణం కోసం పక్కనున్న సర్కారు భూమి, లేదా అసైన్డ్ భూములను తమలో కలిపేసుకున్న పలుకుబడి కలిగిన ఎంతో మంది పెద్దలు ఉన్నారు. అంతెందుకు శివారుల్లోని ప్రతి ఇంజినీరింగ్ కాలేజీలో అసైన్డ్ భూములను నిబంధనలకు విరుద్ధంగా కొనేసుకోవడం, ఎస్సీ, ఎస్టీలను బెదిరించడం, కొంత మొత్తం చెల్లించి కలిపేసుకోవడం జరిగాయి. ఇందులో పెద్దపెద్ద నేతల ప్రమేయం ఉందనేది కాదనలేని సత్యం. వీటిపై హైడ్రా ఏం చేస్తుందనేది వేచి చూడాల్సిందే.

జన్వాడ..

ఒకవైపు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుకు జన్వాడలో మార్గదర్శకాలకు విరుద్ధంగా ఫాంహౌజ్ ఉందనే ఆరోపణలు వస్తున్నాయి. వాటిని ఆయన ఖండించారు. తాను లీజుకు తీసుకున్నానని చెప్పారు. అయితే కేటీఆర్ భార్య శైలీమ పేరుతో ఆ ఫాంహౌజ్ ఉందనే ధ్రువపత్రాలు సోషల్‌మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. మరోవైపు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీద విమర్శలు వచ్చాయి. దానికి ఆయన స్పందిస్తూ తన ఇల్లు నిబంధనలకు విరుద్ధంగా నిర్మించలేదన్నారు .అది నా ఇల్లు కాదనీ, తన కుమారుడిదనీ, అయినా నిబంధనలకు వ్యతిరేకంగా ఉంటే హైడ్రా అధికారులు కూల్చేయవచ్చని స్పష్టం చేశారు. హైడ్రా వ్యవహరిస్తున్న తీరుతో ఎమ్మెల్యే దానం నాగేందర్ అసహనానికి గురయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోతానని చెబుతున్నారు. వీరే కాకుండా అంతర్గతంగా హైడ్రా కూల్చివేతల విషయంలో సీఎం రేవంత్‌ను కలిసేందుకు సెలబ్రిటీలు, బడా పారిశ్రామిక వేత్తలు ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. సీఎం అపాయింట్‌మెంట్ కోసం ప్రతిరోజూ ప్రయత్నం చేస్తున్నారని సమాచారం. కాగా హైడ్రా విషయంలో తామేమీ చేయలేమనే సంకేతాలను సీఎం పేషీ పంపుతున్నట్టు విశ్వసనీయ సమాచారం.

ప్రత్యేక వ్యవస్థ

హైడ్రాను ప్రత్యేక వ్యవస్థగా తీర్చిదిద్దే ఆలోచనతోనే సర్కారు చట్టం చేసింది. 2500 చదరపు కిలోమీటర్ల పరిధిలో హైడ్రా పనిచేస్తున్నది. 3500 మంది సిబ్బందిని సర్కారు కేటాయించింది. 72 ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి. భారీ యంత్రాలను హైడ్రాకు సమకూర్చింది. 259 మంది అధికారులు బాధ్యతల్లో ఉన్నారు. త్వరలో హైడ్రా కోసం ప్రత్యేక పోలీస్‌స్టేషన్ ఏర్పాటయ్యే అవకాశాలు ఉన్నాయి. రాజధానితోపాటు చుట్టుతా దాదాపు 1728 చెరువులు ఉండాలి. ఇందులో 1000 చెరువులు మాయమయ్యాయి. కేవలం 700 చెరువులు మిగిలాయి. వీటిపై హైడ్రా ప్రత్యేక దృష్టిని సారించింది. నాళాలు, చెరువుల ఆక్రమణకు సంబంధించి సుప్రంకోర్టు తీర్పులు సైతం ఉన్న సంగతి తెలిసిందే. పరిపాలనా సంస్కరణలో భాగంగా రేవంత్ సర్కారు హైడ్రాను ఉనికిలోకి తెచ్చింది.

ఇబ్బందుల్లో పేద, మధ్యతరగతి

హైడ్రా లక్ష్యం సరైనదే అయినా పేదలు, మధ్యతరగతి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్ర రాజధానితోపాటు శివారు ప్రాంతాల్లో ఉపాధి, ఇతర అవసరాల కోసం నగరానికి వలస వచ్చిన పేదలు, మధ్యతరగతి ప్రజలు భారీగానే ఉన్నారు. అక్కడక్కడా ఇండ్లు కట్టుకుని పనిచేసుకుంటూ బతుకు తున్నారు. ప్రస్తుతం హైడ్రా దూకుడు మూలంగా చిన్న, మధ్యతరగతి ప్రజలే ఎక్కువగా ఇబ్బంది పడే పరిస్థితి ఎదురవుతున్నది. వీరి పట్ల కఠినంగా వ్యవహరించొద్దని ఫోరం ఫర్ గుడ్ గవర్నెస్ అధ్యక్షులు పద్మనాభయ్య సర్కారుకు విజ్ఞప్తి చేశారు. చట్టం మంచిదేననీ, అక్రమంగా వ్యవహరించిన బడా బిల్డర్లు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల పట్ల కొరడా వేయాల్సిందేనని అంటున్నారు. చెరువులు, నాళాలు, రోడ్లను ఆక్రమించిన వారిని వదలకూడదని విజ్ఞప్తి చేశారు. ఇదిలావుండా గతంలో జీహెచ్ఎంసీ, హెచ్‌ఎండీఏ అనుమతులిచ్చిన ఇండ్లనూ కూల్చివేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. దీనిపై సర్కారు అప్రమత్తంగా ఉండాలనే డిమాండ్ ముందుకు వస్తున్నది.

'ఫార్మా'లో మరో ప్రమాదం

విశాఖ కలెక్టరేట్ : అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో ఘోర ప్రమాదం జరిగి 48 గంటల గడవక ముందే ఇదే జిల్లాలోని పరవాడ మండలంలోని జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీలో మరో ప్రమాదం గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత చోటుచేసుకుంది. సినర్జిన్ యాక్టివ్ ఇన్‌గ్రేడియంట్స్ ఫార్మా కంపెనీలో రియాక్టర్ కెమికల్ లీకవడంతో మంటల వ్యాపించి నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ముగ్గురు, విజయనగరం జిల్లాకు చెందిన ఒకరు తీవ్ర ఉన్నాయి. వారిని విశాఖలోని ఇండస్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. తోటి కార్మికుల కథనం ప్రకారం... సినర్జిన్ యాక్టివ్ ఇన్‌గ్రేడియంట్స్ ఫార్మా కంపెనీలోని బి-బ్లాక్ ఒకటో ఫ్లోర్‌లో ఆరు కిలోలీటర్ల సామర్థ్యం కలిగిన రియాక్టర్ ఉంది. దీనిలోకి కెమికల్ నింపి ఛార్జింగ్ చేస్తున్నప్పుడు మ్యాన్‌హోల్ నుంచి కెమికల్ లీకవడంతో మంటల వ్యాపించాయి. ఆ సమయంలో సి-షిఫ్టు డ్యూటీలో ఉన్న షిఫ్టు ఇన్‌ఛార్జి విజయనగరానికి చెందిన కొవ్వాడ సూర్యనారాయణ, జార్ఖండ్‌కు చెందిన హెల్పర్లు రొయా అంగారియా, వైబన్ కొరా, లాల్‌సింగ్ తీవ్రంగా గాయపడ్డారు. వారిలో కోరాకు 90 శాతం గాయాలవ్వడంతో ఆయన పరిస్థితి విషమంగా ఉంది. ప్రస్తుతం వీరంతా విశాఖలోని ఇండస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వరుస ప్రమాదాల నేపథ్యంలో ఫార్మా కార్మికులు, ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. సినర్జిన్ యాక్టివ్ ఇన్‌గ్రేడియంట్స్ కంపెనీ ఎటువంటి భద్రతా చర్యలూ కార్మికులకు కల్పించకపోవడమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు తెలిపారు. పరవాడ సిఐ బాలసూర్యారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని అనకాపల్లి ఎంపీ సిఎం.రమేష్, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్‌పి దీపిక, పెందుర్తి ఎమ్మెల్యే పంచర్ల రమేష్ బాబు పరిశీలించారు.


ఇండస్ ఆస్పత్రిలో క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న హోం మంత్రి అనిత

బాధితులకు మెరుగైన చికిత్స : హోం మంత్రి అనిత

ప్రమాదంలో గాయపడి ఇండస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, అనకాపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవి పరామర్శించారు. బాధితులతో మాట్లాడి వారిలో ధైర్యం నింపే ప్రయత్నం చేశారు. ప్రమాదం ఎలా జరిగిందో వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారికి అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మీడియాతో మాట్లాడుతూ బాధితులకు మెరుగైన చికిత్స అందిస్తామన్నారు. పరిశ్రమల నిర్వాహకులతో, అధికారులతో త్వరలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని చెప్పారు.

సమగ్ర విచారణ జరపాలి : సీపీఐ(ఎం), సీఐటీయూ

ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి, కంపెనీ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, కోశాధికారి వివి.శ్రీనివాస రావులతో కలిసి ఘటనాస్థలాన్ని సందర్శించారు. లోకనాథం మాట్లాడుతూ గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. 24 గంటల్లో రెండు ఘటనలు జరిగాయంటే కంపెనీల యాజమాన్యాలు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరి స్తున్నాయో అర్థమవుతోందని తెలిపారు. భద్రతా ప్రమాణాలు పాటించడంలో ఫార్మా కంపెనీలు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు.

అమెరికా అధ్యక్ష నామినేషన్‌ను ఆమోదించిన కమలాహారిస్

వాషింగ్టన్ : అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ డెమోక్రటిక్ పార్టీ 2024 అధ్యక్ష నామినేషన్‌ను అధికారికంగా ఆమోదించారు. వయోభారంతో వచ్చిన సమస్యల కారణంగా సతమతమవుతున్న ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ సొంత పార్టీ నుంచి వ్యతిరేకత రావడంతో పోటీ నుంచి తప్పుకుని, కమలా హారిస్‌ను తన వారసురాలిగా ప్రకటించిన సంగతి తెలిసిందే. కమలా హారిస్ గెలుపొందితే.. అమెరికా అధ్యక్షురాలిగా ఎన్నికైన మొదటి మహిళ కానున్నారు.



చికాగోలో సోమవారం నుండి ప్రారంభమైన డెమొక్రాటిక్ నేషనల్ కన్వెన్షన్ గురువారంతో ముగిసింది. పార్టీ ప్రతినిధులు, అధికారుల హర్షధ్వానాల మధ్య .. పార్టీ, లింగం, జాతితో సంబంధం లేకుండా ప్రతి అమెరికన్ తరపున అమెరికా అధ్యక్షురాలిగా మీ నామినేషన్‌ను తాను ఆమోదిస్తున్నానని అన్నారు. అమెరికన్లందరినీ ఏకం చేస్తానని, అమెరికా భవిష్యత్తు కోసం పోరాడతానని ప్రతిజ్ఞ చేశారు.

ఈ ఎన్నికలు.. మన దేశానికి గతంలోని ద్వేషం, విభజన యుద్ధాలను అధిగమించడానికి అమూల్యమైన, అనూహ్యమైన అవకాశాలను అందించాయని అన్నారు. ఏదైనా పార్టీ లేదా వర్గానికి చెందిన సభ్యులుగా కాకుండా అమెరికన్లుగా కొత్త మార్గాన్ని రూపొందించడానికి ఒక అవకాశమని హారిస్ అన్నారు.

తన ప్రత్యర్థి, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి ట్రంప్‌పై విరుచుకుపడ్డారు. దేశాన్ని వెనక్కు తీసుకువెళ్లేందుకు యత్నిస్తున్నారని అన్నారు.

చంద్రుని మట్టి నుంచి నీరు

ఫలించిన చైనా పరిశోధన





బీజింగ్ : మానవ ఆవాసానికి చంద్ర మండలంపై వాతావారణం అనుకూలంగా ఉందా లేదా అన్న ప్రశ్నకు సమాధానం వెతికే క్రమంలో చైనా ఒక ముందడుగు వేసింది. చంద్రుని మట్టి నుంచి నీరు తీయడంలో పరిశోధన ఫలించింది. చంద్రుని నుంచి సేకరించిన ఒక టన్ను మట్టి నుంచి 76 లీటర్ల నీటిని ఉత్పత్తి చేశారు.భవిష్యత్తులో చంద్రునిపై పరిశోధనా కేంద్రం, అంతరిక్ష కేంద్రం నిర్మించేందుకు ఈ పరిశోధనలు కొత్త మార్గాన్ని తెరిచాయని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. 2020 చంద్ర మిషన్‌లో భాగంగా చైనా ఈ సరికొత్త ఆవిష్కరణ చేసింది. చంద్రుని నేలలోని ఖనిజాలతో ఉండే హైడ్రోజన్‌ను అధిక ఉష్ణోగ్రతల వద్ద వేడి చేసి ఆవిరిగా మార్చడం ద్వారా నీరు ఉత్పత్తి అయింది. నీటిని తీసిన తరువాత ఆ మట్టిని ఇటుకల తయారీకి ఉపయోగించవచ్చని పరిశోధకులు తెలిపారు.

కుర్స్క్ ప్రాంతంపై ఉక్రేనియన్ దాడి 'తప్పు'

నాటో సభ్యదేశం

రష్యాలోని కుర్స్క్ ప్రాంతంలోకి ఉక్రెయిన్ చొరబాటును హంగేరీ ఆమోదించదు. ఎందుకంటే బుడాపెస్ట్‌లోని ప్రభుత్వం "శాంతికి అనుకూలమైనది" అని హంగేరియన్ ప్రధాన మంత్రి కార్యాలయ అధిపతి గెర్గెలీ గులియాస్ చెప్పాడు. గురువారం మీడియాతో మాట్లాడున్న సందర్భంగా కొనసాగుతున్న ఉక్రేనియన్ దాడిపై హంగేరియన్ అధికారి గులియాస్ అలా వ్యాఖ్యానించాడు. "ఉక్రెయిన్ డిఫెండింగ్ మాత్రమే కాదు, దాడి కూడా చేస్తోంది. మేము కాల్పుల విరమణ, శాంతిని కోరుకుంటున్నాము" అని గులియాస్ అన్నాడు. మాస్కో, కీవ్‌ల మధ్య వివాదం దౌత్యపరమైన పరిష్కారానికి మార్గంలో ఎటువంటి అడ్డంకినైనా హంగరీ అంగీకరించదని ఆయన చెప్పాడు.

కుర్స్క్ ప్రాంతంలోకి ఉక్రేనియన్ చొరబాటుపై గులియాస్ ప్రకటన యూరోపియన్ యూనియన్ మరియు నాటోలోని ఇతర అధికారుల వైఖరికి పూర్తి విరుద్ధంగా ఉంది. నాటో కూటమి అగ్ర దౌత్యవేత్త, జోసెప్ బోరెల్, అతను గత వారం ఉక్రేనియన్ విదేశాంగ మంత్రి డిమిత్రి కులేబాతో సమావేశమైనప్పుడు "ఉక్రేనియన్ ప్రజల పోరాటానికి యూరోపియన్ యూనియన్ పూర్తి మద్దతును పునరుద్ఘాటించారు" అని చెప్పాడు. "ఉక్రెయిన్‌కు ఆత్మరక్షణ హక్కు ఉంది, వారు కుర్స్క్‌లో తమ ఆపరేషన్ చేయగలరని స్పష్టంగా ఉంది" అని ఫిన్నిష్ ప్రధాన మంత్రి పెట్టెరి ఓర్పో నొక్కిచెప్పాడు. అయితే ఎస్టోనియన్ ప్రధాన మంత్రి క్రిస్టెన్ మిచల్ దాడిలో పాల్గొన్న ఉక్రేనియన్ దళాలకు శుభాకాంక్షలు తెలిపాడు.

ఫిబ్రవరి 2022లో రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధం తీవ్రతరం అయినప్పటి నుంచి హంగేరీ తటస్థ వైఖరిని అవలంబించింది. ఇది కీవ్‌కు మానవతా సహాయం అందించింది. కానీ



ఆయుధాలను పంపడానికి నిరాకరించింది. ఇతర యూరోపియన్ యూనియన్ దేశాలను తన భూభాగం ద్వారా సైనిక సామాగ్రిని రవాణా చేయడానికి లేదా ఉక్రేనియన్ దళాలకు శిక్షణ ఇవ్వడానికి నిరాకరించింది. వాషింగ్టన్, బ్రస్సెల్స్ నుంచి బలమైన ఒత్తిడి ఉన్నప్పటికీ విక్టర్ ఓర్బన్ ప్రభుత్వం యూరోపియన్ యూనియన్ ఆంక్షలను విమర్శించింది. అవి రష్యా కంటే కూటమిని ఎక్కువగా దెబ్బతీశాయని విక్టర్ ఓర్బన్ వాదించాడు. మాస్కో వివాదం అంతటా కీవ్‌తో సంభాషణకు సంసిద్ధతను పదేపదే వినిపించింది. అయితే, కుర్స్క్ ప్రాంతంలోకి చొరబాటు ప్రారంభించిన కొద్దిసేపటికే ఉక్రెయిన్‌తో చర్చల గురించి మాట్లాడలేమని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నొక్కి చెప్పాడు.

ఆగస్టు 6న కుర్స్క్ ప్రాంతంలో చొరబాటు ప్రారంభమైనప్పటి నుంచి ఉక్రెయిన్ ఇప్పటికే 4,700 మంది సైనికులను, 68 ట్యాంకులు, 53 సాయుధ సిబ్బంది క్యారియర్‌లతో సహా అనేక వందల యూనిట్ల సైనిక పరికరాలను కోల్పోయిందని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ గురువారం తెలిపింది.

ప్రపంచ సమాచారం

ఈజిప్ట్ హమాస్-ఇజ్రాయిల్ కాల్పుల విరమణ చర్చల కొత్త రౌండ్‌ను నిర్వహిస్తోంది

రాయిటర్స్

గాజా కాల్పుల విరమణ ప్రతిపాదనపై చర్చల కోసం ఈజిప్ట్ అమెరికా, ఇజ్రాయిల్ ప్రతినిధులకు ఆతిథ్యం ఇస్తోందని రాయిటర్స్ గురువారం నివేదించింది. గాజాలో పాలస్తీనా మిలిటెంట్ సంస్థ హమాస్‌ను నిర్మూలించేందుకు ఇజ్రాయిల్ అక్టోబర్ నుంచి పోరాడుతోంది. చర్చలు గురువారంనాడు ఈజిప్ట్ రాజధాని కైరోలో ప్రారంభమయ్యాయి. మే నుంచి ఇజ్రాయిల్ దళాలు ఆక్రమించిన గాజాతో ఈజిప్ట్ సరిహద్దు వెంబడి భద్రత కల్పించే ప్రణాళికలపై అధికారులు రాజీ కోరుతున్నారు. గాజా రెండు ఈజిప్టు భద్రతా వనరులను ఉదహరించింది. "తాకట్టు మార్పిడి ఒప్పందం కోసం చర్చలను కొనసాగించే లక్ష్యంతో ఇజ్రాయిల్ భద్రతా ప్రతినిధి బృందం కైరోకు చేరుకుంది" అని ఇజ్రాయిల్ స్టేట్ బ్రాడ్‌కాస్టర్ కాన్ కూడా నివేదించింది.

అక్టోబర్‌లో దక్షిణ ఇజ్రాయిల్‌లోకి హమాస్ ఆకస్మిక చొరబాటును ప్రారంభించిన తర్వాత శత్రుత్వాలు చెలరేగాయి. ఆ ఘర్షణలో దాదాపు 1,200 మంది ఇజ్రాయిలీ పౌరులు మరణించారు. హమాస్ మిలిటెంట్లు మరో 200 మందిని బందీలుగా పట్టుకున్నారు. పాలస్తీనా ఆరోగ్య అధికారులు ప్రకారం గాజాలో ఇజ్రాయిల్ సైన్యం క్రూరమైన ప్రతిస్పందన ఫలితంగా 40,000 మందికి పైగా పాలస్తీనా ప్రజలు



మరణించారు. 92,000 మందికి పైగా గాయపడ్డారు. పోరాడుతున్న వర్గాలను ఒక సంధి ఒప్పందానికి తీసుకు రావడానికి, ఇజ్రాయిల్ బందీలు, పాలస్తీనా ఖైదీలను విడుదల చేయడానికి చర్చలలో ఈజిప్టు, యునైటెడ్ స్టేట్స్, ఖతార్‌లతో పాటు నెలల తరబడి మధ్యవర్తిగా పనిచేసింది.

గత వారం ఖతార్ రాజధాని దోహాలో చర్చలు ముగిసిన తర్వాత కొత్త రౌండ్ సమావేశాలు రెండు రోజుల పాటు కొనసాగుతాయి. ఇక్కడ అమెరికా పది నెలల సంఘర్షణను ముగించడానికి "చివరి వంతెన ప్రతిపాదన" అని పిలిచింది. పశ్చిమ జెరూసలేంలో సోమవారం ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో గంటల తరబడి చర్చలు జరిపిన తర్వాత ఇజ్రాయిల్ నాయకుడు ఈ ప్రతిపాదనను ఆమోదించినట్టు విదేశాంగ కార్యదర్శి ఆంటోనీ బ్లింకెన్ ప్రకటించాడు. చర్చలకు హాజరుకాని హమాస్, "నెట్జారిమ్ జంక్షన్, రఫా క్రాసింగ్, ఫిలడెల్ఫీ కారిడార్ ఆక్రమణను కొనసాగించాలని అతని పట్టుదలతో సహా" నెతన్యాహు షరతులకు అనుగుణంగా ఉందని పేర్కొంటూ ప్రణాళికను తిరస్కరించింది.

ఈజిప్ట్, గాజాలను కలిపే ఫిలడెల్ఫీ కారిడార్ నుంచి ఇజ్రాయిల్ దళాలు ఉపసంహరించుకోవాలని కైరో, హమాస్ డిమాండ్ చేస్తున్నాయి. ఇజ్రాయిల్ ఉత్తర ఆఫ్రికా దేశం నుంచి ఆయుధాలను అక్రమంగా రవాణా చేయడానికి మిలిటెంట్ గ్రూప్ ఉపయోగిస్తుందని పేర్కొన్న కీలక మార్గం. ముట్టడి చేయబడిన పాలస్తీనియన్ గాజా ఎన్‌క్లేవ్‌లోకి మానవతా సహాయం అందించటానికి ఇది ఒక ప్రధాన ప్రవేశ స్థానం. స్మగ్లింగ్ మార్గాలను మూసివేసినట్టు ఈజిప్టు ప్రభుత్వం చెబుతోంది. అయితే నెతన్యాహు అక్కడ దళాలను కొనసాగించాలని పట్టుపడుతున్నాడు. శాంతి చర్చలలో పాల్గొన్న ఒక అనామక దౌత్యవేత్తను ఉదహరిస్తూ, మధ్యవర్తులు "నెతన్యాహుపై ఒత్తిడి తీసుకువస్తేనే ఒక ఒప్పందానికి రావటానికి కుదురు తుందని గురువారం ఆలస్యంగా కాన్ న్యూస్ పేర్కొంది.



నవతెలంగాణ - హస్తినాపురం

ఎల్బీనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కుమారుడు గౌతమ్ - సంజనల వివాహ రిసెప్షన్‌లో హస్తినాపురం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఆందోజ్ సత్యం చారి, వర్కింగ్ ప్రెసిడెంట్ మే రెడ్డి ఉదయ్ కుమార్ రెడ్డిలు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

సీజనల్ వ్యాధుల నివారణకు సమన్వయంతో పనిచేయాలి

కమిషనర్ ఆమ్రపాలి కాట

నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో సీజనల్ వ్యాధుల నివారణపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారుల సమన్వయంతో ముందుకు పోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట అధికారులను ఆదేశించారు. శుక్రవారం అడిషనల్, జోనల్ కమిషనర్‌లతో కమిషనర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల కేసుల రికార్డు జీహెచ్ఎంసీ జిల్లా వైద్య అధికారులు పూర్తి వివరాలు తెలుసుకునేందుకు సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి కేసుల సమాచారం తెలుసుకోవాలన్నారు. కేసుల వివరాలతో నివారణకు సులభం అవుతుందన్నారు. ప్రతి వారం జీహెచ్ఎంసీ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని అడిషనల్ కమిషనర్‌ను ఆదేశించారు. శానిటేషన్ నిర్వహణలో భాగంగా రాంకీ వాహనాలు సకాలంలో వచ్చి చెత్తను తీసుకొనిపోయే విధంగా జిపిఎస్ సిస్టమ్ ద్వారా పరిశీలన చేయాలని జోనల్ కమిషనర్‌లను ఆదేశించారు. అదే విధంగా కార్మికుల హాజరు మూడు దశల్లో తీసుకుంటున్నందున హాజరు తీసుకునే పాయింట్‌ను కార్మికులకు తెలియజేయాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.



రోడ్డు పనులు ప్రారంభించిన మేయర్



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉన్న 20వ డివిజన్ అన్నపూర్ణ నగర్ కాలనీ, శ్రీ విద్యా టౌన్ షిప్ కాలనీలల్లో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డితో కలిసి మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ.ఈ.సాయిరాం, పలు కాలనీల ప్రజలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహిళా బాధితులు నిర్భయంగా ఫిర్యాదు చేయండి

- రాచకొండ సీపీ సుధీర్ బాబు

నవతెలంగాణ-హయత్‌నగర్

మహిళా బాధితులు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని రాచకొండ సీపీ సధీర్ బాబు అన్నారు. రాచకొండ ఉమెన్ సేఫ్టీ వింగ్, షీ టీమ్స్ ఆధ్వర్యంలో ఈవ్ టీజర్లకు శుక్రవారం రాచకొండ క్యాంప్ కార్యాలయంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 రోజుల్లో 122 మంది పోకిరీలను రాచకొండ షీ టీమ్స్ పట్టుకున్నారని తెలిపారు. బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, స్కూళ్లు, కాలేజీలు, కూరగాయల మార్కెట్లు, బహిరంగ ప్రదేశాలలో మఫ్టీలో తిరుగుతూ షీ టీమ్స్ డెకాయ్ ఆపరేషన్లు చేస్తున్నారని వివరించారు. బాలికలను, మహిళలను వెంబడించే, వేధించే పోకిరీల చేష్టలను సాక్ష్యాధారాలతో సహా పట్టుకొని న్యాయస్థానంలో హాజరు పరుస్తూ.. వారికి వారి తల్లీదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇస్తున్నారని అన్నారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో మహిళలను, యువతులను వేధింపులకు గురిచేస్తున్న 122 (మేజర్స్-73, మైనర్స్-49) మందిని షీ టీమ్స్ పట్టుకున్నారని వెల్లడించారు. వారికి ఎల్బీనగర్ సీపీ క్యాంప్ కార్యాలయంలో (ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆఫీసు)లో, కౌన్సిలర్స్‌తో వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించినట్టు పేర్కొన్నారు. ఈ నెల 1వ తేదీ నుండి 15వరకు 169 ఫిర్యాదులు అందినట్టు రాచకొండ విమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ టి. ఉషా విశ్వనాథ్గారు తెలిపారు. ఫిర్యాదుల పై విచారణ చేపట్టి దర్యాప్తు పూర్తి చేశామన్నారు.

అందిన ఫిర్యాదులలో..

ఫోన్ల ద్వారా వేధించినవి-24, సోషల్ మీడియా యాప్స్ ద్వారా వేధించినవి - 37, నేరుగా వేధించినవి

వేదించినవి- 108, వాటిలో క్రిమినల్ కేసులు-13 , పెట్టి కేసులు- 52, 68 మందికి కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు.

అవగాహన కార్యక్రమాలు..

ఈ నెల 1వ తేది నుండి 15 వరకు షీ టీమ్స్ రాచకొండ మొత్తం 55 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, దాదాపు 9335 మందికి మహిళా చట్టాలు, వారి యొక్క హక్కులు, నేరాలు జాగ్రత్తలపై వివరించి..అవగాహన కల్పించారు.

మెట్రో-రైల్ డెకాయ్ ఆపరేషన్స్..

రాచకొండ షీ టీమ్స్ మెట్రో రైళ్లలో డెకాయ్ ఆపరేషన్స్ నిర్వహించి, మహిళా కంపార్ట్మెంట్‌లోకి వెళ్ళి ప్రయాణిస్తున్న ఏడుగురిని పట్టుకుని మెట్రో స్టేషన్ అధికారుల ద్వారా ఫైన్ వేయించామన్నారు. ఆడవారికి ఎదురయ్యే భౌతిక పరమైన మరియు సామాజిక మాద్యమాల ద్వారా జరిగే దాడులు, లైంగిక వేధింపులు, ప్రయాణ సమయాల్లో వేధింపులు వంటి ఇబ్బందుల నుంచి రక్షించేందుకు రాచకొండ షీ టీం ఇరవై నాలుగు గంటలూ అందుబాటులో ఉంటున్నారని పేర్కొన్నారు. పురుషులు, సాటి ఆడవారి పట్ల బాధ్యతగా, మర్యాదగా నడుచుకోవాలని, వారికి అండగా నిలవాలని, పలు రకాల అవసరాలతో ఇంటి నుంచి బయటకు వచ్చే స్త్రీలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకూడదన్నారు. స్త్రీలను గౌరవించడం తమ వ్యక్తిత్వంలో భాగం కావాలని, ఆడవారిని ఇబ్బందులు పెట్టే వారిని ఉపేక్షించేది లేదని, అటువంటి వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళలు వేధింపులకు గురి అయినప్పుడు వెంటనే షీ టీమ్స్‌ని, రాచకొండ వాట్సాప్ నెంబర్ 8712662111 ద్వారా లేదా ప్రాంత షీటీమ్ అధికారుల నంబర్లు భువనగిరి ఏరియా- 8712662598, చౌటుప్పల్ ఏరియా- 8712662599, ఇబ్రాహీంపట్నం ఏరియా - 8712662600, కుషాయిగూడ ఏరియా - 8712662601, ఎల్బీనగర్ ఏరియా - 8712662602, మల్కాజిగిరి ఏరియా - 8712662603, వనస్థలిపురం ఏరియా - 8712662604 నెంబర్లకు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ టి. ఉషా విశ్వనాథ్, ఏసీపీ వెంకటేశం, అడ్మిన్ ఎస్ఐ రాజు, షీ టీమ్స్ సిబ్బంది, కౌన్సిలర్స్ తదితరులు పాల్గొన్నారు.



మా విద్యాభ్యాసమంతా ప్రభుత్వ పాఠశాలలోనే..

- రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ వర్మ

నవతెలంగాణ-బంజారా హిల్స్

మా తరం వారందరూ విద్యాభ్యాసం ప్రభుత్వ పాఠశాలలోనే పూర్తి చేశామని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ వర్మ తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ లోని రాజ్ భవన్ ప్రభుత్వ పాఠశాలకూ విచ్చేసిన ఆయన విద్యార్థులను కలిసి ముందుగా విద్యాభ్యాసం ఎలా కొనసాగుతుందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలోని గదులన్నీ తిరిగి పరిశీలించి వసతుల గురించి ఉపాధ్యాయుల బృందాన్ని అడిగి తెలుసుకున్నారు. కాసేపు విద్యార్థులకు పాఠాలు చెబుతూ తమ తరం వారంతా ప్రభుత్వ పాఠశాలలోనే విద్యాభ్యాసం పూర్తి చేశామని చదవాలన్న ధ్యాస ఏకాగ్రత పట్టుదల ఉన్నత లక్ష్యానికి చేరుకోవాలన్న ఆశయ సాధన ఉంటే నిరంతర విద్యాభ్యాసం నిరంతర విద్యార్థిగా ఉండాలని అది ఎంతో ఉన్నతమైన శిఖరానికి తీసుకు వెళుతుందని



తెలిపారు. ప్రతి ఒక్కరూ సావిత్రిబాయి జ్యోతిరావు పూలే, నుండి అంబేద్కర్, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్, రమణ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భువన మంజుల, ఉపాధ్యాయుల బృందం తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నవతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం (నేడు) విద్యుత్ అంతరాయం కలుగుతుందని తుర్కయంజాల్ ఏడీఈ వినోద్ రెడ్డి అన్నారు. నాదర్గుల్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 11:30 నుండి 13:00 వరకు, ఆదిత్య నగర్ ఫీడర్ పరిధిలో ఆదిత్య నగర్, టీచర్స్ కాలనీ, గుర్రం గూడ, హరితపురి కాలనీ, స్వామి నారాయణ కాలనీ, రాజలక్ష్మి కాలనీ, శ్రీ లక్ష్మీ కాలనీ తుర్కయంజాల్ సబ్ స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 01: 00 నుండి 01:30 వరకు, టీసీఎస్ ఫీడర్ పరిధిలో మన్నెగూడ పలు కాలనీలో దుర్గా అంజనాద్రి కాలనీ, విజేత ప్రాజెక్ట్స్, సంపద హెూమ్స్, పగోడా ప్లాజా, సిరి టౌన్షిప్ కమ్మగూడ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం13:30 నుండి 3 గంటల వరకు, కమ్మగూడ, ఈస్ట్ సూరజ్ నగర్, ఏపీపీటి కాలనీ, టీచర్స్ కాలనీ, వీరమని బిస్కెట్ ఇండస్ట్రీ, నవభారత్ కాలనీలల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, విద్యుత్ వినియోగ దారులు విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని ఏఈ రాములు కోరారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకనే విమర్శలు



- రైతు రుణమాఫీ కోసం చేసిన బీఆర్ఎస్ ధర్నాలో రైతులు లేరు
- బోయపల్లి రాఘవేందర్ రెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ పార్టీ నాయకులు విమర్శలు చేస్తున్నారని, రైతు రుణమాఫీ కోసం చేస్తున్న ధర్నాలో రైతులే లేరని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం అల్మాస్‌గూడలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు రూ.2లక్షలు వరకు రుణమాఫీ అమలు చేయటం జరిగిందని, కొన్ని సాంకేతిక కారణాలతో కొంత మంది రైతులకు రుణమాఫీ అమలు కాలేదన్నారు. గత 10సంవత్సరాల కాలంలో రైతు సమస్యలు బీఆర్ఎస్ పార్టీ నాయకులకు గుర్తు రాలేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సీఎం రేవంత్ నాయకత్వంలో చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకనే విమర్శలు చేస్తున్నారని మండి పడ్డారు. రుణమాఫీ అమలు కాని రైతులు వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించినట్లు అయితే త్వరలోనే రుణమాఫీ అవుతుందన్నారు. స్థానిక బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు తమ డివిజన్లలో అభివృద్ధి పనులను చేయకుండా రాజకీయం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఉదయం ధర్నాలు చేయడం, రాత్రి తమ అవసరాల కోసం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను, ఎంపీలను కలువడం జరుగుతుందన్నారు. 10 సంవత్సరాల కాలంలో మాజీ సీఎం కేసీఆర్ అధికారంలో ఉన్న సమయంలో 1లక్ష రూపాయలు కూడా రుణమాఫీ చేయలేదని విమర్శించారు. పార్టీలకు అతీతంగా రైతులకు రుణమాఫీ చేస్తున్నట్లు తెలిపారు. ఏక కాలంలో సీఎం రేవంత్ రెడ్డి రైతులకు రూ.18వేల కోట్లు రుణమాఫీ చేయటం జరిగిందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామిడి కృష్ణారెడ్డి, నాయకులు సోని నాయక్, జంగయ్య గౌడ్, నవీన్ నరేష్ నాయక్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి





పీఓడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అనసూయ

నవతెలంగాణ- వనస్థలిపురం

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అనసూయ అన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం ఏడవ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకొని వివిధ కళాశాలలో, బస్తీలలో మహిళా చైతన్య సదస్సుల నిర్వహణలో భాగంగా వనస్థలిపురంలోని యువ బాలికల డిఫెన్స్ కళాశాలలో శుక్రవారం చైతన్య సదస్సు నిర్వహించి..పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి కళాశాల డైరెక్టర్ భాస్కర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పీఓడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అనసూయ మాట్లాడుతూ ఆకాశంలో సగమైన మహిళలు అన్ని రంగాల్లో ముందు వరసలో కలబడి, నిలబడాలని సకల వివక్షతలను ప్రతిఘటించాలని అన్నారు. రాబోవు నూతన సమాజ ఆవిష్కరణలో మహిళలు కీలక భూమిక పోషించాలని, సమాన హక్కుల సాధనకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో హైకోర్టు న్యాయవాది కట్టా భగవంత రెడ్డి, విశ్రాంత బీసీ ఉప కమిషనర్ బాలచందర్, ప్రేమలత, కళాశాల ప్రిన్సిపల్ అనిల్ కుమార్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'పండుగలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి'



నవతెలంగాణ - చంపాపేట్

గణేష్, మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని దక్షిణ, తూర్పు మండలం డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్ అన్నారు. మలక్‌పేట్ నియోజకవర్గం సైదాబాద్ డివిజన్ పరిధిలోని జెడ్‌సి చార్మినార్ జోన్ అడిషనల్ డీసీపీ సౌత్ ఈస్ట్ జోన్, ఎస్ఇఅండ్ఈఈ, ఎస్ జీహెచ్ఎంసీ, ట్రాన్స్ కో, ఆర్ అండ్ బి, హెచ్ఎండబ్ల్యూఎస్, అండ్ ఎస్ బి, టిజిఎస్ఆర్టిసి, ఆర్‌టిఏ ఉన్నంత అధికారుల, అండ్ ఏసిపి ఎస్, అండ్ ఎస్ హెచ్ సౌత్ ఈస్ట్ జోన్ పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. గణేష్ ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబీ పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కల్గించకుండా శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. గణేష్ మండపాల వద్ద గట్టి బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏసీపీలు వెంకన్న నాయక్, శ్యాంసుందర్, మహమ్మద్ గౌస్, సీఐలు, ఎస్ఐలు, డీఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంతోష్‌నగర్ ఏసీపీ మహమ్మద్ గౌస్ ఆదేశం మేరకు ...

గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సీఐ వెంకట్ రామయ్య విజ్ఞప్తి చేశారు. సంతోష్‌నగర్ ఏసీపీ మహమ్మద్ గౌస్ ఆదేశం మేరకు శుక్రవారం ఐఎస్ సదన్ పోలీస్ స్టేషన్‌లో మిలాద్ ఉన్ నబీ, గణేష్ మండపం నిర్వహణ నేతలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గణేష్, మిలాద్ ఉన్ నబీ పండుగలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. వినాయక చవితి కమిటీ సభ్యులు, సిబ్బంది, కార్యకర్తలు సమాజ సేవలో ముందుండాలన్నారు. మండప నిర్వహకులు పోలీసులకు సహకరించాలని కోరారు. మండపాల ఏర్పాటు, నిమజ్జనం సందర్భంగా ర్యాలీలో ఎదురవుతున్న సమస్యలను మండప నిర్వాహకులు వివరించారు. సమస్యలు పరిష్కారమయ్యేలా చూస్తానని సీఐ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో స్థానిక నాయకులు, గణేష్ మండపం కమిటీ సభ్యులు, డిఐ ఎన్ సైదయ్య, ఎస్ఐ బ్రహ్మాచారి, విజయ్ కుమార్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

వినాయక ఉత్సవాలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సంతోష్‌నగర్ ఏసీపీ మహ్మద్ గౌస్ సూచించారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం సంతోష్‌నగర్ స్టేషన్ పరిధిలోని ఉత్సవాల నిర్వాహకులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఉత్సవాల నిర్వాహకులు స్థానికులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిర్వాహకులు పోలీసుల సూచనలను తప్పకుండా పాటించాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ సమావేశంలో సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ, ఎస్సైలు సిహెచ్.రవి, ఆర్.శివప్రసాద్, సిబ్బంది గణేష్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్

ఇబ్బందులు ఎదుర్కొంటున్న తోటి ప్రయాణికులు

నవతెలంగాణ-పెద్దఅంబర్‌పేట్

పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని ఔటర్‌రింగ్ రోడ్డు సమీపంలో పార్కింగ్ ఇష్టానుసారంగా మారింది. షాపులు, రెస్టారెంట్లు, హెూటళ్లు, షోరూంల ముందున్న పార్కింగ్ స్థలం సరిపోక చాలా మంది కార్లు, బైకులను రోడ్లపైనే నిలుపుతున్నారు. ఫలితంగా ఆ రూట్‌లో తీవ్రమైన ట్రాఫిక్ జామ్ అవుతోంది. పాదచారులకు కనీసం రోడ్ల వెంట నడిచేందుకు జాగా కూడా ఉండడం లేదు. పలుచోట్ల నో పార్కింగ్ బోర్డులున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇష్టమొచ్చినట్లు పార్క్ చేస్తున్నారు. ముఖ్యంగా కార్లతో చాలా ఇబ్బంది అవుతోంది. రాత్రిళ్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా ట్రాఫిక్ పోలీసులు చలాన్లు వేసి చేతులు దులుపుకుంటున్నారు. విజయవాడ, హైదరాబాద్ జాతీయ రహదారి నిత్యం వేలాది వాహనాలతో రద్దీగా కనిపిస్తూ ఉంటుంది. అనుక్షణం ప్రమాదాలు జరగకుండా ఉండే పరిస్థితి ఉండేది ఒకప్పుడు. రోడ్డు విస్తరణ చేసి నిత్యం పెట్రోలింగ్ సిబ్బందితోని రోడ్డుపై పార్కింగ్ చేయకుండా చేయాల్సిన అవసరం ఉండేది. ఇవన్నీ పట్టకుండా 'సంపూర్ణ' హెూటల్, వైన్ షాపు, రెస్టారెంట్లు, ఇతర వ్యాపార సంస్థలు.. రోడ్డునే పార్కింగ్ స్థలంగా ఉపయోగించుకుంటూ దర్జాగా వ్యాపారం సాగిస్తున్నాయి. రహదారిపైన హెూటళ్లు, వ్యాపార సముదాయాలు నిర్వహించాలంటే సిక్స్ లైన్ భూసేకరణ వెలుపల మాత్రమే వాహనాలు నిలుపుకోవాలి. నిత్యం సిక్స్ లైన్ సరిపోనంత రద్దీ. ఔటర్ రింగ్ రోడ్డు ఆనుకొని ఉన్న హెూటల్స్ యజమానులు మాత్రం రోడ్లపైనే పార్కింగ్ పెట్టడం వల్ల తోటి ప్రయాణికులు, ఇతర భారీ వాహనాలు అక్కడికి వచ్చే వరకల్లా కొంత ఇబ్బంది పడుతున్నారు. దీనికి తోడు ఔటర్ రింగ్ రోడ్డు నుంచి వచ్చే వాహనాలు, సిటీలో నుంచి వచ్చే వాహనాల రద్దీ ఎక్కువవుతుంది. రోడ్ సేఫ్టీ అథారిటీ సంబంధించిన పెట్రోలింగ్ వాహనాలు తిరుగుతున్నప్పటికీ కూడా చూసి చూడనట్టుగా వదిలేస్తున్నప్పుడు హెూటల్ యజమానులకు అలుసుగా మారింది. కావున తక్షణమే జాతీయ రహదారిపై పార్కింగ్ చేస్తూ వ్యాపారం చేస్తున్నటువంటి సదరు యజమానిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.





చెరువు ఆక్రమణను కాపాడాలంటూ వినతి



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

పిగ్లీపూర్ గ్రామ రెవెన్యూ సర్వే నెం.46లోని చెరువును కాపాడాలంటూ గ్రామానికి చెందిన పలువురు తహసీల్దార్ రవీందర్ దత్తుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని పిగ్లీపూర్ గ్రామ రెవెన్యూ సర్వేనెం.46లోని 22. 11ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు, ఎఫ్టీఎల్ భూమిని చదును చేస్తూ కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూమిని కబ్జా చేసి ప్లాట్లుగా విక్రయిస్తున్నారని ఆరోపించారు.

పై సర్వే నెం.లోని 22.11ఎకరాల భూమిని సమగ్ర భూ సర్వే చేసి చెరువు, ఎఫ్టీఎల్ భూమిని కాపాడాలని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో గ్రామస్తులు కోట ప్రభాకర్ రెడ్డి, ఐలయ్య, షబ్బీర్, మల్లేష్, ప్రవీణ్, గోవర్ధన్, గోపాలకృష్ణ, చంద్రారావు నరేందర్‌తో పాటు మరికొంత మంది ఉన్నారు.

చెరువుల సుందరీకరణపై ప్రత్యేక దృష్టి

- బోడుప్పల్‌లో పర్యటించిన అధికారులు



నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని పలు చెరువులను త్వరలోనే సుందరీకరణ చేస్తామని హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు. ఈ మేరకు బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్‌తో కలిసి బోడుప్పల్‌లోనిలు చెరువులను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని చెరువులను పూర్తి స్థాయిలో పరిరక్షించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే చెరువుల సుందరీకరణపై దృష్టి సారించామన్నారు. హెచ్ఎండీఏ అధికారులు మాట్లాడుతూ..త్వరగా చెరువుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండీఏ మేనేజర్, ఏహెచ్ఎండీఏ డీఈ, మున్సిపాల్ డీఈ, డిప్యూటీ మేయర్ శ్రవంతి కిషోర్ గౌడ్, కార్పొరేటర్లు చందర్ గౌడ్, పద్మారెడ్డి, కిరణ్ కుమార్‌రెడ్డి, నాయకులు జంగారెడ్డి, కార్పొరేషన్ డీఈఈ, ఏఈఈ, ఇరిగేషన్ ఏఈ పరమేశ్వర్ పాల్గొన్నారు.

నవతెలంగాణ 10
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
శనివారం | ఆగస్టు 24, 2024 | www.navatelangana.com



'క్రెడాయి హైదరాబాద్'వారి ఆధ్వర్యంలో నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద ఆగస్టు 23, 24,25 తేదీల్లో మూడు రోజుల పాటు జరగనున్న 'ప్రాపర్టీ షో' ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఇబ్రహీంపట్నం శాసన సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జక్క వెంకట్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. -నవతెలంగాణ-బోడుప్పల్

సాలర్జంగ్ కంచె కథ కంచికేనా ?

- నాడు అక్రమమని కూల్చివేతలు
- ఆరోపణలు ఎదుర్కొన్న నేతలు పార్టీ మార్పుతో నేడు అవన్నీ సక్రమమేనా
- రంగానథ్ సాబ్ జెర ఇదర్ దేకోనా..



జేసీబీతో అక్రమ నిర్మాణాలను కూల్చేస్తున్న దృశ్యం (ఫైల్)

నవతెలంగాణ-బోడుప్పల్

మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం పీర్జాదిగూడ కార్పొరేషన్ పర్వతాపూర్ రెవెన్యూ పరిధిలోని సాలర్జంగ్ కంచే భూముల కథ కంచికేనా! అంటే అవుననే వాదనలు వినిపిస్తున్నాయి. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా కంచె భూములకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయగా సర్కారు కలుగ జేసుకొని జీవో నెంబరు 118ను తీసుకొచ్చింది. కానీ అది పూర్తి స్థాయిలో కార్యరూపం దాల్చలేదు. ప్రభుత్వ భూము అక్రమాలను నిగ్గు తేల్చటానికి తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ (హైడ్రా) కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న కూల్చివేతలు పర్వతాపూర్ లో ఉంటుందా అంటే ఏమో అనే సమాధానాలు వినిపిస్తున్నాయి.

అసలేం జరిగింది..

ప్రస్తుత మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడ కార్పొరేషన్ పర్వతాపూర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 1,10,11 లో 37 ఎకరాలకుపైగా సాలర్జంగ్ కంచె భూమి ఉన్నట్లు రికార్డులు చెప్తున్నాయి. అయితే గతంలో ఇక్కడ లే అవుట్ చేసిన వ్యక్తులు తప్పుడు సర్వే నెంబర్లతో రిజిస్ట్రేషన్ చేసి పక్క సర్వే నెంబరుతో సాలర్జంగ్ కంచే భూమిని ప్లాట్లుగా చేసి క్రయవిక్రయాలు జరిపారు. అనంతరం అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ సర్వే నెంబర్లలో రిజిస్ట్రేషన్లు చేయకూడదని రాతపూర్వకంగా సబ్ రిజిస్ట్రార్ కు లేఖ రాశారు. అది అలా ఉండగానే పీర్జాదిగూడ కార్పొరేషన్ పాలకవర్గం ఏర్పాటు అనంతరం ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం సాలర్జంగ్ కంచె భూమిలోని సర్వే నెంబరు 10,11లో భూమిలో మేడిపల్లి మండల తహశీలారు కార్యాలయం అధికారులు, పీర్జాదిగూడ కార్పొరేషన్ అధికారులు సంయుక్తంగా ఫెన్సింగ్ వేశారు. దీంతో అక్కడ ప్లాట్లు కొనుగోలు చేసిన బాధితులు లబోదిబోమంటూ తమకు న్యాయం చేయాలని అప్పటి బీఆర్ఎస్ సర్కారుకు మొరపెట్టుకున్నారు. అనేక రకాల ఆలోచనల అనంతరం అప్పటి మున్సిపల్ మినిస్టర్ కేటీఆర్ ఆధ్వర్యంలో జీవో నెంబరు 118ని తెచ్చారు. అయితే అందరూ ఇక మా ప్లాట్లు మాకు దక్కుతాయని ఊపిరి పీల్చుకునేలోపే ఓ పిడుగులాంటి వార్తా బయటపడింది. సదరు జీవోలోని సారాంశం ఎంటంటే అప్పటికే ఇంటి నిర్మాణం ఉండి ప్రభుత్వ భూమి అని సర్కారు వారు ఇబ్బందులు పేడితే దానిని నామినల్ ఫీజుల కింద చెల్లించుకొని క్రమబద్ధీకరణ చేసుకోవాలని ఉండడంతో అప్పటి పీర్జాదిగూడ కార్పొరేషన్ పాలక వర్గంలోని కొందరు ఖాళీ ప్లాట్ల ఓనర్ల నుండి ప్లాట్‌కు ఇంతా అంటూ వసూళ్లు చేశారు. (రాత్రికి రాత్రే రూం నిర్మాణం చేసుకుంటే ఇంటి నెంబరు కరెంటు మీటర్ ఇప్పించే బాధ్యత తీసుకొని) కానీ ఆ పని వర్కౌట్ కాకపోవడంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది. ఈలోగా సర్కారు మారడంతో రెవెన్యూ అధికారులు విడతల వారీగా సర్వే నెంబరు 1,10,11 లో చేపట్టిన నిర్మాణాలను కూల్చేశారు.

నాడు ప్రభుత్వ భూమంటూ గగ్గోలు..

2023 డిసెంబరులో రాష్ట్రంలో బీఆర్ఎస్ సర్కారు మారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే సాలర్జంగ్ కంచె 10,11 సర్వే నెంబరు భూములలో ఉన్న నిర్మాణాలను నెల మట్టం చేశారు. అనంతరం గత నెల రోజుల క్రితం సర్వే నెంబరు1లో కూడా సీలింగ్‌కు సంబంధించిన భూమి ఉందంటూ భారీ బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టారు. అయితే పీర్జాదిగూడ కార్పొరేషన్ మేయర్ జక్క వెంకట్ రెడ్డిపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు సరిపడా బలం కావాలంటే సదరు భూముల తో సంబంధాలున్న నేతలు చేపట్టిన నిర్మాణాలను టార్గెట్ చేసిన సర్కారు ఇప్పుడు అవిశ్వాస తీర్మానం ముగిసిన తరువాత కనీసం ఆ నిర్మాణాల జోలికి వెళ్ళడం లేదంటే అక్కడ సర్కారు భూమి ఎమైపోయినా పర్వాలేదు. మాకు రాజకీయమే ముఖ్యమనే రీతిలో పాలన సాగుతోంది.

హైడ్రా పట్టించుకునేనా...

హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటల్లో చేపట్టిన నిర్మాణాలను తొలగించి ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు సీఎం రేవంత్ రెడ్డి చైర్మెన్‌గా, ఐపీఎస్ అధికారి ఏవీ.రంగానథ్ కమిషనర్‌గా ఏర్పాటు చేసిన హైడ్రా పర్వతాపూర్ సీలింగ్ భూమి పరిరక్షణకు కృషి చేస్తుందా? లేక గతంలో ఆరోపణలు ఎదుర్కొన్న నేతలు ఇప్పుడు పార్టీ మారారు కాబట్టి ఇక సదరు భూముల అక్రమం కాదు.. సక్రమమే అంటూ చేతులు దులపుకుంటారా వేచి చూడాలి.

హైడ్రా పారదర్శకంగా పనిచేయాలి



ప్రభుత్వ భూముల పరిరక్షణకు ఏర్పాటు చేసిన హైడ్రా ప్రజల మన్ననలు పొందాలంటే కమిషనర్ పారదర్శకంగా పని చేయాలి. సుమారు 37 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతుంటే సర్కారు పెద్దలు ఎందుకు నోరు మూయాలి. ఇక్కడ కావాల్సింది రాజకీయం కాదు ప్రభుత్వ భూముల పరిరక్షణ. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలి..

-ఎన్.సృజన, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి, మేడిపల్లి.

మెడికల్ క్యాంపునకు రావాలని ఆహ్వానం



నవతెలంగాణ-కాప్రా

కాప్రా పరిధిలోని చక్రిపురంలో ఉన్న శ్రీ చక్రి విద్యా నికేతన్ స్కూల్‌లో ఈనెల 25న జన విజ్ఞాన వేదిక, పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే మెగా మెడికల్ క్యాంపునకు హాజరుకావాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ఆహ్వానించామని జేవీవీ మేడ్చల్ జిల్లా నాయకులు పి.నాగరాజు తెలిపారు. శుక్రవారం జేవీవీ నాయకులు ఎమ్మెల్యేను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతినెలా బీపీ, షుగర్ మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆదివారం 9వ వార్షికోత్సవం సందర్భంగా మెడికల్ క్యాంపునకు ముఖ్యతిథిగా రావాలని ఎమ్మెల్యేను ఆహ్వానించామని చెప్పారు. వివిధ కాలనీవాసుల ప్రజలు మెడికల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9989925997 సంప్రదించాలని సూచించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ముప్పా శ్రీనివాస్, నాయకులు సోమయ్య చారి, సిఎస్ శేషు, నాగేశ్వరరావు, ఎ.కె.దుర్గాచారి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సరఫరాదారులపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-కాప్రా

మల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ మల్లాపూర్, పరిసర ప్రాంతాల్లోని కాలనీల్లో యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని, గంజాయి ఇతర మత్తు పదార్థాలను సరఫరా చేస్తున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. మత్తుకు బానిసైన వారికి కౌన్సిలింగ్ ఇవ్వాలని నాచారం ఇన్‌స్పెక్టర్ రూద్వీర్ కుమార్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఆయన వెంట పైళ్ల ప్రవీణ్ కుమార్, భూమండ్ల శ్రీశైలం, మెండ రఘు, నాగరం చంద్రశేఖర్, మహేష్, మచ్చ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ డ్రయినేజీ పనులు చేపట్టాలని వినతి



నవతెలంగాణ-కాప్రా

ఓల్డ్ మల్లాపూర్‌లోని పలు బస్తీలల్లో భూగర్భ డ్రయినేజీ పనులు చేపట్టాలని కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డికి ఆయా కాలనీ వాసులు శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు. బీసీ ఏరియాలోని వార్డు ఆఫీస్ ముందు వీధిలో, ఈదమ్మ గుడి ఎదురు వీధిలో, వార్డు ఆఫీస్ వెనుక వీధిలో డ్రయినేజీ లైన్ త్వరగా వేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీశైలం, మెండ రఘు, మచ్చ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'నాటి నడవడి..నేటి ఒరవడి' స్వీయ కవితల సంకలనం ఆవిష్కరణ సభ



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో గొడుగు యాదగిరిరావు రచించిన 'నాటి నడవడి..నేటి ఒరవడి' స్వీయ కవితల సంకలనం ఆవిష్కరణ సభను ఈసీఐఎల్ కమలానగర్ సీఐటీయూ ఆఫీసులో శుక్రవారం నిర్వహించారు. ఈ సభకు ప్రముఖ రచయిత్రి పి. జ్యోతి అధ్యక్షత వహించారు. ప్రముఖ రచయిత కే. దేవేందర్ కవితల సంకలనం ఆవిష్కరించారు. మోదుగ పూలు ఎడిటర్ భూపతి వెంకటేశ్వర్లు పుస్తక పరిచయం చేశారు. విజ్ఞాన దర్శిని వ్యవస్థాపకులు టి. రమేష్ పుస్తకంలోని విజ్ఞాన దృక్పథాన్ని తెలిపారు. రచయిత్రి పి. జ్యోతి మాట్లాడుతూ..గొడుగు యాదగిరిరావు బాల్యం నుండి వివిధ అంశాలపై స్పందించి చక్కని మార్గ నిర్దేశం చేశారన్నారు. సమాజానికి ఉపయోగపడే విధంగా ఆయన రచనలు ఉన్నాయని చెప్పారు. ప్రముఖ రచయిత దేవేంద్ర మాట్లాడుతూ..తనకు యాదగిరిరావుతో 50 ఏండ్ల అనుబంధం ఉందన్నారు. యాదగిరిరావు విద్యార్థి ఉద్యమం నుండి ట్రేడ్ యూనియన్ వరకు, సాహిత్యం నుండి సామాజిక అంశాల వరకు అన్ని రంగాల్లో కృషి చేశారని చెప్పారు. ప్రముఖ విజ్ఞాన వేత్త టి.రమేష్ మాట్లాడుతూ.. సైంటిఫిక్ టెంపర్‌ను విద్యార్థుల్లోనూ, సమాజంలోనూ తీసుకురావడానికి అనేక రకాలుగా ప్రయత్నించారని తెలిపారు. దాంట్లో నన్ను భాగస్వామ్యం చేసినందుకు అభినందనలు తెలిపారు. మాజీ ఉపాధ్యాయు రాలు పద్మ, నరసింహారావు, గిరీష్, వివి ఆచార్యులు , ప్రముఖ రచయిత్రి సలీమ, మహేష్ దుర్గే, యాదగిరి రావు కుమార్తె గొడుగు ప్రవీణ తదితరులు ప్రసంగించారు. అనంతరం పుస్తక రచయిత గొడుగు యాదగిరిరావు ప్రసంగిస్తూ.. నేను కవిగాను రచయితగాను కావాలని కోరికతో రచనలు చేయడం లేదని, సామాజిక అంశాలు అన్నింటిని లక్ష్యం రూపంలో పెడుతున్నాని చెప్పారు. ఇప్పటి వరకు ఏడు పుస్తకాలు తెచ్చానని, దానికి అందరూ ప్రోత్సహించారని తెలిపారు. అందుకు అందరికీ ధన్యవాదాలు చెప్పారు. అనంతరం స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు శ్రీమన్నారాయణ వందన సమర్పణ చేశారు. అంతకుముందు స్ఫూర్తి గ్రూపు యువ నాయకుడు గిరీష్ ప్రముఖులను వేదిక మీదికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జయరాజ్, శివరామకృష్ణ, లీలావతి, వెంకటేశ్వర్లు, పురుషోత్తం, బ్రహ్మం, రామ్బ్రహ్మం, నర్సింగరావు, నరసింహారావు, చంద్రశేఖర్, శ్రీనివాసరావు, శ్రీనివాసులు, రాజమల్లు, శివన్నారాయణ, బాలు, రామ్మూర్తి, పి.బి చారి, సౌమ్య, స్వాతి, వెంకటేశ్వర్లు, మహేష్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీదేవిని కలిసిన నేతాజీ నగర్ కాలనీ కార్యవర్గం



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్‌లోని నేతాజీ నగర్ కాలనీ నూతన కార్యవర్గ సభ్యులు కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాలనీ ప్రెసిడెంట్ మహేష్, జనరల్ సెక్రెటరీ ఐలేష్ యాదవ్, వైస్ ప్రెసిడెంట్ రాజు, కోశాధికారి శ్రీనివాస్, ఇతర కార్యవర్గ సభ్యులను శ్రీదేవి యాదవ్ శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ బుడిగ ప్రభు గౌడ్, సదానంద్, శంకర్, శ్యాం ప్రసాద్ పాల్గొన్నారు.

'ఉప్పల్ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తా'



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం డాక్టర్ ఏఎస్‌రావునగర్‌లోని భవానీ నగర్‌లో రూ.18 లక్షల నిధులతో చేపట్టిన కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సోమ శేఖర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, డివిజన్ మాజీ అధ్యక్షుడు కాసం మహిపాల్ రెడ్డి, ఏఈ కీర్తి, తదితరులున్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

విద్యార్థులు కష్టపడి చదివి సమాజానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం సాకేత్‌లోని అనీష్ డిగ్రీ కళాశాలలో విశాల్ పుట్టిన రోజు సందర్భంగా ఏర్పాటు చేసిన జాబ్ మేళాకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇలాంటి జాబ్ మేళాలు మరెన్నో ఏర్పాటు చేసి ఉద్యోగాల కల్పనకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, ఏఎస్‌రావునగర్ డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు కాసం మహిపాల్ రెడ్డి, బండారి అఖిల్ రెడ్డి, మహేష్ గౌడ్, రహీం, కళాశాల యాజమాన్యం, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం



నవతెలంగాణ-పోచారం

పోచారం మున్సిపల్ పరిధిలోని అన్నోజిగూడ గ్రామంలో సనత్ నగర్‌లోని ఈఎస్ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు ఈ శిబిరంలో 170 మందికి పలు రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మెన్ కొండల్ రెడ్డి, వైస్ చైర్మెన్ రెడ్డియా నాయక్, కమిషనర్ పశ్య వేమన, వెన్నెల, మిథున్, రితేష్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల విలీనంపై గ్రామ సభ



నవతెలంగాణ -ఘట్కేసర్ రూరల్

ఘట్కేసర్ మండల పరిధిలోని అంకుషాపూర్, మాధారం, అవుషాపూర్ గ్రామాలను యాదాద్రి భువనగిరి జిల్లాలో వీలినం చేస్తున్నారని ప్రచారం జరుగుతుండడంతో శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆదేశాలతో అంకుషాపూర్ గ్రామంలో అధికారులు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఘట్కేసర్ మున్సిపాలిటీని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో విలీనం చేస్తున్నారని గ్రామ సభలో గ్రామస్తులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, అంకుషాపూర్ కార్యదర్శి గుండ్ల బాలరాజు, బీజేపీ నాయకులు బద్దం నరసింహ రెడ్డి, పిట్టల రాజు, గంగి శంకర్, కొమ్మిడి దామోదర్ రెడ్డి, బుచ్చిరెడ్డి, రాములు, గ్రామస్తులు ఉన్నారు.

చెరువుల వద్ద అభివృద్ధి పనుల పరిశీలన



నవతెలంగాణ-అల్వాల్

అల్వాల్ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా కొత్తచెరువు బతుకమ్మ పాండు వద్ద రూ.22 లక్షలతో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. కొత్త ఏర్పాటు చేస్తున్న షెడ్లు నిర్మాణ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొత్త చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్కను యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అలాగే రాజీవ్ వీకర్ సెక్షన్‌లో చెట్లను, ముళ్ల పొదలను తొలగించిన ప్రాంతాన్ని పరిశీలించి స్థానికుల బాగోగులు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు యాదగిరి గౌడ్ ,ప్రేమ్ కుమార్, రాజేందర్ ,రహమత్ ఖాన్, సయ్యద్ ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

పూడూరు, రైలాపూర్ గ్రామాలను మేడ్చల్ మున్సిపాలిటీలో విలీనం చేయడాన్ని వ్యతిరేకించిన గ్రామస్తులు

- మునీరాబాద్, గౌడవెల్లి గ్రామాలు గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో విలీనానికి అంగీకారం



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని పూడూరు, రైలాపూర్ గ్రామాలను మేడ్చల్ మున్సిపాలిటీలో విలీనం చేయడానికి శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రజాభిప్రాయ సేకరణ కోసం ఏర్పాటు చేసిన గ్రామసభలో గ్రామస్తులు మేడ్చల్ మున్సిపాలిటీలో విలీనం చేయడాన్ని ముక్తకంఠంతో వ్యతిరేకించారు. ఈ సందర్భంగా పలువురు పూడూరు గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామాన్ని తాత్కాలికంగా మేడ్చల్ మున్సిపాలిటీలో కలిపి ఆ తర్వాత గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేస్తారనే అభిప్రాయ వ్యక్తం చేశారు. అందుకు అనుగుణంగానే రాత్రికి రాత్రి మౌఖిక ఆదేశాలు జారీ చేస్తూ ప్రత్యేక గ్రామ సభలు ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. గ్రామ సర్పంచుల పదవీకాలం ముగిసిన సమయంలో గ్రామాలను మున్సిపాలిటీ, జీహెచ్ఎంసీలో కలపడం ఏంటని ప్రశ్నించారు. చుట్టుపక్కల ఉన్న గ్రామాలను కలుపుకొని పూడూరు మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పూడూరు గ్రామాన్ని మేడ్చల్ మున్సిపాలిటీలో విలీనం చేయొద్దని గ్రామ పంచాయతీగానే కొనసాగించాలని కోరుతూ ఎంపీవో సునీత, పంచాయతీ కార్యదర్శి మధులకు వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా మండల పరిధిలోని మునీరాబాద్, గౌడవెల్లి గ్రామాల ప్రజలు గుడ్లపోచంపల్లి మున్సిపాలిలో విలీనం చేయడానికి అంగీకారం తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాబు యాదవ్, మాజీ వార్డు సభ్యులు మల్లెల కృష్ణ, కోల వెంకటేష్, తుపాకుల కృష్ణ, శేఖర్ రెడ్డి, శేషి కుమార్, గ్రామస్తులు జీ.పరమేష్, నక్క మల్లికార్జున్, అనంత్ రెడ్డి, కుమార్ యాదవ్, తుపాకుల మల్లికార్జున్, మహిపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

వృత్తి విద్యా కోర్సులతో ఉజ్వల భవిష్యత్తు

- సెట్విన్‌లో శిక్షణ పొందిన 300 మంది విద్యార్థులకు పరీక్షలు
- వచ్చే మంగళవారం నుంచి కొత్త బ్యాచ్
- పీర్జాదిగూడ సెట్విన్ ఇన్‌చార్జి వనజ



నవతెలంగాణ-బోడుప్పల్

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 'తెలంగాణ యూత్ సర్వీసెస్' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హైదరాబాద్ నగరంలోని వివిధ సెట్విన్ కేంద్రాలలో శిక్షణ పొందిన సుమారు 300 వందల మంది విద్యార్థులకు నిర్వహించిన పరీక్షలను మున్సిపల్ కమిషనర్ త్రిశేశ్వర్ రావు, సెట్విన్ ఇన్‌చార్జి వనజతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సెట్విన్ ఇన్‌చార్జి వనజ మాట్లాడుతూ.. నేటి ఆధునిక ప్రపంచంలో మహిళలు తమకు ఇష్టమైన రంగాల్లో శిక్షణ పొంది విజయాలను సాధిస్తున్నారని తెలిపారు. నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్న మహిళలలకు సెట్విన్ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం సంతోషంగా ఉందన్నారు. నిరుద్యోగ యువతీయువకులకు వృత్తి విద్యా కోర్సులలో శిక్షణ పొందటం ద్వారా ఉపాధి అవకాశాలు సులభతరం అవుతుందన్నారు. ఇక్కడ బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం వర్క్స్, టైలరింగ్,జ్యూట్ బ్యాగుల తయారీ, ఏసీ, రిఫ్రిజిరేటర్ తదితర 22 కోర్సులలో శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని కోర్సులు ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. వచ్చే మంగళవారం నుండి కొత్త బ్యాచ్ ప్రారంభం అవుతుందని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు పూర్తి వివరాలకోసం 7207816959 నెంబరును సంప్రదించగలరు.

నూతన మున్సిపాలిటీగా డబీల్‌పూర్?



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని డబీల్ పూర్ గ్రామానికి చుట్టుపక్కల ఉన్న గ్రామాలను కలుపుకొని డబీల్‌పూర్‌ను నూతన మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. లింగాపూర్, కోనాయిపల్లి, మైసిరెడ్డిపల్లి, నూతన్‌కల్, శ్రీరంగవరం, బండమాదారం తదితర గ్రామాలను కలుపుకొని డబీల్‌పూర్ కేంద్రంగా నూతన మున్సిపాలిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లుగా జిల్లా పంచాయతీ అధికారుల నుండి సమాచారం అందుతోంది. మేడ్చల్ మున్సిపాలిటీకి అత్యంత సమీపంగా ఉన్న గ్రామాలను మేడ్చల్‌లో, గుండ్లపోచంపల్లికి సమీపంలో ఉన్న గ్రామాలను గుండ్లపోచంపల్లిలో, డబీల్ పూర్ చుట్టుపక్కలున్న గ్రామాలను డబీల్‌పూర్‌లో కలిపి మున్సిపాలిటీగా ఏర్పాటు చేయనునట్లుగా ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లుగా తెలుస్తోంది. అందులో భాగంగానే శుక్రవారం పూడూరు, మునీరాబాద్, రైలపూర్, గౌడవెల్లి గ్రామాలలో ప్రత్యేక గ్రామసభలు ఏర్పాటు చేసి ప్రజాభిప్రాయ సేకరణ చేశారు.

భజన్ మందిర్ గణేష్ ఉత్సవ కమిటీ చైర్మెన్‌గా శివకుమార్



నవతెలంగాణ-కాప్రా

కుషాయిగూడ గణేష్ ఉత్సవాలకు భజన్ మందిర్ గణేష్ ఉత్సవ సమితి కమిటీ చైర్మెన్‌గా పండాల శివకుమార్‌గౌడ్‌ను కుషాయిగూడ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పండాల శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ.. కుషాయిగూడ పరిసర ప్రాంతాలలోనే కాకుండా మండలంలోనే మొట్ట మొదటి గణేష్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ఘనత ఈ భజన్ మందిర్‌కు దక్కుతుందని గుర్తు చేశారు. 78 సంవత్సరాల క్రితం ప్రారంభించిన భజన్ మందిర్ గణేష్ ఉత్సవాలను ప్రతి ఏటా ఎంతో భక్తి శ్రద్దలతో నిర్వహిస్తూ వస్తున్నారని చెప్పారు. ఈ సారి ఈ ఉత్సవాల నిర్వాహణ బాధ్యత తనకు అప్పగించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సారి ప్రతీ సారి కంటే ఇంకా ఎంతో ఘనంగా ఈ భజన్ మందిర్ గణేష్ ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. త్వరలో పూర్తి ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసుకుంటామని తెలిపారు.

నవతెలంగాణ
నమ్మదగ్గ తెలుగు దినపత్రిక
11
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
శనివారం | ఆగస్టు 24, 2024 | www.navatelangana.com

సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నేతలు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్ రెడ్డి కుటుంబ శుభకార్యంలో.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, కూకట్‌పల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టుముక్కల వెంకటేశ్వర రావులు సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు.

సూపర్వైజర్స్, బూత్ లెవెల్ ఆఫీసర్స్‌తో సమావేశం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ మునిసిపల్‌లో నియోజకవర్గం పరిధిలో ఉన్న సూపర్వైజర్స్, బూత్ లెవెల్ ఆఫీసర్స్‌తో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఎస్ఎస్ఆర్ - 2025 లో భాగంగా బూత్ లెవెల్ ఆఫీసర్స్ ఇంటింటికి వెళ్లి ఓటర్ లిస్ట్, డెత్, షిఫ్టెడ్, వెరిఫికేషన్ వేగవంతం చేయాలని కోరారు. అలాగే న్యూ ఓటర్స్‌ను గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ వి నరసింహ, ఈ ఆర్ఓ, ఎండి.రెహమాన్, ఎమ్మార్వో తదితరులు పాల్గొన్నారు.

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నుంచి విముక్తి చేయడమే లక్ష్యం



- రామ్ దేవ్ రావు హాస్పిటల్ డాక్టర్ ఛాయాదేవి

నవతెలంగాణ-కూకట్‌పల్లి

సరైన అవగాహన లేకపోవడం వల్ల ఎంతో మంది మహిళలు గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ బారిన పడుతున్నా రని, రాబోయే రోజుల్లో మహిళలను గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నుంచి విముక్తులను చేయడమే రామ్ దేవ్ రావు హాస్పిటల్ లక్ష్యమని డాక్టర్ ఛాయాదేవి అన్నారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ దిశగా రాందేవ్ రావు హాస్పటల్ ముందంజలో ఉందని చెప్పొచ్చు. గత సంవత్సరం రాందేవ్ రావు హాస్పటల్లో డాక్టర్ ఛాయా దేవి అబ్‌స్ట్రిక్ అండ్ గైనకాలజీ (హెచ్.ఓ.డి) చేతుల మీదగా, హెచ్‌పివి ఫ్రీ వాక్సినేషన్ కార్యక్రమం ప్రారంభమై ఏడాది గడిచిందని.. ఈ సంవత్సర కాలంలో సుమారు 15 వందల మంది, 9 నుంచి 14 సంవత్సరాల పిల్లలకు ఉచితంగా ఈ వ్యాక్సినేషన్ అందించడం జరిగిందని పేర్కొంటూ.. అందులో భాగంగా శుక్రవారం ఉదయం రాందేవరావ్ హాస్పటల్లో భారీ ఎత్తున ఫ్రీ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుముదిని దేవి కాలేజ్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు మరియు యాజమాన్యం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ యాజ మాన్యం మీరా రావు, రాందేవ్ రావు హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కమలాకర్, డాక్టర్ ఛాయాదేవి, సీఈఓ డాక్టర్ యోబు, నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ అపర్ణ, వైస్ ప్రిన్సిపల్ సెలీనా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఛాయాదేవి మాట్లాడుతూ సరైన అవగాహన లేకపోవ డం వలన ఎంతో మంది మహిళలు గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ బారిన పడుతున్నారని, రాబోతున్న కాలంలో మహిళలను గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నుంచి విముక్తులను చేయడమే మన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎంతగానో సహకరిస్తున్నటువంటి హాస్పటల్ యాజమాన్యం విక్రందేవ్, మీరారావు, అపర్ణ, శ్రీ ప్రశాంత్ రావులకు, ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ కమలాకర్ మాట్లాడుతూ సమాజంలో ఒక గొప్ప మార్పు కోసం ఎంతగానో కృషి చేస్తున్నటు వంటి డాక్టర్ ఛాయా దేవికి అభినందనలు తెలి పారు. అలాగే హాస్పిటల్ యాజమాన్యం యొక్క సహకారం ఎల్లప్పుడూ తమకు ఉండే విధంగా డాక్టర్ కమలాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కాలేజ్ లోని 50 మంది విద్యార్థినులకు ఫ్రీగా వ్యాక్సినేషన్ అందించడం జరిగింది. నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ అపర్ణ, వైస్ ప్రిన్సిపల్ సెలీనా ఈ సందర్భంగా తమ హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఫ్రీ వాక్సినేషన్ ద్వారా ఆడవారికి రాబో తున్న తరాలలో గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ నుంచి కాపాడగలమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించి నటువంటి రాందేవ్ రావు హాస్పిటల్ యాజమాన్యానికి మరియు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి వారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ సూపరెంటెంట్ మేరీ డేవిడ్, డ్యూటీ డాక్టర్స్ డాక్టర్ శృతి, డాక్టర్ ప్రిన్సి, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ అనూష, డాక్టర్ నవ్య, నర్సింగ్ ఇన్‌చార్జులు, అడ్మిన్ మేనేజర్లు కల్పన, రమ పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-కూకట్‌పల్లి

మెయింటెనెన్స్, కొత్త సర్వీస్ రిలీజ్ వర్క్ నిర్వహణ నిమిత్తం, 11 కే.వి ఫీడర్‌లపై ఈరోజు విద్యుత్ అంతరాయం గురించి పత్రిక ప్రకటన ఆల్విన్ కాలనీ ఏ.ఈ శరత్ బాబు, విడుదల చేశారు. ప్రకటనలో భాగంగా 33/11కే.వి సబ్ స్టేషన్ నుండి వెలువడే 11కే వి ఆల్విన్ కాలనీ, 11కే.వి జలకన్య ఫీడర్ లో ఉదయం 10 గంటల నుంచి 11,30 గంటల వరకు ఉండే పవర్ షట్ డౌన్ వల్ల ప్రభావితమయ్యే ప్రాంతాలు ఆల్విన్ కాలని డివిజన్‌లోని సాయి నగర్, ఆల్విన్ కాలనీ, భూదేవి హిల్స్, శివ నగర్, తులసి నగర్ జలకన్య ప్రాంతాలు ఉంటాయని తెలిపారు. అలాగే 11కే.వి ఆర్‌పి కాలనీ ఫీడర్, 11కే .వి పాపిరెడ్డి నగర్ ఫీడర్‌లో 12 గంటల నుంచి 12,30 గంటల వరకు, విద్యుత్ అంతరాయం ఏర్పడే ప్రాంతాల్లో, ఆర్‌పి కాలని, రామకృష్ణ నగర్, హనుమాన్ నగర్, దీనబంధు కాలనీ, మాధవరం నగర్ కాలనీ, పాపిరెడ్డి నగర్, ప్రగతి నగర్ ఉంటాయని పేర్కొన్నారు. ప్రశాంత్ నగర్ సబ్ స్టేషన్ నుంచి 11 కే.వి మైత్రీ నగర్ ఫీడర్‌లో మధ్యా హ్నం 1:00 గంట 1:30 గంటల వరకు ఉండే ప్రభావిత ప్రాంతాలు, విజ్ఞాన పురి కాలనీ, మైత్రీ నగర్, సాయి బాబా నగర్, నైనా గార్డెన్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని.. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు ఈ అసౌకార్యానికి సహకరించాలని ఆల్విన్ కాలని ఏ.ఈ శరత్ బాబు కోరారు.

దుండిగల్- గండిమైసమ్మ ,చైతన్య కాలనీ ఫీడర్ 33/11 కేవీ గాగిల్‌పూర్ కొత్తఫీడర్ సర్వీస్ కనెక్షన్ల నిర్వహణ పనుల కారణంగా నేటి ఉదయం 11:00 గం నుంచి 11:30 ॥ని వరకు గాగిల్‌పూర్ క్రాస్ రోడ్, జగన్ వెంచర్, మోడీ బిల్డర్స్‌లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. అలాగే సత్యం ఫీడర్ డీపీపల్లి నుంచి ఉదయం 11:30 నుంచి 12:00 గంటల వరకు గండి మైసమా క్రాస్ రోడ్డు, పోచా రెడ్డి కాలనీలలో గాగిల్‌పూర్‌లో మధ్యాహ్నం 12.00 నుంచి 12.30॥నిల వరకు ప్రేమ-2, పారిశ్రామిక ప్రాంతంల లో అలాగే 01.00గం నుంచి 01.30ని వరకు ఎంఎల్ ఆర్ కళాశాల, నాగ్లూర్ గ్రామం, దుండిగల్ గ్రామం, అలాగే 01.30గం నుంచి 02.00గం వరకు గాగిల్లాపూర్ ఎక్స్ రోడ్, గాగిల్లాపూర్ చర్చి, చైతన్య కాలనీ, 214 ప్రాంతంలలో అలాగే 11:00 కట్టమైసమ్మ ఫీడర్ బహదూర్‌పల్లి ఉదయం 11.30ని మధ్యాహ్నం 01.00 గంటల వరకు సూరారం ఎక్స్ రోడ్, సూరారం బస్సు మార్గం, సూరారం కాలనీ, సూరారం మార్కెట్, భవానీ నగర్,సిద్ధి వినాయక నగర్ లలో కొత్త విద్యుత్ కనెక్షన్ల మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈ విద్యుత్ అంతరాయానికి ప్రజల సహకరించాలని డిపిపల్లి విద్యుత్ శాఖ ఏఈ ఎస్.సురేందర్ రెడ్డి తెలిపారు.

బౌరంపేట్ ఫీడర్‌లో కొత్త సర్వీస్ కనెక్షన్‌ల నిర్వహణ పనుల కారణంగా నేటి ఉదయం 10.00 గం నుంచి 1:00 గం వరకు ప్రణీత్ నేచర్ బౌంటీ, కేపీఆర్ కాలనీ, స్ప్రింగ్ వుడ్, జె ఎస్ ఎస్ విల్లాస్, స్టెర్లింగ్ హెరామ్స్, శంబీపూర్ విలేజ్ ప్రాణాలు అలాగే బహదూర్ పల్లి లక్ష్మీనగర్ ఫీడర్ లో 11.00 గం నుంచి 11.30 ని వరకు సూరారం గ్రామం, అయ్యప్ప సంఘం, విశ్వకర్మ కాలనీ మొదలైన ప్రాణాలలో అలాగే బౌరంపేట్ కేబుల్ ఫీడర్ నుండి ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.00 వరకు బౌరంపేట్ గ్రామం, ఆర్.కే లేఅవుట్, సారెగూడేమ్ రోడ్డు మొదలైన ప్రాంతంలలో బౌరంపేట్ ఫీడర్ నుండి 1:30 గం నుంచి 2.00 గం వరకు నేచర్ సిటీ విల్లాలు, వేద పాఠశాల రోడ్డు, సారెగూడేం రోడ్డు, ల్యాండ్‌మార్క్-3, అపురూప కాలనీ మొదలైన ప్రాంతాలు అలాగే ప్రణీత్ ఫీడర్‌లో 11.00గం నుంచి 11.30 ని వరకు ప్రణీత్ ఫ్లోరా మొదలైన ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈ విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని బౌరంపేట్ విద్యుత్ శాఖ ఏఈ బి.సాయి కిరణ్ తెలిపారు.

చార్మినార్ డివిజన్ ప్రాంతాల్లో.. కరెంట్ ఉందని ప్రాంతాలు..

ధూల్ పేట్ : పాతబస్తీ చార్మినార్ డివిజన్ ప్రాంతాల్లో సాంకేతిక పనులు కొనసాగడంతో పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని చార్మినార్ డివిజన్ ఏడీఈ తెలిపారు. డివిజన్ లోని 11కేవిలలో ఉదయం 9 గంటల నుండి 10గంటల వరకు మదీనాలో, సిటీ కాలేజ్, దేవిబాగ్ కమేల, హైదర్ గూడ, గుల్జార్ హౌజ్, రామ టాకీస్, అసద్ బాబా నగర్, శాలిమార్, న్యూ ఫ్రెండ్స్ కాలనీ, ప్రిన్స్ కాలనీ లలోని ఫీడర్స్ లలోని ప్రాంతాలలో పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఆయా ప్రాంతాలలో పని సమయంలో మాత్రమే అర్ధ గంట, గంట సమయంలో ఉదయం నుండి సాయంత్రం 4:30గంటల వరకు సరఫరా నిలిపి వేస్తామన్నారు. ఈ అంతరాయం స్థానిక ప్రజలు గమనించి సహకరించాలని కోరారు. ఆయా ప్రాంతాల పనులు పూర్తయిన వెంటనే కరెంట్ సరఫరా

కరెన్సీ నోట్లు రహదారిపై గాల్లోకి వెదజల్లిన యువకుడు అరెస్టు..



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి జాతీయ రహదారిపై కరెన్సీ నోట్లు వెదజల్లి ట్రాఫిక్ జామ్‌కు కారణమైన యువకుడిని కూకట్‌పల్లి పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ఈ అరెస్టుపై కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, సీఐ ముత్తులు పాత్రికేయ సమావేశం ఏర్పాటు చేశారు. వివరాలు వెల్లడిస్తూ.. కొర్రపాటి వంశీ అనే 23 ఏండ్ల యువకుడు, కూకట్ పల్లి, కేపీహెచ్‌బీ జాతీయ రహదారిపై తమ ద్విచక్రవాహనంపై వచ్చి, రహదారి మధ్యలో వాహనం నిలిపేసి నోట్లు పైకి ఎగురవేయడంతో, రోడ్డు పై ప్రయాణించే వారు ,నోట్లు తీసుకోవడానికి రహదారిపై పబ్లిక్ ఆగడంవల్ల, ట్రాఫిక్ జామ్ ఏర్పడి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలీసులకు అందిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకోవడం జరిగిందని.. అయితే యువకుడు డబ్బు సంపాదించడం కోసం www.winbuzz.in (గేమ్స్)లో, సంపాదిస్తూ ఫాలో అయ్యి మీరు డబ్బు సంపాదించవచ్చు అనే స్టేట్ మెంట్ సైతం ఇవ్వడం జరిగిందని, కోరపాటి వంశీని కూకట్‌పల్లి పోలీసులు అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరచడం జరిగిందని ఏసీపీ శ్రీనివాస రావు తెలిపారు.

మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండాలి



- వంట ప్రదేశాల్లో పరిశుభ్రత పాటించాలి
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో

విద్యార్థులకు సన్నబియ్యంతో అందించే మధ్యాహ్న భోజనం రుచిగా, పరిశుభ్రంగా ఉండాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి శామీర్‌పేట్ మండలంలోని అలియాబాద్ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి సూచించారు. మధ్యాహ్నం భోజన పథకం నిర్వహణను పరిశీలించేందుకు శుక్రవారం అదనపు కలెక్టర్ అలియాబాద్ జిల్లా పరిషత్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులను తిరిగి పరిశీలించారు. వంటశాలను తనిఖీ చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు బాగా కష్టపడి బాగా చదువుకుని భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి రోజూ మధ్యాహ్న భోజనం పెడుతున్నారా..? భోజనం ఎలా ఉంటుంది..? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి అదనపు కలెక్టర్ భోజనం చేశారు.

3 రోజుల్లో 28 హాస్టళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

నగర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రయివేటు రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలో శుక్రవారం ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు ఫీడ్ సేఫ్టీ అధికారులు నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న కళాశాలలు, హాస్టళ్లను తనిఖీ చేశారు. తనిఖీల్లో వంటగది, వంట సామాగ్రి, స్టోరేజ్ ఏరియా, తయారు చేసిన ఫుడ్ ఐటమ్స్, రా మెటీరియల్‌తోపాటు పారిశుద్ధ్య నిర్వహణ తదితరాలను ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో గ్రేటర్‌లో ఈ నెల 21 నుండి 23 వరకు మొత్తం 28 ప్రయివేటు, ప్రభుత్వ రెసిడెన్షియల్ హాస్టళ్లను తనిఖీ చేశారు. ఎల్బీనగర్ జోన్‌లో 4 రెసిడెన్షియల్ హాస్టళ్లు, చార్మినార్ 6, ఖైరతాబాద్ 5, శేరిలింగంపల్లి 5, కూకట్ పల్లి 4, సికింద్రాబాద్ జోన్‌లో 4 ప్రయివేటు, ప్రభుత్వ



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని డి.పోచంపల్లి వాసులు బొంగునూరి రామ్ రెడ్డి సోదరుడి కుమార్తె వివాహంలో నూతన వధూవరులని ఆశీర్వదించి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుండిగల్

తులసి రెడ్డిని అభినందించిన కోలన్



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బౌరంపేటకు చెందిన పలుకునూరి తులసి రెడ్డి యూరప్ఖండాలోని ఎత్తైన మౌంటెన్ పర్వతాన్ని అధిరోహించాడు. ఈనెల 11వ తారీఖున శిఖరం ఎక్కడం ప్రారంభించిన తులసి రెడ్డి ఆగష్టు 15న యూరప్ ఖండాల్లోని అత్యంత ఎత్తైన శిఖరాన్ని అధిరోహించాడు. లక్ష్యాన్ని నాలుగు రోజుల్లోనూ చేరుకున్నట్లు తెలిపాడు. దీని ఎత్తు 5642 మీటర్ ఉంటుందని వాతావరణ పరిస్థితులను తట్టుకుంటూ ఆగస్టు 15న అక్కడ జాతీయ పథకాన్ని చేత పట్టుకొని జై భారత్ అని నినాదాలు చేసినట్లు పేర్కొన్నారు. తులసి రెడ్డి గత ఏడాది అక్టోబర్లో పర్వతాన్ని అధిరోహించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కోలన్ హన్మంత్ రెడ్డి వారిని కలిసి షాల్వాతో సత్కరించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో కొలన్ జీవన్ రెడ్డి, కొలన్ బాల్ రెడ్డి, నవీన్ రెడ్డి, మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా, అత్యధిక మెజారిటీతో ఘన విజయం సాధించిన వల్లకాటి రాజ్ కుమార్‌ను గురువారం ఆయన నివాసంలో కలిసి, జిల్లా గణేష్ అభినందనలు తెలియజేశారు. కూకట్‌పల్లి ఆల్విన్ కాలనీ పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో.. నోముల అంజనేయులు నేత, జిల్లా గణేష్ నేత,శ్రీరాముల వెంకట కుమార్ నేత (డాన్ వెంకట్), బూర చిరంజీవి నేత, మక్కం నవీన్ నేత, డాక్టర్ వంగరి విష్ణు నేత, సూపల అంజనేయులు నేత తదితరులు కలిసి ఆయనను సత్కరించి అభినందించారు.

నవతెలంగాణ-కూకట్‌పల్లి

సురేష్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సుభాష్ నగర్ మాజీ కార్పొరేటర్ గుడిమెట్ల సురేష్ రెడ్డి, వనపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తో కలిసి జన్మదిన వేడుకలను శుక్రవారం నిర్వహించారు. తనతో పాటు చెన్నారెడ్డి, రాజిరెడ్డి, తన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, అభిమానులు తదితరులు ఉన్నారు.

130 డివిజన్‌లో ఘనంగా సురేష్ రెడ్డి జన్మదిన వేడుకలు...

130 డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ ఆధ్వర్యంలో.. మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. సుభాష్ నగర్ డివిజన్‌లో ప్రజలు తమ అభిమాన నాయకుడికి తమదైన శైలిలో శుభాకాంక్షలు తెలుపుతూ అభిమానాన్ని చాటుకున్నారు. సురేష్ రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకొని శుక్రవారం సూరారం కట్టమైసమ్మ తల్లి దేవాలయంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ, ఎస్సీ సెల్ నాయకులు ఎం.విజయ్ కుమార్, రాజు గౌడ్ సురేష్ అభిమానులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి, సురేష్ రెడ్డి పేరు మీద అభిషేకాలు, అర్చనలు చేయించారు. సురేష్ రెడ్డి భవిష్యత్తు మరింత శోభాయమానంగా, ఉన్నంతగా, ఉన్నత శిఖరాలు అధిరోహించి, సమున్నతంగా, సంపూర్ణ ఆయురారోగ్యాలతో నిండు నూరేండ్లు సంతోషంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ..

డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని... శివ హిల్స్, శివాలయం నగర్‌లో కేక్ కట్ చేసి, పారిశుద్ధ్య కార్మికులను శాలువాలతో సత్కరించి, తన కుటుంబ సభ్యులతో కలిసి చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ గృహకల్ప నాయకులు రాజు గౌడ్, కార్మిక నాయకులు సంతోష్ గౌడ్, శివాలయం నగర్ కమిటీ సభ్యులు సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీ ఎస్.పి.ఆర్ గ్లోబల్ పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజులరామారం డివిజన్ చిత్తారమ్మదేవి నగర్‌లో గల శ్రీఎస్‌పీఆర్ గ్లోబల్ పాఠశాలలో శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు పాఠశాల యాజమాన్యం, చిన్నారి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి పాఠశాల చైర్మెన్ సొంటిరెడ్డి పున్నారెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ సొంటిరెడ్డి చైతన్య రెడ్డిలు పాల్గొని, విద్యార్థులతో సందడి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకృష్ణ భగవానుడు భూమిపై అవతరించిన రోజుగా భక్తులు కృష్ణాష్టమి వేడుకలు జరుపుకుంటా రన్నారు. శ్రీకృష్ణుడు దేవకి వాసుదేవల కుమారుడిగా మధురలో జన్మించిన గోకుల నందనుడు అన్నారు. శ్రీ కృష్ణుడి ఆశీస్సులతో మన జీవితాలు సత్యం, ధర్మం, శాంతి, ఆనందంతో ఉండాలని ఆకాంక్షించారు. విద్యార్థిని విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో నాటి రోజులు కళ్లకు కట్టేలా చూపించి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను ఘనంగా నిర్వహించుకుందాం..

- సీపీఐ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

తెలంగాణ సాయుధ పోరాటాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించుకుందామని సీపీఐ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కార్యదర్శి ఉమామహేష్ అన్నారు. హన్మకొండలో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో మేడ్చల్ జిల్లా తరఫున పార్టీ రిపోర్ట్‌ను ప్రవేశపెడుతూ... తెలంగాణ సాయుధ పోరాటాన్నీ బీజేపీ నాయకులు వక్రీకరిస్తూ.. కేవలం సర్దార్ వల్లభాయ్ పటేల్ వల్లే వచ్చిందని ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. కానీ పటేల్ సైన్యం కమ్యూనిస్టులను చంపి, రజాకార్ల నాయకుడు కాశీం రాజ్వీ పాకిస్తాన్ పరిపోయేలా చేశారన్నారు. నిజాం తెలంగాణ ప్రజలను హింసించి, బట్టలు విప్పి, బతుకమ్మ ఆడించిండు అని ప్రచారం చేస్తు.. ఆ నిజాంను దేశ్ ప్రముక్యగా పదవి ఇచ్చి, పారితోషకం ఇచ్చిన సర్దార్ వల్లభాయ్ పటేల్ ఎలా తెలంగాణ ప్రజలకు న్యాయం చేసారని ప్రశ్నించారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని నడిపి 4500 మంది కార్యకర్తల బలిదానాలు ఇచ్చి, రూ.10 లక్షల ఎకరాల భూమిని పంచిన చరిత్ర సీపీఐకె ఉందన్నారు. నేటికి తెలంగాణ పలు జిల్లాల్లో వీరులను స్మరించుకుంటారని ఈ విషయాన్ని ప్రజల్లోకి వెళ్లేలా సాయుధ పోరాట వారోత్సవాలను మరింత ఉత్సాహంగా నిర్వహించాలని కోరారు. ఈ సమావేశాలకు ముఖ్య అతిథులుగా జాతీయ కార్యదర్శి నారాయణ, మాజీ రాజ్యసభ సభ్యులు అజీజ్ పాషా, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావులు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో భావిభారత నిపుణులు కావాలి



- త్రివేణి పాఠశాల సిఆర్‌ఓ.వెంకట్రావు, సిఎస్ఓ. సుబ్బారావు
- పాఠశాలలో ఘనంగా జాతీయ స్పేస్ డే వేడుకలు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

నేటి విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకొని భావిభారత నిపుణులు కావాలని త్రివేణి పాఠశాల సిఆర్‌ఓ.వెంకట్రావు, సిఎస్ఓ.సుబ్బారావులు అన్నారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ చింతల్ బ్రాంచ్ త్రివేణి పాఠశాలలో "జాతీయ స్పేస్ డే" సందర్భంగా శాస్త్రవేత్తలకు అభినందనలు తెలియజేస్తూ పాఠశాల ప్రాంగణంలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి వారితో పాటు పాఠశాల ప్రిన్సిపల్ శివకీర్తన హాజరయ్యారు. ముందుగా స్థానిక త్రివేణి పాఠశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు చంద్రయాన్ 3 విజయవంతం చేసిన శాస్త్రవేత్తల కృషి ఎనలేనిదని వారిని స్ఫూర్తిగా తీసుకోని విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపల్ శివ కీర్తన మాట్లాడుతూ ఇస్రో శాస్త్రవేత్తల, అంతరిక్షరంగా శాస్త్రవేత్తల నిరంతర కృషి ఫలితంగా చంద్రయాన్ 3 గత ఏడాది సరిగ్గా ఈ రోజే చంద్రుని మీద ల్యాండ్ అయ్యి ప్రపంచ దేశాలలో భారతదేశాన్ని చంద్రుని చేరుకున్న నాలుగో దేశంగా దక్షిణ ధ్రువంలో ల్యాండ్ అయిన మొదటి దేశంగా నిలబెట్టి అంతర్జాతీయంగా భారతదేశాన్ని సమోన్నత స్థాయిలో కీర్తి పతాకాన్ని ఎగరేసామని తెలిపారు. సి.ఆర్.ఓ.వెంకట్రావు విద్యార్థులతో జయహొ ఇస్రో.. జయహొ భారత్.. అంటూ విద్యార్థులు యువత ఈ స్ఫూర్తితో భారతదేశాన్ని మరింత ప్రగతి పథంలో నిలబెట్టాలని ఆకాంక్షించారు. త్రివేణి స్కూల్ సైన్స్ అధికారి సుబ్బారావు మాట్లాడుతూ ఈ సంవత్సరం థీమ్ టచ్చింగ్, లైఫ్ వైల్డ్ టచింగ్,ది మూన్ ఇండియాస్ స్పేస్ సాగా అనే నిదానంతో అంతరిక్షంలో భారత్ మరిన్ని విజయాలు సాధించి వాటి ఫలితాలు ప్రజలకు చేరాలని భారత్ రాబోయే అంతరిక్ష ప్రయోగాలలో ప్రపంచానికే మార్గదర్శి అవుతుందని ఆకాంక్షించారు .మొట్టమొదటి జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్రీ సుధా, కిడ్స్ పాఠశాల వైస్ ప్రిన్సిపల్ నళిని,క్యాంపస్ ఇన్‌చార్జి క్రాంతి,త్రివేణి సైన్స్ క్లబ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్‌ను కలిసిన ఏఈ



నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్‌లోని తార్నాక డివిజన్ నూతనంగా అసిస్టెంట్ ఇంజినీర్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన వేణు శుక్రవారం డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి , ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డిలను తార్నాక లోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ వారికి శుభాకాంక్షలు తెలుపుతూ వారి పని తీరుతో డివిజన్ మరింత అభివథి కావాలని ఆకాంక్షించారు. అలాగే డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉండాలని చెప్పారు.

కోలాహలంగా ప్రొ. కోదండరాం నివాసం



నవతెలంగాణ-ఓయూ

ఇటీవలే ప్రొ. కోదండారం ఎమ్మెల్సీగా పదవీ బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. దాంతో ఆయన నివాసం కోలాహలంగా మారింది. గత వారం రోజులుగా తార్నాక, నాగార్జున నగర్ లోని స్ట్రీట్ నెంబర్ 14లోని ఆయన నివాసానికి పలువురు తెలంగాణ జన సమితి నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ నాయకులు , ఇతర పార్టీల నాయకులు, వివిధ ప్రజా సంఘాల, విద్యార్థి, యువజన సంఘాల, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు వచ్చి ఆయనను ఆత్మీయంగా సత్కరిస్తున్నారు. అలాగే పలు సమస్యలు పరిష్కరించాలని, రాష్ట్ర ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లాలని వినతిపత్రం అందజేస్తున్నారు. దాంతో స్ట్రీట్ నెంబర్ 14 పరిసర ప్రాంతాలు పూర్తిస్థాయిలో రద్దీగా మారింది. మరొకవైపు ఆయన ఉదయం తన నివాసంలో తరువాత నాంపల్లిలోని తమ పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉంటున్నారు.

నిమ్స్‌లో వాటర్ ఏటీఎం ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రి ఆవరణలో సేఫ్ వాటర్ నెట్వర్క్ ఇండియా అనే స్వచ్ఛంద సంస్థ, నిమ్స్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన రెండో ఉచిత వాటర్ ఏటీఎంను శుక్రవారం నిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్ నగరి బీరప్ప ప్రారంభించి మాట్లాడారు. ఆస్పత్రి ఆవరణలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఉచిత వాటర్ ఏటీఎంల ఏర్పాటు వల్ల రోగులు, వారి సహాయకులకు ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. 24 గంటలు శుద్ధి చేసిన నీరు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. జీరో వేస్టేజ్ టెక్నాలజీ, నీటి శుద్ధత ప్రమాణాలు పాటించడం అభినందనీయమన్నారు. ఈ సేఫ్ వాటర్ నెట్వర్క్ ఇండియా అనే స్వచ్ఛంద సంస్థ 15 ఏండ్లుగా రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో 350 పైచిలుకు వాటర్ ఏటీఎంలను ఏర్పాటు చేసిందనీ, ఈ ఏటీఎంల ద్వారా దాదాపు 1.3 మిలియన్ ప్రజలకు ప్రతిరోజూ సురక్షితమైన తాగునీరు అందిస్తున్నారనీ, నిమ్స్ ఆవరణలో రెండో ఏటీఎంను ఏర్పాటు చేసినందుకు సంస్థ ప్రతినిధులను ప్రతేకంగా అభినందించినారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ చరణ్, డాక్టర్ సల్మాన్, మీడియా రిలేషన్ ఆఫీసర్ సత్యగౌడ్, సేవ్ వాటర్ నెట్వర్క్ ఇండియా హెడ్ ఆఫ్ ఆపరేషన్ శంకర్ లాల్ బత్రా, మల్లికార్జున్, శ్రీకాంత్, జితేందర్, భాస్కర్, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లు, పాఠశాలల్లో విస్తృత తనిఖీలు

- నగరంలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో 21 ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలతో ఆకస్మిక తనిఖీలు
- వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, స్కూళ్లలో బియ్యం నాణ్యత, పరిమాణం పరిశీలన : జిల్లా పౌర సరఫరాల అధికారి రమేష్





నవతెలంగాణ-సిటీబ్యూరో

సంక్షేమ హాస్టళ్లు, అంగన్‌వాడీ పాఠశాలలు, మధ్యాహ్న భోజన పాఠశాలల్లో విస్తృత తనిఖీలు నిర్వహించామని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఏ.రమేష్ తెలిపారు. ఆహార, పౌరసంఫరాల ప్రిన్సిపల్ కార్యదర్శి చౌహన్ ఆదేశాల మేరకు శుక్రవారం హైదరాబాద్ జిల్లాల్లోని 44 సంక్షేమ వసతి గృహాలు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి తనిఖీలను నిర్వహించామని ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో భాగంగా సన్న బియ్యం నాణ్యత, పరిమాణాన్ని పరిశీలించామన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు, మధ్యాహ్న భోజన పాఠశాల లు, సంక్షేమ హాస్టళ్లను సందర్శించేందుకు మొత్తం 21 బృందాలను ఏర్పాటు చేసి.. సన్న బియ్యం నాణ్యత, వాటి పరిమాణం, నిల్వ మార్గాల ధృవీకరణతో పాటు వంట విధానాలు తనిఖీ చేశామన్నారు. ఆహార నాణ్యత కోసం విద్యార్థులతో కలిసి భోజనం చేశామని, బియ్యం నాణ్యతపై వారు సంతృప్తి వ్యక్తం చేశారని డీఎస్‌వో రమేష్ తెలిపారు.

డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం సమాజాన్ని మేలుకొలుపుదాం



- ఎమ్మెల్యే శ్రీ గణేష్

నవతెలంగాణ-కంటోన్మెంట్

డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం సమాజాన్ని మేలుకొలుపుదామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ పిలుపునిచ్చారు. కంటోన్మెంట్ బోర్డ్ నాలుగో వార్డ్ మారేడ్‌పల్లి ముంగా రామ్మోహన్ రావు ప్రభుత్వ బాలికల కళాశాలలో ప్రజా నాట్య మండలి ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన డ్రగ్స్ అవేర్నెస్ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడుతూ చుట్టుపక్కల ఎవరైనా మాదకద్రవాలు వాడుతున్నట్టు తెలిస్తే వెంటనే పోలీసుకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ముఖ్యంగా మహిళలకు సెల్ఫ్ డిఫెన్స్ చాలా అవసరమన్నారు. అంతకుముందు ఆయన విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకోగా యూనిఫామ్స్ కావాలని వారు కోరారు. వెంటనే శ్రీ గణేష్ స్పందిస్తూ రెండు మూడు రోజుల్లో విద్యార్థులకు యూనిఫాంలు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. అలాగే కాలేజీ బిల్డింగ్ మరమ్మతులకు అవసరమైన నిధులు కూడా ఇస్తామన్నారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తెచ్చి పెట్టాలని కోరుకుంటున్నానన్నారు. ఈ కార్యక్రమంలో సినీ నటుడు కోటేశ్వరరావు, ప్రజానాట్యమండలి సభ్యులు మారన్నసునీత, కళ్యాణ్, వసీం, ఉపాధ్యాయులు ముజాహిద్ అలీ, తిరుపతయ్య, శంకర్ రెడ్డి, వినయ్, అశోక్, నాగరాణి తదితరులు పాల్గొన్నారు

యాదవుల సమస్యలు పరిష్కరిస్తా : ఎమ్మెల్యే

బోయిన్‌పల్లి యాదవ సంఘం ప్రతినిధులు శుక్రవారం ఎమ్మెల్యే శ్రీ గణేష్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బోయిన్‌పల్లి యాదవ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్‌లో సమావేశం నిర్వహించి ఎమ్మెల్యేకు సమస్యలు చెప్పారు అందుకు స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ అదనపు స్లాబ్ బోరు ఏర్పాటుకు నిధులు కేటాయించి పనులను పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. బోర్డు సీనియర్ మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, నాయకులు ముప్పిడి మధుకర్, అరుణ్ యాదవ్, ముఖేష్ యాదవ్, మల్లేష్ యాదవ్, వెంకటేష్ యాదవ్, రాజు యాదవ్, ఓం ప్రకాష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు



పోర్న్ వెబ్ సైట్లను ప్రభుత్వం నిషేధించాలి



- ప్రొటెక్షన్ చైల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్...

నవతెలంగాణ-బంజారాహిల్స్

పోర్న్ వెబ్ సైట్లను ప్రభుత్వం బ్యాన్ చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ప్రొటెక్షన్ చైల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వక్తలు మాట్లాడారు. పిల్లలు మొబైల్‌కు బానిసలుగా మారడమే కాకుండా పోర్న్ వీక్షించడం పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, ఆ వెబ్‌సైట్‌ల పట్ల ప్రభుత్వాలే బాధ్యత వహించాలని అన్నారు. 2016 లో కేంద్ర ప్రభుత్వం ఐదువేల వెబ్సైట్లను నిషేధిస్తున్నట్టు ప్రకటించాయని... ఇంతవరకు బాగానే ఉంది కానీ నిత్యం 50 వేల మంది మొబైల్ ఫోన్లలో ఇటువంటి వీడియోలు అప్‌లోడ్ చేసి దేశ అస్తిత్వంతో పాటు ప్రజాల వ్యక్తిత్వాన్ని హరిస్తున్నారని ఇష్టం లేకపోయినా మొబైల్ ఫోన్‌లో ఆ లింకులు రావడంతో తెలియక వాటిపై నొక్కడం వాటి బారిన పడి ఎంతో మంది జీవితాలను పాడు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అందులో ముఖ్యంగా చదువుతున్న పిల్లలతో పాటు చిన్న పిల్లలు సైతం బలవుతున్నారని వీటన్నింటినీ ప్రభుత్వమే బాధ్యత వహించి పూర్తిగా నిషేధించే ప్రక్రియ ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

ముఖ్యంగా ప్రభుత్వ పరిధిలోని రెసిడెన్షియల్ స్కూల్స్ ఇతర కళాశాలలో వీటిని పూర్తిగా నిషేధించేలా లేదా వీటిపై అవగాహన కల్పించేలా కార్యకలాపాలు చేపట్టాలని ఇది ఒకరితో సాధ్యం కాదని సమాజంలోని నిష్ణాతులను నిపుణులను వారి సహాయ సహకారాలను పరిగణంలోకి తీసుకొని పిల్లల తల్లిదండ్రుల సహాయ సహకారం సైతం వాడుకొని దీనిని అంతమొందించే ప్రక్రియ ప్రారంభించాలన్నారు. పక్కింట్లో ఏం జరిగినా మనకెందుకులే అనుకుని సమాజం లో జీవిస్తున్న ప్రస్తుత తరుణంలో ప్రతి ఒక్కరూ బాధ్యతయుతంగా ఇది మన దేశం మనతో కలిసి ఉన్న సమస్త సమాజానికి మనిషిగా పుట్టినందుకు ఒక పేజీ జీవిత చరిత్రలో ఉండాలి అనే ఖచ్చిత నిర్ణయం లక్ష్యంతో సమాజానికి మన వంతు సహకారం అందించాలని అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ మాజీ చైర్మెన్ శ్యామల, సామాజికవేత్తలు వెంకటరమణారెడ్డి, శ్రీధర్ ప్రకాష్ అంకుర ఫౌండేషన్ సుభద్ర, స్వచ్ఛంద సేవకురాలు సజ్జన, ఇతర సామాజిక సేవకులు స్వచ్ఛంద సేవకులు వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు ఇబ్బంది లేకుండా చూసే బాధ్యతా మాదే

- కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ

నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉందని, అందుకు అన్ని విధాల కృషి చేస్తున్నామని సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జన్యావుల రామకృష్ణ అన్నారు. శుక్రవారం బస్తీబాట కార్యక్రమంలో భాగంగా కంటోన్మెంట్‌లోని వార్డు 5, దుర్గయ్య గార్డెన్‌లో పర్యటించారు. స్థానికులను వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటోన్మెంట్ ప్రజలకు ఇచ్చిన ప్రతీ మాటను నిలబెట్టుకుంటున్నామని, ప్రతి సమస్యనూ పరిష్కరిస్తూ ముందుకు వెళ్తున్నామని అన్నారు. ప్రధాని మోడీ నేతత్వంలోని కేంద్ర ప్రభుత్వం సహాయ సహకారాల ద్వారా కంటోన్మెంట్ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. బీజేపీ వార్డు 5 అధ్యక్షులు విజయ్, సోమ శేఖర్, మహేష్, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు బస్తీలో జరుగుతున్న పైపులైన్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు

ఇంటి నుంచి పారిపోయిన బాలుడి ఆచూకీ లభ్యం



నవతెలంగాణ-కంటోన్మెంట్

తల్లి మందలించటంతో ఇంటి నుంచి పారిపోయిన బాలుడిని పోలీసులు పట్టుకుని తల్లి వడికి చేర్చారు ఈ సంఘటన తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే జీవనోపాధి కోసం ఈ మధ్యనే కాకినాడ జిల్లా నుండి వచ్చి టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్నారు ఆ కుటుంబ సభ్యులు. కుమారుడిని స్కూల్‌కు వెళ్ళమని తల్లి మందలించడంతో బాలుడు ఇల్లు వదిలి పారిపోయాడు.బాలుడు కనిపించడం లేదని తల్లి తిరుమలగిరి పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు రంగంలో దిగారు. మూడు గంటల వ్యవధిలోనే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లో బాలుని ఆచూకీ ఉన్నారు. దీంతో బాలున్ని తీసుకొచ్చి పోలీసులు తల్లి ఒడికి చేర్చారు. తక్షణమే వెతికి తెచ్చిన పోలీసులకు బాలుని తల్లి కృతజ్ఞతలు చెప్పారు.

మరో ఘటనలో తప్పిపోయిన బాలున్ని కనుగొన్న పోలీసులు



బాలానగర్‌లో తప్పిపోయి తిరుమలగిరికి వచ్చి ఏడుస్తూ కనిపించిన బాలున్ని గుర్తించిన పోలీసులు తల్లి ఆచూకీ తెలుసుకొని అప్పగించిన సంఘటన తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది వివరాల్లోకి వెళితే బాలానగర్‌లో నివాసం ఉంటున్న ఓ మహిళ తన ఆరోగ్యం బాగాలేదని ఇంట్లో పడుకుంది. ఆమె నాలుగేండ్ల బాలుడు ఇంటి బయట ఆడుకుంటూ వీధి చివరన బస్సు ఎక్కి తిరుమలగిరి పోలీస్ స్టేషన్ ప్రాంతానికి చేరుకున్నాడు. అక్కడ ఏడుస్తూ కనిపించడంతో తిరుమలగిరి పోలీస్ పెట్రోల్ వాహనం వారు బాలుడిని తిరుమలగిరి స్టేషన్‌కు తీసుకువచ్చి చైల్డ్ హెల్ప్ లైన్‌కు సమాచారం అందించారు. బాలుడు బాలనగర్‌లో ఉంటున్నట్టు తెలుసుకున్న పోలీసులు బాలానగర్ వీధిలో ఆ బాలుని తల్లి వెతికి ఆమెకు అప్పజెప్పారు.

డెంగ్యూ, మలేరియా నివారణ చర్యలు తీసుకోవాలి

- సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్



నవతెలంగాణ-ఓయూ

పడకేసిన పారిశుధ్య పనులు, జీహెచ్ఎంసీ నిర్లక్ష్యంతో నగరంలో చాప కింద నీరులాగా డెంగ్యూ, మలేరియా విజంభిస్తున్నాయని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ అన్నారు. రోగాలు వ్యాప్తి చెందకుండా దోమల నివారణకు పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని కోరారు. సీపీఐ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ జోన్ ఎంటమాలజిస్ట్ దురాప్రసాద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ జోన్ పరిధిలో మురికివాడలు ఎక్కువగా ఉండడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయని, దీంతో ప్రజలు డెంగ్యూ, మలేరియా రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. అలాగే కలుషిత మంచినీటి సమస్యతో సికింద్రాబాద్ ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. రోగాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పార్టీ సికింద్రాబాద్ సహాయ కార్యదర్శి కొమురెల్లి బాబు, నాయకులు గౌరీ నాగరాజ్, శ్రీహరి, రవికాంత్ పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌తో పర్యావరణ పరిరక్షణ



- ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ,హానరరీ చైర్మెన్ అజయ్ మిశ్రా

నవతెలంగాణ-బంజారాహిల్స్

సోలార్ విద్యుత్ వినియోగంతో పర్యావరణ పరిరక్షణతో పాటు రాయితీతో కూడిన ప్రభుత్వ ప్రోత్సాహం లభిస్తుందని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ,హానరరీ చైర్మెన్ అజయ్ మిశ్రా తెలిపారు. శుక్రవారం బంజారాహిల్స్ లోని హెూటల్ హయత్ పాలస్‌లో సోలార్ విద్యుత్ పానెల్స్‌ను వేగంగా ప్రజలకు చేరువ చేయటంతో పాటుగా అతి తక్కువ ధరల్లో నాణ్యమైన ఉత్పత్తులను తెలుగు రాష్ట్రాల ప్రజలకు అందించే లక్ష్యంతో సాత్విక్ సోలార్ సంస్థ స్వదేశీ సాంకేతికతో రూపొందించిన సరికొత్త సోలార్ మాడ్యుల్‌కు సంబంధించిన వ్యూహాత్మక భాగస్వామ్య పక్షాలుగా భాసు ఎనర్జీ సిస్టంతో ఒప్పందం చేసుకొని నూతన మాడ్యులర్‌ను విడుదల చేసింది. ఈ ఒప్పంద విశేషాలను ఇరు సంస్థల ప్రతినిధులు వెల్లడించారు.

అతిథిగా విచ్చేసిన అజయ్ మిశ్రా మాట్లాడుతూ... రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ ద్వారా తాను ప్రత్యక్ష ప్రయోజనం పొందుతున్నానన్నారు. సోలార్ విద్యుత్ రంగంలో సుప్రసిద్ధ కంపెనీలు కలవటం శుభ సూచకం అంటూ తమ తమ రంగాలలో నెంబర్ 1లు అయిన ఈ సంస్థలు 1 ప్లస్ 1 ఇక్వల్‌టూ 11 లా అభివద్ధి చెందాలని ఆకాంక్షించారు. టీఎస్ రెడ్కో వైస్ చైర్మెన్, ఎండీ ఎన్ జానయ్య మాట్లా డుతూ.. ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతున్న కరెంట్ బిల్లుల బాధ నుంచి ఉపశమనం పొందడానికి సౌర విద్యుత్ ఒక పరిష్కారం అన్నారు. తమ ఇండ్లపై రూఫ్‌టాప్ సోలార్ ప్యానెల్స్‌ను ఏర్పాటుచేసుకుని విద్యుత్ ఉత్పాదన చేయాలనుకునే వారికి 3కిలోవాట్ల వరకూ రూ. 78 వేలను సబ్సిడీగా ప్రభుత్వం అందిస్తున్నదని తెలిపారు.సోలార్ విద్యుత్ పర్యావరణ పరంగా సురక్షితమైనదన్న ఆయన వినియోగించిన విద్యుత్ పరిమాణం అనుసరించి జీరో బిల్లులు వచ్చే అవకాశం ఉందన్నారు. తమ వివరాలను పీఎం సూర్య ఘర్ ముక్త్ బిజిలీ యోజన స్కీమ్ ద్వారా నమోదు చేసుకోవడం ద్వారా పూర్తి వివరాలను తెలుసుకోవచ్చని తెలిపారు.

బాసూ ఎనర్జీ సిస్టమ్స్ ఎల్ఎల్‌పీ ఫౌండర్, చైర్మెన్ భవానీ సురేష్, శంతను సిర్సాత్, ఎండీ మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాలలో సాత్విక్‌సోలార్ పీవీ మాడ్యూల్స్ పంపిణీ చేయనున్నామన్నారు.సాత్విక్ రూపొందించిన దేశీయ సోలార్ మాడ్యుల్‌ను ఇప్పుడు విడుదల చేశామని,అత్యధిక సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం దీనికుందన్నారు. సాత్విక్ సోలార్ నేషనల్ హెడ్- సేల్స్ అండ్ మార్కెటింగ్ పుష్పేంద్ర మాట్లాడుతూ భారతదేశంలో అగ్రగామి సోలార్ మాడ్యుల్స్ తయారీదారులవుతామన్నారు.

కనిష్ట కోత విధానం ద్వారా నియంత్రణలోకి హైపర్‌టెన్షన్..

- ఇంటర్వెన్షన్ కార్డియాలజీ డైరెక్టర్ డాక్టర్ మనోజ్ కుమార్ అగర్వాల్



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందిని హైపర్‌టెన్షన్ లేదా అధిక రక్తపోటు ప్రభావితం చేస్తున్నది. లక్షణాలు కనిపించక పోవడం , తీవ్రమైన హృదయనాళ ప్రమాదాల కారణంగా "నిశ్శబ్ద కిల్లర్"గా ఇది గుర్తింపు పొందింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా ప్రకారం 30-79 సంవత్స రాల వయస్సు గల 1.28 బిలియన్ల మంది పెద్దలు రక్తపోటును కలిగి ఉన్నారు, వీరిలో 46 శాతం మందికి తమ పరిస్థితి గురించి తమకు తెలియదు. వైద్యపరమైన పురోగతి ఉన్నప్పటికీ, చాలా మంది రోగులు రక్తపోటు నియంత్రణ పరంగా తీవ్ర పోరాటమే చేస్తున్నారు.

జూబ్లీహిల్స్ అపోలో హాస్పిటల్స్‌లో ఇంటర్వెన్షన్ కార్డియాలజీ డైరెక్టర్ డాక్టర్ మనోజ్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ "ఆహార పరంగా మార్పులు, సాధారణ శారీరక శ్రమ, ఒత్తిడి నిర్వహణతో సహా జీవనశైలి మార్పులు రక్తపోటును నిర్వహించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. అయితే, చాలా మంది వ్యక్తులకు ఈ చర్యలతో పాటుగా సాంప్రదాయ ఔషధాల ద్వారా తమ రక్తపోటును ఆరోగ్యక రమైన రీతిలో నియంత్రణ లో ఉంచుకోవడం సాధ్యం కాదు" అన్నారు. "క్లినికల్ గణాంకాలు వెల్లడిస్తున్న దాని ప్రకారం, చికిత్స-నిరోధక రక్తపోటు ప్రాబల్యం నిరంతరం పెరుగుతోంది. ప్రస్తుతం అధిక రక్తపోటు జనాభాలో 17 శాతం నుండి 20 శాతం వరకు ఉన్నట్టు అంచనా. రెనెల్ డినెర్వేషన్ చికిత్స, ఈ నిరోధక రక్తపోటు ఉన్న రోగులకు చిరు ఆశను కల్పిస్తుంది. ఈ అతితక్కువ కోత ప్రక్రియ రేడియోఫ్రీక్వెన్సీ అబ్లేషన్ లేదా అల్ట్రాసౌండ్‌ని ఉపయోగించి మూత్రపిండ ధమనుల చుట్టూ ఉన్న సిమ్పా థెటిక్ నరాలను లక్ష్యంగా చేసుకుంటుంది. ఇది రక్తపోటును నియంత్రిం చడంలో కీలకమైనది. యాంజియోప్లాస్టీ మాదిరిగానే, ఆర్‌డీఎన్ మూత్రపిండ ధమనులలోకి ఒక చిన్న కాథెటర్‌ను చొప్పించి , రేడియో ఫ్రీక్వెన్సీ తరంగాలు లేదా అల్ట్రాసౌం డ్‌ను పంపిణీ చేయడం ద్వారా నిర్వహిం చబడుతుంది. 45 నిమిషాల ప్రక్రియ, లోకల్ అనస్థీషియా కింద నిర్వహి స్తారు. అదే రోజు డిశ్చార్జ్ చేయటమూ సాధ్యమవుతుంది" అని అన్నారు.



అంతర్జాతీయ జువెల్లరీ ఎగ్జిబిషన్ షురూ

నవతెలంగాణ-బంజారా హిల్స్...

ముత్యాల నగరంగా పేరు గాంచిన హైదరాబాద్ మహా నగరంలో ఈ సంవత్సరం అత్యంత గ్లామరస్ ఈవెంట్‌లలో ఒకటైన జ్యువెలరీ వరల్డ్ ఎగ్జిబిషన్‌ను మూడురోజుల పండుగ శుక్రవారం బంజారా హిల్స్ తాజ్ కృష్ణలో షురూ అయింది. ఈ సందర్భంగా నిర్వాహకురాలు సోనియా చావ్లా మాట్లాడుతూ... ఈ ఎగ్జిబిషన్, ఆభరణాల ప్రేమికులు, పెండ్లి కుటుంబాలు, వధువులు, పరిశ్రమ నిపుణులకు ఆహ్వానిస్తుందన్నారు. మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం ఉదయం 10 నుంచి రాత్రి 8 వరకు కొనసాగుతుందని ప్రపంచంలోని అత్యంత ప్రసిద్ధ డిజైనర్లు,బ్రాండ్ల నుంచి సంప్రదాయ,ఆధునిక ఆభరణాల డిజైన్‌లను అన్వేషించడానికి సందర్శకులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జ్యువెలరీ వరల్డ్ ఎగ్జిబిషన్ ఆభరణాల పరిశ్రమలో తాజా ట్రెండ్‌కూ ప్రస్తుత యువతకు వారి శైలికి అనువుగా అలాగే వివాహ కుటుంబాలు ఆభరణాల ఆసక్తికరులు ఇక్కడ ప్రదర్శనలో ఉన్న సంక్లిష్టమైన నైపుణ్యం, నవీనమైన డిజైన్‌లు అద్భుతమైన ముకుటాల ద్వారా ఆకర్షితులవుతారని చెప్పారు. సుమారు 50కి పైగా స్టాల్స్ ఏర్పాటు చేశారు.

ఆరు గ్యారెంటీల పథకాలకు అర్జీలు ఎక్కడ...



- అయోమయంలో ప్రజలు

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

6 గ్యారంటీలలోని పథకాలకు ఇంతవరకు అర్జీలు పెట్టుకోని వారు, అలాగే తిరిగి మరొకసారి అర్జీలు పెట్టుకోవాలనుకునేవారు ఎక్కడ చేసుకోవాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. అనేకమంది ప్రతిరోజు బేగంపేటలోని జ్యోతిరావు పూలే ప్రజా పాలన ఆఫీసు వద్దకు వెళ్లి వెనుతిరిగి వస్తున్నారు. అక్కడ ఉన్నతాధికారులు ప్రజా పాలన అర్జీలకు ప్రతి డివిజన్‌లో ఆఫీసు ఏర్పాటు చేశారని.. అక్కడకు వెళ్లి అర్జీలు పెట్టుకోవాలని చెబుతున్నారు. అయితే డివిజన్‌లోని వార్డు కార్యాలయాలలో అర్జీలు ఇవ్వాలని వెళ్తే ఇక్కడ కాదు బేగంపేట ప్రజా పాలన ఆఫీసుకు వెళ్లాలని జీహెచ్ఎంసీ అధికారులు ప్రజలకు సూచిస్తున్నట్టు తెలిసింది. దాంతో అక్కడకు, ఇక్కడకు అని తిప్పుతున్నారని, ఎక్కడా అర్జీలు తీసుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గృహజ్యోతి పథకాన్ని ఇంకా పొందనివారు, నూతన రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే వారు అనేకమంది ఉన్నారని అసలు దరఖాస్తులు ఎక్కడ తీసుకుంటారు? అధికారులు వివరంగా పత్రిక ముఖంగా తెలపాలని ప్రజలు కోరుతున్నారు. తాజాగా రహమత్‌నగర్ డివిజన్‌లో ఏర్పాటుచేసిన ప్రజా పాలన సేవా కేంద్రానికి డివిజన్‌లో రాజీవ్ గాంధీ నగర్ ఎస్‌పీఆర్ హిల్స్ నివాసి సొల్లు నరసయ్య దరఖాస్తు చేసుకోవడానికి రాగా ఇక్కడ దరఖాస్తులు తీసుకోము... గతంలో అర్జీలు పెట్టుకున్న వారి అప్లికేషన్ స్టేటస్ మాత్రమే తెలియజేస్తాము.. పథకాలు ఏమున్నా బేగంపేటలోని ప్రజాదర్బార్ లో మాత్రమే అప్లై చేసుకోవాలని సిబ్బంది చెప్పినట్టు తెలిసింది. దాంతో అధికారుల చుట్టూ తిరిగి విసిగిపోయినట్టు నరసయ్య ఆవేదన వ్యక్తం చేశాడు.

ముఖ్యమంత్రిని కలిసిన జీనోమ్ ఫౌండేషన్ సైంటిస్టులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

అరుదైన వ్యాధులపై సాధారణ ప్రజల గుర్తింపు నివారణ అవకాశం సరసమైన పరిష్కారాల కోసం జీనోమ్ ఫౌండేషన్ పనిచేస్తుందని ఫౌండేషన్ ఎండీ డాక్టర్ కేపీసీ గాంధీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఫౌండేషన్ ప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా జీనోమ్ ఫౌండేషన్ సైంటిస్టులు, డాక్టర్లు చేస్తున్న ప్రయత్నాలను వివరించారు. అనంతరం గాంధీ మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మేడిపల్లిలో ఫౌండేషన్‌కు 4.13 ఎకరాల భూమిని కేటాయించారని తెలిపారు. నగరంలో వినూత్న ఆరోగ్య సంరక్షణ కేంద్రం జెనోమిక్ వెల్‌నెస్ సెంటర్ ఫర్ ఇంటిగ్రేటివ్ మెడిసిన్ ఏర్పాటుతో పాటు అత్యధిక సౌకర్యాలు మౌలిక సదుపాయలతో మేడిపల్లిలో నిర్మించనున్న కొత్త భవనాన్ని శంకుస్థాపన చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించామన్నారు. అందుకు వారు సానుకూలంగా గొప్ప ఉత్సాహంతో అక్టోబర్ 9న శంకుస్థాపన చేయడానికి అంగీకరించారన్నారు. అలాగే ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. వివిధ వ్యాధులను సమగ్ర ఔషధం కోసం



నాన్ ఇన్వసివ్ రోగి కేంద్రీకృత ఆరోగ్య సంరక్షణకు కొత్త కేంద్రాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. రోగులకు వారి కుటుంబాలకు ఉచిత జన్యు సలహాలు సేవలు ప్రత్యమ్నాయ చికిత్స రోగ నిర్ధారణ సేవలను లాభ పేక్ష లేకుండా అందిస్తుందని తెలిపారు. సీఎంను కలిసిన వారిలో ప్రముఖ డాక్టర్ సైంటిస్టులు డాక్టర్ బి. సోమరాజు, డాక్టర్ డి.ప్రసాదరావు, ప్రొఫెసర్ పి.రెడ్డెన్న, డాక్టర్ కోసరాజు ఆర్.రావు, డాక్టర్ కార్తీక్ తదితరులున్నారు.

లైంగికదాడి ఘటన నిందితులను శిక్షించాలి

- గోల్కొండ చౌరస్తాలో నగర సీఐటీయూ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన

నవతెలంగాణ-సిటీబ్యూరో

పశ్చిమ బెంగాల్‌లో ఆర్‌జీ కార్ వైద్య కళాశాలలో జరిగిన లైంగికదాడి ఘటన నిందితులను వెంటనే కఠినంగా శిక్షించాలని, ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా న్యాయ విచారణ జరపాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. ఈమేరకు శుక్రవారం హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో గోల్కొండ చౌరస్తాలో కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టింది. ఈ సందర్భంగా సీఐటీయూ నగర కార్యదర్శి ఎం.వెంకటేష్ మాట్లాడుతూ వైద్యురాలికి సంబంధించిన లైంగిక దాడి ఘటన కేసు విచారణ వెంటనే పూర్తి చేయాలనీ, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఒక మెట్రోపాలిటన్ నగరంలో ఉన్న వైద్య కళాశాలలో ఇంత పెద్ద ఘటన జరగడం సమాజంలో మహిళలకు రక్షణ లేదనడానికి నిదర్శనమన్నారు. ప్రభుత్వాల నిర్లక్ష్యమే ఇందుకు కారణమన్నారు. ఆర్‌జీ కార్ కళాశాల వైద్యురాలు అత్యాచార ఘటన దోషులను తక్షణమే కఠినంగా శిక్షించాలనీ, విచారణ వెంటనే పూర్తి చేయాలన్నారు. జాప్యం జరిగితే దేశవ్యాప్తంగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఉద్యమం నిర్వహిస్తామన్నారు. సీఐటీయూ నగర శ్రామిక మహిళా కన్వీనర్ కిరణ్మయి మాట్లాడుతూ ఇది కేవలం ఒక అత్యాచార ఘటన మాత్రమే కాదని, ఇది మరో నిర్భయ ఘటన



అని అన్నారు. అత్యాచారానికి గురైన వైద్యురాలు ప్రతిఘటించిన క్రమంలో ఆమెపై విపరీతమైన దాడి జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. సామూహికంగా అత్యాచారం జరిగినట్టుగా ప్రాథమిక దర్యాప్తులో తేలిందని, కనుక సీబీఐ వెంటనే దర్యాప్తును పూర్తి చేసి.. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా న్యాయ విచారణ చేపట్టాలన్నారు. దేశంలో అనేక చోట్ల వైద్య సిబ్బందిపై దాడులు, అత్యాచార ఘటనలు జరుగుతున్నాయన్నారు. కావున వైద్య సిబ్బందిపై దాడులను నియంత్రించేందుకు సమగ్రమైన చట్టం తీసుకురావా లన్నారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ నగర అధ్యక్షులు కుమా రస్వామి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో నగర కోశాధికారి అజయ్ బాబు, నగర ఉపాధ్యక్షులు కామేష్ బాబు, మల్లేష్, రాములు, నగర సహాయ కార్యదర్శి మహేందర్, సత్యనారా యణ, శ్యామలీల, మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకులు భాను కిరణ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

కామర్స్ విద్యలో ఉన్నత ప్రమాణాలకు నెలవు

విజయనగర్ కాలేజ్ ఆఫ్ కామర్స్

నవతెలంగాణ-మెహిదీపట్నం



కామర్స్‌లో ఉన్నత విద్యను బోధించడంలో మాసబ్ ట్యాంక్ విజయనగర్ కాలనీలోని విజయ్ నగర్ కాలేజ్ ఆఫ్ కామర్స్ ఉన్నత ప్రమాణాలకు నిలువు అని త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి అన్నారు. మాసబ్ ట్యాంక్ లోని జేఎన్టీయూ లో జరిగిన విజయనగర్ కాలేజ్ ఆఫ్ కామర్స్ స్వర్ణోత్సవ వేడుకలకు వారు హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయనగర్ కాలేజ్ ప్రారంభం నుండి కూడా కామర్స్ ఉన్నత విద్యలో అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తుందని ఆయన తెలిపారు. ఎంతోమంది విద్యార్థుల ను ఉత్తమ పౌరులుగా ఈ కళాశాల తీర్చి దిద్దింద న్నారు. కామర్స్ విద్య కు మంచి భవిష్యత్తు ఉందని విద్యార్థులు సీఏ, సీఎంఏ, సీఎస్ వంటి ప్రొఫెషనల్ కోర్సులతో పాటు ఎంబీ ఏ, ఎంసీఏ లాంటి కోర్సులు కూడా చదవవచ్చని ఆయన స్పష్టం చేశారు. నేటి ఆధునిక ప్రపం చంలో వాణిజ్యశాస్త్రం లేని ప్రపంచాన్ని ఊహించడం అసాధ్యమ న్నారు. కళాశాల ప్రెసిడెంట్ డాక్టర్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ కళాశాల కార్యనిర్వాహక సభ్యుల సేవలను కొనియాడారు. అలాగే ప్రతి విద్యార్థి విధిగా రెండు మొక్కలు నాటి పర్యావరణానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కళాశాల సెక్రటరీ రాజ మహేం దర్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజులలో కళాశాలలో బీకాం ఫైనాన్స్ బిజినెస్ అనలిటిక్స్, ఇలాంటి కోర్సులను ప్రవేశపెడతా మన్నారు. ఉస్మానియా యూని వర్సిటీ కామర్స్ ప్రొఫెసర్ కృష్ణ చైతన్య మాట్లాడుతూ ప్రతి సంవత్సరం 40 నుండి 50శాతం వరకు విద్యార్థులు కామర్స్ కోర్సులలో ప్రవేశిస్తున్నారని తెలిపారు. కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బట్టు సత్య నారాయణ మాట్లాడుతూ విద్యా ప్రమాణాలతో పాటు విద్యార్థుల కృషివలనే మంచి ఫలితాలు వస్తాయన్నారు. తర్వాత కళాశాల పూర్వ విద్యార్థులను కళాశాల అధ్యాపక బృందం సన్మానించారు. విద్యార్థులు గీత, సంగీతాలు చేసిన భరత నాట్యం వినోద్ బాబు బృందం, కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ గోపాల్ ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమణమూర్తి సమ న్వయకర్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ప్రొఫెసర్ శివరాజ్, డాక్టర్ అశోక్ కుమార్, ప్రొఫెసర్ మనోహర్, శివకోటి, డాక్టర్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

'ఏసీబీ వలకు చిక్కిన కమర్షియల్ ట్యాక్స్ అధికారిణి'



నవతెలంగాణ-హిమాయత్ నగర్

హైదరాబాద్ నగరంలో ఏసీబీ ఆకస్మిక దాడుల్లో భాగంగా శుక్రవారం నారాయణగూడ సర్కిల్ డిప్యూటీ కమర్షియల్ ట్యాక్స్ అధికారిణి బి.వసంత ఇందిరా ఏసీబీ వలకు చిక్కారు. అకౌంట్లకు సంబంధించిన విషయమై ఆమె రూ.35 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు నేరుగా దొరికారు. వెంటనే ఆమెను అదుపులోకి తీసుకుని, తన వద్ద దొరికిన డబ్బును సీజ్ చేసి, ఆమెను నాంపల్లి కోర్టులో హాజరు పరిచినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

ప్రభుత్వ సంస్థల్లోని ఉద్యోగులపై అవినీతి నిరోధక శాఖ గట్టి నిఘా ఉంచాలి

నవతెలంగాణ-ధూల్‌పేట్



ప్రభుత్వ సంస్థల్లోని ఉద్యోగులపై, అధికారులపై అవినీతి నిరోధక శాఖ గట్టి నిఘా వేసి ఉంచాలని మూవ్మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (తెలంగాణ) అధ్యక్షుడు ముహమ్మద్ అబ్దుల్ అజీజ్ ఓ ప్రకటనలో కోరారు. అధికా రులు తమ విధులను సక్రమంగా నిర్వహించ డానికి కూడా ప్రజలనుంచి లంచం వసూలు చేయడం శోచనీయమన్నారు. ప్రభుత్వం, అధికారుల నుంచి తమకు కావాల్సిన పనులు చేయించుకోవడం సామాన్య ప్రజల హక్కు అని, తమకు ప్రభుత్వం ద్వారా అందే హక్కును కూడా గత్యంతరం లేక అవినీతిపరులైన ఉద్యోగులకు చదివించుకోవాల్సిన దుస్థితి దాపురించిందని ఆయన చెప్పారు. లంచగొండు లైన అధికారులు అక్రమ ఆస్తులను ప్రోగు చేసుకుంటూ కోట్లకు పడగలెత్తుతూ ఉండగా, మరోవైపున సామాన్య భారత పౌరులు తమ హక్కుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి రావటం కడు శోచనీయం అని తన ఆవేదనను వ్యక్తపరిచారు.

పాస్‌బుక్ ఉన్న ప్రతి ఒక్క రైతుకూ రుణమాఫీ చేయాలి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

రుణమాఫీకి ప్రభుత్వం విధించిన షరతు లను ఉపసంహరించుకోవాలని, రుణం తీసు కున్న రైతులందరికీ రుణమాఫీ చేయాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి ఆర్‌వీ. మహేందర్ కుమార్ అన్నారు. శుక్రవారం కోఠి బ్యాంక్ సీట్ లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైతాంగానికి ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన మాట తప్పిందని మండిపడ్డారు. ప్రతి రైతుకు రెండు లక్షల రూపాయలు రుణమాఫీ ఎలాంటి షరతులు లేకుండా వర్తింపచేయాలన్నారు. రైతులందరికీ రెండు లక్షల రూపా యలు రుణం వర్తించేదాకా విశ్రమించేది లేదని అన్నారు. రుణం తీసుకునేటప్పుడు లేని రేషన్ కార్డు నిబంధన ఇప్పుడు ఎందుకని ప్రశ్నించారు. పట్టాదారు పాసుబుక్ ఆధారంగానే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

యువతి అదృశ్యం..



నవతెలంగాణ-ధూల్‌పేట్

ఓ యువతి అదృశ్యమైన సంఘటన మంగళ్ హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సబ్ ఇన్‌స్పెక్టర్ షేక్ అస్లం తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ్ హాట్ గొడెకి ఖబర్ ప్రాంతానికి చెందిన మారుతి కుమార్తె శిల్పా నిర్గాడే(20) ప్రయివేట్ జాబ్ చేస్తుంది. వీరు కర్ణాటక హమ్నాబాద్ ప్రాంతానికి చెందినవారు ఇక్కడే నివాసం ఉంటున్నారు. ఈ నెల 14వ తేదీ ఉదయం ఇంట్లో నుండి బయటకు వెళ్లి ఎంతకీ తిరిగి రాలేదు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి అదృశ్యం..



ఓ విద్యార్థి అదృశ్యమైన సంఘటన మంగళ్ హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సబ్ ఇన్‌స్పెక్టర్ షేక్ అస్లం తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ్ హాట్ ఇంద్రానగర్ చర్చ గల్లి ప్రాంతానికి ప్రాంతానికి చెందిన లక్ష్మణ్ కుమారుడు ధనుష్(13) విద్యార్థి. ఈ నెల 22న సాయంత్రం ఇంట్లో నుండి బయటకు వెళ్లి ఎంతకీ తిరిగి రాలేదు. స్థానిక పోలీసులకు పిర్యాదు చేశారు. ఫిర్యాదు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రచురించిన యోధుడు షోయబుల్లా ఖాన్

- ఆవాజ్ నగర కార్యదర్శి అబ్దుల్ సత్తార్

నవతెలంగాణ-ధూల్ పేట్



నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పత్రికల్లో ప్రచురించిన యోధుడు షోయబుల్లా ఖాన్ అని ఆవాజ్ నగర కార్యదర్శి అబ్దుల్ సత్తార్ అన్నారు. ఆవాజ్ సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో షోయబుల్లా ఖాన్ 76వ వర్ధంతి సందర్భంగా ఐఎస్ సదన్ చౌరస్తా సౌత్ జిల్లా కమిటీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1948లో రజాకర్ల ఆగడాలను నిరసిస్తూ తన గళాన్ని వినిపించడానికి 'ఇంరోజ్ ' అనే ఉర్దూ పత్రికను నడిపేవారని గుర్తు చేశారు. ఆనాటి నిజాం నిరంకుశ పాలనకి వ్యతిరే కంగా వాస్తవాల్ని పత్రికల్లో రాస్తూ ప్రజల్ని చైతన్య పరిచేవారన్నారు. పాలకుల కుయుక్తుల, కుతంత్రాల గురించి ముఖ్యంగా ముస్లిం యువత నిజనిర్ధారణ చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో జిల్లా నాయకులు మహేష్ దుర్గే, శ్రవణ్ కుమార్, అతాహ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కుర్ని సంక్షేమ సంఘంలో నియంతృత్వ పోకడలను నియంత్రించాలి

- రాష్ట్ర కుర్ని యువసేన రాష్ట్ర అధ్యక్షులు కుర్నీ శ్రీనివాస్



నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ రాష్ట్ర కుర్ని సంక్షేమ సంఘంలో నియంతృత్వ పోకడలను నియంత్రించాలని ఆ సంఘం యువసేన రాష్ట్ర అధ్యక్షుడు కుర్ని శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు శుక్రవారం రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.క్రిష్ణయ్య, ఎమ్మెల్సీ కోదండరామ్‌లను కలిసి వినతి పత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కుర్ని యువసేన అధ్యక్షుడు కుర్ని శ్రీనివాస్ మాట్లాడుతూ.. బీసీ చేనేత సామాజిక వర్గానికి చెందిన వాళ్ళమని, చేనేత వృత్తిగా ఉన్న కుర్ని (బీసీ-బి క్రమ సంఖ్య 16) కు చెందిన వాళ్లమన్నారు. చేనేత వృత్తిగా ఉన్న కుర్ని కులానికి సంబంధించి 2015లో తెలంగాణ రాష్ట్ర కుర్ని సంక్షేమ సంఘం పేరిట ఒక సంఘాన్ని ఏర్పాటు చేశారని, ఈ సంఘం బాధ్యులు కులంలోని పేదల సంక్షేమం పట్ల గాని, యువతకు మార్గ నిర్దేశం చేసే అంశాన్ని ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. 2015 నుంచి ఇప్పటి వరకు నియంతృత్వంగా ఎన్నికలు నిర్వహించకుండా వారే సంఘాన్ని వారి గుప్పిట్లో పెట్టుకున్నారని విమర్శించారు. కొత్త కమిటీని ఎన్నుకోవాలని కుర్ని యువసేన యువత ఒత్తిడి తేగా నాలుగు గదుల మధ్య పిడికెడు మందితో కొత్త కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారని, దీనిని కుర్ని యువసేన తరపున విభేదించి ఎన్నికను బహిష్కరించామని శ్రీనివాస్ తెలిపారు. దీని పై కుర్ని యువసేన కార్యవర్గ సభ్యులు శంకర్, కిషోర్, రవికాంత్ తదితరులందరం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్యను, ఎమ్మెల్సీ కోదండరామ్‌ను కలిసి వినతి పత్రం సమర్పించామన్నారు. కుర్ని సంక్షేమ సంఘం ఏకపక్ష విధానాలపై, ఆర్.కృష్ణయ్య విస్మయం వ్యక్తం చేశారని, బాధ్యులను పిలిపించి ఎన్నికలు జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారని శ్రీనివాస్ తెలిపారు.

CHANGE OF NAME

I, BOOTHAPATY SWAJAN (Old Name), S/o B.Ramana R/o.987/D, Road No.84, Padmashali Township, Kapra Circle & (M), Medchal-Malkajgiri Dist., T.S., have changed my name as SWAJAN SHRIYON (New Name).

IN THE COURT OF THE HON'BLE III ADDL. CHIEF JUDGE, CITY CIVIL COURT, AT: HYDERABAD
E.P. No. 100 of 2007 IN O.P. No. 2324 of 2001

Between:
APSFC, Mahabubnagar Branch .Decree Holder
AND
M. Venkataramulu Goud and another .... Judgement Debtor

Notice to the Judgement Debtor i.e., M. Venkataramulu Goud, S/o. Bassanne Goud, R/o.2-3-70/39, Anantharam Nagar, Bagh Amberpet, Hyderabad-13.

Proclamation of Sale by the Decree Holder it is hereby informed to public at large that the following immovable property will be sold in public auction at 10.30 A.M. on 02.09.2024 in the Court premises.Attached immovable property is:

SCHEDULE OF PROPERTY

All the premises bearing House No. 2-3-70/39 on Plot No.39 admeasuring 234.67 sq.yards or 196.18 sq mtrs., in Sy.No 282/1, 283/1,2,3,284 and 285 situated at Bagh Amberpet Village, Ward No.2, Block No.3, Municipal Corporation of Hyderabad and bounded by North: Plot No.38, South: Plot No.40, East: MCH Play Ground & West: 30' wide Road.

By the order of Court
Sd/- Sri Challa Praveen Kumar, Advocate
Off: 2-1-340/16, 5th Floor, Sai Tara Towers, Beside Fever Hospital, Nallakunta, Nimboliadda, Hyderabad- 500044-
Ph No.9963672942

IN THE COURT OF THE HON'BLE PRL. RENT CONTROLLER AT HYDERABAD
O.S. No. 178 of 2019

BETWEEN.
The Osmangunj Extension Co-operative Housing Society Limited, New Osmangunj, Rep. by its Secretary Shri Goverdhandas Tapadia. ...Petitioner/Plaintiff
AND
Gobindram Sirumal Babani & others ...Respondents/Defendants

To.
Smt. Edara Alekhya W/o. E. Raman janeyulu, Defendant No.3 Aged about 39 years, Occ: Proprietor of M/s.Pal nadu Daily, Transport, Shop No.78 and 79, New Osmangunj, Hyderabad.

Please take notice that the above suit is filed seeking for eviction against the Defendants in respect of the schedule property and the Hon'ble Court was pleased to order notice to Defendant No.3 and the said suit is posted on 10.09.2024 for your appearance at 10.30 AM before the above said Hon'ble Court in person or through an Advocate. Failing which, the said suit will be heard and determined ex-parte.

By order of the court,
R.A. Achuthanand, Advocate
H.No.1-1-651/7/1, Gandhinagar Hyderabad-500 080.
Office Tel.:040 27613027,27608260

PUBLIC NOTICE

The Public in general are hereby informed that my client Sri.Gurinder Singh Malhotra and Smt. Sukpreet Kaur Malhotra entered in to an agreement of sale of the properties as set out herein below.

1. All that the Property bearing Municipal No. 1-2-212/B/16, admeasuring 189.00 Sq.yards, situated at Gagan Mahal, Domalguda, Hyderabad,TG and bounded by: North: Premises bearing no.1-2-211/12/12/B, South: Premises bearing no.1-2-211/B/17, East: 20' Wide Road, West: Land belonging to Gopal Singh.
2. All that the Property bearing Municipal No.1-2-212/B/17, admeasuring 248.00 Sq.yards, situated at Gagan Mahal, Domalguda, Hyderabad, TG and bounded by: North: House of Raj Reddy, South: House of Sheetal Singh, East: 20' Wide Road, West: Neighbours House.

The original owners of the above said properties have also represented that the properties are free from any litigation, charge, Minors interest, encumbrance, mortgages, charges lien etc. and since the date the original owners are in absolute possession and enjoyment of the above said properties. In this regard if any persons have right, interest or claim over the said properties or the documents should write to the undersigned within (7) days from the date of publication of this notice with documentary evidence to substantiate their claim. After the expiry of Seven (7) days period no claim or whatsoever shall be entertained and my client shall proceed with the Completion of Sale transaction as if there are no claims.

Sd- Vikas Chand, (Advocate)
D.no.112, 1st Floor, Happy Trade Centre, S.D.Road, Secunderabad-94
Cell No: 9247429065

IN THE COURT OF THE HON'BLE, II JUNIOR CIVIL JUDGE cum METROPOLITAN MAGISTRATE COURT, AT: MALKAJIGIRI
O.S. No. 871 OF 2021

Between:
Union Bank of Inda ...Plaintiff
AND
Sri Lakshmi Commercial Agencies ...Defendant

To
1.Sri Lakshmi Commercial Agencies Rep by its Proprietotrix M A Kasturi Bai W/o M N Anjalaiah age around Major, H No 13-20, Lothkunta Tirumalgiri Secunderabad-15
2. Anjiah Narasimha Manne S/o Narasimha age Major H No 13-20, Lothkunta Tirumalgiri, Secunderabad-15 ...Defendant

Whereas the above named plaintiff filed suit against the defendants for Recovery of Claim and the same is posted to 17-09-2024 at 10-30 A.M for your appearance. You are hereby directed by the Hon'ble Court to appear before the said Court on the date and time mentioned above. Otherwise the matter will be heard on your absence.

//BY ORDER OF THE COURT//
B.PRAVEEN KUMAR, Advocate
Office at 105, Plot 31, Hanmanth Reddy Complex, ChittareddyColony, Tadbund XRoad, Secunderabad-09

IN THE COURT OF PRINCIPAL DISTRICT AND SESSIONS JUDGE AT : BHONGIR
I.A.NO. OF 2024 IN I.A.NO.406 OF 2024 IN A.S.NO. OF 2024

Between:
Jakkula Jitender & Others ....Petitioners/Appellants
AND
Sadhuneni Nageshwar Rao and Others ....Respondents/Respondents

1. Sri. SADHUNENI NAGESHWAR RAO,S/o.S.Venkat Rao, Aged about 65 Years Occ: Agriculture, R/o.H-No.3-3-5/2A,Opp: Hyderabad Public High school, Ramanthapur, Hyderabad.500013.
2.Smt.SADHUNENI LAXMI NARSAMMA, W/o. S. Nageshwar Rao, Aged about 61 Years Occ: House hold, Both R/o. H-No.3-3-5/2A, Opp: Hyderabad Public High school, Ramanthapur, Hyderabad.500013. ....Respondents/Plaintiffs.

NOTICE

Take Notice that above named Petitioners/Appellants filed appeal against the Respondent No.1 and 2 in respect of the suit schedule property against the Respondents/ Respondents. The said appeal is posted for appearance of the Respondent No.1 and 2 on 11-09-2024 for their appearance. You will be present before on the above said court by 10:30 A.M. on the said date by person or your advocate otherwise the court will pass appropriate orders against you.

//BY ORDER OF THE COURT// Sd/-
G.RAVINDER REDDY RAMANAIAH, B.VEDESHWAR, A.MAHESH,
ADVOCATES: BHONGIR.
Counsel for the Petitioners/Appellants
Cell No.9553057875.
Bhongir
Dt:23-08-2024.

IN THE COURT OF THE PRL. JUNIOR CIVIL JUDGE AT KHAMMAM
O.S. NO. 558/2018

Between :
G. Lasya being miner rep. by Mother G Nagendra Kumari .... Plaintiff
AND
G. Venkateswarlu & others .... Defendants

To,
D10) Beeravolu Neeraja Devi, W/o. Surender Reddy, Age : 77 yrs, Occ : House Hold, H.No. 1-2-597/26, Valvika Nagar, Domalaguda, Hyderabad.

In the above case suit filed for partition in O.S. No. 558/2018 in the above court. The against the defendant no.10 and others Defendants. The above case is posted on 25-09-2024 for your appearance. Therefore you are hereby inform at appear before the above said court on 25-09-2024 at 10.30 AM either in person or through your counsel else matter will be heard in your absence.

// By order of the Court//
M. NIRANJAN REDDY
G. CHANDRA SEKHAR
D. NANDITADEVI
Advocates,
Khammam Khammam.
Dt:23-08-2024 Cell : 9849523606

IN THE HONORABLE COURT OF JUDICIAL MAGISTRATE OF FIRST CLASS AT PONDURU.
CRL.MP. 854/2024 in MC. NO. 12/2023

BETWEEN:
Duvva Kalpana @ indu ....Petitioner
AND
Duvva Damodar Rao@Ganesh S/o Rajarao 37 year Private Employee R/at 1-4-2/2 Flat No: 9 Road No:1 SRL Colony Kottapeta, Rangareddy District, Telangana state. .....Respondent

NOTICE

In the above matter the petitioner filed a maintenance Case against Respondent. The matter posted for appearance of respondent on 02.09.2024 at 10.30 am before this Honourable Judicial 1st class Magistrate Court at Ponduru Srikakulam district in Andhra Pradesh. In the absence of respondent the Honourable Court next step may be order against the respondent.

Hence this notice
K. KRISHNA RAO
Advocate for Petitioner
PONDURU, SRIKAKULAM, A.P.
Cell: 96525 30693

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT, AT: MAHESHWARAM
O.S.No.174 of 2024

Between:
Madilapuram Anji Reddy and others ...PLAINTIFFS
AND
1.The Tahasildar Maheshwaram Mandal, Ranga Reddy District.
2.All Concerned ...DEFENDANTS

To,
All Concerned.
That the general public are hereby informed that the plaintiffs herein filed the above suit for declaration to declare the plaintiffs are the legal heirs of deceased Smt MADILAPURAM PRAMEELAMMA, she died on 30-03-2024.
That the above suit posted on 09-09-2024 for appearance. Hence, in this regard if any person or persons having interest or objection whatsoever, then they may appear before the said Court at 10: 30 AM either personally or through an Advocate and submit their claims, otherwise, the matter will be decided exparte.

//By Order of the Court//
M/S.S.MURALI GOUD, ADVOCATE.
H.NO.6-54, Kandukur X Road Village, Kandukur Mandal, R.R.District.9948872977.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE-CUM-XIV ADDL METROPOLITAN MAGISTRATE AT: HAYATNAGAR RANGAREDDY DISTRICT
O.S.No.580 OF 2024

BETWEEN:
PANDUGULA HAMSAMMA. W/o.LATE PANDUGULA BUGGAIAH AND 6 OTHERS ...PLANITIFFS
AND
THE THASILDAR (ABDULLAPUR MET MANDAL)
ALL CONCERNED ...DEFENDANTS.

Take notice that the above named plaintiffs has filed the above Suit vide O.S.No.580 of 2024 against you (Defendant No.2) for seeking declaration of legal heir of Late Sri. LATE PANDUGULA BUGGAIAH any person or persons intending to seek any claims or objections, then they may raise their objections in the above suit. The suit stands posted on 30-08-2024 at 10:30 A.M for your appearance in person or through counsel, failing which the Hon'ble Court may pass orders in accordance with the law

(BY ORDER OF THE COURT)
S.RAJESH
ADVOCATE
OFF: 4-1986/5
PEDDA AMBERPET, (V). ABDULLAPURMET, (M), RANGA REDDY DIST
MOBILE: 9704233037
COUNSEL FOR PLAINTIEFS.

IN THE COURT OF THE HON'BLE PRL. RENT CONTROLLER AT HYDERABAD
O.S. No. 177 of 2019

BETWEEN:
The Osmangunj Extension Co-operative Housing Society Limited, New Osmangunj, Rep. by its Secretary Shri Goverdhandas Tapadia. ...Petitioner/Plaintiff
AND
J. Kishan Sirumal Babani and others ...Respondents/Defendants

To,
Smt. Edara Alekhya W/o. E. Raman janeyulu, Defendant No.4 Aged about 39 years, Occ: Proprietor of M/s.Pal nadu Daily, Transport, Shop No.78 and 79, New Osmangunj, Hyderabad.

Please take notice that the above suit is filed seeking for eviction against the Defendants in respect of the schedule property and the Hon'ble Court was pleased to order notice to Defendant No.4 and the said suit is posted on 10.09.2024 for your appearance at 10.30 AM before the above said Hon'ble Court in person or through an Advocate. Failing which, the said suit will be heard and determined ex-parte.

By order of the court,
R.A. Achuthanand, Advocate
H.No.1-1-651/7/1, Gandhinagar Hyderabad-500 080.
Office Tel.:040 27613027,27608260

IN THE COURT OF THE HON'BLET PRINCIPAL JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT, CUM XIV ADDL. JUDICIAL MAGASTRATE OF CLASS, AT: HAYATHNAGAR
I.A.NO.1047 OF 2023 IN O.S.NO. 26 OF 2018

Between:
Sri U.S.R.Phani Kumar ....Petitioner/Plaintiff
AND
Gaddam Babaiah & others ...Respondents/ Defendants

To,
Sri Arra Venkateshwar Reddy, S/o.Sri.A.Chenna Reddy, aged about 61yrs, Occ: Business, R/o.H.No.1-2-282, Flat No.404, J.B.Apartment, Domalguda, Hyderabad-500029. T.G.
....Respondent No.7/proposed Defendant No.7

The petitioner/plaintiff has filed the above numbered I.A to implead the name of 7th respondent Sri Arra Venkateswar Reddy, S/o Sri A.Chenna Reddy as the proposed 7th defendant in the suit and 7th respondent in the Interlocutory Appli cation viz., I.A.No.1047/2023. The I.A stands posted to 19-09-2024 for your appearance in person or through duly appointed Advocate at 10-30A.M and if you fail to so appear, the matter will be decided on merits, in your absence.

(BY ORDER OF THE COURT) Sd/-
S.MUJIB KUMAR
Advocate, High Court, Telangana State, Counsel for the petitioner/Plaintiff
H.No.16-11-16/T/5, West Prasanthnagar Colony, Moosarambagh, Hyd-500 036

BEFORE THE HONOURABLE CHAIRMAN, DISTRICT CONSUMERS RIGHTS PROTECTION REDRESSAL COMMISSION-III, AT: HYDERABAD
C.C.NO.133 of 2024

Between:
Merugu Ramesh, S/o.Late M.Balaiah, Aged about 52 yrs, Occ: Managing Director of RK Sweets, R/o.Ashok Colony, Sanathnagar, Hyderabad, Telangana State-18., ...Complainant
AND
1.A & P Engineering Company, represented by it's Proprietor Er.M.A.Quadeer, #18-13-8/J/47, Tulsi Nagar, Bandlaguda, Chandrayan Gutta Road, Hyderabad-500005, TG State.
2.Er.M.A.Quadeer, Proprietor of A & P Engineering Company, #18-13-8/J/47, Tulsi Nagar, Bandla guda, Chandrayan Gutta Road, Hyderabad-500005, TG State. Cell no.9949151268.
....Opposite-Parties.

NOTICE

Whereas the above mentioned Complainant have filed the CC no. 133 of 2024 for declaration of the Complainant for the claim of compensation on the file of the court of Hon'ble Chairman, District Consumer Rights Protection Redressal Commission-III, At Hyderabad. Therefore the Hon'ble Court was pleased to issue notice through paper publication to the opposite parties 1 and 2. Please take notice that the above said case is posted for appearance on 13-09-2024, on that day you should appear either through an advocate or in person before the Hon'ble Court at 10:30 AM without fail. If fail to appear before the Hon'ble Court on the above said day the case will be decided as exparte.

//By Order of the Honourable Court//
Sd/-
R.SREENIVASA RAO
M.KALAVATHI
M.INDRAJA
ADVOCATES,
Flat no.404, Sai Sarada Enclave, Road no.12, Banjara Hills, Hyderabad, Telangana State

గోషామల్ సర్కిల్-14 ఏఎంహెచ్ఓగా డా.వెంకట్ రమణ



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

జీహెచ్ఎంసీ గోషామాల్ సర్కిల్ -14 ఎఎంహెచ్ఓగా డాక్టర్ వెంకట్ రమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అబిడ్స్‌లోని ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పారిశుధ్యం పై ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఎప్పటిక ప్పుడు సర్కిల్ పరిధిలోని అన్ని ప్రాంతాలను తనిఖీ చేస్తామన్నారు. స్వచ్ఛ ఆటోల ద్వారా చెత్తను ఎప్పటికప్పుడు తరలిస్తామన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక కార్మికుడు విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ సమయ పాలన పాటించాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గంలోని అడిక్మెట్ డివిజన్, ముషీరాబాద్ డివిజన్ కి చెందిన సీఎం రిలీఫ్ ఫండ్ దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులకు (3,37000) విలువగల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ లు శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాకేష్ కుమార్, శంకర్ ముదిరాజ్, మీడియా ఇంచార్జ్ ముచ్చ కుర్తి ప్రభాకర్, అస్లాం, ఖదీర్, దీన్ దయాల్ రెడ్డి, భాస్కర్, బల్వంత్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేరస్తులను కఠినంగా శిక్షించాలి

- ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ మహిళా సబ్ కమిటీ
- విషాద ఘటనను నిరసిస్తూ కమిటీ కాన్వాస్‌పై సంతకాల సేకరణ



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ఇటీవల కలకత్తాలో ట్రైనీ డ్యూటీ యువ వైద్యురాలిపై జరిగిన లైంగిక దాడి, హత్య ఘటనకు కారకులైన నేరస్తులను కఠినంగా శిక్షించాలని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ మహిళా సబ్ కమిటీ డిమాండ్ చేసింది. కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సెక్రటేరియట్ ఎల్ఐసీ హైదరాబాద్ జోనల్ కార్యాలయంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగులు, క్లాస్-1 అధికారులు, నిలోఫర్ పీజీ మెడికల్ విద్యార్థులు నిరసన వ్యక్తం చేస్తూ కమిటీ కాన్వాస్‌పై సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జాతీయ పూర్వ ఉపాధ్యక్షులు వీ.వీ.ఆర్.శాస్త్రి, ప్రధాన కార్యదర్శి జి.తిరుపతయ్య మహిళా సబ్ కమిటీ కన్వీనర్ వి.మైథిలి మాట్లాడుతూ వైద్యురాలిని అత్యంత పాశవికంగా లైంగిక దాడి, హత్య చేసిన నిందితులకు ఉరిశిక్ష విధించాలని వారు డిమాండ్ చేశారు. గత పది రోజుల క్రితం జరిగిన ఈ ఘటన దేశ ప్రజలందరిని తీవ్రంగా కలచివేసిందని, ఈ అమానవీయ చర్యతో యావత్ దేశం దిగ్భ్రాంతికి గురైందని పేర్కొన్నారు. బంగారు భవిష్యత్తును కలలుగన్న ఆ యువ వైద్యురాలు అర్ధాంతరంగా తన జీవితాన్ని కోల్పోయిన ఈ ఘటనకు కారకులైన నేరస్తులను, హేయమైన రీతిలో హింసకు గురి చేసిన వారి వెనుక ఉన్న యంత్రాంగంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం నిలోఫర్ పీజీ వైద్య విద్యార్థులు డాక్టర్ తేజస్, డాక్టర్ సుహానా మాట్లాడుతూ దేశం యావత్తూ తమ ఉద్యమానికి మద్దతు పలికినా, పాలకుల నుండి మాత్రం సరైన స్పందన లేకపోగా, ఎలాంటి ఉపశమనం కలిగే చర్యలు చేపట్టలేదని, ఇలాంటి చర్యల వల్ల వైద్య వృత్తిలోనే గాక, ఇతర విద్యార్థినులు, మహిళా ఉద్యోగినుల ఆత్మ స్థైర్యం దెబ్బ తింటుందన్నారు. వైద్యేతర సమాజం నుండి ఇలాంటి మద్దతు రావడం ఆహ్వానించదగిందని తెలిపారు. ఇందులో మహిళలే కాక, అన్ని తరగతుల ఉద్యోగులు, అధికారులు అధిక సంఖ్యలో పాల్గొని తమ సంతకాలు చేశారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ డివిజన్ అధ్యక్షులు ఎల్.మద్దిలేటి, జోనల్ ఉపాధ్యక్షురాలు పి.సుజాత, డివిజన్ ఉపాధ్యక్షురాలు ఎస్.ఝాన్సీ లక్ష్మి, కమిటీ కో-కన్వీనర్లు సరస్వతి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

షేరింగ్ ఆటో ప్రయాణికులే టార్గెట్

- దృష్టి మళ్లించి దోచుకుంటున్న ముఠా
- నలుగురు నిందితుల అరెస్టు
- రూ.8.82లక్షల విలువగల సొత్తు స్వాధీనం



నవతెలంగాణ-సిటీబ్యూరో

షేరింగ్ ఆటో ప్రయాణికుల దృష్టి మళ్లించి దోచుకుంటున్న నలుగురు నిందితులను టాస్క్ ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి బంగారు ఆభరణాలు, ఆటో, రెండు ఫోన్లతో పాటు రూ.2000నగదును స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.8,82,000 ఉంటుందని పోలీసులు తెలిపారు. శుక్రవారం డీసీపీ సుధీంద్ర తెలిపిన వివరాల మేరకు ఢిల్లీకి చెందిన ఇర్ఫాన్, బోరబండకు చెందిన మాహ్మద్ ఫిరోజ్, ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన షకీర్, ఆయన భార్య రుబీ ఒక ముఠాగా ఏర్పాడ్డారు. వీరు రైల్వే స్టేషన్లు, బస్టాండ్స్ వద్ద షేరింగ్ ఆటోను పెట్టుకుని ప్రయాణీకులను గమనిస్తుంటారు. లగేజీతో వెళ్లేవారిని టార్గెట్ చేస్తారు. ఎక్కడికి వెళ్లాలని అడుగుతారు. పథకం ప్రకారం ముందుగానే ఆటో లో షకీర్ ఆయన భార్య రుబీ ఆటో వెనుక సీటులో ప్రయాణీకులుగా కూర్చుంటారు. ఆటోను డ్రైవర్ ఫేరోజ్ నడిపిస్తూ బ్యాగ్‌లు, లగేజీవున్న ప్రయాణీకులను, దూరం వెళ్లే వారిని ఎక్కించుకుంటాడు. మార్గ మధ్యలో ఇర్ఫాన్ ఆటోను ఆపి ప్రయాణికునిగా ఎక్కుతాడు. దాంతో ప్రయాణీకుల బ్యాగ్‌లను, లగేజీని సీట్ వెనుకాలా పెట్టాలని డ్రైవర్ ఫేరోజ్ ప్రయాణీకులకు సూచిస్తాడు. కొంత దూరం వెళ్లిన తర్వాత ప్రయాణీకుల దృష్టి మళ్లిస్తారు. అదే సమయంలో వెనుక సీట్లో కూర్చున షకీర్, రుబీ ప్రయాణీకుల బ్యాగ్‌లోని విలువైన వస్తువులు, నగదును చాకచక్యంగా కొట్టేస్తారు. పనికాగానే ఆటోను రోడ్డుపై నిలిపేసీ బ్రేక్ డౌన్ అయినట్టు నటిస్తారు. ముఠా సభ్యులందరూ ప్రయాణీకుల్లానే వేర్వేరుగా విడిపోతారు. నిజమైన ప్రయాణీకులను మాత్రం రోడ్డుపైనే వదిలేస్తారు. వారు వెళ్లిన తర్వాత నలుగురు నిందితులు తిరిగి కలుస్తారు. నగరంలో ఇలాంటి మోసాలు అధికం కావడంతో పాటు ఈ మధ్యనే బేగంపేట్‌లోని ప్యారడైజ్ హెూటెల్ వద్ద ఇదే తరహాలో ప్రయాణీకులను దోచుకున్నారు. బాధితుల ఫిర్యాదుతో బేగంపేట్ పోలీసులు, నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్సు పోలీసులు ప్రత్యేక నిఘా వేశారు. ఈ క్రమంలో నిందితులను అరెస్టు చేశారు. షేరింగ్ ఆటోలో ప్రయాణిచే సమయంలో ప్రయాణీకులు అప్రమత్తంగా ఉండాలని డీసీపీ తెలిపారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ సైదులు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై లైంగిక దాడులను అరికట్టండి

- పీఓడబ్ల్యూ, పీవైఎల్ నిరసన ర్యాలీ



నవతెలంగాణ-ముషీరాబాద్

దేశంలో మహిళలపై రోజు రోజుకి పెరుగుతున్న లైంగిక దాడులను అరికట్టాలని పీ.ఓ.డబ్ల్యు, పీ.వై.ఎల్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పీ.ఓ.డబ్ల్యు, పీ.వై.ఎల్ ఆధ్వర్యంలో విద్యానగర్ మార్క్స్ భవన్ నుండి రాంనగర్ మీ సేవ వరకు ర్యాలి నిర్వహించి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పీ.ఓ.డబ్ల్యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డి.స్వరూప, సి.హెచ్ శిరోమణి, పీ.వై.ఎల్ రాష్ట్ర అధ్యక్షులు కే.ఎస్ ప్రదీప్‌లు మాట్లాడుతూ.. చిన్న పిల్లలు సైతం గ్యాంగ్ రేపులకు గురవుతున్న భయంకర పరిస్థితికి నేటి సమాజం చేరుకున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ రాష్ట్ర మాజీ కార్యదర్శి చంద్ర అరుణ, రాష్ట్ర నాయకులు విజయలక్ష్మి, గోదావరి, కల్పన, ఝాన్సి, లక్ష్మి, పి.వై.ఎల్ నాయకులు ప్రతాప్, రాకేష్, ఈశ్వర్, రవి కుమార్, కృష్ణ, ప్రేమ్ సింగ్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆశయ సాధన కోసం అవిశ్రాంతంగా కృషి చేయాలి

- బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయాదేవి



నవతెలంగాణ-ధూల్‌పేట్

ఆశయాలకు, ఆచరణకి మధ్య అలసత్వం కూడదని, అవిశ్రాంతంగా ప్రయత్నించటమే విజయానికి మార్గమని బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయాదేవి అన్నారు. బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో సిటీ కళాశాలలో ఏర్పాటైన ఉచిత సివిల్ సర్వీసెస్ ఫౌండేషన్ కోర్సు మూడో బ్యాచ్ ప్రారంభ సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ... ఆరంభోత్సాహంతో ఆగిపోకుండా గమ్యాన్ని చేరుకునే వరకు పట్టుదలతో కృషి చేసినవారే విజేతలవుతారన్నారు. ఈ తరం విద్యార్థులకు, యువతకు వివిధ ఉద్యోగ అవకాశాల సాధనకు తగిన వనరులు, శిక్షణ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వాటిని సముచితంగా వినియోగించుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని అభిలాషించారు. చిన్న ఉద్యోగాలు సాధించటం అభినందనీయమే కానీ, అక్కడితో మన ప్రయాణం ఆగకూడదని, ప్రతి విద్యార్థి నిత్యం కనీసం రెండు దినపత్రికలు చదవాలని సూచించారు. సిటీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం చేస్తున్న కృషిని అభినందిస్తూ భవిష్యత్తులో కళాశాలతో కలసి మరిన్ని విద్యార్థి కేంద్రక కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ మాట్లాడుతూ.. బీసీ స్టడీ సర్కిల్ సెంటర్ ద్వారా వివిధ పోటీపరీక్షలకు శిక్షణ అందించామన్నారు. ఈ శిక్షణకు ఇతర కళాశాలల విద్యార్థులు కూడా ఆసక్తి చూపుతున్నారని, ఈ విడత 30 మంది ఇతర కళాశాలల విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. కెరీర్ గైడెన్స్ విభాగం కన్వీనర్ డాక్టర్ కె.భాస్కర్ మాట్లాడుతూ.. గత రెండు సంవత్సరా లలో వివిధ పోటీ పరీక్షలకు కళాశాలలో అందించిన శిక్షణ, విజేతల వివరాలు తెలిపారు. ఈ సమావేశంలో బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, కోర్సు కో ఆర్డినేటర్ బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డా.విప్లవ దత్ శుక్లా, డాక్టర్.జె.నీరజ, డా.శంకర్, డా.కృష్ణవేణి, శాంతి తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగ కృషితోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైంది



- ఈజీఎస్ తెలంగాణ స్టేట్ డైరెక్టర్ దళిత రత్న అందే యాకయ్య

నవతెలంగాణ-ముషీరాబాద్

మందకృష్ణ మాదిగ కృషితోనే ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుతో సాధ్యమైందని ఈజీఎస్ తెలంగాణ స్టేట్ డైరెక్టర్ దళిత రత్న అందే యాకయ్య అన్నారు. శుక్రవారం ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పై హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగను తన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అందే యాకయ్య ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. మంద కృష్ణ మాదిగ 30 సంవత్సరాల పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు అని అన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ ను స్థాపించిన తర్వాతనే మాదిగలలో ఆత్మగౌరవం అధికారులలో గౌరవం పెరిగిందన్నారు. అధికారంతో కుర్చీ మీద కూర్చొని గౌరవంగా మాట్లాడే స్వేచ్ఛ అప్పుడే మొదలయింది అని పట్టువదలకుండా తాను చేసిన ఉద్యమం వలన వర్గీకరణకు సుప్రీంకోర్టు తీర్పు అనుకూలంగా జడ్జిమెంట్ రావటం ముమ్మాటికి మంద కృష్ణ మాదిగ కృషి మాత్రమే అని అన్నారు. వర్గీకరణకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ నరేష్ మాదిగ , అందె సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విష్ణు నారాయణ్ బాత్కాండే జయంతి వేడుకలు..

- సితార్ విద్వాంసులు, ప్రిన్సిపాల్ పాండురంగ ముతాలిక్



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

విష్ణు నారాయణ్ బత్కాండే జయంతిని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ శ్రీ త్యాగరాజ గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ మ్యూజిక్ అండ్ డాన్స్ ఆధ్వర్యంలో శుక్రవారం రాంకోఠిలోని శ్రీ త్యాగరాజ ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో విష్ణు నారాయణ్ జయంతి ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సితార్ విద్వాసులు, కళాశాల ప్రిన్సిపల్ పాండురంగ్ ముతాలిక్ ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల లెక్చరర్ శ్వేత హిందుస్థాని ఒకల్ కచేరి ఎంతగానో ప్రేక్షకులను అలరించింది. సితార్ విద్వాంసులు, ప్రిన్సిపల్ పాండురంగ్ ముత్తాలిక్ సితార్ వాయిద్యంతో పూర్వ ధనశ్రీ రాగం, హంస ధ్వని రాగం, శివరంజని రాగంతో సితార్‌ను అద్భుతంగా రాగాలను పలికించారు. శిష్య బృందం ఆనందంతో పర్వశించారు. సంగీత విద్యార్థులకు ఎంతో ప్రేరణగా నిలిచింది. ఈ సందర్భంగా మాజీ ప్రిన్సిపల్ రామచంద్రమూర్తి, మాజీ సితార్ అధ్యాపకులు, నిజామాబాద్ మ్యూజిక్ స్కూల్ ప్రిన్సిపల్ పి.రవీందర్ రాజులను ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రిన్సిపాల్ పాండురంగ్ ముత్తాలిక్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంగీతాన్ని సాహిత్యాలను ఎంతగానో ప్రోత్సహిస్తున్నారన్నారు. ఈ సంగీత నృత్య కళాశాలలో ప్రముఖ సంగీత విద్వంసులను గుర్తు చేసుకుంటూ వారి జయంతిలను ఘనంగా నిర్వహించుకోవడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టి జయ కిషన్, వినాయక్ కయాల్‌లు వాయిద్య సహకారం అందించారు. రవీందర్‌రాజు, గుమ్మడి జనార్ధన్‌లతో పాటు సంగీత అధ్యాపకులు వారి శిష్య బృందం పాల్గొన్నారు.

'ట్రిపుల్ టెస్ట్' తీర్పు అంశంపై ప్రత్యేక చర్చ జరగాలి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ



నవతెలంగాణ-ముషీరాబాద్

ఈనెల 25న వివిధ జిల్లాలలో జరుగుతున్న బీసీ అడ్వకేట్ల సమావేశంలో బీసీ జనాభా దామాషా రిజర్వేషన్ల పాలిట అడ్డగోలుగా మారిన 'ట్రిపుల్ టెస్ట్' తీర్పు అంశంపై చర్చ జరగాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ కోరారు. ఈ మేరకు విద్యానగర్ బీసీ భవన్ లో శుక్రవారం బీసీ నాయకులు సమావేశంలో ఎర్ర సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 శాతం రిజర్వేషన్ల పరిమితి అధికారిక కమిషన్, వెనుకబడినతనం, నిర్ధారణల ప్రాతిపదికపైనే బీసీ రిజర్వేషన్లు వివిధ రంగాలలో నియమించబడాలనే ట్రిపుల్ టెస్ట్ సుప్రీం తీర్పు రాజ్యాంగ సవరణ ద్వారా వచ్చిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు చట్టం ద్వారా బలహీన పడినందున, ఈ తీర్పు ప్రామాణికత కోల్పోయిన వైనంపై విస్తృత చర్చ జరపాలని బీసీ వాదులకు, న్యాయవాదులకు, రాజ్యాంగ పరిరక్షణ అభిలాషులను కోరారు. బలహీనపడ్డ ఈ తీర్పును వాడుకోని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లు 18 నుండి 23శాతంతో జరపాలని రాష్ట్ర ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలని ఆయన కోరారు. ఈ అంశంపై ఈమధ్య హైకోర్టులో జరిగిన ఒక ముఖ్య వాజ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇందులో పార్టీగా దూరిన బీఆర్ఎస్ పార్టీ ఏకకంఠంతో ఈ ట్రిపుల్ టెస్ట్ తీర్పుకు మద్దతు ఇచ్చిన నేపథ్యంలో బీసీల వ్యతిరేక అంశంలో ఈ రెండు పార్టీల వైఖరి ఒకటేనని తేటతెల్లమైందని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న పది సంవత్సరాలు బీసీలను అన్ని రంగాలలో నిండా ముంచడమే కాకుండా దేశంలో ఎక్కడా లేని విధంగా ఉన్న రిజర్వేషన్లను కూడా సగానికి కుదించి ఇప్పుడు రాజకీయం కొరకు అనుకూలంగా ఉద్యమించడం దుర్మార్గమనీ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పార్టీ బీసీ వ్యతిరేకత వైఖరిని నిండా మునిగిన బీఆర్ఎస్ నాయకులు ఇంకా బానిస ఆలోచనలను మానుకొని సొంత బీసీ రాజకీయ పార్టీ పెట్టుకొని బీసీలకై ఉద్యమించాలి తప్ప బీసీ వ్యతిరేక పార్టీకి భుజాలిచ్చే ప్రయత్నాలు మానుకోవాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో నందగోపాల్, రాందేవ్, మనోజ్ గౌడ్, ఊరగాయం మహేష్, తదితరులు పాల్గొన్నారు.

'చట్ట సభల్లో జర్నలిస్టుల గొంతుకగా నిలబడతా'

- ఎమ్మెల్సీ ఆమెర్ అలీ ఖాన్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ఓ పత్రికా సంపాదకుడిగా జర్నలిస్టుల కష్టసుఖాలపై తనకు ఎంతో అవగాహన ఉందని, చట్ట సభల్లో జర్నలిస్టుల గొంతుకగా నిలబడతానని ఎమ్మెల్సీ, సియాసత్ ఉర్దూ దిన పత్రిక సంపాదకులు ఆమెర్ అలీ ఖాన్ భరోసా ఇచ్చారు. తెలంగాణ శాసన మండలి సభ్యులుగా ఇటీవల ఆయన బాధ్యతలు చేపట్టిన సందర్భంలో శుక్రవారం బషీర్‌బాగ్‌లోని టీయూడబ్ల్యూజే కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే), హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యూజే) సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సత్కార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దాదాపు యాభై ఏండ్లుగా తమ కుటుంబానికి ఈ యూనియన్‌తో సంబంధం ఉందని, యూనియన్ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పాలు పంచుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు. జర్నలిస్టులకు ఎలాంటి ఆపద వచ్చిన తన వంతు చేయూత అందిస్తానని ఆమెర్ అలీ ఖాన్ హామీ ఇచ్చారు. అనంతరం టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ మాట్లాడుతూ సియాసత్ పత్రికా వ్యవస్థాపకులు ఆబిద్ అలీ ఖాన్ ఉమ్మడి రాష్ట్రంలోని తమ ఏపీయూడబ్ల్యూజే సంఘంలో క్రియాశీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. రాష్ట్ర అక్రిడిటేషన్ కమిటీలో తమ యూనియన్ ప్రతినిధిగా, ప్రెస్ అకాడమీ పాలక మండలి నియామక వీధి విధానాల కమిటీ చైర్మెన్‌గా ఆయన కొనసాగారని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాజీ సభ్యులు ఎం.ఎ. మాజీద్, టీయూడబ్ల్యూజే కార్యదర్శి వి.యాదగిరి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.రాజేష్, చిన్న మధ్య తరగతి పత్రికల సంఘం అధ్యక్షులు యూసుఫ్ బాబు, హెచ్‌యూజే అధ్యక్షులు శిగా శంకర్ గౌడ్, కార్యదర్శి హమీద్ షౌకత్, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

'సోమనాథ్ శర్మ మృతి పట్ల ప్రగాఢ సంతాపం'

నవతెలంగాణ-హిమాయత్ నగర్



మృతుడు సోమనాథ్ శర్మ(ఫైల్)

ఆర్య సమాజ్ సంఘ కార్యకర్త, తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ వ్యవస్థాపకులు, ప్రముఖ సంఘ సేవకులు, విద్యావేత్త సోమనాథ్ శర్మ ఆర్య మృతి పట్ల టీసీసీ, తెలంగాణ మేధావుల ఫోరం కార్యవర్గ సభ్యులు ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ మాట్లాడుతూ ప్రముఖ ఆర్య సమాజ్ సంఘకర్త సోమనాథ్ శర్మ ఆర్య మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గత 40 ఏండ్లుగా ఆర్య సమాజ్ అభివృద్ధి, సమాజ సంక్షేమం, శాంతి, పర్యావరణం, జాతీ య సమైక్యత, ఆర్య సమాజ అభివృద్ధి కోసం ఋషి స్వామి వివేకానంద సరస్వతి జీవిత చరిత్రపై ఎన్నో అవగాహన శిబిరాలు, యజ్ఞలు నిర్వహించి ప్రజలను జాగృత పరిచి ఎన్నో అవార్డులు అందుకున్నారని గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, గవర్నర్లు వివిధ సంస్థల ద్వారా ఎన్నో పురస్కారాలు అందుకున్నారన్నారు. ఆర్య కన్య పాఠశాలలో కార్యదర్శి, కరస్పాండెంట్‌గా నిరు పేద విద్యార్థిని, విద్యార్థులకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి వారి విద్యా వాప్తికి ఆయన ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, ప్రొఫెసర్ డా. ధర్మతేజ ఆర్య, సం స్కృత విభాగం హెడ్, హెచ్ఓడి ప్రొఫెసర్ విద్యానంద ఆర్య, ఫ్రీడమ్ ఫైటర్ గంగారాం, భక్తురామ్, లైన్స్ క్లబ్ అధ్య క్షులు లయన్ ప్రేమ్ చంద్, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాలు పాల్గొని మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



నవతెలంగాణ-ధూల్‌పేట్

ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఎస్ విధానం రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీఎస్ సీపీఎస్ ఈయు హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు కె.శ్యామ్ సుందర్ డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో బహదూర్ పుర తాడుబన్ ప్రభుత్వ ఓల్డ్ సిటీ ఐటీఐలో శుక్రవారం మధ్యాహ్న భోజన విరామంలో ఉద్యోగులు నిరసన వ్యక్తం చేస్తూ, జీవో 28 ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయడంలో జాప్యం చేస్తుందన్నారు. కోరుకున్న తెలంగాణ తెచ్చుకున్న కూడా ఉద్యోగులకు సీపీఎస్ విధానం రద్దు చేయకపోవడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కొత్త పెన్షన్ విధానానికి ముడి పెట్టడంతో బ్లాక్ డేగా గుర్తిస్తూ జీవో పతులను దగ్ధం చేస్తున్నామన్నారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్ సీపీఎస్ఈయు జాయింట్ సెక్రటరీ వి. ప్రశాంత్ రావు, ఓల్డ్ సిటీ ఐటిఐ ఉపాధ్యాయులు ఏ కవిత, అబ్దుల్ మజీద్, మొయినుద్దీన్, బలిరాం, అబ్దుల్ కరీం, సఫియా బేగం, ముత్యం రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డీసీడీపీ ప్రోగ్రామ్‌ను సద్వినియోగించుకోవాలి



నవతెలంగాణ-ముషీరాబాద్

భారత ప్రభుత్వ - తపాల శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన డీసీడీపీ(డాక్ కమ్యూనిటీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్)ను సద్వినియోగం చేసుకోవాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం గాంధీనగర్ డివిజన్ జానప్రియా అబ్బోడ్స్ అపార్టుమెంట్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎ.పావని వినయ్ కుమార్ హాజరై మాట్లాడుతూ.. భారత ప్రభుత్వ పోస్టల్ డిపార్టుమెంట్ వారి పోస్టాఫీసు ద్వారా అమలు కాబడుతున్న పథకాలు, సేవల ద్వారా ప్రజలు ఆర్థిక సాధికారత పెంపొంది, జీవన శైలి అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతి ఒక్కరు భారత ప్రభుత్వ - పోస్టల్ డిపార్టుమెంట్ అందిస్తున్న సేవలను మీ దగ్గరలోని పోస్ట్ ఆఫీస్ కార్యాలయాన్ని సందర్శించి వివరాలను క్లుప్తంగా తెలుసుకొని పథకాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్ కుమార్, అసిస్టెంట్ సూపరింటెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీస్ సాగర్ దండపూడి ,గాంధీనగర్ సబ్ పోస్ట్ మాస్టర్ ఫిరోజ్ ఖాన్, వారి సిబ్బంది జానప్రియ అబడ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు స్వామి దాస్,సెక్రటరీ మల్లేష్, కోశాధికారి చేంద్రకల, కమిటీ సభ్యులు,అపార్టుమెంట్ వాసులు పాల్గొన్నారు

తెలంగాణలో నారాయణ, శ్రీ చైతన్య కళాశాలలను రద్దు చేయాలి

- పీడీఎస్‌యు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి బోనగిరి మధు, పొడపంగి నాగరాజు

నవతెలంగాణ-ముషీరాబాద్



తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి నారాయణ శ్రీ చైతన్య కార్పొరేట్ విద్యా సంస్థలను రద్దు చేయాలని పీడీఎస్‌యు తెలంగాణ రాష్ట్ర కార్యవర్గం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శుక్రవారం విద్య నగర్‌లోని చంద్ర పుల్లారెడ్డి భవన్ భవన్‌లో పీడీఎస్‌యు తెలంగాణ రాష్ట్ర కార్యవర్గం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పీడీఎస్‌యు తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భువనగిరి మధు బోనగిరి మధు, పొడపంగి నాగరాజులు మాట్లాడుతూ రాష్ట్రంలో నారాయణ, శ్రీ చైతన్య కళాశాలలో రోజుకో విద్యార్థి బలం మరణం పాలవుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు ఒకపక్క ఫీజుల దోపిడీ కొనసాగిస్తూ మరోపక్క విద్యార్థి ఆత్మహత్యలకు కారణం అవుతున్న ఈ రెండు కార్పొరేట్ కళాశాలను రద్దు చేసేంతవరకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. స్తోమతకు మించే విధంగా సౌకర్యాలు తక్కువ ఫీజులు ఎక్కువ అనే నినాదంతో ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తూ పేద మధ్య తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర శ్రమను జలగల వలె పీల్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల, రాజకీయ నాయకుల అండదండలతో ఒక బ్రాంచ్‌కి పర్మిషన్ తీసుకొని దానికి అనుబంధంగా 5 లేదా 6 బ్రాంచ్లను కొనసాగిస్తూ ఇష్టానుసారంగా విద్యా వ్యాపారం కొనసాగి స్తున్నారు. తక్షణమే అనుమతులేని కళాశాలలను రద్దు చేయాలని ఈ కళాశాలలో మరణించిన విద్యార్థుల మరణాలపై సీబీఐతో విచారణ చేపించి యాజమాన్యాలపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈ కాలేజీలను రద్దు చేసేంతవరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు మంద నవీన్ రాష్ట్ర నాయకులు తీగల శ్యామ్, యశ్వంత్, ఝాన్సీ పాల్గొన్నారు.

నేడు ఉచిత వృద్ధాప్య వైద్య శిబిరం

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



నేడు కింగ్ కోఠి ప్రభుత్వ ఆయుర్వేద పాలి క్లినిక్ లో ఉచిత వృద్ధాప్య వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని సీనియర్ ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కింగ్ కోఠి జిల్లా ఆసుపత్రి ఆవరణలో గల ఆయుర్వేద పాలి క్లినిక్‌లో ఉచిత వృద్ధాప్య వైద్య శిబిరం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గన్ ఫౌండ్రి డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓం ప్రకాష్ పాల్గొం టారని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో వృద్ధులకు రక్తపోటు, మధుమేహం, మోకాళ్ళ నొప్పులు బాధపడుతున్న వారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అంద జేస్తామని తెలిపారు. పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

నాణ్యమైన విద్యను అందించాలి



నవతెలంగాణ-ముషీరాబాద్

చిన్నారులకు ఆటపాటలతో పాటు నాణ్యమైన విద్యను అందించాలని అంగన్వాడి సెంటర్ సూపర్వైజర్ తిరుమల అన్నారు. శుక్రవారం రాంనగర్ పరిధిలోని అంగన్‌వాడి సెంటర్లను సివిల్ సప్లై అధికారులతో కలిసి సూపర్వైజర్ తిరుమల సందర్శించారు. చిన్నారులకు గర్భిణీ తల్లులకు అందిస్తున్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందుతుందని తెలిపారు.

తిన్న వెంటనే నీళ్లు తాగుతున్నారా?

తిన్న వెంటనే చాలా మంది నీరు తాగుతుంటారు. దీనివల్ల మీ శరీరానికి ఎలాంటి హాని కలుగుతుందో తెలుసుకుందాం.

జీర్ణవ్యవస్థపై ప్రభావం : మీరు ఆహారం తిన్నప్పుడు, మీ శరీరంలో జీర్ణక్రియ ప్రారంభమవుతుంది. ఆహారం జీర్ణం కావడానికి శరీరం ఎంజైమ్‌లు, ఆమ్లాలను ఉత్పత్తి చేస్తుంది.

మీరు ఆహారం తిన్న వెంటనే నీరు తాగితే, అది ఎంజైములు, ఆమ్లాలను పలుచన చేస్తుంది. దీని వలన ఆహారం సరిగ్గా జీర్ణం కాదు. దీనివల్ల అపానవాయువు, అసిడిటీ, అజీర్ణం వంటి సమస్యలు తలెత్తుతాయి.

బరువు పెరుగుట : ఆహారం తిన్న వెంటనే నీరు తాగడం వల్ల ఎక్కువ ఆహారాన్ని తీసుకుంటారు. నీరు మీ కడుపుని నింపుతుంది. మీరు తక్కువ ఆకలితో ఉన్నందున ఇది జరుగుతుంది. తర్వాత ఆహారం సరిగ్గా జీర్ణం కాకపోవడంతో మళ్లీ ఆకలిగా అనిపిస్తుంది. ఈ విధంగా మీరు ఎక్కువగా తింటారు. దీని వలన బరువు పెరుగుతారు.



పోషకాల శోషణ క్షీణించడం: నీరు ఆహారంలో ఉండే పోషకాలను పలుచన చేస్తుంది. దీని కారణంగా శరీరం వాటిని సరిగ్గా గ్రహించదు. దీని కారణంగా, మీరు పోషకాల లోపంతో బాధపడవచ్చు. తిన్న తర్వాత ఎప్పుడు నీరు తాగాలి అని చాలా మందికి సందేహం వచ్చే ఉంటుంది. తిన్న అరగంట తర్వాత నీరు తాగడం మంచిది. దాంతో మీరు హైడ్రేట్‌గా ఉంటారు.

ప్రేమ... స్నేహం

ప్రేమంటే మానసిక పరమైన, ఆనందకరమైన భావన. ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా మంచి మనసుతో ఇంకొకరి పట్ల చూపే నిస్వార్థమైన ఆదరణే ప్రేమ. ఒక్క మాటలో చెప్పాలంటే మనం ఎవరినైతే ప్రేమిస్తున్నామో వారి క్షేమాన్ని, ఆనందాన్ని కోరుకోవడం. ప్రేమ అనేది ఎప్పుడు, ఎవరిపైన, ఎందుకు పుడుతుందో చెప్పలేము. అలాంటి ప్రేమను సాధించడానికి ఏం చేయడానికైనా నేటి యువతరం సిద్ధంగా ఉంటుంది. జీవితంలో ఎన్నో ఆటుపోట్లు ఎదురుకొని ప్రేమించిన వారిని పెండ్లి చేసుకోవడం పెద్ద విజయంగా భావిస్తున్నారు. అయితే పోరాడి సాధించుకున్న ప్రేమను జీవితాంతం నిలుపుకుంటున్నారా అనేదే ఇప్పుడు అసలు సమస్య. అలాంటి ఓ సమస్యే ఈ వారం ఐద్వా అదాలత్...



అశోక్‌కు 28 ఏండ్లు ఉంటాయి. అనుతో వివాహం జరిగి రెండేండ్లు అవుతుంది. వారిది ప్రేమ వివాహం. ఇంట్లో వాళ్లను ఎదిరించి, స్నేహితుల సహాయంతో వివాహం చేసుకున్నారు. ఇప్పుడు కూడా వారి సహకారంతోనే విడిపోవాలని ఐద్వా దగ్గరకు వచ్చారు. అసలు వారి మధ్య ఏం జరిగిందో, ఎందుకు విడిపోవాలనుకుంటున్నారో తెలుసుకుందాం.

అశోక్, అనూ ఇద్దరూ ఒకే కంపెనీలో ఉద్యోగం చేసేవారు. ఇద్దరి మధ్య పరిచయం ప్రేమగా మారింది. ఈ విషయం ఇంట్లో చెబితే ఒప్పుకోలేదు. ఇద్దరి కులాలు వేరు కావడమే దీనికి ప్రధాన కారణం. ఇక చేసేది లేక స్నేహితుల సహకారంతో రిజిస్టర్ ఆఫీసులో పెండ్లి చేసుకున్నారు. ఆరు నెలలు బాగానే ఉన్నారు. తర్వాత చిన్న చిన్న గొడవలు మొదలయ్యాయి. అశోక్ అందరితో సరదాగా, కలివిడిగా ఉంటాడు. అది నచ్చే అనూ అతన్ని ప్రేమించింది. కానీ ఇప్పుడు అదే ఇద్దరి మధ్య సమస్యలను తీసుకొస్తుంది.

పెండ్లి తర్వాత ఎవరితో మాట్లాడొద్దు, కలవద్దు అంటుంది. ఆఫీసులో ఇతరులతో కలవకుండా, మాట్లాడకుండా పని చేయడం అసాధ్యం. అందరూ కలిసి చేయాల్సి ఉంటుంది. టీమ్ వర్క్ ఉంటుంది. టీమ్‌లో ఏ ఒక్కరు పని చేయకపోయినా, టీమ్ సభ్యుల మధ్య గొడవలు వచ్చినా వర్క్ మొత్తం నష్టపోతారు. అలాంటిది ఎవరితో మాట్లాడవద్దు అంటే ఎలా పని చేయాలో అతనికి అర్థం కావడం లేదు. మహిళా ఉద్యోగులు ఫోన్ చేసినా గొడవ చేస్తుంది. అనూ కూడా అతనితో పాటే ఉద్యోగం చేస్తుంది. ఆఫీసు వాతావరణం అక్కడి పరిస్థితి, పని విధానం మొత్తం అనూకు తెలుసు. అయినా ఎందుకు తను అలా చేస్తుందో అశోక్‌కు అర్థం కావడం లేదు. దానితో ఇద్దరూ కలిసి ఒక దగ్గర వర్క్ చేస్తే ఆఫీసులో గొడవలు వస్తాయని అశోక్ వేరే కంపెనీలో చేరాడు. అప్పటి నుండి పరిస్థితి మరింత దారుణంగా తయారయింది.

'ఇక్కడ ఆఫీసులో నువ్వు ఎవరితో మాట్లాడినా, సంబంధాలు పెట్టుకున్నా నాకు తెలుస్తుందని వేరే ఆఫీసులో ఉద్యోగం చూసుకున్నావా' అంటూ గొడవ పెట్టుకుంది. అశోక్ చిన్నప్పటి స్నేహితురాలైన సుమతితో మాట్లాడితే మాత్రం ఆ రోజు ఇంట్లో యుద్ధమే. సుమతి గురించి అనూకు ముందు నుండే తెలుసు. అప్పట్లో వీరి స్నేహం గురించి ఎంతో గొప్పగా చెప్పేది. సుమతితో అనూ కూడా స్నేహంగా ఉండేది. సుమతి భర్త కూడా వీళ్ల ఇంటికి వచ్చిపోతుండేవాడు. అలాంటిది ఇప్పుడు ఆమెతో మాట్లాడితే అస్సలు ఒప్పుకోవడం లేదు. ఎంత చెప్పినా అర్థం చేసుకోవడం లేదు. దాంతో తనకు కష్టంగా ఉన్నా సుమతితో మాట్లాడటమే తగ్గించాడు. ఇలా అనూ పెడుతున్న ఇబ్బందులు భరించలేక ఆమె నుండి విడిపోవాలనుకుని సలహా కోసం ఐద్వా అదాలత్‌కు వచ్చి...

ఎవరితో మాట్లాడవద్దు అంటే ఎలా పని చేయాలో అతనికి అర్థం కావడం లేదు. మహిళా ఉద్యోగులు ఫోన్ చేసినా గొడవ చేస్తుంది. అనూ కూడా అతనితో పాటే ఉద్యోగం చేస్తుంది. ఆఫీసు వాతావరణం అక్కడి పరిస్థితి, పని విధానం మొత్తం అనూకు తెలుసు. అయినా ఎందుకు తను అలా చేస్తుందో అశోక్‌కు అర్థం కావడం లేదు.

ఐద్వా అదాలత్
సెల్: 9490098024

'మేడమ్ అనూతో విడిపోవడం సరైనదో కాదో నాకు అర్థం కావడం లేదు. కానీ నేను ఆమెను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను. ఆమె సంతోషం కోసం తనకు నచ్చినట్టు ఉంటున్నాను. నాకు ఇష్టం లేకపోయినా ఆమె చెప్పినట్టు వింటున్నాను. అంతకు ముందు నేను అందరితో సరదాగా ఉండేవాడిని. ఇప్పుడేమో అవసరమున్నా మాట్లాడలేకపోతున్నాను. నా ఐడెంటిటీనే కోల్పోతున్నాను. ఇలాంటి పరిస్థితుల్లో ఏం చేయాలో నాకేం అర్థం కావడం లేదు. మీరే ఏదైనా సలహా ఇవ్వండి' అని అడిగాడు.

మేము అనూని పిలిపించి అశోక్ చెప్పిన దాని గురించి అడిగితే ఆమె 'అశోక్ అంటే నాకు చాలా ఇష్టం. అందుకే పెద్దవాళ్లను ఎదిరించి పెండ్లి చేసుకున్నాను. ఆయన ప్రేమ నాకు మాత్రమే సొంతం. నేను ఆయన ప్రేమను ఎవరితోనూ పంచుకోలేను. ఆయన అందరితో సరదాగా కలిసిపోతారు. నాకూ వాళ్లకు ఏమాత్రం తేడా లేదు. అందరికంటే నాతోనే ఎక్కువ సరదాగా మాట్లాడాలి. ప్రేమగా ఉండాలి అనుకోవడంలో తప్పేముంది. నా భర్త నాకు మాత్రమే సొంతం. అశోక్ ఇతరులతో మాట్లాడుతుంటే నేను భరించలేకపోతున్నాను. సుమతితో మాట్లాడుతుంటే మాత్రం నాకు బాగా కోపం వస్తుంది. అందుకే అశోక్‌ను కంట్రోల్ చేస్తున్నాను. అయితే వారిద్దరి గురించి నాకు ఎలాంటి అనుమానం లేదు. వాళ్లిద్దరూ మంచి స్నేహితులు మాత్రమే అని నాకు బాగా తెలుసు. కానీ నాకు తెలియకుండానే అలా గొడవపడుతున్నాను. అశోక్ ఇక్కడి వరకు వచ్చాడు అంటే అతన్ని నేను చాలా ఇబ్బంది పెట్టాను. కానీ నేనేం చేయాలి. నా ప్రేమలో స్వార్థం ఎక్కువ అనుకుంటా. అందుకే ఇలా ప్రవర్తిస్తున్నాను' అంటూ బాధపడింది.

'మేడమ్ అనూతో విడిపోవడం సరైనదో కాదో నాకు అర్థం కావడం లేదు. కానీ నేను ఆమెను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను. ఆమె సంతోషం కోసం తనకు నచ్చినట్టు ఉంటున్నాను. నాకు ఇష్టం లేకపోయినా ఆమె చెప్పినట్టు వింటున్నాను. అంతకు ముందు నేను అందరితో సరదాగా ఉండేవాడిని. ఇప్పుడేమో అవసరమున్నా మాట్లాడలేక పోతు న్నాను.

దానికి మేము 'మీ ఇద్దరి మధ్య ఎంతో ప్రేమ ఉంది. కానీ అనవసరమైన గొడవలతో బాధపడుతున్నారు. అశోక్ చేసే ఉద్యోగం గురించి నీకు బాగా తెలుసు. అతను ఎంత మందితో మాట్లాడినా నీ భర్త. నీతోనే ప్రేమగా ఉంటాడు. వాళ్లతో కేవలం సరదాగా ఉంటాడు. కానీ నీతో ప్రేమగా ఉంటాడు. అది నువ్వు గుర్తించాలి. నువ్వు తనకు సపోర్ట్ చేస్తేనే కదా ఆ ప్రేమను నువ్వు పొందగలవు. అలా కాకుండా ఊరికే గొడవ పడుతుంటే ఇద్దరి మధ్య దూరం పెరుగుతుంది. ఇద్దరూ ఎంతో ప్రేమించుకొని పెద్దలను ఎదరించి పెండ్లి చేసుకున్నారు. ఒకరినొకరు అర్థం చేసుకొని జీవితాంతం కలిసి ఉండాలి' అని ఆమెకు చెప్పాము.

అలాగే అశోక్‌తో 'మీరు అనూతో మరింత సమయం గడపాలి. ఆమెలో అభద్రతా భావం ఉంది. మీరు అందరిలాగే తనతో ఉంటున్నారని అనుకుంటుంది. తనకు మీరు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారో ఆమెకు అర్థం కావాలి. ప్రేమ ఉంటే సరిపోదు. అది ప్రత్యేకంగా చూపించాలి. అప్పుడే తనకు మీపై నమ్మకం వస్తుంది. ముందు ఇద్దరూ కలిసి సరదాగా ఓ వారం రోజులు ఏదైనా టూర్‌కి వెళ్ళిరండి. అప్పుడు సగం సమస్యలు పరిష్కారమవుతాయి. ఇప్పటి నుండి ఇద్దరూ సంతోషంగా ఉండండి. లేనిపోని సమస్యలతో సంతోషాన్ని పాడు చేసుకోకండి' అని సర్ది చెప్పి పంపించాము.

- వై వరలక్ష్మి
9948794051

బఫర్ జోన్‌లో ఉంటే కూల్చేయండి

(మొదటిపేజీ తరువాయి)

హయాంలో జరిగిందేనని విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, కోదండరెడ్డితో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో వేస్తామంటూ తాము పదే పదే చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. 18 రాష్ట్రాల రెవెన్యూ చట్టాలను అధ్యయనం చేసి, కొత్త ఆర్వోఆర్ చట్టాన్ని తీసుకొస్తున్నామన్నారు. ఈ చట్టం దేశానికే మోడల్ కాబోతున్నదని తెలిపారు. 'రాష్ట్ర ప్రభుత్వం ఇతర ఖర్చులన్నీ తగ్గించుకుని ప్రజలకు రుణమాఫీ చేసింది. ఇప్పటికే 22 లక్షల మంది రైతులకు రూ.2 లక్షలలోపు రుణాలు మాఫీ చేసింది. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా చేయని విధంగా రుణమాఫీ చేశాం. రైతుల ఖాతాల్లో రూ.18వేల కోట్లు జమయ్యాయి. మరో రూ.12 వేల కోట్లు మిగిలిన ఖాతాలో త్వరలోనే వేస్తాం. గత ప్రభుత్వం చేసినట్టుగా తమ ప్రభుత్వం రైతులను మోసం చేయడం లేదు. కేసీఆర్ ప్రభుత్వం ప్రజలను రెండు సార్లు మోసం చేసింది. రూ.లక్ష రుణమాఫీ విడతల వారీగా చేస్తామని చెప్పి ఐదేండ్లలో కూడా చేయకుండా ఎన్నికల ముందు కొందరికే రుణమాఫీ చేసింది. చేసిన మంచి పనిని కూడా తాము ప్రచారం చేసుకోలేదు. కేసీఆర్, కేటీఆర్ ప్రచారం కోసం రూ.వేల కోట్లు వృథా చేసినట్టుగా తాము చేయలేదు' అని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వంద రోజుల్లోనే ఐదు గ్యారంటీలు అమలు చేశామని తెలిపారు. రూ.7 లక్షల కోట్లు అప్పులు ఉన్నప్పటికీ హామీలు అమలు చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటికి రాష్ట్రం రూ.7.19 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని గుర్తు చేశారు. ఉచిత విద్యుత్ కోసం రూ.42 లక్షల దరఖాస్తులు మాత్రమే సరిగా ఉన్నట్టు తెలిపారు. తప్పులు సవరించి మరో 7 లక్షల మందికిపైగా ఉచిత విద్యుత్ వర్తింపజేస్తామన్నారు. ఉచిత కరెంట్, గ్యాస్ రాయితీ లబ్దిదారుల సంఖ్య నిరంతరం పెరుగుతూనే ఉందన్నారు. దరఖాస్తుల్లో తప్పులు సవరించే ప్రక్రియ నిరంతరం కొనసాగుతున్నదని తెలిపారు. వ్యవసాయ రుణం రూ.2 లక్షలకు పైగా ఉన్నవారి ఖాతాల్లో నిధులు వేయలేదనీ, ఆ పైన ఉన్న మొత్తాన్ని రైతులు చెల్లించాలని కోరారు.

అనిల్ అంబానీపై ఐదేండ్లు నిషేధం

(మొదటిపేజీ తరువాయి)

జారీ అయ్యేందుకు సహకరించినందుకుగానూ వాటిపై చర్యలు తీసుకుంది. 2022లోనూ సెబీ వీరందరిపై నిషేధం విధించడం గమనార్హం.



రుణాల రూపంలో ఆర్‌హెచ్ఎఫ్ఎల్ నిధులు మళ్లింపు

మొత్తం 222 పేజీలతో సెబీ రిపోర్టును విడుదల చేసింది. ఆ వివరాలు.. అనిల్ అంబానీ తన అనుబంధ సంస్థలకు రుణాల రూపంలో ఆర్‌హెచ్ఎఫ్ఎల్ నిధులను మళ్లించారు. అందుకోసం కంపెనీకి చెందిన కీలక నిర్వహణాధికారులతో కలిసి కుట్ర పన్నారు. ఆర్ఎఫ్‌హెచ్ఎల్ డైరెక్టర్ల బోర్డు నిలువరించే ప్రయత్నం చేసినా, యాజమాన్యం పట్టించుకోలేదు. అనిల్ అంబానీ ఒత్తిడితోనే కీలక అధికారులు నిబంధనలను అతిక్రమించడంతో పాటుగా అవినీతికి పాల్పడ్డారు. ఇతర సంస్థలు నిధుల గ్రహీతలుగా లేదా మళ్లింపునకు మధ్యవర్తిగా వ్యవహరించాయని విచారణలో తేలింది. ఈ రుణాలు పొందిన చాలా కంపెనీలు తిరిగి చెల్లించటంలో విఫలమయ్యాయి. ఆర్ఎఫ్‌హెచ్ఎల్ దివాలా తీసింది. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం దివాలా పరిష్కార ప్రణాళికకు వెళ్లడంతో పబ్లిక్ వాటాదారుల పరిస్థితి దుర్భరంగా మారింది. '2018లో కంపెనీ షేరు ధర రూ.59.60గా ఉండగా.. 2020 నాటికి కంపెనీ మోసం బయటపడింది. షేరు విలువ రూ.0.75కు పడిపోయింది. ఇప్పటికీ తొమ్మిది లక్షల మంది వాటాదారులు నష్టాలతో కొనసాగుతున్నారు." అని సెబీ తన నివేదికలో పేర్కొంది.

డిజైన్ ప్రకారం నిర్మాణం జరగలేదు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని బ్యారేజీల నిర్మాణం డిజైన్ల ప్రకారం జరగలేదని సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ ఎస్ఈ ఫజల్ వ్యాఖ్యానించారు. అంతా తొందర తొందర చేశారనీ, నిబంధనల ప్రకారం నిర్మాణం జరిగి ఉంటే మేడిగడ్డ వైఫల్యం చెంది ఉండేది కాదని అభిప్రాయపడ్డారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్‌లోని కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్ చైర్మెన్ జస్టిస్ పీసీ ఘోష్ ఎదుట ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఘోష్ కమిషన్‌కు కీలకమైన సమాచారం అందించారు. డిజైన్లు, నిర్మాణం, ప్రణాళిక, బ్యారేజీ స్థలం, సాంకేతిక అంశాలు, సర్కారు ఒత్తిడి, రాష్ట్ర మంత్రివర్గానికి సంబంధించిన అంశాలపై కమిషన్‌కు వివరంగా చెప్పారు. దాదాపు గంటపాటు భేటీ అయ్యారు. తనకు తెలిసిన విషయాలను చెప్పడంతోపాటు మధ్య, మధ్యలో చైర్మెన్ ఘోష్ వేసిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. అలాగే మేడిగడ్డ నిర్మాణంలో సీకెంట్ ఫైల్‌కు వెళ్లాలని కాళేశ్వరం సీఈ చెప్పారన్నారు. సుందిళ్ల రెండో బ్లాక్-ఏలో అదనపు ఆరు వెంట్లు డిజైన్‌లో లేవని గుర్తు చేశారు. డిజైన్ ప్రకారం బ్యారేజీలు నిర్మించకపోవడం కూడా లోపాలకు కారణమని వ్యాఖ్యానించారు. మంత్రివర్గం నిర్ణయం మేరకు తర్వాత అదనపు వెంట్లు వేసినట్టు వివరించారు. కాళేశ్వరం సీఈ నివేదిక మేరకు క్రాస్‌సెక్షన్లు ఆమోదించామని అభిప్రాయపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం మూడు కంపెనీలకు అప్పగించినట్టు చెప్పారు. ఆయా నిర్మాణ కంపెనీలు సైతం సర్కారు ఒత్తిడి మేరకు ముందుకు సాగినట్టు తెలిపారు. మేడిగడ్డ ఏడో బ్లాకులో పిల్లర్ల కుంగుబాటు, ఇతర బ్యారేజీల్లో బుంగలు రావడం నిర్మాణ లోపాలేనని వివరించారు. ఆనకట్టల నిర్మాణ స్థలాన్ని పరిశీలించకుండానే వాటికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని చెప్పారు. మరోవైపు సీడీవో రిటైర్డ్ ఈఎన్సీ నరేందర్‌రెడ్డి కమిషన్ ముందుకు రెండో రోజూ విచారణకు వచ్చారు. గురువారం నాటి విచారణకు కొనసాగింపుగా రెండు లేఖలను కమిషన్‌కు నరేందర్‌రెడ్డి అందజేశారు. దాదాపు అరగంటకుపైగా కమిషన్ ఆయా అంశాలను ప్రస్తావించింది. అనుమానాలను నివృత్తి చేసుకుంది.కాగా కాళేశ్వరం నిర్మాణంలో మాజీ సీఎం కేసీఆర్, అప్పటి సాగునీటిశాఖ మంత్రి హరీశ్‌రావు ఒత్తిడి చేశారని కమిషన్‌కు చెప్పిన సంగతి తెలిసిందే.

చర్చలతోనే పరిష్కారం !

(మొదటిపేజీ తరువాయి)

పర్యటిస్తున్న ప్రధాని మోడీ, ఆ దేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో శుక్రవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలు చర్చించారని భారత విదేశాంగ శాఖ తెలిపింది. ఇరు పక్షాలు ఒక పరిష్కారానికి వచ్చే క్రమంలో కావాలంటే అవసరమైన సాయం అందించడానికి భారత్ సిద్ధంగా వుందని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ తెలిపారు. మోడీ, జెలెన్‌స్కీ సమావేశం అనంతరం కీవ్‌లో జైశంకర్ మీడియాతో మాట్లాడుతూ, ఇటీవలి కాలంలో ఇరు దేశాల మధ్య వాణిజ్యం బాగా తగ్గిపోయిందని, ఈ నేపథ్యంలో వాణిజ్య సంబంధాలను పునర్నిర్మించేందుకు అంతర్ ప్రభుత్వ సంఘం (ఐజిసి) ఏర్పాటుపై ఇరుదేశాలు దృష్టి సారించాయని అన్నారు. ఈ ఏడాది చివరిలోగా కమిషన్ తొలి సమావేశం జరుగుతుందన్నారు.

రష్యా నుండి ఇంధన కొనుగోళ్లు కూడా చర్చకు వచ్చాయన్నారు. ఇంధన మార్కెట్ పరిస్థితులను భారత్ వివరించిందని, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ ప్రయోజనాల రీత్యా ధరలు స్థిరంగా, సహేతుకంగా వుండేలా చూడాలంటే కొన్ని తప్పనిసరి నిర్ణయాలు వుంటాయని చెప్పారు. ఇరువురు నేతలు సవివరమైన, పారదర్శకమైన, నిర్మాణాత్మకమైన చర్చలు జరిపారని జైశంకర్ తెలిపారు. శాంతి ప్రక్రియలో భారత్ పాత్ర వుండాలని ఉక్రెయిన్ కోరుకుంటోందని చెప్పారు. ఎక్కువ సమయం రష్యా-ఉక్రెయిన్ ఘర్షణలపైనే చర్చించారని తెలిపారు. ఇప్పటివరకు భారత్ 17విడతలుగా ఉక్రెయిన్‌కు మానవతా సాయాన్ని అందజేసిందని మంత్రి చెప్పారు.

నాలుగు ఒప్పందాలు

ఇరు దేశాల మధ్య నాలుగు ఒప్పందాలు కుదిరాయి. వ్యవసాయం, సాంస్కృతిక సహకారం, వైద్య, ఆరోగ్య రంగం, మానవతా సాయం అంశాలకు సంబంధించి కుదిరిన ఒప్పందాలపై మోడీ, జెలెన్‌స్కీ సంతకాలు చేశారు. వాణిజ్యం, ఆర్థిక, రక్షణ, వ్యవసాయ, విద్య తదితర అంశాలపై కూడా చర్చలు జరిగాయి.

మహాత్ముని శాంతి సందేశం

సామరస్య సమాజ నిర్మాణానికి శాంతి కీలకమని మహాత్ముడు ఇచ్చిన సందేశం ఈనాటికీ కాలానుగుణ్యమైందని మోడీ వ్యాఖానించారు. ఆయన ఆదర్శాలు, విలువలు సార్వజనీనమైనవని, లక్షలాదిమందికి ఆశాకిరణం వంటివన్నారు. మానవాళికి ఆయన చూపిన మార్గంలోనే మనందరం పయనించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ మేరకు మోడీ ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

బిషమ్ క్యూబ్‌లు అందజేత

పది జనరేషన్ సెట్‌లతో సహా 22 టన్నుల మెడికల్ పరికరాలను కలిగివున్న బిషమ్ క్యూబ్‌లను శుక్రవారం భారత్, ఉక్రెయిన్‌కు అందజేసింది. 1991లో ఉక్రెయిన్‌కు స్వాతంత్ర్యం లభించి, 1992లో దౌత్య సంబంధాలు ఏర్పడిన తర్వాత తొలిగా పర్యటిస్తున్న భారత ప్రధాని మోడీ అని, ఇది చారిత్రక పర్యటన అని జై శంకర్ వ్యాఖ్యానించారు. రష్యా యుద్ధంలో మరణించిన చిన్నారులపై ఏర్పాటు చేసిన మల్టీమీడియా ఎగ్జిబిషన్‌ను మోడీ సందర్శించారు. యుద్ధానికి బలైన బాలలను చూస్తుంటే మనసు కలిచి వేస్తోందని మోడీ వ్యాఖ్యానించారు.

ఇక 'స్పీడ్..'

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలకు చేరువ చేసేందుకు వీలుగా రాష్ట్ర ప్రణాళికా విభాగం ప్రత్యేకంగా ఆన్‌లైన్ పోర్టల్‌ను నిర్వహించనుంది. ప్రతీ రోజు నిర్వహించే పనులు, వాటి పురోగతికి సంబంధించిన డేటాను ఆ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేస్తారు.

నేపాల్‌లో ఘోరం !

(మొదటిపేజీ తరువాయి)

నేపాల్‌లో సాధారణంగా నదులు చాలా వేగంగా, ఒరవడిగా ప్రవహిస్తూ వుంటాయి. గత కొద్ది రోజులుగా భారీ వర్షాలతో వరద నీరు రావడం వల్ల మురికిగా వుండి నదిలో పడినవి కనిపించడం కూడా కష్టంగా వుంటుంది. జూన్‌నుండి సెప్టెంబరు వరకు నేపాల్‌లో భారీ వర్షాలు పడతాయి.

ముందు కాంగ్రేసోళ్ల ఇండ్లు కూల్చండి

(మొదటిపేజీ తరువాయి)

రేవంత్‌రెడ్డి రాలేదని విమర్శించారు. క్షేత్రస్థాయిలో తిరగాల్సిన సీఎం ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొడుతున్నారన్నారు. సీఎం సొంతూరులో రుణమాఫీ అయ్యిందా? లేదా? అని తెలుసుకోవడానికి మహిళా జర్నలిస్టులు వెళితే వారిపై కాంగ్రెస్ కార్యకర్తలు చిల్లరగా దాడులు చేయడం దుర్మార్గమని చెప్పారు. వాళ్లను వెల్దండ పోలీస్ స్టేషన్ వరకు వెంబడించారని తెలిపారు. జర్నలిస్టులకు సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వారిపై సోషల్‌మీడియాలో నికృష్టంగా విషప్రచారం చేయడం దారుణమన్నారు. అధికారం ఎవ్వరికీ శాశ్వతం కాదనీ, పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించవద్దని సూచించారు. మహిళా జర్నలిస్టులపై దాడి చేసినవారిపైనా, తిరుమలగిరిలో బీఆర్ఎస్ దీక్షపై దాడిచేసిన వారిపైనా కేసులు పెట్టి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మంచిర్యాలతో ఎమ్మెల్యే తీరుతో తమ నాయకుడు గొంతు కోసుకున్నాడని తెలిపారు. హైదరాబాద్‌లో శాంతిభద్రతలు గాడి తప్పాయనీ, నెలలో 28 హత్యలు జరిగాయని తెలిపారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బ తినవద్దనే మేము ఇప్పటి వరకు ఊరుకుంటున్నామన్నారు. తమ సహనాన్ని, చేతగాని తనం అనుకోవద్దనీ, తాము ప్రతిఘటించే దాకా పరిస్థితి తెచ్చుకోవద్దని హెచ్చరించారు. కొంతమంది పోలీసులు మంత్రుల బర్త్‌డే కార్యక్రమాల్లో పరవశించి పోతున్నారని విమర్శించారు.

రూ.300కే ఇంటర్నెట్, కేబుల్ టీవీ,ఎడ్యుకేషన్

(మొదటిపేజీ తరువాయి)

ప్రతిపాదించిన టీ-ఫైబర్ ప్రాజెక్టు అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ. 530 కోట్లను వివిధ ఆర్థిక సంస్థల ద్వారా సమీకరించిందని కేంద్ర మంత్రి సింధియాకు తెలియజేశారు. మొత్తం పెట్టుబడి వ్యయం రూ. 1,779 కోట్లను యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ ఫండ్ (యూఎస్ఎఫ్ఓ) ద్వారా వడ్డీ లేకుండా దీర్ఘకాలిక రుణంగా ఇవ్వాలని కేంద్ర మంత్రి సింధియాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

భారత్ నెట్ 3 ఆర్కిటెక్చర్‌కు డీపీఆర్‌ను ఆమోదించండి

నేషనల్ ఆప్టికల్ ఫైబర్ నెట్ వర్క్ (ఎన్ఓఎఫ్ఎన్) మొదటి దశ మౌలిక సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వానికి సకాలంలో అందించాలని సీఎం కోరారు. ప్రస్తుతం రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఎన్ఓఎఫ్ఎన్ మొదటి దశ లైనియర్ ఆర్కిటెక్చర్ ఆధారంగా నడుస్తుంటే... మిగితా ప్రాంతాల్లో రింగ్ ఆర్కిటెక్చర్ ఆధారంగా టీ-ఫైబర్ నడుస్తోందన్నారు. ఈ రీత్యా నెట్‌వర్క్ సమర్థ నిర్వహణ, వినియోగం కోసం సకాలంలో ఎన్ఓఎఫ్ఎన్ మొదటి దశ మౌలిక సదుపాయాలకు అందించాలని ప్రతిపాదించారు. ఎన్ఓఎఫ్ఎన్ మొదటి దశను భారత్ నెట్ 3 ఆర్కిటెక్చర్‌కు మార్చడానికి గతేడాది అక్టోబరులో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి డీపీఆర్ పంపించిందని గుర్తు చేశారు. ఆ డీపీఆర్ త్వరగా ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. భారత్ నెట్ 3 ద్వారా రాష్ట్రంలోని 33 జిల్లాల పౌరులకు ఈ-గవర్నెన్సును అందించగలుగుతామని భరోసా ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాలకు హై-స్పీడ్ ఇంటర్నెట్ సదుపాయాల కల్పనకు ఉద్దేశించిన భారత్ నెట్ ఉద్యమి పథకాన్ని టీ-ఫైబర్ కు వర్తింపజేయాలని కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాను సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

అంతర్జాతీయ స్టేడియాలకు వేదిక

హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్స్, సరూర్ నగర్ స్టేడియం, ఎల్బీ స్టేడియం, కేవీబీఆర్ ఇండోర్ స్టేడియం, ఓయూ క్యాంపస్, జింఖానా గ్రౌండ్, హుస్సేన్ సాగర్ తదితరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఈత కొలనులు, మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలు, సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్స్, షూటింగ్ రేంజ్, ఫుట్‌బాల్ గ్రౌండ్స్, స్కేటింగ్ ట్రాక్స్, వాటర్ స్పోర్ట్స్, ఇతర క్రీడలకు వసతులు ఉన్నాయని కేంద్ర మంత్రి మాండవీయకు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో వివిధ కేటగిరిల ఫైవ్ స్టార్ హోటళ్లు ఉన్నాయని, విమాన, రైలు సర్వీసులతో అనుసంధానమై ఉందని తెలిపారు. 2002లో నేషనల్ గేమ్స్, 2003లో ఆఫ్రో-ఏషియన్ గేమ్స్, 2007లో ప్రపంచ మిలటరీ గేమ్స్ హైదరాబాద్‌లో నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. వీటన్నింటని పరిగణనలోకి తీసుకొని భవిష్యత్‌లో ఒలింపిక్స్, ఆసియన్ గేమ్స్, కామన్‌వెల్త్ గేమ్స్ తెలంగాణలో నిర్వహించే అవకాశం ఇప్పించాలని, 2025, జనవరిలో నిర్వహించే ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు హైదరాబాద్‌కు అవకాశం ఇవ్వాలని కేంద్ర మంత్రి మాండవీయకు సీఎం రిక్వెస్ట్ చేశారు.

ఖేలో ఇండియా స్కీంలో నిధులు పెంచండి

రాష్ట్రంలో క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ఖేలో ఇండియా స్కీం కింద నిధుల విడుదలను పెంచాలని కేంద్ర మంత్రి మాండవీయను సీఎం కోరారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియం, సెంట్రల్ యూనివర్శిటీలోని షూటింగ్ రేంజ్, ఎల్‌బీ స్టేడియం, హకీంపేటలోని స్పోర్ట్స్ స్కూల్, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో మౌలిక వసతుల అభివద్ధికి తాము ఇప్పటికే పంపించిన డీపీఆర్‌లను ఆమోదించాలని కేంద్ర మంత్రిని కోరారు.

ఘనంగా హీరో కిరణ్ అబ్బవరం వివాహం


కిరణ్ అబ్బవరం, రహస్య గోరక్

'రాజావారు రాణిగారు' సినిమాలో కలిసి నటించిన హీరో కిరణ్ అబ్బవరం, హీరోయిన్ రహస్య గోరక్ ఆ సినిమా చిత్రీకరణ సమయంలోనే పరస్పరం ఇష్టపడ్డారు. ఇప్పుడు పెద్దల అంగీకారంతో వైవాహిక బంధంలోకి అడుగుపెట్టారు.
వీరి వివాహమహోత్సవం గురువారం రాత్రి కర్ణాటకలోని కూర్గ్‌లో ఘనంగా జరిగింది.
కూర్గ్‌లోని ఓ రిసార్ట్‌లో కుటుంబ సభ్యులు, సన్నిహిత మిత్రుల సమక్షంలో వీరి వివాహ వేడుకలు జరిగాయి. కిరణ్ అబ్బవరం, రహస్య గోరక్ వివాహ వేడుకల ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో సందడి చేస్తున్నాయి.
సినీ ప్రియులు, చిత్ర పరిశ్రమకు చెందిన మిత్రులు ఈ కొత్త జంటకు శుభాకాంక్షలు చెబుతూ పోస్టలు చేస్తున్నారు. కిరణ్ అబ్బవరం ప్రస్తుతం భారీ పీరియాడిక్ థ్రిల్లర్ మూవీ 'క' లో నటిస్తున్నారు. ఈ త్వరలోనే ఈ సినిమా పాన్ ఇండియా రిలీజ్ కు రెడీ అవుతోంది.

చిన్నా.. ఇది వింత లోకం


విశ్వదేవ్, నివేత థామస్

నివేత థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ లీడ్ రోల్స్‌లో నటించిన న్యూ ఏజ్ క్లీన్ ఎంటర్ టైనర్ '35-చిన్న కథ కాదు'.
సురేష్ ప్రొడక్షన్స్, ఎస్ ఒరిజినల్స్, వాల్టెయిర్ ప్రొడక్షన్స్ బ్యానర్లపై రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మిస్తున్న ఈ చిత్రానికి నంద కిషోర్ ఈమాని రైటర్, డైరెక్టర్. తాజాగా మేకర్స్ 'చిన్నా ఇది వింత లోకం..' సాంగ్‌ను రిలీజ్ చేశారు. చిల్డ్రన్స్, ఇన్నోసెంట్ హార్ట్స్‌ని బ్యూటీఫుల్‌గా ప్రజెంట్ చేసిన ఈ పాటని వివేక్ సాగర్ సూపర్బ్‌గా కంపోజ్ చేశారు. భరద్వాజ్ గాలి రాసిన లిరిక్స్, సింగర్ విజయ్ ప్రకాష్ లైవ్లీగా పాడిన ఈ పాట మళ్ళీ మళ్ళీ వినాలనిపించేలా ఉంది. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేందుకు ఈ సినిమా రెడీ అవుతోంది. త్వరలోనే ఈ సినిమా తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో విడుదల కానుంది.

కృష్ణాష్టమి కానుకగా ఫస్ట్‌లుక్


మంచు అవ్రామ్

విష్ణు మంచు నటిస్తూ నిర్మిస్తున్న చిత్రం 'కన్నప్ప'. ప్రతీ సోమవారం ఈ చిత్రం నుంచి ఒక అప్డేట్ ఇస్తూ సినిమా పై మేకర్స్ అంచనాలు పెంచుతూ ఉన్నారు. సినిమాలోని కీలక పాత్రలకు సంబంధించిన పోస్టర్‌లను రిలీజ్ చేస్తూ బజ్ క్రియేట్ చేస్తున్నారు. శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఈ సోమవారం స్పెషల్ కారెక్టర్‌కు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేస్తున్నారు. కృష్ణాష్టమి సందర్భంగా మంచు విష్ణు తనయుడు అవ్రామ్ మంచు ఫస్ట్ లుక్ విడుదల కానుంది.
ముఖ్యమైన పాత్రలో నటిస్తున్న అవ్రామ్ ఈ సినిమాతో సినీ రంగ ప్రవేశం చేస్తున్నాడు. మంచు వారి మూడు తరాలు ఇందులో కనిపించబోతున్నాయి. మోహన్ బాబు, విష్ణు మంచు, అవ్రామ్ మంచు కలయికతో ఈ చిత్రం స్పెషల్ కానుంది. అవ్రామ్ పాత్ర, సినిమాలో లుక్ ఎలా ఉంటుందో తెలుసుకోవాలంటే మరో 3 రోజులు ఆగాల్సిందేనని అంటున్నారు మేకర్స్. ఈ పాన్ ఇండియా చిత్రం డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది.

నవచిత్రం

కాకినాడలో మట్కా కీలక షెడ్యూల్


వరుణ్ తేజ్

వరుణ్ తేజ్ తాజాగా 'మట్కా' సినిమాతో పాన్ ఇండియాలో అడుగు పెడుతున్నారు. కరుణ కుమార్ దర్శకత్వంలో వైర ఎంటర్‌టైన్‌మెంట్స్, ఎస్ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి ఈ మూవీని నిర్మిస్తున్నారు. వరుణ్ తేజ్‌ని డిఫరెంట్ లుక్స్‌లో ప్రజెంట్ చేసిన ఫస్ట్‌లుక్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.
ప్రస్తుతం ఈ సినిమా కాకినాడలో షూటింగ్ జరుపుకుంటోంది. ఈ ముఖ్యమైన షెడ్యూల్‌లో టాకీ పార్ట్, ప్రముఖ తారాగణంతో యాక్షన్ పార్ట్‌ను చిత్రీకరించనుంది. మేకర్స్ విడుదల చేసిన పోస్టర్‌లో వరుణ్ తేజ్ చేతిలో తుపాకీతో కాకినాడ ఓడరేవులో క్రూయిజ్ షిప్ ముందు నిలబడి కనిపించారు. పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ సినిమాలో వరుణ్ తేజ్ డిఫరెంట్ మేకోవర్‌లలో కనిపించనున్నారు. మీనాక్షి చౌదరి, నోరా ఫతేహీ హీరోయిన్లుగా నటిస్తున్నారు.
నవీన్ చంద్ర, సలోని, అజయ్ ఘోష్, కన్నడ కిషోర్, రవీంద్ర విజయ్, పి రవి శంకర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: కరుణ కుమార్, నిర్మాతలు: డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి, సంగీతం: జివి ప్రకాష్ కుమార్, డీవోపీ: ఎ కిషోర్ కుమార్, ఎడిటర్: కార్తీక శ్రీనివాస్ ఆర్, ప్రొడక్షన్ డిజైనర్: కిరణ్ కుమార్ మన్నె, సీఈఓ: ఈవీవీ సతీష్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఆర్కే జానా, ప్రశాంత్ మండవ, సాగర్, కాస్ట్యూమ్స్: కిలారి లక్ష్మి.

రెండో వారంలో అదనంగా 141 థియేటర్లు


విక్రమ్, పార్వతి తిరువోతు

ఇటీవల ప్రేక్షకుల ముందుకొచ్చిన 'తంగలాన్' సినిమా భారీ నిర్మాణ విలువలు, విక్రమ్ అద్భుత నటనతో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని కలిగించింది. దర్శకుడు పా రంజిత్ మరోసారి తన వెండితెర మాయాజాలం చేశారు.
ఈ పీరియాడిక్ యాక్షన్ మూవీ ఈ నెల 15న థియేటర్స్‌లోకి వచ్చి బ్లాక్‌బస్టర్ సక్సెస్ అందుకుంది. అన్ని సెంటర్స్ నుంచి సక్సెస్ ఫుల్ టాక్‌తో పాటు మంచి కలెక్షన్స్ రాబడుతోంది. మొదటి వారంతో పోలిస్తే రెండో వారంలో ఈ సినిమాకు తెలంగాణ, ఏపీలో అదనంగా 141 థియేటర్స్ పెరిగాయి. ఒక్క నైజాం ఏరియాలోనే 90 థియేటర్స్ పెంచటం విశేషం.
తెలుగు స్ట్రెయిట్ సినిమాలతో పాటు విడుదలైన 'తంగలాన్' గట్టి పోటీని తట్టుకుని బాక్సాఫీస్ వద్ద బలంగా నిలబడింది. రెండో వారంలోనూ భారీగా పెరిగిన ఈ థియేటర్స్ ఈ చిత్ర దిగ్విజయానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఈ చిత్రాన్ని దర్శకుడు పా రంజిత్ రూపొందించగా, నీలమ్ ప్రొడక్షన్స్‌తో కలిసి స్టూడియో గ్రీన్ ఫిలింస్ బ్యానర్ పై నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించారు. పార్వతీ తిరువోతు, మాళవిక మోహనన్ హీరోయిన్లుగా నటించారు. పీరియాడిక్ యాక్షన్ డ్రామా కథతో మ్యాజికల్ రియలిజం స్క్రీన్ ప్లేతో తెరకెక్కిన ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకుల్ని విశేషంగా అలరిస్తూ రోజు రోజుకి కలెక్షన్లతోపాటు థియేటర్ల సంఖ్యనూ పెంచుకుంటోంది.

8 భాషల్లో మిరాయ్ విడుదల


తేజ సజ్జా

పాన్ ఇండియా సక్సెస్ 'హను-మాన్'తో దూసుకుపోతున్న హీరో తేజ సజ్జా నెక్స్ట్ పాన్ ఇండియా మూవీ 'మిరాయ్'తో అలరించనున్నారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్న ఈ యాక్షన్-అడ్వెంచర్‌లో తేజ సజ్జా సూపర్ యోధ పాత్రలో కనిపిస్తారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్ భారీ స్థాయిలో నిర్మిస్తునారు.
తేజ సజ్జ పుట్టినరోజు సందర్భంగా బ్రాండ్ న్యూ పోస్టర్‌ని మేకర్స్ రిలీజ్ చేశారు. సినిమాలో తేజ సజ్జా పాత్రలోని కరేజియస్ స్పిరిట్‌ని హైలైట్ చేస్తూ పోస్టర్ అద్భుతంగా ప్రజెంట్ చేశారు. పోస్టర్‌లో తేజ సజ్జ మండుతున్న ఐరెన్ రాడ్‌ను పట్టుకుని పైకి చూస్తున్నట్లు టెర్రిఫిక్‌గా కనిపించారు. ప్రమాదకర పరిస్థితిలో చిక్కుకుపోయినప్పటికీ ఇంటెన్స్‌గా ఉన్నారు. బ్యాక్‌డ్రాప్‌లో ఒక పురాతన దేవాలయం కూడా ఉంది. ఆసక్తికరంగా ఉన్న ఈ పోస్టర్ ప్రేక్షకులను కట్టిపడేసింది.
తేజ సజ్జా చాలా హార్డ్ వర్క్ చేసి సినిమా కోసం బెస్ట్ ఎఫర్ట్స్ పెడుతున్నారని బర్త్‌డే స్పెషల్ పోస్టర్‌లో స్పష్టంగా కనిపిస్తోంది. న్యూ వరల్డ్‌ని క్రియేట్ చేయడంలో డైరెక్టర్ కార్తీక్ ఘట్టమనేని నైపుణ్యం కనిపిస్తుంది. అత్యున్నత స్థాయి ప్రొడక్షన్ వాల్యూస్‌తో ఈ సినిమా టెక్నికల్‌గా టాప్ క్లాస్‌లో ఉండబోతోంది. తేజ సజ్జ, మంచు మనోజ్ పాత్రలను పరిచయం చేసిన ఫస్ట్-లుక్ పోస్టర్లు, గ్లింప్స్ లకు ట్రెమండస్ రెస్పాన్స్‌తో భారీ అంచనాలు నెలకొల్పాయి. ఈ కొత్త పోస్టర్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది.
కార్తీక్ ఘట్టమనేని సినిమాటోగ్రఫీతో పాటు డైలాగ్ రైటర్ మణిబాబు కరణంతో కలసి స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు. గౌరహరి సంగీతం సమకూరుస్తున్నారు. శ్రీ నాగేంద్ర తంగాల ఈ చిత్రానికి ఆర్ట్ డైరెక్టర్. 8 భాషల్లో వచ్చే ఏడాది ఏప్రిల్ 18న 2డి, 3డి వెర్షన్‌లలో విడుదల చేస్తామని మేకర్స్ అనౌన్స్ చేశారు.
తేజ సజ్జ, మనోజ్ మంచు, రితికా నాయక్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి దర్శకత్వం: కార్తీక్ ఘట్టమనేని, నిర్మాత: టీజీ విశ్వ ప్రసాద్, క్రియేటివ్ ప్రొడ్యూసర్: కృతి ప్రసాద్, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సుజిత్ కుమార్ కొల్లి, సంగీతం: గౌర హరి, ఆర్ట్ డైరెక్టర్: శ్రీ నాగేంద్ర తంగాల, రైటర్: మణిబాబు కరణం.

డైమండ్ లీగ్‌లో నీరజ్ సీజన్ బెస్ట్ త్రో

- 89.49మీటర్లు జావెలిన్ విసిరి రెండో స్థానం
- 90.61మీ.తో వేసి ఆండర్సన్ పీటర్స్ ప్రథమ స్థానం

లాసన్నె (స్విట్జర్లాండ్)

లాసన్నె వేదికగా జరిగిన డైమండ్ లీగ్ జావెలిన్ త్రో విభాగంలో నీరజ్ చోప్రా రెండో స్థానంలో నిలిచాడు. శుక్రవారం జరిగిన జావెలిన్ త్రో.. ఆరో ప్రయత్నంలో నీరజ్ తన జావెలిన్‌ను 89.49 మీటర్ల దూరం విసిరాడు. ఈ సీజన్‌లో నీరజ్‌కు ఇదే అత్యుత్తమ త్రో. పారిస్ ఒలింపిక్స్‌లో నీరజ్ 89.45మీటర్ల దూరం విసిరి రెండోస్థానంలో కాంస్య పతకం కైవసం చేసుకోగా.. డైమండ్ లీగ్‌లో ఆ ఫీట్‌ను సవరించాడు. ఇక 2022లో స్టాక్‌హోమ్ వేదికగా జరిగిన డైమండ్ లీగ్‌లో నీరజ్ చోప్రా జావెలిన్‌ను 89.94 మీటర్ల దూరం విసిరాడు. ఇదే అతని కెరీర్‌లో బెస్ట్ త్రో. నిజానికి లాసన్నె డైమండ్ లీగ్‌లో నీరజ్‌చోప్రా తొలి ఐదు ప్రయత్నాలను ఆశించిన స్థాయిలో వేయలేకపోయాడు. తొలి అయిదు ప్రయత్నాల్లో 82.10మీ, 83.21మీ, 83.13మీ, 82.34మీ, 85.58మీ. దూరం విసిరాడు. గ్రెనెడాకు చెందిన అండర్సన్ పీటర్స్ ఈ సీజన్‌లో మీట్ రికార్డు క్రియేట్ చేశాడు. అతను 90.61 మీటర్ల దూరం జావెలిన్‌ను విసిరాడు. జర్మనీకి చెందిన జులియన్ వెబర్ 87.08 మీటర్ల దూరం విరిసి మూడవ స్థానంలో నిలిచాడు. పారిస్ ఒలింపిక్స్‌లో అండర్సన్ 88.54మీ.తో కాంస్య పతకం చేజిక్కించుకున్న సంగతి తెలిసిందే. ఆ ఒలింపిక్స్‌లో పాకిస్తాన్‌కు చెందిన అర్షాద్ నదీమ్ 92.97మీ. త్రో చేసి ప్రపంచ రికార్డు నెలకొల్పడం తో పాటు స్వర్ణ పతకం ఎగరేసుకుపోయాడు. జులి యన్‌వెబెర్ పారిస్‌లో 87.40మీ.తో 6వ స్థానానికే పరిమితమైనా.. డైమండ్ లీగ్‌లో మూడో స్థానంలో నిలిచాడు. ఈ టోర్నీకి పాకిస్తాన్ స్టార్ త్రోయర్ అర్షాద్ నదీమ్ దూరంగా ఉన్న సంగతి తెలిసిందే.



రిటైర్మెంట్ యోచనలో కెఎల్ రాహుల్..?



బెంగళూరు : దులీప్ ట్రోఫీకి సన్నద్ధమ వుతున్న కెఎల్ రాహుల్ ఇన్‌స్టాగ్రామ్‌లో చేసిన పోస్ట్ అతని అభిమానులకు షాక్‌కు గురి చేసింది. శుక్రవారం సామాజిక మాధ్యమాల్లో అతడి గురించిన ఓ న్యూస్ వైరల్ అవుతోంది. రాహుల్ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ అందరినీ షాక్‌కు గురి చేస్తోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ స్టార్ ప్లేయర్ సిగ్నేచర్ స్టయిల్ సెలబ్రేషన్ ఫొటోతో పాటు సుదీర్ఘ పోస్ట్ ఉంది. దాంతో, ఆ పోస్ట్ చూసిన అభిమానులంతా షాకయ్యారు. అసలు ఆ పోస్ట్‌లో ఏం ఉందంటే.. 'సుదీర్ఘ సమాలోచన, చాలా చర్చల తర్వాత ప్రొఫెషనల్ క్రికెట్‌కు వీడ్కోలు పలకాలని నిర్ణయించుకున్నా. నా జీవితంలో కీలక భాగమైన క్రికెట్‌కు ఆటకు అల్విదా చెప్పడం సులువైన నిర్ణయం కాదు' అని రాసి ఉంది. దాంతో, ఫ్యాన్స్‌తో పాటు పలువురు క్రికెటర్లు సైతం ఇదేంటీ? రాహుల్ వీడ్కోలు చెప్పాడా? అని ఆందోళనకు లోనయ్యారు. అయితే.. అదంతా ఫేక్ న్యూస్ అని సమాచారం. దాంతో, అభిమానులు హమ్మయ్యా అని ఊపిరి పీల్చుకుంటున్నారు. తాను క్రికెట్‌కు వీడ్కోలు పలికినట్టు వస్తున్న వార్తలపై రాహుల్ స్పందించాడు. 'నేను ఓ ప్రకటన చేయబోతున్నా. వేచి ఉండండి' అంటూ మాత్రమే ఫ్యాన్స్‌ను ఉద్దేశించి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టాడు.

పారిస్ పారా ఒలింపిక్స్‌లోనూ వీరు సత్తా చాటేనా..!

ఆర్చరీలో శీతల్ దేవిపైనే అందరి దృష్టి



పారిస్: పారిస్ పారా ఒలింపిక్స్‌లో అందరి దృష్టి వీరిపైనే నెలకొంది. ముఖ్యంగా ఆర్చరీ విభాగంలో శీతల్ దేవిపైనే ప్రధానంగా నెలకొంది. 2022 ఆసియా పారా గేమ్స్‌లో అద్భుత ప్రదర్శనతో అదరగొట్టిన శీతల్.. ఈ ఒలింపిక్స్‌లో పతకం దక్కడం ఖాయం కనబడుతోంది. రెండు చేతులు లేకపోయినా.. కాళ్ల సాయంతో బాణాలను నిర్ణీత గమ్యానికి చేర్చడంలో దిట్ట శీతల్ దేవి. ఆసియా పారా క్రీడల్లో ఆమె రెండు స్వర్ణ పతకాలతో సత్తా చాటి అందరి దృష్టిని తనవైపు తిప్పుకుంది. ఇక రాజస్తాన్‌కు చెందిన అవని లఖేరా రైఫిల్ షూటింగ్ విభాగంలో, పురుషుల ఎఫ్-64 విభాగంలో సుమిత్ అంటిల్, బ్యాడ్మింటన్‌లో కృష్ణ నగర్, పారా పిస్టల్ షూటింగ్‌తోపాటు 50మీ. మిక్స్‌డ్ పిస్టల్ ఎస్‌హెచ్-1 విభాగంలో మనీష్ నర్వాల్ పతకాలు సాధించగల అథ్లెట్లు. వీరంతా 2020 టోక్యో పారా ఒలింపిక్స్, ఆసియా పారా క్రీడల్లో పతకాలు సాధించినవారే.

అరంగేట్రం టెస్ట్‌లోనే స్మిత్ సెంచరీ

రసపట్టులో ఇంగ్లండ్-శ్రీలంక టెస్ట్



మాంచెస్టర్: ఇంగ్లండ్-శ్రీలంక జట్ల మధ్య జరుగుతున్న తొలిటెస్ట్ రసపట్టుగా నడుస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో 358పరుగులకు ఆలౌటైన ఇంగ్లండ్.. రెండో ఇన్నింగ్స్‌లో శ్రీలంకను 95 పరుగుల్లోపే నాలుగు వికెట్ల పడకొట్టి పట్టు బిగిస్తోంది. ఓవర్‌నైట్ స్కోర్ 6వికెట్ల నష్టానికి 259పరుగులతో మూడోరోజు ఆటను కొనసాగించిన ఇంగ్లండ్ జట్టు 358పరుగులకు ఆలౌటైంది. అరంగేట్రం టెస్ట్‌లోనే జెమీ స్మిత్(111) సెంచరీతో కదం తొక్కాడు. వోక్స్(25), అట్కిన్సన్(20), వుడ్(22) కూడా బ్యాటింగ్‌లో రాణించారు. దీంతో ఇంగ్లండ్‌కు 122పరుగుల ఆధిక్యత లభించింది. శ్రీలంక బౌలర్లు అసిత ఫెర్నాండోకు నాలుగు, ప్రభాత్ జయసూరియకు మూడు, విశ్వ ఫెర్నాండోకు రెండు వికెట్లు దక్కాయి. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక జట్టు 98పరుగులకే 4వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ సమయానికి శ్రీలంక జట్టు ఇంకా 24పరుగులు వెనుకబడి ఉంది. క్రీజ్‌లో మాథ్యూస్(43), కమిందు(2) ఉన్నారు. ఇంగ్లండ్ బౌలర్లు వోక్స్, అట్కిన్సన్, వుడ్, పాట్స్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహదినం

- 6న రవీంద్రభారతిలో కోదండరామ్‌కు అభినందన సభ
- మహిళలపై అఘాయిత్యాలకు వ్యతిరేకంగా కార్యక్రమాలు
- సీఎం రేవంత్‌రెడ్డి మమ్మల్ని పిలిచి సమస్యలను పరిష్కరించాలి
- 27 మందితో తెలంగాణ ఉద్యోగ జేఏసీ స్టీరింగ్ కమిటీ ఏర్పాటు : చైర్మెన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సెప్టెంబర్ ఒకటిన పెన్షన్ ద్రోహ దినం పాటించాలని తెలంగాణ ఉద్యోగ జేఏసీ నిర్ణయించింది. అందులో భాగంగా హైదరాబాద్‌లోని అమరవీరుల స్థూపం వద్ద, జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలను చేపట్టాలని పిలుపునిచ్చింది. శుక్రవారం హైదరాబాద్‌లో టీఎన్జీవో భవన్‌లో తెలంగాణ ఉద్యోగ జేఏసీ స్టీరింగ్ కమిటీ సమా వేశాన్ని నిర్వహించారు. 27 మందితో స్టీరింగ్ కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం విలేకర్ల సమావేశంలో తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మెన్, టీఎన్జీవో అధ్యక్షులు మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్, టీజీవో అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ నూతనంగా ఎమ్మెల్సీగా ఎన్నికైన కోదండరామ్‌కు అభినందన సభను వచ్చేనెల ఆరో తేదీన హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహిస్తా మని చెప్పారు. కోల్‌కతాలో వైద్య విద్యార్థినితో పాటు మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు నిరసన గా వచ్చే నెలలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం జేఏసీని ఏర్పాటు చేశామన్నారు. తమను సీఎం రేవంత్‌రెడ్డి చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించాలని కోరారు. నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నా యనీ, వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల వారికీ ప్రాధాన్యత ఇస్తున్నదని చెప్పారు. ఉద్యోగుల సమస్యల పరి ష్కారంపైనా దృష్టి సారించాలని కోరారు. వచ్చేనెల ఒకటిన సీపీఎస్‌ను రద్దు చేయా లని కోరుతూ పెన్షన్ విద్రోహ దినం పాటిస్తా మన్నారు. అన్ని జిల్లా కేంద్రాల్లో కలెక్టరేట్ల ముందు నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమా లను చేపడతామని అన్నారు. హైదరాబాద్ లో గన్‌పార్క్ వద్ద నిరసన తెలుపుతామని చెప్పారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన విధంగా పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. 317 జీవో వల్ల ఉద్యో గులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడు తున్నారనీ, బాధితుల సమస్యలను పరిష్క రించాలని కోరారు. ప్రభుత్వంతో సఖ్యతగా ఉండి శాంతియుతంగా సమస్యలు పరిష్కార మయ్యేలా చూస్తామ న్నారు. రాష్ట్ర ప్రభుత్వ స్పందనను బట్టి త్వరలోనే తదుపరి కార్యా చరణను రూపొందిస్తామని చెప్పారు. వంద మందితో తెలంగాణ ఉద్యోగ జేఏసీ ఎగ్జి క్యూటివ్ కమిటీని నియమిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి, ఎస్టీయూటీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి సదానందంగౌడ్, ట్రెసా అధ్యక్షులు వంగా రవీందర్‌రెడ్డి, టీఆర్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కటకం రమేష్, మారెడ్డి అంజిరెడ్డి, టీటీటీఎఫ్ అధ్యక్షులు వై అశోక్‌కుమార్, డీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి టి లింగారెడ్డి, పీఆర్టీయూ తెలంగాణ ప్రధాన కార్యదర్శి పర్వతి సత్యనారాయణ, టీపీటీయూ రాష్ట్ర అధ్యక్షులు రాధాకృష్ణ, టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి ముజీబ్, అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, సత్య నారాయణగౌడ్, జీజేఎల్ఏ రాష్ట్ర అధ్యక్షులు పి మధుసూదన్‌రెడ్డి, క్లాస్-4 ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.